సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 218

మంగళవారం 29-10-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'



సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
మంగళవారం ॥ 29-10-2024

దేవుడిచ్చిన కూతురు

డాక్టర్ జె. రాధాకృష్ణన్‌కు అవి ఉద్విగ్న భరితమైన క్షణాలు! కిందటి శనివారం ఆయన నాగపట్నంలోని సంరక్షణాలయంలోకి అడుగు పెట్టినప్పుడు చేతుల్లో బిడ్డతో సౌమ్య ఆయనకు ఎదురొచ్చింది. ఆ బిడ్డను మురిపెంగా తన చేతుల్లోకి తీసుకున్నారు ఆయన. సౌమ్య తనకు దేవుడిచ్చిన కూతురైతే, ఆ కూతురి కన్నబిడ్డ ఆయన చేతుల్లోని పసికందు.

సౌమ్య తల్లయిందని తెలిసి ఆమెను చూడ్డం కోసం ఆ హోమ్‌కి వచ్చారు రాధాకృష్ణన్, ఆయన భార్య కృతిక. తన బిడ్డకు వారి ఆశీర్వాదం కోసం తను పెరిగిన హోమ్‌కే తీసుకు వచ్చింది సౌమ్య.

సౌమ్యను ఇరవై ఏళ్ల కంటికి రెప్పలా చూసుకున్న హోమ్ అది. ఈ ఇరవై ఏళ్లుగా హోమ్‌లో సౌమ్య బాగోగులను చూసుకున్న జిల్లా


సౌమ్య కుమార్తెను చూడడానికి వచ్చిన రాధాకృష్ణన్ దంపతులు


సౌమ్య పెళ్లిలో రాధాకృష్ణన్ దంపతులు

కలెక్టర్ డాక్టర్ రాధాకృష్ణన్. ఎందుకు ఆయనకు సౌమ్య అంటే అంత మమకారం?! ఈ ప్రశ్నకు సమాధానం వెలాంకిణి మాతకు తెలుసు. ఆ మాతే కదా.. సునామీలో సౌమ్య తల్లిదండ్రులు కొట్టుకుపోవటం చూసింది! ఆ మాతే కదా అనాథగా నాగపట్నం తీరంలో వెక్కి వెక్కి ఏడుస్తున్న నాలుగేళ్ల సౌమ్యను నన్స్ చేత చేరదీయించి, వారు చేర్పించిన సంరక్షణాలయంలో రాధాకృష్ణన్ కంట పడేలా చేసింది!

2004 డిసెంబర్ 26న హిందూ మహాసముద్రం విప్పిన సునామీ పడగ ఉప్పెన తమిళనాడు తీరప్రాంతం నాగపట్నాన్ని కూడా ముంచెత్తింది. వేలాదిగా మరణాలు. కొట్టుకుపోయిన ఇళ్లు... చెల్లాచెదురైన కుటుంబాలు. వారి పునరావాసం కోసం ప్రభుత్వం తంజావూరు జిల్లా కలెక్టర్ రాధాకృష్ణన్‌ను అక్కడికి పంపింది. ఆ కొద్దిరోజులకే ఆయనకు నాగపట్నం జిల్లా కలెక్టర్ గా పోస్టింగ్ ఇచ్చింది.

వెలాంకిణి ఆలయ నన్స్ అనాథ పిల్లల్ని చేర్పించిన అన్నై సాథియ గవర్నమెంట్ చిల్డ్రన్స్ హోమ్‌ను సందర్శించినప్పుడే రాధాకృష్ణన్ మొదటిసారిగా సౌమ్యను చూశారు. ఆ చిన్నారి కళ్లలోని విషాదం ఆయన మనసును కలచివేసింది. దగ్గరకు తీసుకుని ఓదార్చారు. కూతుళ్లు లేకపోవటం వల్ల కావచ్చు సౌమ్యను చూడగానే దేవుడిచ్చిన కూతురు అనే భావన ఆయనలో కలిగింది. కుదిరినప్పుడల్లా వెళ్లి ఆ కూతుర్ని మనసు నిండుగా చూసుకుని వచ్చేవారు.

కాలం గడిచింది. 2018 లో ఒకసారి ఆయన సౌమ్యను చూడానికి వెళ్లినప్పుడు సౌమ్య, ఆమె స్నేహితురాలు మీనా కనిపించారు. 'మిగతా పిల్లలంతా దత్తతకు వెళ్లిపోయారని, అప్పటి పిల్లల్లో వీళ్లిద్దరే మిగిలారని' హోమ్ వాళ్లు చెప్పారు. మళ్లీ వెళ్లినప్పుడు... మణివణ్ణన్ అనే సముద్ర ఉత్పత్తుల వ్యాపారి, ఆయన భార్య మలర్విళి సౌమ్యను దత్తత తీసుకున్నారని తెలిసింది.

2022 లో సుబ్బయ్య అనే టెక్నీషియన్‌తో సౌమ్య పెళ్లి జరిగింది. రాధాకృష్ణన్ దంపతులే వారి పెళ్లి జరిపించారు. ఈ అక్టోబర్ 22న పాపను ప్రసవించింది సౌమ్య. ఆ పాపకు శారా అని పేరు పెట్టుకుంది. పాపను చూడాలని ఉందంటే హోమ్ వాళ్లే ఈ 'తండ్రీ కూతుళ్ల' కలిసే ఏర్పాట్లు చేశారు.

ఎకనామిక్స్‌లో బి.ఏ. చేసిన సౌమ్య ప్రస్తుతం నర్సింగ్ కోర్స్ చేస్తోంది. అందుకు రాధాకృష్ణన్ సహకారం ఉంది. ఆయన ఇప్పుడు అడిషనల్ చీఫ్ సెక్రటరీ. కో ఆపరేషన్, ఫుడ్, కన్స్యూమర్ ప్రొటెక్షన్ డిపార్ట్‌మెంట్‌కి ఇంఛార్జి. 'సునామీని తట్టుకుని నాగపట్నం నిలబడినట్లే... సౌమ్య, మీనా, ఇంకా అటువంటి అనాథ పిల్లలు జీవితాన్ని ఎదుర్కొన్న తీరు ఆదర్శనీయం' అంటారు రాధాకృష్ణన్.


షబానా అజ్మీ

ఆయన్ని ఎప్పటికీ ఆ పని చేయనివ్వను

షబానా అజ్మీ జగద్విఖ్యాత ఫెమినిస్ట్. 74 ఏళ్ల ఈ వయసులోనూ ఆమె నవ్వులో హుషారు ఉంటుంది. ఆమె మంచి నటి, చురుకైన సోషల్ యాక్టివిస్ట్ కూడా అయినప్పటికీ.. పెద్ద పెద్ద ఇంటర్వ్యూ లలో ఆమెను ఫెమినిజం గురించే ఎక్కువగా ప్రశ్నలు అడుగుతుంటారు. బయట ఆమెకు తారసపడే యువతులు కూడా... 'మేడమ్.. ఫెమినిజం అంటే మీ ఉద్దేశంలో ఏమిటి?' అని ప్రాథమిక స్థాయి ప్రశ్న వేస్తుంటారు. ఆ ప్రశ్నకు షబానా నవ్వేస్తుంటారు. 'ఈ అమ్మాయిలున్నారే.. తాము ఫెమినిస్టలము కాదు అని గర్వంగా చెప్పుకుంటారు, మళ్లీ 'బ్రా – బర్నింగ్' మూవ్ మెంట్ గురించి గొప్పగా మాట్లాడుతుంటారు' అంటారు షబానా. (పితృస్వామ్య వ్యవస్థను నిరసిస్తూ, అందుకు సంకేతంగా 60 లలో ఆనాటి మహిళా యాక్టివిస్టులు బ్రా లను మంటల్లో వేసి తగలబెట్టిన మూవ్‌మెంటే 'బ్రా బర్నింగ్' ఉద్యమం).

ఫాయే డి సౌజా యూట్యూబ్ ఛానల్ కు తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఫెమినిజానికి సంబంధించి ఒక ఆసక్తికరమైన విషయం చెప్పారు షబానా. ఓసారి ఆమె అమెరికాలో ఉన్నప్పుడు జావేద్ (అఖ్తర్) కుర్తాను ఇస్త్రీ చేస్తూ ఉండగా చూసిన ఒక తెలిసినావిడ.. 'మిమ్మల్ని ఫెమినిస్ట్ అంటారు. మీరేమో మీ భర్త దుస్తుల్ని ఇస్త్రీ చేస్తున్నారు?!' అని అన్నారు. షబానా నవ్వుతూ, 'దీనికి దానికీ సంబంధం ఏమిటి?!' అని అడిగారు. అందుకు ఆవిడ... 'మరైతే మీ వారు మీ శారీని ఇస్త్రీ చేస్తారా?!' అన్నారు.

'లేదు. నేను ఎప్పటికీ ఆయన్ని ఆ పని చేయనివ్వను' అన్నారు షబానా.

డిసౌజాకు ఈ సంగతి చెప్పినప్పుడు... డిసౌజా కూడా షబానాను ఇదే ప్రశ్న అడిగారు. 'మరి మీ ఉద్దేశంలో ఫెమినిజం అంటే ఏమిటి?! అని.

ప్రపంచాన్ని మనం చూసే దృష్టిలో ఉండేదే ఫెమినిజం. స్త్రీ పురుషులు వేర్వేరు. అంతే తప్ప ఎక్కువా కాదు, తక్కువా కాదు. 'ప్రపంచం అనాదిగా ప్రతి సమస్యకూ పురుషుడి దృష్టి కోణం నుంచే పరిష్కారం వెతుకుతూ వస్తోంది. పరిష్కారం కోసం స్త్రీ వైపు నుంచి కూడా ఆలోచించటమే ఫెమినిజం' అని చెప్పారు షబానా. ఇంతకుమించిన నిర్వచనం ఉంటుందా స్త్రీవాదానికి? ఎంతైనా షబానా కదా!

యువతుల 'పడవ'ళ్లు!


శ్రీనగర్‌లోని దాల్ సరస్సులో మహిళలకు పడవ పోటీలు

దాల్ సరస్సులోని నీళ్లు ఎప్పుడూ స్వచ్ఛంగా ఉండి, శ్రీనగర్ పట్టణ ప్రాంత సోయగాలను, ప్రకృతి రమణీయతను ప్రతిబింబిస్తూ ఉంటాయి. ఇక ఆ సరస్సులో సోమవారం జరిగిన బోట్ రేస్ ఏకంగా మహిళా సాధికారతనే పరవళ్లు తొక్కించింది! 150 మందికి పైగా అందరూ మహిళలే పాల్గొన్న అలాంటి ఒక రేస్ దాల్ సరస్సులో జరగటం ఇదే మొదటిసారి. మహిళా అథ్లెట్లను ప్రోత్సహించటం, జమ్మూ లోయలోని మహిళల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయటం, సంప్రదాయ మూస పద్ధతులను బద్దలు కొట్టించి మహిళల్ని ఇంటి బయటికి రప్పించటం ఈ పడవ పోటీల లక్ష్యం. కశ్మీర్ మహిళలకు వాటర్ స్పోర్ట్స్‌లో శిక్షణ ఇచ్చేందుకు తన జీవితాన్నే అంకితం చేసిన ప్రఖ్యాత అథ్లెట్, పారిస్ ఒలింపిక్స్‌లో భారత దేశపు మొదటి మహిళా జ్యూరీ.. బిల్కిస్ మీర్ ఈ పోటీలను నిర్వహించారు.

"మహిళల కోసం దాల్ సరస్సులో ఏర్పాటు చేసిన ఈ మొట్టమొదటి ట్రాక్ రేస్ చరిత్రాత్మకమైనది. పురుషులకు ఎన్నో ఈవెంట్స్ ఉంటాయి. మహిళలకు అన్ని ఉండవు. ఇటువంటి మరిన్ని రేసులను నిర్వహించి, 35మంది యువతుల్ని వారి ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసుకుని అంతర్జాతీయ పోటీలకు శిక్షణ ఇస్తాం" అని బిల్కిస్ మీర్ తెలిపారు. పోటీలో పాల్గొన్న మాదిహా ఫరూక్ అనే యువతి, తను ఈ రేసులో భాగం అయినందుకు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, "ఆడపిల్లలకు ఆటలేంటి అనే భావజాలం సమాజం నుండి రూపుమాసిపోవాలి" అని అన్నారు.

అందమైన జలమార్గాలకు పేర్గాంచిన కశ్మీర్‌లో, మహిళల్ని వాటర్ స్పోర్ట్స్‌లో ప్రోత్సహించటం ద్వారా సాధికారత వైపు పడవల్ని పరుగులెత్తించటం బాగుంది.

నా బుగ్గల్లో ప్లాస్టిక్ ఏం లేదు!

● నయనతార



అందమైన నయనాలే కాదు వాటికి పైన ఉండే కనుబొమలతోనూ ముఖ కవళికల్లో మార్పులు తీసుకురావడం సాధ్యమేనా?! అని అడిగితే సాధ్యమే అంటోంది నటి నయనతార. ముఖాకృతిలో మార్పులకు కనుబొమలు కీలకమైనవి అంటోందామె.

జవాన్ చిత్రంలో షారుఖ్ ఖాన్ సరసన బాలీవుడ్‌లోకి అడుగుపెట్టినప్పటి నుంచి దేశవ్యాప్తంగా నయనతార ఇమేజ్ పెరుగుతూ వచ్చింది. దీంతో ఆమెలో వచ్చిన మార్పును సూచిస్తూ పాత, కొత్త ఫోటోలు పెట్టి, నయన్ ముఖానికి ప్లాస్టిక్ సర్జరీ, సన్నబడటానికి లైపోసక్షన్ చేయించుకుందని సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు కొందరు.

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె ఈ పుకార్లకు స్పందించి, కనుబొమల తీరులో, ఆహారంలో మార్పులు చేసుకోవడం వల్లనే ఇది సాధిస్తున్నానని, ఇందుకు ప్లాస్టిక్ సర్జరీ అవసరమే లేదని తెలిపింది.

'ఇది నిజమైన గేమ్ ఛేంజర్. నా కనుబొమలలో మార్పులు తీసుకురావడం నాకు చాలా ఇష్టం. కొన్నేళ్లుగా విభిన్న రకాల కనుబొమలను ట్రై చేస్తూ వచ్చాను. అది ఇప్పుడు వర్క్ ఔట్ అయిందనుకుంటా! అలాగే సన్నగా కనిపించేందుకు లైపోసక్షన్ చేయించుకున్నాననే వార్తలు కూడా వచ్చాయి. కానీ, అది నిజం కాదు. ఆహారాన్ని బట్టి బరువు హెచ్చుతగ్గుల్లో చాలా మార్పులు తీసుకురావచ్చు. ఆ మార్పుల్లో భాగంగా ఒకసారి నా బుగ్గలు లోపలికి వెళ్లినట్టు, మరోసారి బయటికి వచ్చినట్టు కనిస్తాయి. కావాలంటే నా బుగ్గలను నొక్కి చూడవచ్చు, వీటిలో ప్లాస్టిక్ లేదు' అంటూ నవ్వుతూ సమాధానమిచ్చింది నయన్.

సాగుబడి
స్వాతి కార్తె : అక్టోబర్ 24 నుండి

గుళి సామ.. ఎకరానికి 11 క్వింటాళ్లు!

విత్తనం వెదజల్లటం కన్నా మొక్కలు నాటితే అధిక దిగుబడి

ఉత్తరాంధ్రలోని అల్లూరి సీతారామ జిల్లాలో సామ పంట విస్తృతంగా సాగవుతోంది. గత కొన్ని సంవత్సరాలుగా ఇతర చిరుధాన్యాలతో పాటు సామలకు మంచి గిరాకీ ఏర్పడటంతో గిరిజన రైతుల్లో ఈ పంట సాగుపై ఆసక్తి పెరుగుతోంది. దీంతో ఈ పంట విస్తీర్ణం కూడా విస్తరిస్తోంది. సేంద్రియ పద్ధతిలో పండించడానికి శ్రమ, పెట్టుబడి పెద్దగా అవసరం లేనిది సామ. అందువల్ల గిరిజనులందరూ ఎంతోకొంత విస్తీర్ణంలో ఈ పంటను పండించి, తాము తింటూ, మిగతా సామలు అమ్ముకుంటూ మంచి ఆదాయాన్ని పొందుతున్నారు.

పూర్వం సామ ధాన్యాన్ని తిరగలిలో మరపట్టి బియ్యంలా మార్చుకొని సామ అన్నం, ఉప్మా, జావ వంటి సాంప్రదాయ వంటలు వండుకునే వారు. ఈ మధ్య మైదాన ప్రాంతా ప్రజల్లో కూడా చిరుధాన్యాల వినియోగం పెరగడం, వీటితో బిస్కట్లు, కేక్ వంటి వివిధ రకాల చిరు తిండి ఉత్పత్తులను తయారుచేసి అమ్మడం వల్ల చిరుధాన్యాల ధరలు పెరిగి రైతులకు మంచి లాభాలు వస్తున్నాయి.


అల్లూరి సీతారామరాజు జిల్లాలో సాగవుతున్న గుళి సామ పంట


గుళి పద్ధతిలో సాగు చేసిన నిలువెత్తు సామ దుబ్బుతో గిరిజన రైతులు వంతల రామోజీ, గెమ్మెలి తవుడన్న


గుళి పద్ధతిలో సాగు చేసిన సామ దుబ్బుతో దుంబ్రిగూడ మండలం అరమ గ్రామానికి చెందిన రైతు దంపతులు లకోయి ఆనంద్, రాధమ్మ.

అప్పుడు చోడి, ఇప్పుడు సామ

ఈ క్రమంలో వికాస స్వచ్ఛంద సంస్థ 2016లో చోడి /రాగి పంటలో గుళి సాగు పద్ధతిని ప్రవేశపెట్టింది. సాధారణంగా రైతులు చిరుధాన్యాల విత్తనాలను వెదజల్లే పద్ధతిలో పండిస్తుంటారు. నారు పెంచి, పొడి దుక్కిలో వరుసల్లో గుంతలు తీసి నాట్లు వేసుకునే పద్ధతిలో పండించడాన్నే 'గుళి' (గుళి అంటే గిరిజన భాషలో గుంట అని అర్థం) పద్ధతిగా పిలుస్తున్నారు. గుళి చోడిని పద్ధతిలో పండిస్తూ గిరిజన రైతులు దిగుబడిని ఎకరాకు 400 కేజీల నుంచి దాదాపు 1000 కేజీల వరకు పెంచుకోగలిగారు. ఈ క్రమం లోనే వికాస సంస్థ 2024 ఖరీఫ్ పంట కాలంలో గుళి పద్ధతిలో సామ పంటను సాగు చేయటానికి 54 మంది గిరిజన రైతులకు తోడ్పాటునందించింది.

30-35 రోజుల మొక్క నాటాలి

ప్రధాన పొలం చివరి దుక్కిలో 200 కేజీల ఘన జీవామృతాన్ని చల్లడం వల్ల భూమికి బలం చేకూరి, రైతులు మంచి దిగుబడి సాధించారు. సామ పంట ముఖ్యంగా పెద్ద సామ రకం బాగా ఎత్తు పెరుగుతుంది. అందువల్ల మొక్కలు నాటిన తర్వాత 30 నుండి 35 రోజుల మధ్య వెన్ను రాక ముందే తలలు తుంచాలి. దీని వల్ల పంట మరీ ఎత్తు పెరగకుండా, దుబ్బులు బలంగా పెరుగుతాయి. గాలులకు పడిపోకుండా ఉంటుంది.

దుంబ్రీగూడ మండలం లోగిలి గ్రామంలో కొర్రా జగబంధు అనే గిరిజన రైతు పొలంలో గుళి పద్ధతిలో పండించిన పెద్ద సామ పంటలో క్రాప్ కటింగ్ ప్రయోగాన్ని నిర్వహించారు. రైతులు, వికాస సిబ్బంది, నాబార్డ్ జిల్లా అధికారి చక్రధర్ సమక్షంలో సామలను తూకం వేసి చూస్తే.. ఎకరాకు దాదాపు 1,110 కేజీల (11.1 క్వింటాళ్ల) దిగుబడి నమోదైంది. ఈ పొలానికి పక్కనే రైత్వారీ పద్ధతిలో వెదజల్లిన సామ పొలంలో దిగుబడి ఎకరాకు 150 కేజీల నుంచి 200 కేజీలు మాత్రమే!

గుళి సాగు ప్రత్యేకత ఏమిటి?

రైత్వారీ పద్ధతిలో ఎక్కువ విత్తనం వెదజల్లటం, నేలను తయారు చేసే సమయంలో ఎటువంటి ఎరువు వేయకపోవడం, ఒక ఎకరాకు ఉండాల్సిన మొక్కల కన్నా మూడు నాలుగు రెట్లు ఎక్కువ సాంద్రతలో మొక్కలు ఉండటంతో పంట బలంగా పెరగలేకపోతోంది.

గుళి పద్ధతిలో లేత నారును పొలంలో వరుసల మధ్య అడుగున్నర దూరం, మొక్కల మధ్య అడుగు ఉండేలా నాటుతారు. రైత్వారీ వెద పద్ధతిలో ఎకరానికి 3 నుంచి 4 కేజీల విత్తనం అవసరం. దీనికి బదులు మొక్కలు నాటడం వల్ల ఎకరానికి 300 నుంచి 400 గ్రాముల విత్తనం (దాదాపు పది శాతం మాత్రమే) సరిపోతుంది. నారు పెంచుకొని 15 నుంచి 20 రోజుల వయసు మొక్కల్ని పొలంలో నాటుకోవడం వల్ల విత్తన ఖర్చు దాదాపుగా 90 శాతం తగ్గుతోంది.

మొక్కల సాంద్రత తగినంత ఉండి, మొక్కలు పెరిగే సమయంలో ప్రతి మొక్కకూ చక్కగా ఎండ తగలుతుంది. ఘన జీవామృతం వల్ల నేల సారవంతమై సామ మొక్కలు బలంగా పెరిగి, మంచి దిగుబడి వస్తున్నట్టు గమనించామని వికాస సిబ్బంది వెంకట్, నాగేశ్వర రావు, తవుడన్న చెబుతున్నారు.

దూరంగా నాటడం వల్ల దుక్కి పశువులతో కానీ, సైకిల్ వీడర్‌తో కానీ కలుపు తొందరగా, సులభంగా తియ్యవచ్చు. మొక్కలు బలంగా , ఏపుగా పెరగటం వల్ల కోత సమయంలో వంగి మొదలు నుంచి కోసే బదులు, నిలబడి వెన్నులు కొయ్యడం వల్ల సమయం ఆదా అవడమే కాక సులభంగా పంట కోత జరుగుతుండటం మరో విశేషం.

మున్ముందు వరిగ, ఊద కూడా..

అల్లూరి సీతారామ జిల్లాలో సామ పంటను ఈ సంవత్సరం ప్రయోగాత్మకంగా గుళి పద్ధతిలో పండించిన గిరిజన రైతులకు ఎకరానికి 11 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. రైత్వారీ వెద పద్ధతిలో 2 క్వింటాళ్లకు మించలేదు. కనువిందు చేస్తున్న ఈ పొలాలను చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతులను, మహిళలకు చూపిస్తున్నాం. వారు కూడా వచ్చే సంవత్సరం నుంచి మొక్కలు నాటే పద్ధతిని అనుసరించేలా ప్రోత్సహిస్తున్నాం. ఇప్పటికే గిరిజన రైతులు చోడి సాగులో గుళి పద్ధతిని పాటిస్తున్నారు. దీని వల్ల తక్కువ సమయంలోనే సామ రైతులు గుళి పద్ధతికి మారే అవకాశం ఉంది. రాబోయే రోజుల్లో వరిగ, ఊద పంటల్ని కూడా గుళి పద్ధతిలో సాగు చేయిస్తాం.



– డా. కిరణ్ (98661 18877),
వికాస స్వచ్ఛంద సంస్థ,
అల్లూరి సీతారామరాజు జిల్లా

దొండతో దండిగా ఆదాయం!

ప్రణాళికాబద్ధంగా కష్టపడితే వ్యవసాయం సహా ఏ రంగంలోనైనా రాణించొచ్చు అంటున్నారు ప్రకాశం జిల్లా కంభం పట్టణానికి చెందిన యంజి బిఈడి కళాశాల కరస్పాండెంట్ గఫార్ అలిఖాన్. బీఈడీ కళాశాల పనులపై ఇతర ప్రాంతాలు వెళ్లి వచ్చే క్రమంలో తూర్పు గోదావరి జిల్లాలో పండ్ల తోటల్లో అంతర పంటలుగా కూరగాయలు సాగు చేస్తున్న పొలాలు కంటపడ్డాయి. ఆ పంటలను చూసిన తర్వాత వ్యవసాయంపై మక్కువ కలిగింది. అక్కడి రైతులతో మాట్లాడి వ్యవసాయం లాభదాయకంగా ఎలా చెయ్యాలో తెలుసుకున్నారు. కందులాపురం వద్ద తనకున్న 2.2 ఎకరాల భూమిలో రెండేళ్ళ క్రితం బత్తాయి మొక్కలు నాటారు. అందులో 12 రకాల అంతర పంటలు సాగు చేస్తూ సత్ఫలితాలు పొందుతున్నారు గఫార్. బత్తాయి తోట కాపునకు వచ్చే సరికి నాలుగేళ్ళ

- లేత బత్తాయి తోటలో అనేక కూరగాయ పంటల సాగు
- విద్యావేత్తగానే కాక వ్యవసాయంలోనూ రాణిస్తున్న గఫార్ అలిఖాన్


టొమాటోలు కోస్తున్న వ్యవసాయ కార్మికులు

కాలం పడుతుంది. ఈలోగా అంతర పంటలు వేసుకొని సాగు లాభదాయకమని ప్రధాన అంతర పంటగా టొమాటోను ఫెన్సింగ్ పద్ధతిలో సాగు చేస్తూ మంచి దిగుబడి పొందుతున్నారు. బత్తాయి తోట చుట్టూ సుమారు 20 సెంట్లలో పందిళ్ల వేసి దొండ మొక్కలు నాటారు. 4 నెలలకే పంట చేతికి వస్తున్నది. ప్రస్తుతం మార్కెట్‌లో కేజీ దొండ రూ. 50 వరకు పలుకుతున్నది. ఇప్పటికే రూ. లక్షన్నరకు పైగా లాభం వచ్చిందని గఫార్ వివరించారు. దొండ పందిళ్ల కింద క్యాబేజీ, బీట్‌రూట్ సాగు చేస్తున్నారు. పొలం చుట్టూ వేసిన ఫెన్సింగ్‌కు సైతం సొరకాయ చెట్లను పాకించారు. సొర తీగలు కాయలనివ్వటంతో పాటు చీడపీడలను అడ్డుకునే జీవ కంచెగా ఉపయోగపడుతున్నాయన్నారు. కొత్తిమీర, కాకర, మెంతి, కాకర, మిరప, మునగ, కాలీఫ్లవర్, బీర ఇంకా తదితర అంతర పంటలు సాగు చేస్తున్నారు. రెండు ఎకరాల్లో 15 ట్రాక్టర్ల మాగిన పశువుల ఎరువుతో పాటు వర్మీ కంపోస్టు, జీవామృతం, వేప పిండి, కానుగ పిండి, ఆముదం పిండి, జీవన ఎరువులను వినియోగిస్తున్నారు.

తక్కువ విస్తీర్ణంలో అంతర పంటలతో మేలు



రెండెకరాల లేత బత్తాయి తోటలో అంతర పంటలుగా కూరగాయలు సాగు చేస్తున్నాను. భూమిని ఖాళీగా వదలకుండా అంతర పంటలు వేశాం. తోటల్లో అంతర పంటలుగా కూరగాయ పంటలు సాగు చేసుకుంటే మంచి లాభాలు ఉంటాయని నా అనుభవంలో తెలుసుకున్నాను. అంతర పంటలకు పెట్టుబడి తక్కువే. శ్రమ అధికంగా ఉంటుంది. అందుకని రైతులు తక్కువ విస్తీర్ణంలో అంతర పంటలు వేసుకోవటం లాభదాయకం.

– గఫార్ అలీఖాన్, కంభం


బత్తాయిలో సాగు చేసే అంతర పంటలకు పెట్టుబడి తక్కువగానే ఉంటుంది. పందిళ్లు వేసి విత్తనాలు నాటితే చాలు దిగుబడినిస్తాయి. దొండలో వచ్చిన ఆదాయం బత్తాయితో పాటు ఇతర అన్ని పంటల పెట్టుబడికి సరిపోతుందని గఫార్ స్వీయానుభవంగా చెబుతున్నారు. బీర, సొరకాయ, క్యాబేజీ, ఇతర కూరగాయల సాగు కూడా మంచి లాభదాయకమేనన్నారు.

– ఖాదర్ బాష, సాక్షి, కంభం

సీమాప్‌లో ఔషధ, సుగంధ మొక్కల సాగుపై శిక్షణ

హైదరాబాదు బోడుప్పల్‌లోని కేంద్రియ ఔషధ, సుగంధ పరిశోధన మొక్కల సంస్థ (సీమాప్) ఆవరణంలో నవంబర్ 12–14 తేదీల్లో నిమ్మగడ్డి, కాశగడ్డి, అశ్వగంధ, వటివేర్, సిట్రొనెల్లా, జెరేనియం, మింట్, పచౌళి, సోనాముఖి, కాలమేఘ తదితర ముఖ్య ఔషధ, సుగంధ వాణిజ్య పంటల సాగు, ప్రాసెసింగ్, నాణ్యత, మార్కెటింగ్ అంశాలపై ఆంగ్లంలో శిక్షణ ఇవ్వనున్నట్లు చీఫ్ సైంటిస్ట్ జి.డి. కిరణ్‌బాబు తెలిపారు. నమోదు రుసుం రూ. 3,500. నవంబరు 8లోగా దరఖాస్తు చేసుకోవాలి. రాత్రి వసతి సదుపాయం లేదు. వివరాలకు: 94910 43252, 94934 08227.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 20 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 218
మంగళవారం 29-10-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'


భారతీయ అమెరికన్లలో హారిస్‌కు తగ్గిన ఆదరణ!
-6లో


బుల్స్ బ్యాక్!
సెన్సెక్స్ 602 పాయింట్లు ప్లస్.. 158 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
-17లో


'రక్షణ'లో కొత్త అధ్యాయం
భారత తొలి ప్రైవేట్ సైనిక, సరకు రవాణా విమానం తయారీని స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్‌తో కలిసి మోదీ ప్రారంభించారు.
వివరాలు 6లో ▸


జపాన్‌లో హంగ్
జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా నేతృత్వంలోని అధికార కూటమి కీలకమైన పార్లమెంటరీ ఎన్నికల్లో మెజారిటీని కోల్పోయింది.
వివరాలు 6లో ▸


అక్రమ వలసలపై ఉక్కుపాదమే!
అమెరికాలోని అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపి తీరతానని రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు.
వివరాలు 6లో ▸


జనవరి 22 నుంచి జేఈఈ
ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలలో ప్రవేశాలకు ఉద్దేశించిన జేఈఈ మెయిన్స్–2025 నోటిఫికేషన్‌ను ఎన్‌టీఏ విడుదల చేసింది.
వివరాలు 14లో ▸

జిల్లాలన్నీ ఉడాలే!



జిల్లాలన్నీ కవరయ్యేలా కొత్తగా 19 యూడీఏలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

- ఇప్పటికే ఉన్న 9 పట్టణాభివృద్ధి సంస్థల పరిధి ఆయా జిల్లాల వ్యాప్తంగా పెంపు
- ములుగు, ఆసిఫాబాద్‌లోని కొన్ని మండలాలకు మినహాయింపు
- మొత్తం 12 వేలకు గాను 10 వేలకు పైగా గ్రామాలు వీటి పరిధిలోనే..
- ఆసిఫాబాద్ జిల్లాలోని 10 మండలాలు కాగజ్‌నగర్ యూడీఏ పరిధిలోకి
- వేములవాడ దేవాలయ అభివృద్ధి సంస్థ (వీటీడీఏ) పరిధిలోకి సిరిసిల్ల జిల్లా
- కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలోకి వరంగల్, హనుమకొండ
- డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అనుమతులన్నీ ఇక జిల్లాల్లోనే..

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని కొన్ని గ్రామాలు మినహా.. రాష్ట్రమంతా వివిధ పట్టణాభివృద్ధి సంస్థ (యూడీఏ–ఉడా)ల పరిధిలోకి వెళ్లింది. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 9 ఉడాలు ఉండగా, తాజాగా వాటి పరిధిని రాష్ట్ర ప్రభుత్వం విస్తరించింది. దీంతోపాటు.. ములుగు జిల్లా, ఆసిఫాబాద్ జిల్లాలోని ఐదు మండలాలు, కొన్ని జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాలు మినహా ఇప్పటివరకు ఉడాలు లేని అన్ని జిల్లాలు కవర్ అయ్యేలా కొత్తగా మరో 19 ఉడాలను కూడా ఏర్పాటు చేసింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 28 ఉడాలు ఏర్పాటైనట్టయ్యింది. ప్రతి పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలోకి ఆ జిల్లాలోని మండలాల్లో ఉన్న దాదాపుగా అన్ని గ్రామాలు చేరాయి. రాష్ట్రంలో సుమారు 12 వేల గ్రామ పంచాయతీలు ఉండగా, దాదాపు 10 వేలకు పైగా గ్రామ పంచాయతీలు ఉడాల పరిధిలోకి రావడం గమనార్హం.

ఇప్పటివరకు చుట్టుపక్కల గ్రామాలే ఉడాల పరిధిలో..

రాష్ట్రంలో హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు ఉన్నాయి. దీంతో పాటు వరంగల్, కరీంనగర్, వేములవాడ, మిగతా 2వ పేజీలో ▶

గ్రామ పంచాయతీల అధికారాలు యథాతథం!

జిల్లా పరిధిని పూర్తిగా పట్టణాభివృద్ధి సంస్థ కిందికి తీసుకురావడంతో గ్రామ పంచాయతీల అధికారాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే పురపాలక శాఖ అధికారులు మాత్రం అలాంటిదేమీ ఉండబోదని అంటున్నారు. డీటీసీపీకి ఉన్న అనుమతుల అధికారం మాత్రమే పట్టణాభివృద్ధి సంస్థలకు దఖలు పడుతుందని స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో 800 చదరపు గజాల లోపు నిర్మాణాలకు అనుమతులు ఆయా పంచాయతీలే ఇస్తున్నాయి. ఆ విధానం భవిష్యత్తులో కూడా కొనసాగనుందని ప్రభుత్వం చెబుతోంది.

పేదింటికి కేంద్రం చేయూత రెట్టింపు!
- పట్టణాభివృద్ధి సంస్థల సంఖ్య పెంపు ఫలితం
- 'పట్టణ' పరిధిలోకి రానున్న వేలాది పంచాయతీలు
- రూ.72 వేలకు బదులు రూ.లక్షన్నర దక్కే చాన్స్

2 లో

అనంతరం 'లోక్‌సభ' పునర్విభజన?

2025లో జనగణన..



నాలుగేళ్ల సుదీర్ఘ జాప్యం తర్వాత ఎట్టకేలకు దేశ జనాభా గణన జరగనుంది. కులగణన చేపట్టాలన్న ప్రతిపక్షాల డిమాండ్ నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. అయితే జనగణనలో భాగంగా కులగణన కూడా ఉంటుందా అన్న కీలక అంశంపై మాత్రం ప్రస్తుతానికి స్పష్టత లేదు. జనగణనలో భాగంగా పౌరులను అడిగేందుకు 31 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని రిజిస్ట్రార్ జనరల్, జనగణన కమిషనర్ కార్యాలయం ఇప్పటికే సిద్ధం చేసింది. చివరిసారిగా 2011లో జనగణన జరిగింది. 2021లో జరగాల్సి ఉండగా, కరోనా కారణంగా ఆగింది. అప్పట్నుంచీ పెండింగ్‌లోనే ఉంది.

వివరాలు 6లో


అమితాబ్ బచ్చన్ చేతుల మీదుగా ఏఎన్ఆర్ అవార్డును అందుకున్న హీరో చిరంజీవి. చిత్రంలో నాగార్జున, వెంకట్ అక్కినేని 16 లో

నా సినీ జీవితానికి పరిపూర్ణత ఇచ్చిన అవార్డు ఇది
హీరో చిరంజీవి భావోద్వేగం

న్యూస్‌రీల్

రెండు కేటగిరీల్లో తీవ్ర పోటీ

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోని 563 గ్రూప్–1 పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ చేపట్టిన మెయిన్స్ పరీక్షలపర్వం ముగిసింది. జవాబు పత్రాల మూల్యాంకనాన్ని అతిత్వరలో చేపట్టేందుకు కమిషన్ కసరత్తు చేస్తోంది. బీసీ–డీ కోటాలో ఒక్కో పోస్టుకు సగటున 175 మంది, బీసీ–బీ కింద సగటున 128 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.
- వివరాలు 14లో▶

టీచర్లు ఏం చేస్తున్నారు?

ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని భావిస్తున్న ప్రభుత్వం.. టీచర్ల హాజరు, బోధన విధానం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టనుంది. ఇందుకోసం మండల విద్యాశాఖాధికారులకు మంగళవారం నుంచి హైదరాబాద్‌లో శిక్షణ ఇవ్వనుంది.
- వివరాలు 14లో▶

సీడీఎంఏగా శ్రీదేవి.. హరీశ్‌కు ఐ అండ్ పీఆర్


రాష్ట్రంలో 11 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మరో ఇద్దరు ఐఏఎస్ అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించింది. రాష్ట్రస్థాయి కమిషనర్లు, డైరెక్టర్లు, జిల్లాల కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు ఈ జాబితాలో ఉన్నారు.
- వివరాలు 5లో▶

పత్తి రైతుకు ధరాఘాతం

ఈ ఏడాది పత్తి రైతులకు తీరని నష్టం ఎదురవుతోంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం వివిధ జిల్లాల నుంచి రైతులు పత్తి తీసుకురాగా, మద్దతు ధర రూ.7,521 దక్కకపోగా, జెండా పాటే గరిష్ఠంగా రూ.6,700 పలికింది. నాణ్యత, తేమ పేరిట వ్యాపారులు అంతకన్నా తక్కువే చెల్లించారు.
- వివరాలు 15లో▶

రాజ్ పాకాలకు నోటీసులు

జన్వాడ పార్టీ కేసులో పోలీసుల దర్యాప్తు ముమ్మరం
- విజయ్ మద్దూరికి స్టేషన్ బెయిల్.. అజ్ఞాతంలో రాజ్ పాకాల
- ఇద్దరూ ఠాణాలో హాజరుకావాలని సూచించిన పోలీసులు
- పార్టీలో పాల్గొన్నవారికి నోటీసులు ఇచ్చి విచారించాలని నిర్ణయం


రాజ్ పాకాల

శంకర్‌పల్లి: మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఇంట్లో అనుమతి లేని పార్టీ నిర్వహణ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. అనుమతి లేకుండా మద్యం పార్టీ నిర్వహించారనే కారణంతో రాజ్ పాకాల (51)తోపాటు, కొకైన్ తీసుకున్నట్టు నిర్ధారణ అయిన విజయ్ మద్దూరి (56)పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం రాత్రి విజయ్ మద్దూరికి 41 సీఆర్‌పీసీ కింద పోలీసులు నోటీసులు ఇచ్చి, స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. విచారణ నిమిత్తం సోమవారం పోలీస్‌స్టేషన్‌కు రావాలని వారు సూచించినా.. ఆయన సాయంత్రం వరకు కూడా స్టేషన్‌కు రాలేదు. ఇక శనివారం రాత్రి పార్టీ నుంచి వెళ్లిపోయిన రాజ్ పాకాల అజ్ఞాతంలోకి వెళ్లారు. ఈ నేపథ్యంలో మోకిల పోలీసులు సోమవారం దర్యాప్తు కోసం రాయదుర్గంలోని రాజ్ పాకాల నివాసానికి వెళ్లారు. తాళం వేసి ఉండటంతో ఇంటి బయట నోటీసులు అతికించారు. సోమవారం రాత్రి 11 గంటలకల్లా తమ ముందు విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొన్నారు. మరోవైపు ఈ కేసు విషయంలో రాజ్ పాకాల హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. తాను 48 గంటల్లో విచారణకు హాజరవుతానని పేర్కొంటూ న్యాయవాదుల ద్వారా పోలీసులకు లేఖ అందజేశారు.

ఇంటికి అనుమతులు లేవన్న అధికారులు

రాజ్ పాకాలకు రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడ గ్రామ పరిధిలోని సర్వే 691, 692లలో శ్రీమాతే ప్రాపర్టీస్ పేరుతో సుమారు 8 ఎకరాల భూమి ఉంది. అందులో దాదాపు 1,500 గజాల విస్తీర్ణంలో జీ+1 ఇంటి నిర్మాణం చేపట్టారు. జన్వాడ గ్రామం 111 జీవో పరిధిలో ఉండటంతో మిగతా 8వ పేజీలో ▶

జన్వాడ కేసులో.. ఎలాంటి కఠిన చర్యలు వద్దు
పోలీసులకు, ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- పిటిషనర్ రెండు రోజుల్లో ఆ పార్టీ వివరాలన్నీ అందజేయాలి..
- ఆ తర్వాత పోలీసులు చట్టప్రకారం ముందుకెళ్లాలని స్పష్టీకరణ
- విచారణ నవంబర్ 25వ తేదీకి వాయిదా

8లో

12,39,044
ఒకేరోజు కేసుల పరిష్కారం
3వ లోక్ అదాలత్‌లో టీజీఎస్ఎల్ఎస్ఏ రికార్డు.. దేశంలోనే నంబర్ వన్
5 లో


ఇప్పటికైనా మనం మన దేశం మీద.. మన ఫ్యామిలీల మీద శ్రద్ధ పెట్టాలనుకుంటా సార్!

తప్పిన విద్యుత్ భారం
14 లో
- రూ. 1,200 కోట్ల మేర చార్జీలు పెంచాలన్న డిస్కంల ప్రతిపాదనను తిరస్కరించిన ఈఆర్సీ
- విద్యుత్ సబ్సిడీలను రూ. 11,499 కోట్లకు పెంచేందుకు సర్కారు ఓకే
- ఫలితంగా చార్జీల పెంపు నుంచి ప్రజలకు లభించిన ఉపశమనం
- 2024–25 టారిఫ్ ఉత్తర్వులు జారీ..
- వివరాలు వెల్లడించిన చైర్మన్ శ్రీరంగారావు, సభ్యులు

ఈఆర్సీ చైర్మన్‌గా జస్టిస్ దేవరాజు నాగార్జున
14 లో

వరంగల్ మామునూరు బెటాలియన్ ప్రాంగణంలో నల్లబ్యాడ్జీలు ధరించి బైఠాయించిన కానిస్టేబుళ్లు


కొనసాగిద్దామా ఆపేద్దామా?
- టీజీఎస్పీ సిబ్బందిలో అంతర్మథనం
- వద్దని సీనియర్లు.. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడని జూనియర్లు..

15లో



మంత్రి పొంగులేటికి సీఎం జన్మదిన శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్/ఖమ్మం వన్‌టౌన్: రెవెన్యూ, గృహనిర్మాణ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. పొంగులేటి పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపేందుకు ఖమ్మం, వరంగల్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పలువురు అభిమానులు ఉదయం మంత్రుల క్వార్టర్స్‌కు వచ్చారు. వారితో కలిసి పొంగులేటి అక్కడ కేక్ కట్ చేశారు. అనంతరం సచివాలయానికి వచ్చిన పొంగులేటికి ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు శుభాకాంక్షలు తెలిపారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖలకు చెందిన అధికారులు, సచివాలయ సిబ్బంది సమక్షంలో పొంగులేటి కేక్ కట్ చేశారు.

భూముల తాకట్టుకు ఓకే!

400 ఎకరాల తాకట్టుతో రూ.10 వేల కోట్ల రుణ సేకరణ ● ఇటీవలి కేబినెట్ భేటీలో 'ప్రభుత్వ గ్యారంటీ'కి ఆమోదం



సాక్షి, హైదరాబాద్: పరిశ్రమల భూములను తాకట్టు పెట్టి మూలధనం, ఇతర అవసరాల కోసం రూ.10వేల కోట్ల రుణ సేకరణ చేయాలనుకున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలు ఇకపై వేగం పుంజుకోనున్నాయి. ఫైనాన్స్ సంస్థల నుంచి పరిశ్రమల మౌలిక సదుపాయాల సంస్థ తీసుకునే రూ.10వేల కోట్ల రుణాలకు గ్యారంటీ ఇచ్చింది. గ్యారంటీ ఇవ్వాలన్న నిర్ణయానికి ప్రభుత్వం శనివారం సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ భేటీలో ఆమోదం (ర్యాటిఫై) తెలిపింది. రుణ మార్కెట్ నుంచి రూ.10వేల కోట్లు అప్పులు తెచ్చేందుకు ఆర్‌బీఐ నిబంధనలు అడ్డుపడుతుండటంతో ప్రభుత్వం కొంతకాలంగా తర్జనభర్జన పడుతోంది.

400 ఎకరాల తాకట్టు..

హైదరాబాద్‌లో అత్యంత ఖరీదైన కోకాపేట, రాయదుర్గంలోని రూ.20వేల కోట్ల విలువ చేసే సుమారు 400 ఎకరాల భూములను ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలకు తాకట్టు పెట్టాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. భూములను తనఖా పెట్టి రుణం తీసుకున్న అనుభవం ప్రభుత్వ శాఖలకు లేకపోవడంతో మర్చంట్ బ్యాంకర్లకు రుణ సేకరణ బాధ్యత అప్పగించారు. రుణం ఇప్పించే మర్చంట్ బ్యాంకర్‌కు కనీసం ఒక శాతం చొప్పున లెక్క వేసినా రూ.100 కోట్లు కమీషన్ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. రుణమార్కెట్ నుంచి అప్పులు తేవడంలో అనుభవం కలిగిన మర్చంట్ బ్యాంకర్లను ఈ ఏడాది జూలైలో ప్రభుత్వం ఎంపిక చేసింది. తాజాగా గ్యారంటీ ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో న్యాయపరమైన చిక్కులు లేకుండా మర్చంట్ బ్యాంకర్లు రుణ సేకరణ చేయాల్సి ఉంటుంది.

అప్పుల కోసం ప్రభుత్వం తరఫున ఫైనాన్స్ సంస్థల వద్దకు వెళ్లిన మర్చంట్ బ్యాంకర్లు, సవాలక్ష ప్రశ్నలు ఎదుర్కొన్నారు. రూ.10వేల కోట్ల రుణం కోసం రూ.20వేల కోట్ల విలువ చేసే భూములను తాకట్టు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైనా రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇస్తేనే రుణం ఇస్తామని ఫైనాన్స్ సంస్థలు మెలిక పెట్టాయి. ప్రభుత్వం గ్యారంటీ ఇస్తే భూములు తాకట్టు పెట్టి తీసుకునే రుణాలకు కూడా 'ద్రవ్య బాధ్యత బడ్జెట్ నిర్వహణ' (ఎఫ్‌ఆర్‌బీఎం) నిబంధన వర్తిస్తుందని ఆర్‌బీఐ వర్గాలు చెప్పినట్లు సమాచారం. దీంతో ఎఫ్‌ఆర్‌బీఎం పరిధికి లోబడే పరిశ్రమల భూములను తాకట్టు పెట్టి తీసుకుంటున్న రుణాలకు గ్యారంటీ ఇవ్వాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది.

పేదింటికి కేంద్రం చేయూత రెట్టింపు!

రాష్ట్రంలో పట్టణాభివృద్ధి సంస్థల సంఖ్య పెంపు ఫలితం

'పట్టణ' పరిధిలోకి రానున్న వేలాది పంచాయతీలు | రూ.72 వేల బదులు రూ.లక్షన్నర దక్కే చాన్స్



సాక్షి, హైదరాబాద్: పట్టణాభివృద్ధి సంస్థల సంఖ్యను రాష్ట్ర ప్రభుత్వం భారీగా పెంచటంతో చాలా గ్రామాలు 'పట్టణ పరిధి'లోకి చేరటంతో పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకం ద్వారా కేంద్రం అందించే సాయం రెట్టింపు కానుంది. పేదల ఇళ్ల నిర్మాణానికి సంబంధించి గ్రామీణ ప్రాంత యూనిట్ కాస్ట్ రూ.72 వేలుగా ఉండగా, పట్టణ ప్రాంత యూనిట్ కాస్ట్ రూ.1.5 లక్షలుగా కొనసాగుతోంది. అయితే ఇప్పుడు రాష్ట్రంలో మూడొంతులకు పైగా గ్రామ పంచాయతీలు పట్టణాభివృద్ధి సంస్థల జాబితాలోకి వెళ్లాయి. గతంలో 9 పట్టణ ప్రాంత అభివృద్ధి సంస్థలు ఉండగా, వాటి సంఖ్యను రాష్ట్ర ప్రభుత్వం తాజాగా 28కు పెంచింది. ఫలితంగా వేల సంఖ్యలో గ్రామ పంచాయతీలు 'పట్టణ' పరిధిలోకి చేరనున్నాయి. దీంతో వీటికి పట్టణ ప్రాంత యూనిట్ కాస్ట్ ప్రకారం నిధులు అందుతాయి.

రెండో దశలోనూ పాత యూనిట్ కాస్టే..

చాలా రాష్ట్రాల్లో పేదల ఇళ్ల నిర్మాణ పథకం యూనిట్ కాస్ట్ రూ.2.5 లక్షలుగా ఉంటోంది. పట్టణ ప్రాంతాల్లో కేంద్రం ఒక్కో ఇంటికి రూ.1.5 లక్షలు ఇస్తుంటే, మిగతా మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తే సరిపోయేది. కానీ తెలంగాణ ప్రభుత్వం యూనిట్ కాస్ట్‌ను రూ.5 లక్షలుగా ఖరారు చేసింది. ఇది రాష్ట్ర ఖజానాపై అతిపెద్ద భారం మోపనుంది. పీఎంఏవై పథకం మొదటి దశ కాలపరిమితి తీరిపోవటంతో, కేంద్రం రెండో దశకు శ్రీకారం చుడుతోంది. ఇందులో పట్టణ ప్రాంత ఇళ్ల యూనిట్ కాస్ట్‌ను రూ.2.25 లక్షలకు పెంచుతారనే ప్రచారం జరిగింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన యూనిట్ కాస్ట్‌లో 45 శాతం కేంద్రమే భరించినట్టవుతుందని రాష్ట్ర ప్రభుత్వం తొలుత భావించింది. కానీ కేంద్రం ఆ యూనిట్ కాస్ట్‌ను పెంచకుండా, గతంలో ఉన్న రూ.1.5 లక్షలే కొనసాగించాలని నిర్ణయించింది. అలాగే గ్రామీణ ప్రాంత యూనిట్ కాస్ట్ కూడా రూ.72 వేలుగానే ఉంది.

గ్రామీణ యూనిట్లకు పట్టణ కాస్ట్ దక్కేలా..

కేంద్రం నుంచి గ్రామీణ యూనిట్ కాస్ట్ రూ.72 వేలు మాత్రమే అందితే, ఆ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం భారీగా ఖర్చు చేయాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రానికి కొంతైనా ఊరట దక్కేలా వ్యూహరచన చేసిన ప్రభుత్వం.. సింహ భాగం గ్రామాలకు పట్టణ ప్రాంత యూనిట్ కాస్ట్ (రూ.1.5 లక్షలు) దక్కేలా పట్టణాభివృద్ధి సంస్థల సంఖ్యను పెంచేసింది. దీంతో ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ఇళ్లు 'పట్టణ' పరిధిలోకి రానున్నాయి. తద్వారా వాటికి 'పట్టణ' యూనిట్ కాస్ట్ ప్రకారం నిధులు అందే అవకాశం దక్కింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం కేవలం గృహనిర్మాణ పథకానికే పరిమితం కాకుండా, కొన్ని ఇతర పథకాలకు కూడా లబ్ధి చేకూర్చనుండటం గమనార్హం.

సాయంపై స్పష్టతకు మరింత సమయం

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన ఆరు నెలల తర్వాత కేంద్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. అప్పటికే రాష్ట్రంలో పథకాల ప్రకటన జరిగిపోయింది. కేంద్రంలోని కొత్త ప్రభుత్వం పథకాలను సమీక్షించుకుంటూ మార్పుచేర్పులు చేసేసరికి మరింత ఆలస్యం అయింది. ఫలితంగా కేంద్రం నుంచి ఎంత సాయం అందుతుందో రాష్ట్రానికి ఇప్పటికీ స్పష్టత రాలేదు. తాజాగా పట్టణాభివృద్ధి సంస్థల పెంపు నేపథ్యంలో, ఎన్ని పట్టణ ప్రాంత ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టనుందో కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనివ్వాల్సి ఉంది. అంటే తాజా నిర్ణయం మేరకు పట్టణ ప్రాంత ఇళ్ల సంఖ్యను తేల్చాల్సి ఉంది. ఆ మేరకు త్వరలో క్షేత్రస్థాయి సర్వే చేసి వివరాలు క్రోడీకరించి కేంద్రానికి పంపాల్సి ఉంటుంది. కేంద్రం ఎన్ని యూనిట్లను మంజూరు చేస్తుందో ఆ తర్వాతే తేలుతుంది. అప్పుడే కేంద్రం నుంచి వచ్చే సాయంపై స్పష్టత వస్తుంది. కానీ గతంతో పోలిస్తే ఆ సాయం భారీగా పెరుగుతుందని మాత్రం తేలిపోయింది.

జిల్లాలన్నీ ఉడాలే..!

▶ మొదటి పేజీ తరువాయి

సిద్దిపేట, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలతో ఏర్పాటు చేసిన మొత్తం 9 పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో ఇప్పటివరకు చుట్టుపక్కలున్న గ్రామాలు మాత్రమే ఉండేవి. మిగతా గ్రామాలన్నీ డీటీసీపీ (డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్) పరిధిలోకి వచ్చేవి. దీంతో 800 చదరపు గజాల పైబడి నిర్మాణాలకు, గ్రామాల్లో సాగే లే అవుట్ల అనుమతులన్నీ డీటీసీపీ ద్వారానే తీసుకోవలసి వచ్చేది. ఇప్పుడు జిల్లాల పరిధి మొత్తానికి ఉడాలను విస్తరించడంతో లే అవుట్లతో పాటు 800 చదరపు గజాల నిర్మాణాల అనుమతులు కూడా ఆయా జిల్లాల్లో ఏర్పాటైన ఉడాల ద్వారానే పొందే అవకాశం లభించింది.

జిల్లాల వారీగా మాస్టర్ ప్లాన్‌కు అవకాశం

రాష్ట్రంలో ఇప్పటివరకు పట్టణాలకు కూడా సరైన మాస్టర్‌ప్లాన్ లేదు. ఉడాల ద్వారా మాస్టర్‌ప్లాన్ రూపకల్పనకు కొన్ని ప్రయత్నాలు గతంలో జరిగినా వివిధ కారణాల వల్ల కొలిక్కి రాలేదు. ఇప్పుడు జిల్లా పరిధినే యూనిట్‌గా పట్టణాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేయడంతో జిల్లా మొత్తానికి మాస్టర్‌ప్లాన్ రూపొందించే అవకాశం లభించినట్లయిందని పురపాలక శాఖ అధికారి ఒకరు తెలిపారు. అలాగే ఆయా మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీలతో పాటు మండల కేంద్రాల మాస్టర్ ప్లాన్‌లను కూడా ప్రత్యేకంగా రూపొందించే అవకాశం లభించింది.

కేంద్ర నిధులు పెరిగేందుకు దోహదం

గ్రామాల్లో సాగే పేదల గృహనిర్మాణ కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు పెరిగేందుకు కూడా ఉడాల ఏర్పాటు దోహదపడనుంది. ప్రతి పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలోకి పట్టణాలు, కార్పొరేషన్లతో పాటు 10 నుంచి 15 మండలాల్లోని గ్రామాలు వస్తుండడంతో కేంద్రీకృతమైన అభివృద్ధికి ఆస్కారం లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

కొన్ని విశేషాలు..

- ఆసిఫాబాద్ జిల్లాలో కాగజ్‌నగర్ ఉడాను ఏర్పాటు చేసిన ప్రభుత్వం.. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ మునిసిపాలిటీలతో పాటు 10 మండలాల్లోని గ్రామాలను దాని పరిధిలోకి తెచ్చింది. కెరమెరి, జైనూర్, తిర్యానీ, లింగపూర్, సిర్పూర్-యూ మండలాల్లోని గ్రామాలన్నీ ఆసిఫాబాద్ జిల్లా కిందనే ఉంటాయి.
- ములుగు జిల్లాలోని 9 మండలాల్లో ఉన్న 174 గ్రామాలు ఏ పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలోకీ రావు.
- వేములవాడ దేవాలయ అభివృద్ధి సంస్థ (వీటీడీఏ) పరిధిలోకి సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల మునిసిపాలిటీతో పాటు 13 మండలాలను చేర్చారు.
- కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) పరిధిలోకి వరంగల్, హనమకొండ జిల్లాలు వస్తాయి.

17 వేల కి.మీ. రోడ్ల నిర్మాణానికి ఓకే!

- వచ్చే నాలుగేళ్లలో చేసేందుకు సర్కారు ప్రణాళిక
- రూ.12వేల కోట్ల అంచనా వ్యయం



సాక్షి, హైదరాబాద్: భారీ వాహనాలు వెళ్లేందుకు వీలుగా 17,300 కి.మీ. మేర గ్రామీణ రహదారుల ఆధునీకరణ, పునరుద్ధరణ, విస్తరణ, కొత్త రోడ్ల నిర్మాణ ప్రతిపాదనలపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు 10 మెట్రిక్ టన్నుల వాహనాల ప్రయాణానికి అనువుగా ఉండగా, అంతకుమించి సామర్థ్యమున్న భారీ వాహనాలు ఈ రహదారులపై వెళుతుండటంతో రోడ్లు దెబ్బతిన్నాయి. కొన్నేళ్లుగా పంచాయతీరాజ్ రోడ్ల నిర్వహణ, సంరక్షణ అనేది తీసికట్టుగా మారగా, కొంతకాలం క్రితం కురిసిన భారీ వర్షాలకు ఈ రహదారులు దెబ్బతిన్నాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఈ నేపథ్యంలో అంచనా వేసిన నష్టాలు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన నివేదికల ఆధారంగా 17,300 కి.మీ. రోడ్లను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ రోడ్ల పునరుద్ధరణ, నవీకరణ, నిర్వహణ పనులను హైబ్రిడ్ అన్యూటీ మోడల్ (హామ్)లో పోటీ ప్రక్రియ ద్వారా చేపట్టనున్నారు. జాతీయ రహదారుల నిర్మాణానికి అనుసరించే ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిని గ్రామీణ రోడ్ల నిర్మాణంలో అమలుచేసేలా ఇటీవల జరిగిన కేబినెట్ భేటీలో చర్చించారు. ప్రతి గ్రామ పంచాయతీ నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్డు నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పుడున్న రోడ్ల సామర్థ్యాన్ని 10 మెట్రిక్ టన్నుల నుంచి 30 మెట్రిక్ టన్నులకు పెంచనున్నారు. వచ్చే నాలుగేళ్లలో ఈ పనులు పూర్తిచేయాలంటే రూ.12 వేల కోట్ల నిధులు అవసరం కానున్నాయి.

వచ్చే నాలుగేళ్లలో చేపట్టనున్న రోడ్ల ప్రతిపాదనలు

సంవత్సరం	రోడ్ల నిడివి(కి.మీ.)	అంచనా వ్యయం (రూ.కోట్లు)
2024-25	4800	3,250
2025-26	4200	2,500
2026-27	3800	3,250
2027-28	4500	3,000
మొత్తం	17,300	12,000

చర్యల నివేదికలను త్వరగా ఇవ్వండి

- పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ
- కమిటీ సమావేశాన్ని బహిష్కరించిన బీఆర్ఎస్



సాక్షి, హైదరాబాద్: ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఆడిట్ పేరాలకు సంబంధించిన వివరణాత్మక నోట్స్, చర్యల నివేదికలను వీలైనంత త్వరగా సమర్పించేలా సంబంధిత శాఖల అధికారులు శ్రద్ధ చూపాలని పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ ఆదేశించారు. సోమవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో గాంధీ అధ్యక్షతన పీఏసీ రెండో సమావేశం జరిగింది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) సమర్పించిన నివేదికలు, పీఏసీ పరిశీలించిన ఆడిట్ పేరాలు, కాగ్ పేర్కొన్న అంశాలపై సంబంధిత శాఖల వివరణలపై ఈ సమావేశంలో చర్చించారు. కాగ్ నివేదికల ప్రకారం ఈ ఏడాది సెప్టెంబర్ చివరి నాటికి 32 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 302 ఆడిట్ పేరాలు, ఉమ్మడి ఏపీకి సంబంధించి 202 ఆడిట్ పేరాలు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తించారు.

క్షేత్రస్థాయి నుంచి సమాచారం ఆలస్యం

క్షేత్రస్థాయి నుంచి సమాచారం ఆలస్యంగా అందుతుండటంపై సంబంధిత శాఖల అధికారులు, జిల్లా కలెక్టర్లు సమీక్షలు నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ఆడిట్ పేరాలకు సంబంధించి వివరణాత్మక నోట్స్, చర్యల నివేదికలు సమర్పించే విషయంలో అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేస్తామని ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రామారావు పవార్, కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు పాల్గొన్నారు. కాగా పీఏసీ చైర్మన్ నియామకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఎల్.రమణ, సత్యవతి రాథోడ్ ఈ భేటీని బహిష్కరించారు.

కాంగ్రెస్‌కు ఓట్లు వేయలేదన్న అక్కసుతోనే ఇళ్ల కూల్చివేతలు

బుచ్చమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించిన కేటీఆర్



బుచ్చమ్మ కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న కేటీఆర్

కూకట్‌పల్లి: హైడ్రా అనే బ్లాక్‌మెయిల్ సంస్థను పేదల మీదకు ఉసిగొల్పి నోటీసులు ఇవ్వకుండానే ఇళ్లు కూల్చివేస్తామంటూ భయానక వాతావరణాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సృష్టిస్తున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు పేర్కొన్నారు. హైడ్రా కూల్చివేతల భయంతో గత కొద్ది రోజుల క్రితం ప్రాణాలు కోల్పోయిన బుచ్చమ్మ కుటుంబ సభ్యులను సోమవారం మాజీ మంత్రులు శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో కలిసి కేటీఆర్ పరామర్శించారు. బుచ్చమ్మ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన, ప్రణాళిక లేకుండా హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చటం హేయమైన చర్య అని ఆయన మండిపడ్డారు. హైదరాబాద్ నగరంలోని ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయలేదన్న అక్కసుతో హైడ్రా పేరుతో ప్రభుత్వం పగ, కసి పెంచుకుందన్నారు. బుచ్చమ్మది ఆత్మహత్య కాదు.. రేవంత్‌రెడ్డి చేయించిన హత్య అని ఆయన ఆరోపించారు. వేదశ్రీ అనే పాప తన పుస్తకాలు తీసుకుంటామని ఏడుస్తుంటే కూడా అవకాశమివ్వకుండా వారి షాపులు కూలగొట్టారన్నారు. రాష్ట్రంలో పేదవాళ్లకు మాత్రమే చట్టాలున్నాయా, రేవంత్‌రెడ్డి అన్నకు మాత్రం ఎఫ్‌టీఎల్‌లో ఉన్న ఇంటికి నోటీసులిస్తారా అని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్లపై ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చిన ఈ ప్రభుత్వం ఒక్క ఇల్లు కూడా కట్టలేదన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు బొంద పెట్టడం ఖాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మాధవరం రోజాదేవి రంగారావు, జూపల్లి సత్యనారాయణ, మందడి శ్రీనివాసరావు, పండాల సతీశ్‌గౌడ్, నాయకులు ఎర్రబెల్లి సతీశ్‌రావు, బీఆర్‌యస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


చిన్నారి వేదశ్రీకి పుస్తకాలు, స్కూలు బ్యాగు



హైడ్రా కూల్చివేతల కారణంగా ఇంటితో పాటు తాను చదువుకునే పుస్తకాలు కోల్పోయిన చిన్నారి వేదశ్రీ కుటుంబాన్ని కేటీఆర్ పరామర్శించారు. వేదశ్రీతో మాట్లాడి ఇల్లు కూల్చివేసిన రోజు ఏం జరిగిందో అడిగి తెలుసుకున్నారు. పుస్తకాలు కోల్పోయిన వేదశ్రీకి పుస్తకాలతో పాటు స్కూల్ బ్యాగును అందించారు. వారి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. వేదశ్రీ కుటుంబానికి అండగా ఉంటామని, హైడ్రా బాధితులందరికీ బీఆర్‌యస్ పార్టీ తరఫున న్యాయసాయం అందిస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

రేవంత్‌కు విషం తప్ప విజన్ లేదు

- మూసీ అక్రమాలు బయట పెట్టినందుకే కేటీఆర్ వ్యక్తిత్వంపై దాడి: హరీశ్‌రావు
- బండి సంజయ్ కేంద్రానికి కాదు.. రేవంత్ రెడ్డికి సహాయ మంత్రి
- పండుగల సీజన్‌లో రజాకార్ రాజ్యంలా 144 సెక్షన్ పెట్టారు



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెదడులో విషం తప్ప విజన్ లేదని, పాలనపై అవగాహన లేక రాష్ట్రాన్ని దివాళా తీయించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు మండిపడ్డారు. మూసీ పునరుజ్జీవం పేరిట రేవంత్ చేస్తున్న అక్రమాలను బయటపెట్టినందుకే ప్రజల దృష్టిని మళ్లించేలా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇందుకోసమే కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని ఆయన వ్యక్తిత్వంపై దాడి చేస్తున్నారన్నారు. ప్రజా సమస్యల మీద కొట్లాడుతున్న కేటీఆర్‌పై కక్ష తీర్చుకోవాలని ప్రభుత్వం చూస్తోందని, ప్రభుత్వం ఎంత భయపెట్టినా పోరాటం ఆపేది లేదని తేల్చిచెప్పారు. తెలంగాణ భవన్‌లో సోమవారం హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. 'కుటుంబసభ్యులను అడ్డుపెట్టుకుని దాడి చేస్తూ రేవంత్ రాక్షస పాలన చేస్తున్నారు. కుటుంబ విందును కూడా రేవ్ పార్టీ అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు' అని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు.

శోకనగర్‌గా మార్చారు..

'కేసీఆర్ పదేళ్ల పాలనలో అన్ని వర్గాలను కడుపులో పెట్టుకుని కాపాడితే, రేవంత్ ప్రభుత్వం మాత్రం పది నెలల్లో అందరి కడుపుకొట్టింది. నమ్మి ఓట్లేసిన ప్రజలను నట్టేట ముంచి ఏడాది కాకమునుపే అన్ని వర్గాల ప్రజలు రోడ్డెక్కి నిరసనలు చేసే దుస్థితి తెచ్చారు. కేసీఆర్ మానవీయ కోణంలో ప్రారంభించిన పథకాలు అటకెక్కగా, కొత్త హామీల అమలు ఊసే లేదు. పండుగ, పెళ్లిళ్ల సీజన్‌లో 144 సెక్షన్ విధించి రజాకార్ పాలన తలపిస్తున్నారు. విద్యార్థులు, యువత వీపులు కమిలి పోయేలా కొట్టారని, అశోక్‌నగర్‌ను శోకనగర్‌గా మార్చారని దుయ్యబట్టారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ స్థాయి దిగజారి రేవంత్ రెడ్డి తరఫున వకాల్తా పుచ్చుకుంటున్నారు. కేంద్ర సహాయ మంత్రిగా కాకుండా రేవంత్‌కు సహాయ మంత్రిగా బండి సంజయ్ వ్యవహరిస్తున్నారు' అని హరీశ్‌రావు పేర్కొన్నారు. 'పండుగ పూట పోలీసుల ఉద్యోగాలు ఊడగొట్టి వారి కుటుంబాలను ఏడిపిస్తున్నారు. శాంతిభద్రతలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న పోలీసులను కిరాయి మూకలుగా చూపిస్తున్నారు. పోలీసు కుటుంబం నుంచి వచ్చిన నాకు పోలీసుల కష్టాలు తెలుసు అంటూ ఎన్నికల సమయంలో రేవంత్ ఊదరగొట్టారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసుల పట్ల కర్కశంగా వ్యవహరిస్తున్నారు' అని హరీశ్‌రావు చెప్పారు. డిస్మిస్, సస్పెన్షన్ ఉత్తర్వులను వెనక్కుతీసుకొని తొలగించిన టీజీఎస్పీ సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అరికెపూడి నియామకాన్ని రద్దు చేయాలి

- పీఏసీ భేటీ నుంచి బీఆర్ఎస్ సభ్యుల వాకౌట్
- ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రేవంత్ రాజకీయం

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ సాంప్రదాయాలకు విరుద్ధంగా జరిగిన పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ నియామకాన్ని రద్దు చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. శాసనసభలో ప్రతిపక్ష నాయకుడు, బీఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావు సూచించిన మాజీ మంత్రి హరీశ్‌రావును పీఏసీ చైర్మన్‌గా నియమించాలన్నారు. శాసనసభ కమిటీ హాల్‌లో సోమవారం అరికెపూడి గాంధీ అధ్యక్షతన జరిగిన పీఏసీ చైర్మన్ సమావేశాన్ని బీఆర్ఎస్ సభ్యులు బహిష్కరించారు. అనంతరం తెలంగాణ భవన్‌లో పీఏసీ సభ్యులు సత్యవతి రాథోడ్, ఎల్.రమణతో కలిసి వేముల ప్రశాంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ సూచన మేరకు గీతారెడ్డి, కిష్టారెడ్డిని పీఏసీ చైర్మన్లుగా నియమించారని, కేంద్రంలోనూ రాహుల్ గాంధీ సూచన మేరకు పీఏసీ చైర్మన్‌గా కేసీ వేణుగోపాల్ నియమితులైన విషయాన్ని గుర్తు చేశారు. పీఏసీ సభ్యుడిగా హరీశ్‌రావు నామినేషన్‌ను ఎందుకు తిరస్కరించారో ప్రభుత్వం వివరణ ఇవ్వాలన్నారు. ఏఐసీసీ సూచనల మేరకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చెప్తున్నారని, కానీ మంత్రి శ్రీధర్‌బాబు మాత్రం అరికెపూడి గాంధీ బీఆర్ఎస్‌లో ఉన్నాడంటున్నారని ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించినా స్పందన లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అడ్డుపెట్టుకుని రేవంత్ రాజకీయం చేస్తూ అసెంబ్లీ సాంప్రదాయాలకు తూట్లు పొడుస్తున్నారని మండిపడ్డారు. పీఏసీ చైర్మన్ నియామకంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇచ్చిందని ఎమ్మెల్సీ ఎల్.రమణ విమర్శించారు.

క్లుప్తంగా...

కేటీఆర్ మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారు

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మిడి మిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి మంత్రిగా పనిచేసిన వ్యక్తికి ఎక్సైజ్ శాఖ ఎలా తనిఖీలు చేస్తుందో కూడా తెలియదా అని ప్రశ్నించారు. సోమవారం సీఎల్పీ కార్యాలయంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఎక్సైజ్ తనిఖీలు చేయడానికి వారెంట్ అవసరం లేదని, చట్టాలు తెలియకుండా మాట్లాడుతూ కేటీఆర్ నవ్వుల పాలవుతున్నారని అన్నారు. నార్కోటిక్స్ పరీక్ష చేస్తే పాజిటివ్ వస్తుందనే రాజ్ పాకాల తప్పించుకుని తిరుగుతున్నాడని అన్నారు. నిజంగా వారు తప్పు చేయకుండా పోలీసుల ముందుకు వచ్చి తాను ఎలాంటి తప్పు చేయలేదని చెప్పాలి కదా అని ప్రశ్నించారు. ఎదురుదాడి అన్నింటిలో పనికిరాదన్న విషయాన్ని కేటీఆర్ గ్రహించాలని, తన బావమరిదిని వెనకేసుకు రావడం ద్వారా కేటీఆర్ తనకు తాను రాజకీయ సమాధి చేసుకుంటున్నాడని వ్యాఖ్యానించారు.

హరీశ్‌రావును వెంటనే అరెస్టు చేయాలి

ఫిషర్‌మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్



సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగబద్ధమైన ముఖ్యమంత్రి పదవిలో ఉన్న రేవంత్‌రెడ్డిని అవమానించేలా మాట్లాడినందుకు మాజీ మంత్రి హరీశ్‌రావును వెంటనే అరెస్టు చేయాలని తెలంగాణ మత్స్య పారిశ్రామిక సహకార సొసైటీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ డిమాండ్ చేశారు. సీఎం అంటే చీటింగ్ మ్యాన్ అంటూ హరీశ్‌రావు అవమానకరంగా మాట్లాడారని, సీఎం అంటే క్రెడిబులిటీ మ్యాన్ అని రేవంత్ నిరూపించుకున్నారని వ్యాఖ్యానించారు. సోమవారం గాంధీభవన్‌లో సాయికుమార్ విలేకరులతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డిని అవమానించినందుకు ఈనెల 26న హరీశ్‌రావుపై బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టామని తెలిపారు. రేవంత్‌రెడ్డికి హరీశ్‌రావు వెంటనే క్షమాపణలు చెప్పాలని, లేదంటే హరీశ్‌ను అసెంబ్లీలో అడుగు పెట్టనీయబోమని హెచ్చరించారు. జన్వాడ ఫామ్‌హౌజ్ ఘటనలో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఏఎన్‌యూలో 'టీవీ అండ్ ఫిలిం' పీజీ కోర్సుకు దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ టీవీ అండ్ ఫిలిం స్టడీస్ రెండేళ్ల పీజీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ విభాగం కోఆర్డినేటర్ మధుబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు నవంబర్ 2వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కోర్సులో డాక్యుమెంటరీ, షార్ట్ ఫిలిం మేకింగ్, ఆర్ట్ ఆఫ్ ఫిలిం డైరెక్షన్, క్రియేటివ్ రైటింగ్, స్క్రీన్ రైటింగ్, స్టోరీ బోర్డింగ్, సినిమాటోగ్రఫీ, ఫిలిం గ్రామర్, ఫిలిం హిస్టరీ, టీవీ, న్యూస్ రీడింగ్, యాంకరింగ్ వంటి అనేక అంశాల్లో శిక్షణ పొందవచ్చని వివరించారు. కోర్సు ద్వారా సినిమా, టీవీ రంగాల్లో మంచి ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ కోర్సులో ప్రవేశం పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని, లేదా 9393110848 ఫోన్ నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.



"మనుషులు దేవుళ్లను తమ రూపంలోనే సృజిస్తారు.
– జెనోఫనీజ్

సాక్షి
మంగళవారం, 29 అక్టోబర్ 2024

ఒక ముందడుగు!

నాలుగేళ్ళ తర్వాత ప్రతిష్టంభనను తొలగించేందుకు తొలి అడుగు పడింది. హిమాలయ సరిహద్దు వెంట కొన్ని వివాదాస్పద ప్రాంతాల్లో ఉద్రిక్తతలను తగ్గించేందుకు భారత, చైనాల మధ్య అంగీకారం కుదిరింది. విస్తృతమైన సరిహద్దు వివాదం అలాగే అపరిష్కృతంగా ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి తూర్పు లద్దాఖ్ ప్రాంతంలో గాల్వాన్ లోయ ఘర్షణలకు ముందున్న పరిస్థితికి తిరిగి వచ్చే అవకాశం ఏర్పడుతోంది. చైనా సైతం పాల్గొన్న 'బ్రిక్స్' శిఖరాగ్ర సమావేశానికి భారత ప్రధాని వెళ్ళే ముందు గత వారమే ఈ ఒప్పందం గురించి వార్త బయటకు వచ్చింది. ఇప్పుడు ఆ చర్యలు తుది రూపానికి వచ్చాయి. ఒప్పందంలోని మరిన్ని వివరాలు విశదం కావాల్సి ఉన్నప్పటికీ, ద్వైపాక్షిక సంబంధాల మెరుగుదల, ఫలితంగా నెలకొనే ప్రాంతీయ సుస్థిరతకు ఇది ఓ సానుకూల పరిణామమని చెప్పవచ్చు. ఆసియా ఖండంలోని రెండు భారీ శక్తుల మధ్య రాజకీయ, వాణిజ్య సంబంధాల మెరుగుదలకు మళ్ళీ మార్గం సుగమం కానుందని భావించవచ్చు.

2020 జూన్‌లో చైనా సైనిక బలగాలు భారత భూభాగంలోకి చొచ్చుకొని వచ్చాయి. భారత బలగాలు సైతం త్వరితగతిన అందుకు దీటుగా బదులిచ్చాయి. బాహాబాహీ సాగిన ఆ ఘర్షణల్లో రెండు పక్షాల నుంచి గణనీయమైన సంఖ్యలో సైనికులు మరణించారు. గాయపడ్డారు. 1975 తర్వాత రెండు దేశాల మధ్య మళ్ళీ అంతటి ఉద్రిక్తతకు అది కారణమైంది. సరిగ్గా ఆ ఘర్షణలు జరిగిన గాల్వాన్ లోయ ప్రాంతం వద్దే ఇప్పుడు శాంతి, సాంత్వన యత్నానికి శ్రీకారం చుట్టడం ఒక రకంగా శుభపరిణామం. నాలుగేళ్ళ ప్రతిష్టంభన తర్వాత రెండు దేశాల మధ్య సంబంధాలు ఎంతో కొంత మెరుగయ్యేందుకు ముందడుగు వేసినందుకు ఇరుపక్షాలనూ అభినందించాల్సిందే. ఇరు పక్షాల మధ్య అనేక వారాలుగా సాగిన చర్చల తర్వాత ఈ ఒప్పందం కుదిరింది. ఒప్పందంలో భాగంగా భారత, చైనా భూభాగాలను విభజించే వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంట, తూర్పు లద్దాఖ్ సెక్టార్‌లోని డెప్సాంగ్, డెమ్‌ఛోక్ మైదాన ప్రాంతాల్లో భారత, చైనా సైనిక బలగాలను తగ్గించడం ఇప్పటికే మొదలైంది. అలాగే, గతంలో అంగీకరించిన పద్ధతిలోనే గస్తీ పునఃప్రారంభం కానుంది.

వ్యూహాత్మకంగా ఇటీవల 'బ్రిక్స్' సమిట్ సమయంలోనే ఈ గస్తీ ఒప్పందాల గురించి బయటకు చెప్పడం గమనార్హం. తద్వారా రెండు దేశాల మధ్య వైషమ్యాలను దూరం పెట్టి, ఆర్థిక సహకార పునరుద్ధరణకు బాటలు పరవాలనుకోవడం మంచిదే. అందుకు తగ్గట్లుగా 'బ్రిక్స్' సందర్భంగా భారత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ల మధ్య దాదాపు 50 నిమిషాల పాటు సుహృద్భావ పూర్వక భేటీ జరిగింది. సమావేశానికి కొద్ది రోజుల ముందే కుదిరిన ఈ సరిహద్దు గస్తీ ఒప్పందం, దరిమిలా ఆ భేటీ వల్ల ఉద్రిక్తతలు కొంత సడలడం ఖాయం. అలాగని ఈ ఒప్పందాన్ని కేవలం సైనిక సమన్వయ చర్యగా తక్కువ చేసి చూడడం సరికాదు. రెండు దేశాల మధ్య ఆర్థిక బంధాలనూ, అలాగే అంతర్జాతీయ స్థాయిలో దౌత్య సంబంధాలనూ పునర్ నిర్వచించే సామర్థ్యం కూడా ఈ ఒప్పందానికి ఉంది. అదే సమయంలో ఈ ఒప్పందంతో భారత, చైనాల మధ్య రాత్రికి రాత్రి అపూర్వ సత్సంబంధాలు నెలకొంటాయని అనుకొంటే అత్యాశే. ఇది కేవలం మొదటి అడుగు మాత్రమే. ఇంకా చేయాల్సింది చాలా ఉంది.

నిజానికి, భారత – చైనాలది సుదీర్ఘమైన 3440 కిలోమీటర్ల మేర విస్తరించిన సరిహద్దు. నదులు, సరస్సులు, హిమఖండాలతో కూడిన ఆ దోవలో విభజన రేఖను నిర్దుష్టంగా పేర్కొనడమూ చిక్కే. ఈ పరిస్థితుల్లో భూటాన్ – నేపాల్‌ల మధ్య సిక్కిమ్‌లో, అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్ సెక్టార్‌లో, ఇంకా అనేక ప్రాంతాల్లో ఇరుపక్షాల సైనికులు ముఖాముఖి ఎదురుపడి, ఘర్షణకు దిగడం జరుగుతున్నదే. దానికి తోడు భారత భూభాగంలోకి పదేపదే జొరబడుతూ చైనా చూపుతున్న విస్తరణ కాంక్ష తెలియనిదీ కాదు. ఈ పరిస్థితుల్లో ఎల్ఏసీ వెంట రోడ్లు, నివాసాల సహా ప్రాథమిక వసతి సౌకర్యాలను ఇబ్బడిముబ్బడిగా పెంచి, ప్రత్యర్థిపై పైచేయి సాధించాలనే ప్రయత్నం రెండు వైపులా సాగింది. ఆ నేపథ్యమే గాల్వాన్ ఘర్షణకూ దారి తీసింది. రెండు దేశాల మధ్య సాధారణ స్థితి రావాలంటే, తూర్పు లద్దాఖ్‌కే పరిమితమైన ఒప్పందంతో సరిపోదు. మొత్తం ఎల్ఏసీ వెంట సాధారణ పరిస్థితులకు కృషి సాగాలి. దానికి ఇరుపక్షాలలోనూ చిత్తశుద్ధి ముఖ్యం. డ్రాగన్ సైతం చెప్పేదొకటి, చేసేదొకటి విధానాన్ని ఇకనైనా మానుకోవాలి.

భారత్, చైనాలు కేవలం పొరుగుదేశాలే కాదు, ప్రపంచంలోనే అధిక జనాభా గల దేశాలు. కాబట్టి, పరస్పర స్నేహ సౌహార్దాల వల్ల రెండిటికీ లాభమే. భారత అగ్రశ్రేణి వాణిజ్య భాగస్వాముల్లో అమెరికాతో పాటు చైనా ఒకటి. సరుకుల నుంచి టెలికమ్యూనికేషన్ల హార్డ్‌వేర్, భారతీయ ఫార్మా రంగానికి ముడి పదార్థాల దాకా అనేకం భారత్‌కు అందించే అతి పెద్ద వనరు చైనాయే. గాల్వాన్ ఘటన తర్వాత చైనా పెట్టుబడులు, వీసాలు, యాప్‌లపై మన దేశం సహజంగానే తీవ్ర షరతులు పెట్టింది. అవన్నీ తొలగాలంటే, మళ్ళీ పరస్పరం నమ్మకం పాదుకొనే చర్యలు ముఖ్యం. గస్తీ ఒప్పందం కుదిరింది కదా అని నిర్లక్ష్యం వహించకుండా భారత్ అప్రమత్తంగా ఉండాల్సిందే. అవతలి పక్షాన్ని విశ్వసిస్తూనే, అంతా సజావుగా సాగుతున్నదీ లేనిదీ నిర్ధరించుకోవాల్సిందే. ఒప్పందాల మాట ఎలా ఉన్నా... సరిహద్దు వెంట సన్నద్ధతను మానరాదు. సరిహద్దులో ప్రాథమిక వసతి సౌకర్యాల నిర్మాణాలను కొనసాగించడమే దీర్ఘకాలంలో మన దేశానికి ఉపకరిస్తుంది. ఒకప్పటితో పోలిస్తే భారత్ బలీయంగా తయారైందని గాల్వాన్‌లో మన సైన్యాల దీటైన జవాబు రుజువు చేసింది. ఆ బలాన్ని కాపాడుకుంటూనే, డ్రాగన్‌తో బంధాన్ని పటిష్ఠం చేసుకోవడమే మార్గం.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.ద్వాదశి ఉ.10.36 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** ఉత్తర రా.7.28 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** తె.4.47 నుండి 6.31 వరకు (తెల్లవారితే బుధవారం), **దుర్ముహూర్తం:** ఉ.8.18 నుండి 9.06 వరకు, తదుపరి రా.10.31 నుండి 11.19 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.29 నుండి 1.16 వరకు, ధన త్రయోదశి

సూర్యోదయం : 6.01
సూర్యాస్తమయం: 5.27
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

సమతా పథంలో సాగాలంటే...

విశ్లేషణ



డా॥ కత్తి పద్మారావు

మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ అంబేడ్కర్ జపం చేస్తోంది. దేవేంద్ర ఫడ్నవీస్ రాజ్యాంగం మీద ఎక్కడలేని ప్రేమను కురిపిస్తున్నారు. రాజ్యాంగం తనకు శిరోధార్యం అని నమ్మించడానికి ప్రయత్నిస్తున్నారు. అంబేడ్కర్‌ను బీజేపీ, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ ఇప్పుడు కొనియాడటంలో మార్మికత ఉంది. వాటిని దళిత బహుజనులు అర్థం చేసుకుంటున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ కూడా రాజ్యాంగాన్ని చేత బూనుతుంది. కానీ కుల నిర్మూలనకు, స్త్రీ విముక్తికి, సంపద అందరికీ పంచడానికి పాటుపడటం లేదు. ఈ కార్పొరేట్ భారతాన్ని మతవాదులు పెంచి పోషిస్తున్నారు. అంబేడ్కర్ ఒక విస్తృతమైన మానవాభ్యుదయం కోసం కృషి చేశారు. సామ్యవాద భారతం కావాలంటే అంబేడ్కర్ మార్గం ఒక్కటే దిక్సూచి.

భారతదేశంలో అనేక భావ విప్లవ ఉద్యమాలు, సామాజిక సాంస్కృతిక పరిణామాలు ఆ యా కాలాల్లో వచ్చాయి. అవి రాజకీయ సిద్ధాంతాలపై ప్రభావం చూపాయి. ముఖ్యంగా భారతదేశంలో 1927వ సంవత్సరం నుండి సామాజిక విప్లవోద్యమం ప్రారంభమైంది. బి.ఆర్. అంబేడ్కర్ మనుస్మృతిని దహనం చెయ్యటంతోనే ఈ సాంస్కృతిక విప్లవం ప్రారంభమైంది. అంబేడ్కర్ పుట్టిన మహారాష్ట్రలో అడుగుపెట్టిన నోబెల్ బహుమతి గ్రహీత వి.ఎస్.నైపాల్ ముంబయి నగరాన్ని చూస్తుంటే అంబేడ్కర్ నగరంగా కనిపిస్తుందని అన్నారు. ఎక్కడ చూసినా అంబేడ్కర్ విగ్రహాలు, అంబేడ్కర్ కాలేజీలు, అంబేడ్కర్ విశ్వవిద్యాలయాలు, అంబేడ్కర్ చైత్యాలు, అంబేడ్కర్ గ్రంథాలయాలతో నిండివుందని నైపాల్ రాశారు. భారతదేశం మొత్తం ఎక్కడ చూసినా– బెంగళూరు, చెన్నై, కలకత్తా అన్ని మహానగరాల్లోనూ అంబేడ్కర్ స్ఫూర్తే కనపడుతుంది.

నిజానికి ఆర్ఎస్ఎస్‌కు, విశ్వహిందూ పరిషత్‌కు భావజాల పరంగా, సిద్ధాంతపరంగా ప్రత్యామ్నాయంగా రూపొందించిందే మన రాజ్యాంగం. భారత రాజ్యాంగం పూర్తిగా మనుస్మృతి భావజాలాన్ని నిరాకరించిన గ్రంథం. అంబేడ్కర్ రాజ్యాంగ ప్రతిని రాజ్యాంగ పరిషత్తులో ప్రవేశపెట్టిన నాటి నుండి ఆర్ఎస్ఎస్ నిరాకరిస్తూనే వచ్చింది. బీజేపీ ద్వారా సంపూర్ణ రాజ్యాధికారమే వస్తే రాజ్యాంగాన్నే మార్చాలనే దుర్వ్యూహం వాళ్ళ దగ్గర వుంది.

అంబేడ్కర్ భారతదేశాన్ని సమసమాజ నిర్మాణంలోకి తీసుకు వెళ్ళాలని ఎంతో ప్రయత్నం చేశారు. పెను వృక్షంలాంటి కాంగ్రెస్ బ్రాహ్మణవాదాన్ని ఎదిరించటానికి, అంతర్గతంగా కాంగ్రెస్‌లో దాగివున్న హిందూ సాంప్రదాయవాదాన్ని ఎదిరించడానికి ఒక దశలో ఒంటరి పోరాటం చేయవలసి వచ్చింది. తన ప్రజలు కూడా తనకు తోడురాని పరిస్థితుల్లోనూ నిక్కచ్చిగా నిలబడ్డారు. అంబేడ్కర్ దేశ వ్యాప్తంగా తన తాత్విక ముద్ర వేయగలగడానికి కారణం ఆయన బౌద్ధతాత్విక జీవన విధానమే. ఆయన రాజ్యాంగ రచనా రూపకల్పనలో అష్టాంగ మార్గాన్ని ఆదర్శ సూత్రాల్లోకి సమన్వయించ గలిగారు. సమదృష్టి, సత్‌సంకల్పము, సత్ వచనము, సత్ కర్మ, సత్ జీవనము, సత్ ప్రయత్నము, సత్ కృతి, సత్ సమాధి సూత్రాలను భారత రాజ్యాంగంలో చేర్చిన తరువాత దానికి సామాజిక, తాత్విక జీవన పరిమళం వచ్చింది. భారత రాజ్యాంగం ఒక గొప్ప సమతా మార్గ నిర్దేశంగా నిలబడింది.

ఈనాడు మహారాష్ట్ర ఎన్నికల సందర్భంలో బీజేపీ కొత్త ఎత్తుగడతో అంబేడ్కర్ జపం చేస్తోంది. మహారాష్ట్ర రాజకీయాల్లో ఈ దశాబ్దంలో అనేక మార్పులు వచ్చాయి. బీజేపీ దుర్వ్యూహాల గురించి దళితులు, బహుజనులు అర్థం చేసుకుంటున్నారు. ఇప్పుడు బీజేపీ నాయకుడు దేవేంద్ర ఫడ్నవీస్ రాజ్యాంగం మీద ఎక్కడలేని ప్రేమ



కురిపిస్తున్నారు. రాజ్యాంగం తనకు శిరోధార్యం అని నమ్మించడానికి ప్రయత్నిస్తున్నారు. ఫడ్నవీస్ రాజ్యాంగానికి, అంబేడ్కర్‌కు మోకరిల్లుతున్న పోస్టర్లు మహారాష్ట్రలో విస్తృతంగా దర్శనమిస్తున్నాయి. రాజ్యాంగ రూపకల్పన పూర్తయిన సందర్భంగా, రాజ్యాంగ నిర్ణాయక సభలో 1949 నవంబర్ 25న అంబేడ్కర్ చేసిన రాజ్యాంగం తుది ప్రతి మీద ఆర్ఎస్ఎస్ దుమ్మెత్తి పోసింది. రాజ్యాంగంలో భారతీయత అనేది ఉదాహరణ ప్రాయంగా కూడా లేదని దెప్పి పొడిచింది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు పూర్తయినా దళితులపై ప్రతిరోజూ అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. కొన్నిసార్లు బహిరంగంగా కొట్టడం, మరి కొన్నిసార్లు గుడిలోకి రానివ్వకపోవడం, చేసిన పనికి జీతం అడిగితే దాడులకు దిగడం, దొంగతనం చేశారన్న ఆరోపణలతో అకృత్యాలకు పాల్పడటం నిత్యకృత్యాలుగా మారి శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతూనే ఉన్నాయి. దళితులను అవమానించడం, సాంఘిక బహిష్కరణ కేసులు నిత్యం వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) గణాంకాల ప్రకారం, దళితులపై అఘాయిత్యాలకు సంబంధించి ప్రతిరోజూ 150కి పైగా కేసులు నమోదవుతున్నాయి. ఎన్డీయే పాలనలో 2018 నుండి 2022 మధ్య దళితులపై లైంగికదాడులు 35 శాతం పెరిగాయని ఆ నివేదిక తెలిపింది. ఆ నివేదిక ప్రకారం 2018 నుంచి ప్రతి సంవత్సరం కేసుల సంఖ్య పెరుగుతూనే ఉన్నది. దళితులపై నేరాలకు సంబంధించి 2018లో 42,793 కేసులు నమోదయ్యాయి. 2021లో 50,900 కేసులు, 2022లో 57,582 కేసులు నమోదయ్యాయి. ఆ నివేదిక ప్రకారం ఉత్తరప్రదేశ్‌లో దళితులపై అఘాయిత్యాల కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. 2022లో అక్కడ 15 వేలకుపైగా కేసులు నమోదయ్యాయి. ఎనిమిదిన్నర వేలకు పైగా కేసులు నమోదైన రాజస్థాన్ రెండో స్థానంలో ఉంది.

యోగీ ఆదిత్యనాథ్ ఇలాకాలోని భరూచ్ జిల్లా తాజ్‌పూర్ తెడియా గ్రామంలో ఇద్దరు కోళ్ల ఫారం యజమానులు దళిత బాలురు దొంగతనం చేశారన్న అనుమానంతో దాష్టీకానికి దిగారు. బాలురను కొట్టి, గుండు గీయించి, ముఖానికి నల్లరంగు పులిమి గ్రామంలో ఊరేగించారు. ఐదు కిలోల గోధుమలు అపహరించారని ఆరోపిస్తూ 12–14 ఏళ్ల వయసున్న ముగ్గురు బాలుర ముంజేతులపై 'దొంగ' అని రాసి గ్రామంలో ఊరేగించారు.

దళితుల మానవ హక్కుల పోరాటం గురించి అంబేడ్కర్ ఎంతో అధ్యయనం చేశారు. మొదట డ్రాఫ్టింగ్ కమిటీ సభ్యుడిగా ఎన్నుకోబడిన అంబేడ్కర్ ఆ పిదప 1947 ఆగస్ట్ 29వ తేదీన రాజ్యాంగ రచన సంఘ అధ్యక్షునిగా ఎన్నుకోబడ్డారు. ఎన్. గోపాల స్వామి అయ్యంగార్, సర్ అల్లాడి కుప్పుస్వామి అయ్యర్, కె.ఎం. మున్షీ, మహ్మద్ సాదుల్లా, ఎన్. మాధవ రావు, డి.పి. ఖైతాన్ యితర సభ్యులు కాగా, బి.ఎన్.రావు రాజ్యాంగ సలహాదారులు. కాంగ్రెస్ పార్టీని, ఆ పార్టీ నాయకులను విమర్శించే అంబేడ్కర్‌ను రాజ్యాంగ రచన సంఘాధ్యక్షులుగా ఆహ్వానించారు. ఇది ఒక రకంగా కాంగ్రెస్ పార్టీ ఔదార్యంగా చెప్పబడినా అంబేడ్కర్ అసాధారణ ప్రతిభ, ఒక చారిత్రక అవసరంగా మాత్రమే పరిగణించబడుతుంది.

అంబేడ్కర్ తనపై మోపబడిన ఈ భారాన్ని సమర్థవంతంగా, నిజాయితీగా నిర్వర్తించడానికి కృషి చేశారు. అంబేడ్కర్ అమెరికాలో చదువుతున్న కాలంలో నీగ్రోల చరిత్రను అధ్యయనం చేశారు. నీగ్రోలు తమ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్ళే క్రమంలో అమెరికా రాజ్యాంగంలోని 14వ అధికరణం ద్వారా ఎలా స్వాతంత్ర్యం పొందారో తెలుసుకున్నారు. నీగ్రోల విముక్తి పోరాటంలో ప్రధాన పాత్ర వహించిన బుకర్ టి.వాషింగ్టన్ చరిత్రను అధ్యయనం చేశారు. నీగ్రోల పోరాట చరిత్ర ద్వారా భారతదేశంలో దళితుల్ని ఎలా విముక్తి చేయాలో అర్థం చేసుకొన్నారు.

అంబేడ్కర్ ఒక విస్తృతమైన మానవాభ్యుదయం కోసం కృషి చేశారు. ఆయనకు కుల మత బేధాలు లేవు. ఆయన బౌద్ధ జీవన పథికుడు. ఆయన ఆర్థిక, వ్యాపార, రాజకీయ, పరిపాలన, ధర్మ శాస్త్రాల నిపుణుడు. మనుస్మృతిని, యాజ్ఞవల్క్య స్మృతిని, శారదా స్మృతిని అధ్యయనం చేసిన భారతీయుడు. అవి అధర్మశాస్త్రాలని తేల్చిన పరిశోధకుడు. చార్వాకాన్ని, బౌద్ధాన్ని, జైనాన్ని, సాంఖ్యాన్ని అవపోసన పట్టారు. జాన్ డ్యూయీ శిష్యునిగా ప్రజాస్వామ్య శాస్త్రాన్ని ప్రపంచానికి బోధించారు. ఆయన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ ఇప్పుడు కొనియాడటంలో మార్మికత ఉంది. కాంగ్రెస్ పార్టీ కూడా రాజ్యాంగాన్ని చేత బూనుతుంది కానీ అస్పృశ్యత నివారణకు, కుల నిర్మూలనకు, స్త్రీ విముక్తికి, సంపద అందరికీ పంచడానికి పాటుపడటం లేదు. ఈ కార్పొరేట్ భారతాన్ని మతవాదులు పెంచి పోషిస్తున్నారు. సామ్యవాద భారతం కావాలంటే అంబేడ్కర్ మార్గం ఒక్కటే దిక్సూచి. ఆయన మార్గంలో నడుద్దాం.

వ్యాసకర్త దళితోద్యమ నాయకులు । 98497 41695

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

మారే రాజకీయాలు



ఆలస్యమైన జనగణన వచ్చే ఏడాది మొదలుకావడం, దాని తర్వాత నియోజకవర్గాల పునర్విభజన జరగడం అనేది చాలా పెద్ద వార్త. భారత రాజకీయ నిర్మాణాన్ని మార్చగలిగే సంభావ్యత ఉన్న కథనం ఇది.

– సబా నఖ్వీ, రచయిత్రి

ఏ కాలపు వాళ్లో!



మా జిమ్ములో మనుషులు వస్తారు, పరిగెడతారు, బరువులెత్తుతారు, నీళ్లు తాగి వెళ్లిపోతారు. ఒక్కరూ అద్దంలో ఒక ఫొటోనో, లేకపోతే ఒక రీలో తీసుకోరు. ఏంటో ఎలా బ్రతుకుతారో వీళ్లంతా!

– శ్రీకాంత్ మిర్యాల, సైకియాట్రిస్ట్

సంపూర్ణ ఆనందం



మనం కోరుకున్నది దొరికితే ఇంక కోరుకోవడానికి ఏమీ ఉండదు. మనిషి సంపూర్ణమవుతాడు. మనలోని అసంపూర్ణతే మనల్ని సక్సెస్‌ఫుల్‌గా ఉండటానికి ఇంకేదో చేయిస్తుంది. కావాల్సింది దొరికి, పూర్తి తృప్తినొంది, మనసు పూర్ణ విశ్రాంత స్థితిలో ఉన్నప్పుడు గొప్ప ఆనందాన్ని అనుభవిస్తాం. అదింక భూమ్మీద ఎక్కడా దొరకదు.

– శ్రీ ఎం., ఆధ్యాత్మిక గురువు

కలిసిపోయినై!



ప్రతి రోజూ పొద్దున్న ఆరింటికి నేను మూడు వీధి పిల్లులకు ఆహారం పెడుతున్నాను. పోట్లాడుకుని, గుర్రుగుర్రుగా చూసుకున్నవి కాస్తా విచిత్రంగా ఐదు రోజుల తర్వాత స్నేహితులయ్యాయి.

– వీర్ దాస్, స్టాండప్ కమెడియన్

ఏదైనా జరగొచ్చు!



తమిళనాడు 2026 శాసనసభ ఎన్నికలను 18 నెలల ముందే అంచనా వేస్తున్నవారికి కూటములు ఎలా బరిలో ఉంటాయో తెలీదు. ఎన్నికలయ్యాక కూడా ఫలితాలు అంచనా వేయలేని పరిస్థితిలో ఇది హాస్యాస్పదం. నటుడు విజయ్ తొలి ఓవర్లో సిక్స్ కొట్టాడు. మంచి ప్రారంభం. తర్వాత సెంచరీ చేయొచ్చు, మూడో ఓవర్లోనే ఔట్ కావొచ్చు. ఇప్పటికి చెప్పగలిగిందల్లా రాజకీయాలు మరింత ఆసక్తిగా మారాయని!

– సుమంత్ రామన్, హోస్ట్

ఏమి కానుందో!



కంగనా రనౌత్ ఇండియా ట్రంప్. మర్యాదతో నోరు కట్టేసుకునే ప్రపంచంలో ఎవరూ అనాలనుకోని మాటలను అనే జూదానికి దిగుతుంది. చాలా సత్యాల్లాగే ఇది దురుసుగా కనబడుతుంది. ఈ కారణంగానే ట్రంప్‌లాగే ఆమె రాజకీయ భవిష్యత్తును తక్కువగా అంచనా వేస్తాం.

– మను జోసెఫ్, కాలమిస్ట్

ఉండాల్సిన విధం



ఒక ప్రగతిశీల దేశం అంటే – మహిళలు రాత్రి పూట స్వేచ్ఛగా సంచరించగలగాలి; ప్రజారవాణా వ్యవస్థ సౌకర్యంగా, సురక్షితంగా ఉండాలి; ప్రభుత్వం సైన్యం మీద తక్కువగా, విద్య మీద ఎక్కువగా ఖర్చు చేయాలి; విద్యా నాణ్యత పెరగాలి, ఖర్చు తగ్గాలి; పని ప్రదేశంలో దోపిడీ తక్కువగా ఉండాలి.

– స్వాతి కె., న్యాయవాది

డ్యూటీ సరే... వారూ మనుషులని మరిస్తే ఎలా?

అభిప్రాయం



ఏనుగుల రాకేష్ రెడ్డి

తెలంగాణలో బెటాలియన్ కానిస్టేబుల్‌ల తిరుగుబాటు దేశంలోనే అతిపెద్ద తిరుగుబాటు. సామాన్యులు తమ హక్కుల కోసం రోడ్డెక్కి ధర్నాలు చేస్తే కట్టడి చేసే పోలీస్ కానిస్టేబుళ్ల కుటుంబాలే రోడ్లెక్కి ధర్నాలు చేసే దుఃస్థితి దాపురించింది. శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే పోలీస్ కుటుంబాల మీదకే పోలీసులను ఉసిగొల్పి పరుగులు పెట్టిస్తోంది ఈ ప్రభుత్వం.

ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో తానూ పోలీస్ కుటుంబం నుండే వచ్చాననీ, పోలీస్ కానిస్టేబుళ్లు పడే బాధలు, కష్టాలు తెలుసని అనేకసార్లు ప్రస్తావించి వాళ్ల మనసులు దోచుకునే ప్రయత్నం చేశారు. ప్రధానంగా 'ఏక్ యూనిఫాం – ఏక్ పోలీస్ విధానం' తీసుకొస్తామని హామీ ఇచ్చారు. కానీ పదినెలలు గడుస్తున్నా కీలకమైన హోం శాఖను తన దగ్గరే ఉంచుకున్న సీఎం పట్టించుకోవడం లేదు.

పోలీస్ కానిస్టేబుళ్లు సమాజంలో శాంతి భద్రతలు కాపాడటానికి మూల స్తంభాలు. సమాజాన్ని కుటుంబంగా భావిస్తూ వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసి పండగలు, పర్వదినాల్లో సైతం కుటుంబానికి దూరంగా ఉంటూ గస్తీ కాస్తూ ఉంటారు. ఎంతో ప్రత్యేకమైన ఈ యూనిఫాం సర్వీస్‌పై మక్కువతో వచ్చిన వాళ్లను సివిల్ కానిస్టేబుల్, టీఎస్ఎస్పీ, ఏఆర్ అంటూ వివిధ విభాగాలుగా విభజించారు. అందరూ ఒకే రకమైన పరీక్షలతో పోటీ పడి వచ్చినప్పటికీ, ఒంటిమీద ఉన్న ఖాకీ దుస్తులను చూసి కాకుండా వారి విభాగాన్ని బట్టి వారికి గౌరవం ఇవ్వడం మానసికంగా వారిని కుంగదీస్తోంది. కానిస్టేబుల్ ఉద్యోగం అంటే పేద, మధ్యతరగతి కుటుంబాల్లో సహజంగా ఎంతో మర్యాద, గౌరవం ఉంటాయి. కాని, పండగలకు పబ్బాలకు దేవుడెరుగు ఇంట్లో తల్లిదండ్రులకు ఆరోగ్యం బాగలేకపోయినా, భార్య పిల్లలను



చూసుకోవడానికి, పిల్లలతో కాస్త సమయం గడపడానికి కూడా వీలు లేని దుఃస్థితి దాపురించింది.

న్యాయాన్ని కాపాడే పోలీసులు అన్యాయంపై పోరాడితే అది ధిక్కారం ఎలా అవుతది, ప్రశ్నించడం అవుతది తప్పు? 'అన్యాయాన్ని ఎదిరిస్తే నా గొడవకు సంతృప్తి. అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి. అన్యాయాన్నెదిరించిన వాడే నాకారాధ్యుడు' అన్న కాళోజీ వారసులు మన తెలంగాణ పోలీసులు. కొట్లాడి సాధించుకున్న ప్రత్యేక తెలంగాణ వచ్చిన తొలినాళ్లలోనే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు నేతృత్వంలో పోలీస్ వ్యవస్థ ఎంతో పటిష్ఠమై దేశానికే ఆదర్శంగా నిలిచింది. మిగతా అన్ని డిపార్ట్‌మెంట్‌లతో పోలిస్తే పోలీస్ శాఖలో ఉంటే బాసిజంను ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో పారదోలి, పై అధికారులకు, కిందిస్థాయి పోలీస్‌లకు స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పారు.

గత ప్రభుత్వం టీఎస్ఎస్పీ బెటాలియన్ కానిస్టేబుళ్లకు 15 రోజుల డ్యూటీ తర్వాత 4 రోజులు సెలవులు ఇచ్చి కాస్త ఉపశమనం ఇచ్చేది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత కర్కశంగా నెలంతా నిద్రాహారాలు మాని విధులు నిర్వహిస్తే 26 రోజుల డ్యూటీ తర్వాత 4 రోజులు మాత్రమే సెలవులు ఇస్తామని కొత్త నిబంధనలు తెచ్చి తీవ్రంగా హింసించాలని చూస్తోంది. ఇప్పటికే పని ఒత్తిడి, పై అధికారుల పెత్తనం తట్టుకోలేక అనేకమంది కానిస్టేబుళ్లు బలవన్మరణాలకు పాల్పడుతున్న ఘటనలు ఎన్నో ఉన్నాయ్.

చాలీచాలని జీతాలు, పని ఒత్తిడితో నలిగిపోతున్న పోలీస్ కానిస్టేబుళ్లకు ప్రస్తుత ప్రభుత్వం తెచ్చిన ఈ నిబంధనలు మూలిగే నక్కమీద తాటిపండు పడ్డట్టయ్యింది. పోలీస్ కానిస్టేబుల్ కుటుంబాలతో సమావేశమైన ఒక అధికారి ఒక కానిస్టేబుల్ భార్యతో మాట్లాడుతూ, 'మిమ్మల్ని టీఎస్ఎస్పీ బెటాలియన్ కానిస్టేబుళ్లను ఎవరు పెళ్లి చేసుకొమ్మన్నరు? ఇందులో ఇలాగే ఉంటుందని మీకు తెలియదా?' అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడిన తీరు అందరినీ నివ్వెరపర్చింది. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళలను, కుటుంబ సభ్యులను... తోటి పోలీస్ కానిస్టేబుళ్ల కుటుంబాలే అని స్పృహ కూడా లేకుండా... పోలీస్ అధికారులు, సీఎం రేవంత్ రెడ్డి వారి సమస్యలు వినడానికి కూడా సమయం ఇవ్వడం లేదు.

పోలీస్ అమరవీరుల సంస్మరణ సభలో ముఖ్యమంత్రి నుండి వారు ఆశించిన ప్రకటన రాకపోవడంతో నిరాశతో వారి కుటుంబాలు ధర్నాలు చేస్తే వారిపై ఉక్కుపాదం మోపారు. గత రెండు, మూడు రోజులుగా పోలీస్ కానిస్టేబుళ్లే స్వయంగా ధర్నాలు చేస్తే వారిని సస్పెండ్ చేసి విధుల నుండి తొలగించారు. ఇదే టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్లే ముఖ్యమంత్రికి వెనకా, ముందూ గస్తీ కాస్తారు. మంత్రుల కార్లు నడుపుతారు. రక్షణ కవచంగా ఉంటారు. ప్రజలను, ప్రభుత్వ పెద్దలకు కంటికి రెప్పలా కాపాడుతారు. కాబట్టి, వారి కుటుంబాలకు కూడా ప్రభుత్వమే రక్షణ కల్పించాలి. వారి ఆత్మగౌరవం కూడా నిలపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కాబట్టి, వారి సహజ న్యాయమైన డిమాండ్లు అయిన 'ఏక్ పోలీస్' విధానాన్ని తక్షణమే అమలు చెయ్యాలి.

అలాగే రెండు మూడు నెలలకు ఒక చోటుకు పంపడం, రోజుకో స్థలంలో విధులకు పంపడం వల్ల వాళ్ల కుటుంబాలు నలిగిపోతున్నాయి. వాళ్ల జీవితాల్లో ప్రయాణానికి, సామాన్లు సర్దుకోవడానికే సమయం సరిపోతోంది. కాబట్టి, మానవీయ కోణంలో ఆలోచించి కనీసం 5 ఏళ్లు ఒక్కదగ్గర ఉండేలా చర్యలు చేపట్టాలి.

వ్యాసకర్త బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు

విధి విలాసం

దేవతలే కోరుకున్నప్పటికీ, ఒక్కొకసారి కోరుకున్నవి సరిగ్గా అలాగే జరగవు. సాక్షాత్తూ దేవేంద్రుడే కలగజేసుకుని పథకం రచించినప్పటికీ అది సాధ్యం కాదు. తారకాసురుడి వృత్తాంతం ఎలా మొదలై, ఏ పరిణామాలకు దారితీసిందో చూస్తే, ఇందులో తాత్పర్యం బోధపడుతుంది. బ్రహ్మదత్తమైన వర బలంతో ముల్లోకాలను అధీనంలోకి తీసుకుని పాలిస్తూ, ముప్పది మూడు కోట్ల బృందారకులను, మహర్షి గణాలను ముప్పుతిప్పలు పెట్ట సాగాడు తారకాసురుడు. ఆ స్థితిలో ఇక తాళలేక అందరూ బ్రహ్మదేవుడి వద్దకే వెళ్ళి 'గర్భయాచకుల భంగి దరిద్రత చుట్టుకున్నట్లయింది మాకు. కుక్కలు కూడా పడని పాట్లు పడుతున్నాం' అని మొర పెట్టుకున్నారు. వారి ఆక్రందనలను విన్న బ్రహ్మదేవుడు 'నా వరప్రభావంతోనే వాడు ఇలాగయ్యాడని నేనెరుగుదును. ఎంత విష వృక్షాన్నైనా, పెంచిన చేతితో పెరికెయ్యడం తగిన పని కాదు కదా! సమయం వస్తుంది. శివపార్వతుల సంతానం చేతిలో వాడికి ఆయువు తీరుతుంది. చింతమాని ఇళ్ళకు వెళ్ళండ'ని అనునయించి పంపాడు. ఇది నిర్దయమైన కొన్నాళ్ళకు, ఇంద్రుడు మన్మథుడిని దగ్గరకు పిలిచి, అతడు చేయాల్సిన పని గురించి చెప్పే సందర్భంలో ఇలా అన్నాడని శ్రీనాథుడి హరవిలాసం, తృతీయాశ్వాసంలో ఉంది.

జ్యోతిర్మయం

తే. కోరి యభ్యర్థనము సేయువారు సురలు;
కార్యము హితమ్ము మూడు లోకమ్ములకును;
కర్మమున హింస పలమైన గానరాదు;
కామ! సంస్పృహణీయ విక్రముడ వీవు!

'దేవతలే కోరుతున్నారు కాబట్టి ఇందులో మరి వెరవాల్సిందేమీ లేదు. ముల్లోకాలకు ఇది మేలును కలిగించే కార్యం. తపస్సులో మునిగి ఉన్న శంకరుడి మనస్సును పార్వతి మీదకు మళ్ళించడమనే పనిలో హింస కొంచెం కూడా కనపడదు. ఇందులో నీ ప్రతాపానికి అడ్డముండదు. నీకు విజయం దక్కనుంది. వెళ్ళిరా!' అని ఇంద్రుడు మన్మథుడిని పురికొల్పి పంపడం పై పద్యం భావం. ఆశించినది సాధించడంలో మన్మథుడు కృతకృత్యుడైనప్పటికీ, ఎవ్వరూ ఊహించని విధంగా, శివుడి మూడవ కంటి మంటలో మండి బూడిదవడంతో దేవతల ప్రయత్నం దుఃఖాన్ని మిగల్చడం అందరూ ఎరిగినదే! ఎంతటి బలవంతులకైనా విధి చేతలకు తలవంచక తప్పదన్నది ఇందులో గ్రహించ వలసిన సారాంశం.

– భట్టు వెంకటరావు

సీడీఎంఏగా శ్రీదేవి.. హరీశ్‌కు ఐఅండ్‌పీఆర్

11 మంది ఐఏఎస్‌లను బదిలీ చేసిన ప్రభుత్వం.. ఇద్దరికి అదనపు బాధ్యతలు

- రంగారెడ్డి కలెక్టర్‌గా నారాయణరెడ్డి.. నల్లగొండ కలెక్టర్‌గా త్రిపాఠీ
- రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల కమిషనర్‌గా శశాంక
- నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా మేడ్చల్ జెడ్పీసీఈవో దిలీప్‌కుమార్
- ఇద్దరు ఐఎఫ్ఎస్ అధికారులు కూడా బదిలీ


టి.కె.శ్రీదేవి


ఎస్. హరీశ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 11 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మరో ఇద్దరు ఐఏఎస్ అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించింది. రాష్ట్రస్థాయి కమిషనర్లు, డైరెక్టర్లు, జిల్లాల కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు ఈ జాబితాలో ఉన్నారు. వీరితో పాటు ఇద్దరు ఐఎఫ్ఎస్ అధికారులను కూడా ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషనర్ టి.కె. శ్రీదేవిని మళ్లీ పుర పాలక శాఖకు పంపారు. ఆమెను కమిషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ)గా బదిలీ చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం సమాచార, పౌర సంబంధాల శాఖ (ఐఅండ్‌పీఆర్) స్పెషల్ కమిషనర్‌గా ఉన్న ఎం. హనుమంతరావును యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేయగా, ఐఅండ్‌పీఆర్ బాధ్యతలను రెవెన్యూ జాయింట్ సెక్రటరీ ఎస్.హరీశ్‌కు అప్పగించారు. ఆయనను ఐఅండ్‌పీఆర్ స్పెషల్ కమిషనర్‌గా బదిలీ చేసినప్పటికీ రెవెన్యూ శాఖ జాయింట్ సెక్రటరీగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతల్లో కొనసాగుతారని ఉత్తర్వుల్లో వెల్లడించారు. నల్లగొండ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న సి.నారాయణరెడ్డిని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేయగా, ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా ఉన్న శశాంకకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. కాగా సమాచార, పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్‌గా నియమితులైన ఎస్.హరీశ్ సోమవారం ఆన్‌లైన్‌లో బాధ్యతలు స్వీకరించారు.

బదిలీ అయిన ఐఏఎస్ అధికారులు

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
నారాయణరెడ్డి	నల్లగొండ కలెక్టర్	రంగారెడ్డి కలెక్టర్
ఇల త్రిపాఠీ	టూరిజం డైరెక్టర్	నల్లగొండ కలెక్టర్
ఎం.హనుమంతరావు	ఐఅండ్‌పీఆర్ స్పెషల్‌కమిషనర్	యాదాద్రి కలెక్టర్
టి.కె.శ్రీదేవి	ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషనర్	సీడీఎంఏ
మంద మకరందు	నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్	పీడీ, సీఎంఆర్‌వో, సీసీఎల్ఏ
జడ్ హనుమంతు కొండిబా	యాదాద్రి కలెక్టర్	టూరిజం డైరెక్టర్ (దేవాదాయ శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు)
కె.శశాంక	రంగారెడ్డి కలెక్టర్	ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల కమిషనర్
ఎస్. హరీశ్	జాయింట్ సెక్రటరీ, రెవెన్యూ	ఐఅండ్‌పీఆర్ స్పెషల్ కమిషనర్ (జాయింట్ సెక్రటరీ, రెవెన్యూ అదనపు బాధ్యతలు)
టి.వినయ్ కృష్ణారెడ్డి	జాయింట్ సెక్రటరీ, వైద్యారోగ్య శాఖ	కమిషనర్, పునరావాసం, భూసేకరణ
ఆయేషా మస్రత్ ఖనమ్	వెయిటింగ్	జాయింట్ సెక్రటరీ, వైద్యారోగ్య శాఖ
కొర్ర లక్ష్మి	డైరెక్టర్, స్పోర్ట్స్	ఎండీ, వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ (స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు)
ఎస్. క్షితిజ (ఐఎఫ్ఎస్)	సీసీఎఫ్, జోగుళాంబ సర్కిల్	ఎండీ, ఎస్సీ కులాల అభివృద్ధి కార్పొరేషన్
వి.వి.ఎల్. సుభద్రాదేవి (ఐఎఫ్ఎస్)	డిప్యూటీ కన్జర్వేటర్	అదనపు కమిషనర్ (జీహెచ్ఎంసీ, అర్బన్ ఫారెస్ట్రీ)

(వీరితో పాటు టీజీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తికి వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్‌గా, హాకా ఎండీ కె. చంద్రశేఖర్‌రెడ్డికి పాడి అభివృద్ధి సమాఖ్య ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఎండీగా ఉన్న ఐఎఫ్ఎస్ అధికారిణి సోని బాలాదేవిని డైరెక్టర్, స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఎండీగా పునర్నియమించారు. మేడ్చల్–మల్కాజ్‌గిరి జెడ్పీ సీఈవోగా ఉన్న ఎస్.దిలీప్‌కుమార్‌ను నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. రాజన్న సర్కిల్‌లో అసిస్టెంట్ కన్జర్వేటర్‌గా ఉన్న అటవీశాఖ అధికారి జి.జ్ఞానేశ్వర్‌ను వికారాబాద్ జిల్లా అటవీ అధికారి (డీఎఫ్‌వో)గా నియమించారు.)

ఒకేరోజు 12,39,044 కేసుల పరిష్కారం

- 3వ లోక్ అదాలత్‌లో టీజీఎస్ఎల్ఎస్ఏ రికార్డు.. దేశంలోనే నంబర్ వన్
- టీజీఎస్ ఎల్ఎస్ఏకు సీజే జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ సుజోయ్‌పాల్ అభినందనలు


జస్టిస్ అలోక్ అరాధే


జస్టిస్ సుజోయ్‌పాల్

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా నిర్వహించిన మూడో జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించి తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీజీఎస్ ఎల్ఎస్ఏ) నంబర్ వన్‌గా నిలిచింది. ఒకే రోజు 12,39,044 కేసులను పరిష్కరించి ఈ ర్యాంక్ సాధించింది. ఈ నేపథ్యంలో అథారిటీని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ సుజోయ్‌పాల్ అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని కేసులను పరిష్కరించి, కక్షిదారులకు సత్వర న్యాయం అందించాలని అభిలషించారు. ప్రత్యామ్నాయ పరిష్కార వేదికగా ఎదుగుతున్న అథారిటీకి ప్రజాదరణ పెరుగుతుండటంపై హర్షం వ్యక్తం చేశారు. కోర్టులపై భారం తగ్గడంతోపాటు వేగంగా న్యాయం అందిస్తున్న అథారిటీ మరింత వృద్ధి సాధించాలని అభిప్రాయ పడ్డారు. ఈ సందర్భంగా హైకోర్టు ఆవరణలోని లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యాలయంలో సభ్యకార్యదర్శి సీహెచ్ పంచాక్షరి సోమవారం మీడియాతో మాట్లాడారు. 2024 సెప్టెంబర్ 14న నిర్వహించిన లోక్ అదాలత్‌లో 12,39,044 కేసులను పరిష్కరించి రూ.250,19,44,447 పరిహారం కక్షిదారులకు అందజేశామని చెప్పారు. కేసుల సత్వర పరిష్కారం, ఖర్చు లేకుండా న్యాయం అందించడమే లక్ష్యంగా అథారిటీ పనిచేస్తుందన్నారు. అథారిటీ ప్యాట్రన్ ఇన్ చీఫ్, హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే, అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, జస్టిస్ సుజోయ్ పాల్ నేతృత్వం, సూచనలతో పెద్ద మొత్తంలో కేసుల పరిష్కారం సాధ్యమైందని వెల్లడించారు. వరుసగా రెండోసారి నంబర్ వన్‌గా నిలపడంలో సహకరించిన వారికి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ సుజోయ్‌పాల్ కృతజ్ఞతలు తెలిపారన్నారు. ప్రత్యామ్నాయ పరిష్కార యంత్రాంగాన్ని వినియోగించుకుని వివాదాలను సత్వరంగా పరిష్కరించుకోవాలని, అందుకు కక్షిదారులు ముందుకు రావాలని న్యాయమూర్తులు పిలుపునిచ్చినట్లు వివరించారు.

భారీగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు (ఎస్‌జీడీసీ), డిప్యూటీ కలెక్టర్లను భారీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్‌జీడీసీల హోదాలో అడిషనల్ కలెక్టర్లు, డీఆర్‌వోలు, స్పెషల్ కలెక్టర్లు, ఆర్డీవోలుగా పనిచేస్తున్న వారితో పాటు డిప్యూటీ కలెక్టర్ల హోదాలో పనిచేస్తున్న ఆర్డీవోలు, ఇతర అధికారులను బదిలీ చేస్తూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని స్థాయిల్లోని రెవెన్యూ అధికారులను కలిపి మొత్తం 73 మందిని బదిలీ చేయడం గమనార్హం. వీరిలో 70 మందికి పోస్టింగులివ్వగా, మరో ముగ్గురిని ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఎస్‌జీడీసీల బదిలీల వివరాలు సాక్షి ప్లస్‌లో..

ముందస్తు బెయిల్ ఇవ్వండి

ఫోన్ ట్యాపింగ్ కేసులో శ్రవణ్‌కుమార్ పిటిషన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ నిందితుడు (ఏ–6) ఎ.శ్రవణ్‌కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ అభ్యర్థనపై పోలీసుల నుంచి సూచనలు పొంది తెలియజేయాలని పీపీని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను నవంబర్ 7కు వాయిదా వేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసు తీవ్ర సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. రెండు రోజుల క్రితం పాస్‌పోర్టు అథారిటీ శ్రవణ్‌కుమార్ పాస్‌పోర్టును రద్దు చేసింది. ఆయన ఏ విమానాశ్రయంలో దిగినా హైదరాబాద్ పోలీసులకు సమాచారం వస్తుంది. అలాగే ట్రయల్ కోర్టు కూడా ఆయనపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ కోరుతూ శ్రవణ్‌కుమార్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ జువ్వాడి శ్రీదేవి సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. రాజకీయ నాయకులపై పిటిషనర్ ఎప్పుడూ నిఘా పెట్టలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎస్ఐబీ అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని.. ఇతర రాజకీయ నేతలను బీఆర్ఎస్‌లో చేరాలని ఒత్తిడి చేసినట్లు చెబుతున్నదంతా అసత్యమని పేర్కొన్నారు. ఈ కేసులో పిటిషనర్‌కు వ్యతిరేకంగా ఇతర నిందితులు చెప్పిందంతా అబద్ధమని వెల్లడించారు.

లేడీస్ అండ్ జెంటిల్‌మెన్!

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓటుకూ లింగ భేదం?



అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు వారం రోజుల్లో జరగనున్నాయి. పురుష ఓటర్లలో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌కే భారీ ఆదరణ కన్పిస్తుండగా మహిళలు మాత్రం డెమొక్రాట్ల అభ్యర్థి కమలా హారిస్ వైపే మొగ్గుతున్నారు. అగ్రరాజ్యంలోనూ రాజకీయంగా నెలకొని ఉన్న లింగ వివక్షను ఇది ప్రతిబింబిస్తోంది. ఎన్నికల ఫలితాలను నిర్ణయించడంలో కూడా ఈ అంశం కీలకంగా మారింది. హారిస్ తొలినుంచీ ఇలాంటి గుర్తింపు రాజకీయాల జోలికి వెళ్లలేదు. ఎక్కడా తను మహిళను కనుక ఓటేయండని కోరలేదు. దాన్ని ప్రచారాంశంగా మలచుకునే ప్రయత్నమూ చేయలేదు. జాతి, జెండర్‌తో నిమిత్తం లేకుండా అమెరికన్లందరి శ్రేయస్సు కోసం పని చేయడానికి తానే సమర్థురాలినని నమ్ముతున్నట్టు పలు ఇంటర్వ్యూల్లో హారిస్ స్పష్టం చేశారు కూడా. అలా జెండర్‌ను తటస్థంగా ఉంచడానికి ఆమె ఎంత ప్రయత్నించినా అది ప్రధానాంశంగానే ఉంటూ వస్తోంది. ఎందుకంటే 'మేడం ప్రెసిడెంట్' అనేది అమెరికాకు చాలా కొత్త విషయం. ఇప్పటిదాకా ఒక్క మహిళ కూడా అత్యున్నత పీఠాన్ని అధిరోహించింది లేదు. ఈ నేపథ్యంలో హారిస్ ప్రెసిడెంట్ అవడమనే ఆలోచననే చాలామంది ఓటర్లు ఇష్టపడుతున్నారు. పలువురు అమెరికన్లు మాత్రం ఈ తరహా కొత్తదనాన్ని ఇబ్బందికరంగా భావిస్తున్నారు.

బహిరంగ రహస్యమే

హారిస్ తన ప్రచారంలో ఎక్కడా జెండర్ విషయాన్ని ప్రస్తావించకపోయినా లైంగికత అనేది అమెరికా సమాజంలోనే అంతర్లీనంగా దాగుందని, అధ్యక్షురాలిగా ఓ మహిళకు ఓటేయడానికి చాలామందికి ఇదో అడ్డంకిగా కనిపిస్తోందని భావిస్తున్నారు. ట్రంప్ ప్రచార బృందం కూడా పైకి జెండర్‌తో సంబంధం లేదని చెబుతున్నా, ''హారిస్ బలహీనురాలు. నిజాయితీ లేని వ్యక్తి. ప్రమాదకరమైన ఉదారవాది'' తరహా ప్రచారంతో ఊదరగొడుతోంది. అమెరికా ప్రజలు ఆమెను తిరస్కరించడం ఖాయమంటోంది. అంతేగాక అధ్యక్ష అభ్యర్థుల్లోని ఈ లింగపరమైన తేడా తమకే లాభిస్తుందని ట్రంప్ ప్రచార బృందం సీనియర్ సలహాదారు బ్రయాన్ లాంజా బాహాటంగానే అన్నారు. ఫలితంగా ట్రంపే గెలుస్తారని తాను నమ్ముతున్నట్టు చెప్పుకొచ్చారు.

'మీటూ' ప్రభావమెంత?

సమాజంలో తన స్థానంపై మహిళల దృక్కోణంలో 2016 నుంచి పెను మార్పులొచ్చాయి. 2017లో 'మీటూ' ఉద్యమం పని ప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొనే వివక్షపై సమాజంలో అవగాహనను ఎంతో పెంచింది. మహిళల గురించి మాట్లాడే విధానాన్నీ మార్చింది. కానీ భిన్నత్వం, సమానత్వం, సమ్మిళితం వంటి అంశాల్లో అంతటి పెద్ద ముందడుగును జీర్ణించుకునే స్థితిలో అమెరికా సంప్రదాయ యువకులు లేరు. దీన్ని కేవలం తమకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారంగా వారు భావిస్తున్నారు. అధ్యక్ష రేసులో లింగ అంతరం ప్రారంభమైందన్న సీబీఎస్ న్యూస్ పోల్ తాజా ఫలితాలు ఇందుకు అద్దం పట్టేవే. అమెరికాలో పురుషులు ప్రధానంగా ట్రంప్ మద్దతుదారులుగానే ఉన్నారు. హారిస్‌ను బలమైన నేతగా చూసే పురుషులు కూడా తక్కువగా ఉన్నారు. యువకులు చాలావరకు ట్రంప్, ఎలాన్ మస్క్ 'బ్రో కల్చర్'లో నిండా మునిగి తేలుతున్నారు. ''డెమొక్రాట్లు ఎంతసేపూ మహిళలు, గర్భస్రావ హక్కులు, ఎల్జీటీబీక్యూ సంస్కృతి గురించే మాట్లాడుతున్నారు. మరి మా పరిస్థితేమిటి?'' అన్నది అమెరికా యువత నుంచి గట్టిగా వినిపిస్తున్న ప్రశ్న. దీన్ని డెమొక్రాట్ల పాలిట డేంజర్ బెల్‌గా విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు!

ఎంతో అంతరం

అమెరికా పురుషుల్లో 51 శాతం మంది ట్రంప్‌కు మద్దతిస్తుండగా హారిస్‌కు 45 శాతం మాత్రమే సానుకూలంగా ఉన్నట్టు ఇటీవలి సీఎన్ఎన్ జాతీయ ఓటర్ల సర్వే తేల్చింది. హార్వర్డ్ యూత్ పోల్‌లో 30 ఏళ్ల లోపు మహిళల్లో హారిస్ ఏకంగా 47 శాతం ఆధిక్యంలో ఉన్నారు. అదే 30 ఏళ్లలోపు పురుషుల్లో ఆమెకు మద్దతిస్తున్నది కేవలం 17 శాతమే. దీంతో హారిస్ ప్రస్తుతం ఈ అంతరాన్ని తగ్గించే పనిలో పడ్డారు. గత వారాంతంలో స్వింగ్ స్టేట్స్‌లోని పురుషులను లక్ష్యంగా చేసుకుని కొత్త ప్రకటనలకు తెరతీశారు. 'బీ ఏ మాన్.. ఓట్ ఫర్ ఉమన్' వంటి నినాదాలను నమ్ముకున్నారు. హారిస్ రన్నింగ్ మేట్ టిమ్ వాల్జ్ ప్రచార కూడా పలు కార్యక్రమాలు, ఇంటర్వ్యూలు, డిజిటల్ మీడియా కంటెంట్‌తో పురుష ఓటర్లకు చేరువయ్యే ప్రయత్నంలో ఉన్నారు. ట్రంప్ మాత్రం మరిన్ని ఇంటర్వ్యూలతో పురుష ఓటర్లకు మరింత దగ్గరవుతున్నారు. మొత్తంగా చూస్తే ఈసారి అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలను 'లేడీస్ అండ్ జెంటిల్‌మెన్', 'బాయ్స్ అండ్ గాళ్స్' డిసైడ్ చేయబోతున్నారు. ఆ లెక్కన అమెరికన్ల జీవితంలో మహిళల పాత్రపై దీన్ని రెఫరెండంగా కూడా భావించొచ్చేమో!

- సాక్షి, నేషనల్ డెస్క్

'పురుష నిస్పృహ'.. ట్రంప్ ఆయుధం!

అమెరికాలో యువతులతో పోలిస్తే యువకుల తీరు తీసికట్టుగానే ఉన్నట్టు గణాంకాలన్నీ చెబుతున్నాయి. కళాశాలలో యువకులు తక్కువగా చేరుతున్నారు. సమాజంతో సంబంధాలను కొనసాగించడమూ తక్కువే. ఆత్మహత్య రేటూ వారిలోనే ఎక్కువ. యువతులు బాగా చదువుకుంటున్నారు. సేవా రంగంలో రాణిస్తున్నారు. యువకులతో పోలిస్తే ఎక్కువ సంపాదిస్తున్నారు. ట్రంప్ అధ్యక్షుడయ్యాక యువకుల కంటే యువతులే బాగా ఉదారంగా మారినట్టు గాలప్ పోలింగ్ బృందం తెలిపింది. అయితే ఇవన్నీ అమెరికా సమాజంలో లింగ విభేదాలను మరింతగా పెంచేందుకే దోహదపడుతుండటం చింతించాల్సిన విషయమే. యువత అసంతృప్తలను ట్రంప్ బాగా అర్థం చేసుకున్నారు. అందుకే ప్రచారం చివరి రోజుల్లో ఈ పురుష నిస్పృహపైనే ప్రధానంగా దృష్టి సారించారు. 'పురుషత్వం దాడికి గురవుతోంది' అనే హెచ్చరికను తన సోషల్ మీడియా టూల్ ట్రూత్‌లో తిరిగి పోస్ట్ చేశారు.


హిల్లరీకీ ఇదే పరిస్థితి!

అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో దిగిన తొలి మహిళగా హిల్లరీ క్లింటన్ చరిత్రలో నిలిచిపోయారు. అయితే ఎనిమిదేళ్ల క్రితం జరిగిన ఆ హోరాహోరీ పోరులో హిల్లరీ ఓటమికి లింగ వివక్ష, స్త్రీల పట్ల అమెరికా సమాజంలో దాగున్న వ్యతిరేకత కూడా కారణమైంది. అప్పుడు కూడా ప్రధాన ప్రత్యర్థి, అధ్యక్ష పోరులో అంతిమ విజేత ట్రంపే కావడం విశేషం. ఈసారి వివక్ష కాస్త తగ్గినట్టు కనిపిస్తున్నా మరోసారి గెలుపోటములను నిర్ణయించే కీలకాంశం కావచ్చన్న విశ్లేషణలు విన్పిస్తున్నాయి!

1920లో మహిళలకు ఓటు హక్కు

అమెరికా మహిళలు తొలిసారిగా 1920 అధ్యక్ష ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆ ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన వారెన్ జి.హార్డింగ్ మొదటి ప్రపంచ యుద్ధం తాలూకు అనిశ్చితి నుంచి దేశం త్వరలోనే సాధారణ స్థితికి వస్తుందని హామీ ఇచ్చారు. కానీ ఆ 'సాధారణ స్థితి' అంటే ఏమిటో 100 ఏళ్లు గడిచినా సగటు అమెరికన్లకు అర్థం కావడం లేదు. 2024లో కూడా అమెరికన్ అంటే 'పురుషుడా, లేక మహిళా?' అనే ప్రశ్న అడుగడుగునా తలెత్తుతూనే ఉంది. చారిత్రకంగా తెల్లజాతి పితృస్వామ్యంలో నిండా మునిగి తేలుతూ వస్తున్న అగ్ర రాజ్యం ఇప్పుడు తమ నాయకురాలిగా నల్లజాతీయురాలైన మహిళను నామినేట్ చేసింది. ఫలితంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోంది. 1920తో పోల్చుకుంటే ఆర్థిక, సామాజికంగా ఎంతో అభివృద్ధి చెందినా అమెరికా మహిళలు ఇప్పటికీ తమ శరీరాలపై హక్కులు తదితరాల కోసం పోరాడాల్సే వస్తోంది. రాజకీయంగా పోటీని మరింత బలంగా ఎదుర్కోవాల్సి వస్తోంది.

జనగణన... వచ్చే ఏడాదే



2026 నాటికి పూర్తి.. కేంద్రం నిర్ణయం!

- తర్వాత లోక్‌సభ స్థానాల పునర్విభజన?
- అడ్డంకిగా మారనున్న ఆర్టికల్ 82
- కులగణనపై ఇప్పటికైతే అస్పష్టతే
- జరిపి తీరాల్సిందేనంటున్న విపక్షాలు

న్యూఢిల్లీ: నాలుగేళ్ల సుదీర్ఘ జాప్యం తర్వాత ఎట్టకేలకు దేశ జనాభా గణన జరగనుంది. ''2025 తొలినాళ్లలో ఈ ప్రక్రియను ప్రారంభించాలని కేంద్రం భావిస్తోంది. 2026 కల్లా ఇది ముగియనుంది. దాని ఆధారంగా జాతీయ జనాభా రిజిస్టర్ (ఎన్‌పీఆర్)ను సవరిస్తారు. అనంతరం తాజా జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ స్థానాల పునర్విభజన ప్రక్రియ మొదలయ్యే అవకాశముంది. అదే జరిగితే ఆ ప్రక్రియ 2028 నాటికి పూర్తి కావచ్చు'' అని అధికార వర్గాలు తెలిపాయి. కులగణన చేపట్టాలన్న ప్రతిపక్షాల డిమాండ్ నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. అయితే జనగణనలో భాగంగా కులగణన కూడా ఉంటుందా అన్న కీలక అంశంపై మాత్రం ప్రస్తుతానికి స్పష్టత లేదు. జనగణనలో భాగంగా పౌరులను అడిగేందుకు 31 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని రిజిస్ట్రార్ జనరల్, జనగణన కమిషనర్ కార్యాలయం ఇప్పటికే సిద్ధం చేసింది. జనగణనలో మత, సామాజిక వర్గీకరణతో పాటు, జనరల్, ఎస్సీ, ఎస్టీ గణనే గాక జనరల్, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలలోని ఉప విభాగాల సర్వేలు కూడా ఉండవచ్చని భావిస్తున్నారు. దీనిపై ఇప్పటికైతే స్పష్టత లేదు. జనగణనను సరైన సమయంలో చేపడతామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా గత ఆగస్టులో చెప్పడం తెలిసిందే. ఈసారి కార్యక్రమం పూర్తిగా మొబైల్ అప్లికేషన్ ద్వారా డిజిటల్‌గా జరుగుతుందని ఆయన వెల్లడించారు.

మారిపోనున్న జనగణన సైకిల్: భారత్‌లో తొలి జనగణన 1872లో జరిగింది. స్వాతంత్ర్యానంతరం 1951 నుంచి ప్రతి పదేళ్లకు ఓసారి జరుగుతూ వస్తోంది. చివరిసారిగా 2011లో జనగణన జరిగింది. 2021లో జరగాల్సిన జనగణనకు కరోనా కారణంగా అంతరాయం ఏర్పడింది. అప్పటినుంచీ పెండింగ్‌లోనే ఉంది. ఈ ఆలస్యం కారణంగా జనగణన సైకిల్ కూడా మారనుంది. ఇకపై 2025–35, 2035–45... ఇలా కొనసాగనుంది. తాజా పరిణామాల నేపథ్యంలో భారత జనగణన కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ డిప్యుటేషన్‌ను 2026 ఆగస్టు దాకా కేంద్రం పొడిగించింది. 2011 జనగణనలో భారత్‌లో 121 కోట్ల పై చిలుకు జనాభా ఉన్నట్టు తేలింది. అంతకుముందు పదేళ్లతో పోలిస్తే 17.7 శాతం వృద్ధి రేటు నమోదైంది.

కులగణన జరపాల్సిందేనన్న కాంగ్రెస్: కులగణనకు కేంద్రం నిరాకరించడం ఓబీసీ వర్గాలకు ద్రోహం చేయడమేనని కాంగ్రెస్ నేత మాణిక్యం ఠాగూర్ విమర్శించారు. మోదీ సర్కారు రాజకీయ అహంకారంతో వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజల పక్షాన నిలబడతాయా, లేదా మౌనంగా ఉంటాయా?'' అని ఆయన ప్రశ్నించారు.

లోక్‌సభ సీట్లు తగ్గుతాయేమో!

దక్షిణాది రాష్ట్రాల ఆందోళన

జనాభా లెక్కల విషయంలో దక్షిణాది రాష్ట్రాల్లో ఇప్పటికే తీవ్ర ఆందోళన నెలకొని ఉంది. ఉత్తరాదితో పోలిస్తే ఆ రాష్ట్రాలు జనాభా నియంత్రణలో ముందంజలో ఉండటం తెలిసిందే. ఫలితంగా ఆ రాష్ట్రాల్లో జనాభా బాగా తగ్గుముఖం పట్టింది. ఈ కారణంగా నూతన జనగణన గణాంకాల ఆధారంగా పునర్ వ్యవస్థీకరణ జరిగే పోంలో తమ లోక్‌సభ స్థానాల్లో బాగా కోత పడే ఆస్కారముండటం వాటిని కలవరపెడుతోంది. ఇది రాజకీయంగా తమ ఆధిపత్యాన్ని బాగా తగ్గిస్తుందని ఆ రాష్ట్రాలు అనుమానిస్తున్నాయి. 1971 జనాభా లెక్కల ఆధారంగా చివరిసారిగా నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ జరిగింది. అయితే 2026 అనంతరం చేపట్టే తొలి జనగణన తాలూకు ఫలితాలు అందుబాటులోకి వచ్చేదాకా లోక్‌సభ నియోజకవర్గాల తదుపరి పునర్ వ్యవస్థీకరణ జరగరాదని రాజ్యాంగంలోని 82వ ఆర్టికల్ నిర్దేశిస్తోంది. ఆ లెక్కన తాజా జనగణన 2025లో మొదలయ్యే పక్షంలో వాటి ఆధారంగా పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియ చేపట్టడానికి వీలుండదు. అలాగాక వాటి ఆధారంగా పునర్ వ్యవస్థీకరణ జరపాలంటే 82వ ఆర్టికల్‌ను సవరించాల్సి ఉంటుంది. కనుక ఆ క్రతువును మొదలుపెట్టే ముందు ఈ అంశాలన్నింటినీ కూలంకషంగా పరిశీలించి పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

రక్షణ రంగంలో కొత్త అధ్యాయం

- వడోదరలో సీ295 విమాన తయారీ కర్మాగారాన్ని ప్రారంభించిన మోదీ, స్పెయిన్ అధ్యక్షుడు పెడ్రో సాంచెజ్
- ఇది 'మేకిన్ ఇండియా, మేక్ ఫర్ వరల్డ్' అని వ్యాఖ్యానించిన మోదీ

వడోదర: భారత ప్రైవేట్ రక్షణ విమానయాన రంగంలో కొత్త అధ్యాయం ఆరంభమైంది. భారత్‌లోనే తొలి ప్రైవేట్ సైనిక, సరకు రవాణా విమానం తయారీ పనులు ప్రారంభమయ్యాయి. ఇందుకు గుజరాత్‌లోని వడోదర పట్టణంలోని టాటా ఎయిర్‌క్రాఫ్ట్ కాంప్లెక్స్ వేదికైంది. స్పెయిన్ అధ్యక్షుడు పెడ్రో సాంచెజ్‌తో కలిసి భారత ప్రధాని మోదీ సోమవారం ఈ ప్లాంట్‌లో సీ295 రకం సైనిక రవాణా విమాన తయారీని ప్రారంభించారు. అక్కడి విడిభాగాల ఎగ్జిబిషన్‌ను ఇరునేతలు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడారు. '' భారత్, స్పెయిన్ భాగస్వామ్యం కొత్త మలుపులు తీసుకుంటోంది. ఇది రెండు దేశాల మధ్య సంబంధాలు పటిష్టంచేయడమే కాకుండా మేకిన్ ఇండియా, మేక్ ఫర్ వరల్డ్ లక్ష్యాన్ని సాకారం చేస్తుంది. కొత్త ఫ్యాక్టరీని అందుబాటులోకి తెచ్చిన ఎయిర్‌బస్, టాటా బృందాలకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. భారత్‌లో విదేశీ సరకు రవాణా విమానం తయారీ కలను సాకారం చేసిన వ్యాపార జగజ్జేత రతన్ టాటాకు ఘన నివాళులు'' అని అన్నారు.

కొత్త పని సంస్కృతికి నిదర్శనం

'' నూతన భారత దేశ కొత్తతరహా పని సంస్కృతికి సీ295 ఫ్యాక్టరీ ప్రతిబింబింగా నిలవనుంది. 2022 అక్టోబర్‌లో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన నాటినుంచి ఉత్పత్తిదాకా భారత వేగవంతమైన ఉత్పాదకతకు నిదర్శనం ఈ కర్మాగారం'' అని మోదీ అన్నారు. ఈ సందర్భంగా ప్రఖ్యాత స్పానిష్ రచయిత ఆంటోనియో మకాడో కవితలోని 'మనం లక్ష్యం సాధించేందుకు ముందుకెళ్తుంటే మార్గం దానంతట అదే ఏర్పడుతుంది' అనే వాక్యాన్ని మోదీ గుర్తుచేశారు. ''కొత్తగా మొదలైన టాటా–ఎయిర్‌బస్ ఫ్యాక్టరీ ద్వారా వేలాది మందికి ఉద్యోగాలు లభిస్తాయి. దేశీయంగా 18,000 విమాన విడిభాగాల తయారీని ఈ ఫ్యాక్టరీ సుసాధ్యం చేయనుంది. భవిష్యత్తులో భారత పౌరవిమానయాన రంగానికి అవసరమైన విమానాల తయారీకి ఈ ఫ్యాక్టరీ బాటలువేస్తోంది'' అని మోదీ అన్నారు.

స్పెయిన్‌లో యోగా, ఇండియాలో ఫుట్‌బాల్

''ఇరుదేశాల ప్రజల మధ్య బంధమే దేశాల మధ్య బంధాన్ని బలీయం చేస్తోంది. యోగా స్పెయిన్‌లో తెగ పాపులర్. ఇక స్పానిష్ ఫుట్‌బాల్‌ను భారతీయులూ బాగా ఇష్టపడతారు. ఆదివారం రియల్ మాడ్రిడ్‌తో మ్యాచ్‌లో బార్సిలోనా బృందం సాధించిన ఘనవిజయం గురించి భారత్‌లోనూ తెగ చర్చ జరుగుతోంది. ఆహారం, సినిమాలు, ఫుట్‌బాల్.. ఇలా ప్రజల మధ్య బంధం దేశాల మధ్య పటిష్ట బంధానికి కారణం. 2026 ఏడాదిని 'ఇండియా–స్పెయిన్ ఇయర్ ఆఫ్ కల్చర్, టూరిజం, ఏఐ'గా జరుపుకోవాలని నిర్ణయించుకోవడం సంతోషకరం'' అని మోదీ అన్నారు.

బంధం బలీయం: స్పెయిన్ అధ్యక్షుడు

''1960లలోనే ప్రఖ్యాత స్పెయిన్ క్లాసిక్, జాజ్ సంగీత కళాకారుడు పాకో డిలూసియా, భారతీయ సంగీత దిగ్గజం పండిట్ రవిశంకర్ రెండు దేశాల సంగీత ప్రియులను ఒక్కటి చేశారు. పారిశ్రామిక అభివృద్ధి, స్నేహబంధాలకు ఈ ఫ్యాక్టరీ గుర్తుగా నిలుస్తుంది' అని స్పెయిన్ అధ్యక్షుడు పెడ్రో సాంచెజ్ అన్నారు.



సోమవారం వడోదరలోని విమాన తయారీ ప్లాంట్‌లో మోదీ, సాంచెజ్, రాజ్‌నాథ్‌సింగ్ తదితరులు

40 విమానాల తయారీ ఇక్కడే

ఎయిర్‌బస్ సీ295 రకం మధ్యశ్రేణి రవాణా విమానాన్ని తొలుత స్పెయిన్‌కు చెందిన సీఏఎస్ఏ ఏరోస్పేస్ సంస్థ డిజైన్‌చేసి తయారుచేసేది. ప్రస్తుతం ఇది యూరప్ బహుళజాతి ఎయిర్‌బస్ సంస్థలో భాగంగా ఉంది. యుద్ధంలో బాంబులతోపాటు అవసరమైన సందర్భాల్లో వైద్య పరికరాలు, విపత్తుల వేళ బాధితుల తరలింపునకు, తీర ప్రాంతాల్లో గస్తీ, నిఘా కోసం సైతం పలు రకాలుగా వినియోగించుకోవచ్చు. ఎయిర్‌బస్ సంస్థతో భారత ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం మొత్తంగా సీ295 రకం 56 విమానాలను సైన్యానికి అప్పగించనున్నారు. వీటిలో 16 విమానాలను స్పెయిన్‌లోని సవీలేలో తయారుచేసి ఎయిర్‌బస్ నేరుగా నాలుగేళ్లలోపు భారత్‌కు పంపనుంది. మిగిలిన 40 విమానాలను టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ వారి ఆధ్వర్యంలో వడోదరలోని తయారీయూనిట్‌లో తయారుచేస్తారు.

అక్రమ వలసలపై ఉక్కుపాదమే: ట్రంప్

న్యూయార్క్: అమెరికాలోని అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపి తీరతానని రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. తాను అధ్యక్షుడిని అయితే దేశ చరిత్రలోనే అతి పెద్ద ఆపరేషన్ చేపట్టి కనీసం 10 లక్షల మందికి పైగా అక్రమ వలసదారులందరినీ వెనక్కు పంపించడం ఖాయమని ప్రకటించారు. అధ్యక్ష ఎన్నికల పోలింగ్ శరవేగంగా సమీపిస్తున్న వేళ ఆదివారం న్యూయార్క్‌లోని ప్రసిద్ధ మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో భారీ ర్యాలీలో ట్రంప్ ప్రసంగించారు. ఆయనతో పాటు రిపబ్లికన్ పార్టీ నేతలంతా డెమొక్రాటిక్ అభ్యర్థి కమలా హారిస్‌పై తీవ్ర స్థాయిలో వ్యక్తిగత దాడికి పాల్పడ్డారు. ఆమెను అవమానిస్తూ హేళనగా మాట్లాడారు. హారిస్‌ను దెయ్యంగా, 'రాడికల్ లెఫ్ట్ మార్క్సిస్టు'గా అభివర్ణించారు. ''ఆమెకు తెలివి లేదు. దేశ సమస్యలను పరిష్కరించలేరు'' అంటూ విమర్శించారు. ట్రంప్ అయితే ఉపాధ్యక్షురాలిగా హారిస్ తన అసమర్థ పాలనతో అమెరికాను నాశనం చేశారని ఆరోపించారు. ట్రంప్‌కు మద్దతుగా మాట్లాడిన కమెడియన్ టోనీ హిచ్‌క్లిఫ్ చేసిన జాత్యహంకార వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. లాటిన్ అమెరికా వాసులు పిల్లల్ని కనేందుకే ఇష్టపడతారన్న వ్యాఖ్యలపై రిపబ్లికన్లే అసహనం వ్యక్తం చేశారు. పోర్టోరికోను తేలాడే చెత్తదిబ్బగా టోనీ పేర్కొనడాన్నీ రిపబ్లికన్లు ఖండించారు.

జపాన్‌లో హంగ్

- మెజారిటీ కోల్పోయిన అధికార కూటమి
- ప్రధానిగా కొనసాగుతా
- షిగెరు ఇషిబా ప్రకటన



జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా

టోక్యో: జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా నేతృత్వంలోని అధికార కూటమి ఆదివారం జరిగిన కీలకమైన పార్లమెంటరీ ఎన్నికల్లో మెజారిటీని కోల్పోయింది. 465 స్థానాలున్న దిగువ సభలో కూటమి బలం 279 స్థానాల నుంచి 215కు పడిపోయింది. మెజారిటీకి కనీసం 233 స్థానాలు అవసరం. కూటమి సారథి లిబరల్ డెమొక్రటిక్ పార్టీ (ఎల్‌డీపీ)కి 2009 తర్వాత అత్యంత దారుణమైన ఫలితాలివే. జపాన్‌ను దాదాపుగా 1955 నుంచీ ఎల్‌డీపీయే పాలిస్తూ వస్తోంది. ఏ పార్టీకి మెజారిటీ రాకపోవడంతో అనిశ్చితి దెబ్బకు జపాన్ కరెన్సీ యెన్ మూడు నెలల కనిష్టానికి పడిపోయింది. ఫలితాలు తమకు ప్రతికూలంగా వచ్చాయని ఇషిబా సోమవారం అంగీకరించారు. ''ప్రజా తీర్పును అంగీకరిస్తున్నా. అయితే ప్రధానిగా నేనే కొనసాగుతాం'' అని స్పష్టం చేశారు. ''అధికార కూటమికి మా ఎల్‌డీపీయే సారథ్యం వహిస్తుంది. కీలక విధానాలతో ప్రణాళికాబద్ధమైన బడ్జెట్‌ను రూపొందిస్తాం. రాజకీయ సంస్కరణలు కొనసాగిస్తాం. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉంటే ప్రతిపక్షాలకు సహకరించడానికి మా పార్టీ సిద్ధం'' అన్నారు. డిసెంబర్ నెలాఖరులో కీలకమైన బడ్జెట్ ప్రణాళికలను పాలకవర్గం ఆమోదించేదాకా ఇషిబా కొనసాగే అవకాశముంది. ఫ్యూమియో కిషిడా నుంచి ఇషిబా అక్టోబర్ 1న పదవీ బాధ్యతలు స్వీకరించడం తెలిసిందే. ఆ వెంటనే సాధారణ ఎన్నికలకు వెళ్లారు.

చిన్న పార్టీలే కీలకం

సెంట్రిస్ట్ నేత యోషిహికో నోడా నేతృత్వంలోని ప్రధాన ప్రతిపక్షం కాన్‌స్టిట్యూషనల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ జపాన్ (సీడీపీజే) 148 స్థానాలు గెలుచుకుంది. ఇది గతంలో కంటే 50 స్థానాలు అధికం. ''అధికార కూటమికి మెజారిటీ రాకుండా చూడాలన్న లక్ష్యాన్ని సాధించాం. ఇది గొప్ప విజయం'' అని నోడా అన్నారు. ఇతర ప్రతిపక్షాలతో కలిసి సంకీర్ణానికి నాయకత్వం వహించాలని భావిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఏర్పాటుకు 30 రోజుల సమయముంది. ఎక్కువ సీట్లు సాధించిన చిన్న పార్టీల పాత్ర కీలకంగా మారనుంది. ఇషిబాతో చేయి కలిపేందుకు డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ది పీపుల్, కన్జర్వేటివ్ జపాన్ ఇన్నోవేషన్ పార్టీ సిద్ధంగా ఉన్నాయి. పాక్షిక పొత్తుకు సిద్ధమని డీపీపీ అధినేత యుచిరో తమాకీ కూడా తెలిపారు.

ఆర్మీ కాన్వాయ్‌పై ముష్కరుల కాల్పులు

ఎదురుకాల్పుల్లో ఉగ్రవాది హతం

జమ్మూ: జమ్మూ జిల్లాలోని అఖ్నూర్ సెక్టార్‌లో ఉగ్రవాదులు మళ్లీ రెచ్చిపోయారు. ఈ సందర్భంగా జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక ఉగ్రవాది హతమయ్యాడు. వాస్తవాధీన రేఖకు సమీపంలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ముందుగా ఆర్మీ కాన్వాయ్‌పైకి ఉగ్ర మూకలు కాల్పులకు దిగాయి. బలగాలు అప్రమత్తమై దీటుగా స్పందించడంతో ప్రమాదం తప్పింది. అనంతరం ముష్కరులు సమీపంలోని అటవీ ప్రాంతంలోకి పరారయ్యారు. ఆ ప్రాంతాన్ని దిగ్బంధించిన బలగాలు అదనంగా పోలీసులను, ఆర్మీని తరలించి గాలింపు ముమ్మరం చేశారు. ఎదురు కాల్పుల్లో ఒక ఉగ్రవాది హతమయ్యాడు. అతడి వద్ద ఆయుధం స్వాధీనం చేసుసుకున్నారు. హెలికాప్టర్‌ను రంగంలోకి దించి బలగాలు ఓ భవనం బేస్‌మెంట్‌లో ఉగ్రవాదులు దాగినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా భారీ పేలుళ్లు, కాల్పులు చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ముగ్గురు సభ్యుల ముష్కరుల ముఠా ఆదివారం రాత్రి సరిహద్దులు దాటి దొంగచాటుగా దేశంలోకి ప్రవేశించినట్లు భావిస్తున్నామని అధికారులు తెలిపారు. ఉగ్రవాదుల కాల్పుల్లో ఆర్మీ అంబులెన్సుకు కనీసం డజను బుల్లెట్లు తగిలాయని చెప్పారు. అంతకుముందు, ఉగ్రవాదులు అస్సన్ ఆలయంలోకి ప్రవేశించి సెల్‌ఫోన్ కోసం అక్కడి వారిని అడిగారు, ఇంతలోనే అటుగా వస్తున్న ఆర్మీ కాన్వాయ్‌ని గమనించి కాల్పులకు దిగారన్నారు.

భారతీయ అమెరికన్లలో హారిస్‌కు తగ్గిన ఆదరణ!

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కీలకమైన పోలింగ్ తేదీ సమీపిస్తున్న వేళ డెమొక్రాట్లకు చేదు కబురు. ఆ పార్టీకి మద్దతిస్తున్న ఇండియన్ అమెరికన్ ఓటర్ల సంఖ్యలో గత ఎన్నికలతో పోలిస్తే ఏకంగా ఏడు శాతం తగ్గుదల నమోదైంది! భారత మూలాలున్న కమలా హారిస్‌కు మద్దతిస్తున్న వారి సంఖ్య 61 శాతానికి తగ్గింది. అంతేగాక తాము డెమొక్రాట్లమని చెప్పుకున్న ఇండియన్ అమెరికన్ల సంఖ్య కూడా 56 నుంచి 47 శాతానికి తగ్గింది. సోమవారం వెలువడ్డ 'ఇండియన్ అమెరికన్ ఆటిట్యూడ్స్' సర్వేలో ఈ మేరకు తేలింది. ట్రంప్‌కు ఓటేస్తామని వారిలో 32 శాతం మంది పేర్కొన్నారు. 2020లో డెమొక్రాట్ల అభ్యర్థి జో బైడెన్‌కు 68 శాతం మద్దతు దక్కగా ట్రంప్‌కు 22 శాతం మాత్రమే జైకొట్టారు!

- ఇండియన్ అమెరికన్ మహిళా ఓటర్లలో 67 శాతం మంది హారిస్‌కు జైకొట్టారు. ట్రంప్‌కు మద్దతిచ్చిన వారు కేవలం 22 శాతమే.
- 40 ఏళ్ల పైచిలుకు వయసు వారిలో ఏకంగా 70 శాతం మహిళలు, 60 శాతం పురుషులు హారిస్‌కు జైకొట్టారు.
- 40 ఏళ్ల లోపువారిలో మాత్రం 60 శాతం మహిళలే హారిస్‌కు మద్దతిచ్చారు.
- ఇండియన్ అమెరికన్ పురుషుల్లో 53 శాతం హారిస్‌కు, 39 శాతం మంది ట్రంప్‌కు ఓటేస్తామని చెప్పారు.
- 40 ఏళ్లలోపు పురుషుల్లో మాత్రం ట్రంప్‌దే పైచేయి కావడం విశేషం. ఆయనకు 48 శాతం, హారిస్‌కు 44 శాతం జైకొట్టారు.
- యువ ఇండియన్ అమెరికన్లలో మాత్రం ట్రంప్‌కు మద్దతిస్తున్న వారి సంఖ్య భారీగా పెరిగినట్టు సర్వే తేల్చింది.
- అమెరికాలో 52 లక్షలకు పైగా భారత సంతతి వారున్నారు. వారిలో ఓటర్ల సంఖ్య 26 లక్షల పై చిలుకు.
- హిందూయేతరులతో పోలిస్తే హిందువుల్లో ట్రంప్ మద్దతుదారులు అధికంగా ఉండటం విశేషం. ఆయనకు ఓటేస్తామని 58 శాతం మంది హిందువులు తెలిపారు. 35 శాతం హిందువులు హారిస్‌కు మద్దతిస్తామన్నారు.
- హిందూయేతర భారతీయ అమెరికన్లలో 62 శాతం హారిస్‌కు, 27 శాతం ట్రంప్‌కు మద్దతిచ్చారు.
- 17 శాతం మంది ద్రవ్యోల్బణాన్ని ప్రధాన సమస్యగా పేర్కొన్నారు.
- ఉపాధి, ఆర్థిక అవ్యస్థ, అబార్షన్ ప్రధానాంశాలని 13 శాతం చెప్పారు.
- భారత్–అమెరికా సంబంధాలకు ప్రాధాన్యమిస్తున్నట్టు చెప్పిన వారు కేవలం 4 శాతమే.

ఎస్‌జీపీసీ చీఫ్‌గా మళ్లీ హర్జిందర్ ధామి



అమృత్‌సర్: శిరోమణ అకాలీ దళ్(ఎస్ఏడీ)కు చెందిన హర్జిందర్ సింగ్ ధామి శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ (ఎస్‌జీపీసీ) అధ్యక్షుడిగా మళ్లీ ఎన్నికయ్యారు. గురుద్వారాలు, సిక్కుల ప్రార్థనా స్థలాల నిర్వహణను చూసే ఈ అత్యున్నత వేదికకు ధామి ఎన్నికవడం ఇది వరుసగా నాలుగోసారి. ఎస్ఏడీ తిరుగుబాటు వర్గం శిరోమణి అకాలీ దళ్ సుధార్ లెహర్ నేత బీబీ జాగిర్ కౌర్‌పై ధామి ఘన విజయం సాధించారు.

నోబెల్ శాంతి బహుమతి గ్రహీతకు తీవ్ర అనారోగ్యం



దుబాయ్: ఇరాన్‌కు చెందిన నోబెల్ శాంతి బహుమతి గ్రహీత నర్గెస్ మొహమ్మదీ(52) తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రి పాలయ్యారు. రెండు నెలలుగా ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్న నర్గెస్‌ను ఆస్పత్రిలో చేర్చారని ఆమె తరఫున పోరాడుతున్న 'ఫ్రీ నర్గెస్ కోవలిషన్' ఆదివారం ప్రకటించింది. ఆమెను వెంటనే విడుదల చేయాలనిడిమాండ్ చేసింది.



సరికొత్త 'ముద్ర'.. రూ.20 లక్షలు

కార్పొరేటేతర, వ్యవసాయేతర సూక్ష్మ, చిన్న తరహా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు కేంద్రం 2015లో ప్రధానమంత్రి ముద్రా యోజన (పీఎంఎంవై) ప్రారంభించింది. ఇప్పుడు కొత్తగా తరుణ్ ప్లస్ విభాగం కింద రూ.20 లక్షల వరకు రుణాలు ఇవ్వనున్నారు.

రుణాలిచ్చే విభాగాలు

శిశు: రూ.50 వేలు

కిశోర: రూ.50 వేల నుంచి 5 లక్షల వరకు

తరుణ: రూ.10 లక్షల వరకు

రూ.2.14 లక్షల కోట్లు 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు విడుదల చేసిన ముద్ర రుణాల మొత్తం

రూ.6.68 కోట్లు 2023-24లో మంజూరు చేసిన రుణాలు

రూ.5.41 లక్షల కోట్లు మంజూరు చేసిన మొత్తం

రూ.5.32 లక్షల కోట్లు విడుదల చేసింది

రూ.48.78 కోట్లు 2015 నుంచి ఇప్పటివరకు మంజూరు చేసిన రుణాలు

రూ.29.79 లక్షల కోట్లు మంజూరు చేసిన మొత్తం

ఆధారం: ముద్ర డాట్ ఆర్గ్

గ్రీన్‌హౌస్ పవర్

ప్రపంచంలో 2023 నాటికి 57.1 బిలియన్ మెట్రిక్ టన్నుల కార్బన్ డయాక్సైడ్‌తో సమానమైన గ్రీన్‌హౌస్ వాయువులు వాతావరణంలోకి చేరాయి. ఇందులో జీ20 దేశాల వాటా 77 శాతం. చైనా వాటా 30 శాతం, అమెరికా వాటా 11 శాతం కాగా, ఇండియాది 8 శాతమే.

గ్రీన్‌హౌస్ వాయువులను ఎక్కువగా వెలువరించే ప్రధాన రంగాలు (శాతాల్లో)

పవర్ 26	రవాణా 15
పరిశ్రమలు 11	వ్యవసాయం 11
ఇంధన ఉత్పత్తి 10	భవనాలు 6
వ్యర్థాలు, ఇతరత్రా 4	విమానయానం 4

ఆధారం: యూఎన్ ఎమిషన్స్ గ్యాప్ రిపోర్ట్ - 2024

మరో విమానానికి బాంబు బెదిరింపు

- విశాఖ నుంచి ముంబై బయలుదేరిన విమానాన్ని వెనక్కి రప్పించిన అధికారులు
- ప్రయాణికుల్లో తీవ్ర ఆందోళన
- విస్తృత తనిఖీల అనంతరం బాంబు లేదని నిర్ధారణ



సాక్షి, విశాఖపట్నం: వరుస బాంబు బెదిరింపులు విమానయాన సంస్థలతోపాటు ప్రయాణికులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. రెండు రోజులుగా వివిధ విమాన సర్వీసులకు బాంబు బెదిరింపులు వస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఓ బెదిరింపు కాల్ సోమవారం విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయంలో అలజడి సృష్టించింది. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వచ్చిన ఇండిగో విమానంలో బాంబు ఉందని గుర్తుతెలియని వ్యక్తి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ఫోన్ చేసి హెచ్చరించాడు. దీంతో అప్రమత్తమైన అక్కడి అధికారులు విశాఖ విమానాశ్రయ అధికారులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే విశాఖ చేరుకుని.. ముంబై బయలుదేరిన ఇండిగో విమానాన్ని అత్యవసరంగా వెనక్కి రప్పించారు. విమానం ల్యాండ్ అయ్యే సరికే బాంబ్ స్క్వాడ్‌ను సిద్ధం చేశారు. ప్రయాణికులను కిందకు దింపి భద్రతా సిబ్బంది తనిఖీలు చేశారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ప్రయాణికులతో పాటు లగేజ్, విమానాన్ని పూర్తిగా బాంబ్ స్క్వాడ్ తనిఖీ చేసి.. బాంబు లేదని నిర్ధారించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం విశాఖ నుంచి సుమారు 2 గంటలు ఆలస్యంగా సాయంత్రం 5.32 గంటలకు విమానం ముంబైకి బయలుదేరి వెళ్లిందని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజారెడ్డి తెలిపారు.

పనులన్నీ వదిలేసి వెళ్లిపోండి!



కాంట్రాక్టర్లకు టీడీపీ ముఖ్యనేతల అల్టిమేటం

సాగునీటి ప్రాజెక్టుల నుంచి రహదారుల వరకు అన్ని శాఖల్లోనూ ఇదే తంతు

'మీరు చేస్తున్న పనులు ఉన్నది ఉన్నట్టుగా వదిలేసి వెళ్లిపోండి..! లేదంటే కేసులు ఎదుర్కోవడానికి సిద్ధపడండి..! మీ కంపెనీ తరఫున మేం పనులు చేస్తాం.. బిల్లులు కూడా మేమే తీసుకుంటాం..!'
- తస్మదీయ కాంట్రాక్టర్లకు టీడీపీ ముఖ్యనేతల అల్టిమేటం.

'అలాగైతే.. మీరు చేసే అక్రమాలకు మేం బాధ్యత వహించాల్సి వస్తుంది..! మాకు ఇవ్వాల్సిన బిల్లులు ఇచ్చేసి.. ఏపీడీఎస్ఎస్ (ఆంధ్రప్రదేశ్ డీటెయిల్డ్ స్టాండర్డ్ స్పెసిఫికేషన్స్) 60 సీ నిబంధన కింద కాంట్రాక్టు ఒప్పందాన్ని రద్దు చేయండి! కావాలంటే ఈ వ్యవహారంపై మేం కోర్టులో సవాల్ చేయబోమని హామీ కూడా ఇస్తాం!'
- కాంట్రాక్టర్ల ప్రతిపాదన.

సాక్షి, అమరావతి: గతంలో అధికారంలో ఉన్నప్పుడు వ్యవహరించిన మాదిరిగానే 2014–19 తరహాలోనే 60 సీ నిబంధన కింద పనుల ఒప్పందాలను రద్దు చేసి.. మిగిలిన పనుల అంచనా వ్యయాన్ని పెంచేసి.. అస్మదీయులకు కట్టబెట్టి కమీషన్లు వసూలు చేసుకునేందుకు టీడీపీ ముఖ్యనేతలు సిద్ధపడ్డారు. ఈ క్రమంలో రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నుంచి రహదారుల వరకు వివిధ శాఖల పరిధిలో చేపట్టిన నిర్మాణ పనులపై కన్నేసి అస్మదీయ కాంట్రాక్టర్లను పనులు చేసుకునేందుకు అనుమతిస్తున్న టీడీపీ నేతలు.. తస్మదీయ కాంట్రాక్టర్లను మాత్రం అడ్డుకుంటున్నారు. ఉన్నఫళంగా పనులు వదిలేసి వెళ్లిపోవాలంటూ హుంకరిస్తున్నారు. తమకే పనులు అప్పగించాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. మీ కంపెనీ తరఫున పనులు చేస్తాం.. బిల్లులు మేం తీసుకుంటామని ఒత్తిడి తెస్తున్నారు. అయితే ఈ ప్రతిపాదనకు కాంట్రాక్టు సంస్థలు ఒప్పుకోవడం లేదు. చేసిన పనుల్లో ఏవైనా లోపాలు తలెత్తితే వాటికి తాము బాధ్యత వహించాల్సి వస్తుందని స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వం నుంచి తనకు రూ.2 వేల కోట్ల మేర బిల్లులు రావాలని.. వాటిని ఇప్పించి, తాను చేస్తున్న పనుల కాంట్రాక్టు ఒప్పందాలన్నీ రద్దు చేసుకోవాలని ఓ బడా కాంట్రాక్టు సంస్థ అధినేత టీడీపీ ముఖ్యనేతలకు సూచించారు.

పాత విధానంలో దూకుడుగా

కాంట్రాక్టర్లు తమ ఒత్తిళ్లకు లొంగకపోవడంతో 2014–19లో అమలు చేసిన విధానానికే టీడీపీ నేతలు మరింత పదును పెట్టారు. సాగునీటి ప్రాజెక్టుల నుంచి రహదారుల పనుల వరకూ తస్మదీయ కాంట్రాక్టు సంస్థలు చేస్తున్న పనులను 60 సీ కింద రద్దు చేయాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఆ తర్వాత మిగిలిన పనులకు 2024–25 ఎస్ఎస్ఆర్(స్టాండర్డ్ షెడ్యూల్డ్ రేట్స్) ప్రకారం అంచనాలను రూపొందించి.. ఎక్కువ కమీషన్ ఇచ్చే కాంట్రాక్టర్లకు వాటిని కట్టబెట్టడానికి సిద్ధమయ్యారు.

వైఎస్సార్‌సీపీ వాళ్లు, వలంటీర్లు సచివాలయం మెట్లెక్కితే
ఉద్యోగి గూబ పగలగొట్టండి

- ప్రకాశం జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి శశికాంత్‌భూషణ్ వివాదాస్పద వ్యాఖ్యలు
- ఏ పోలీసోడు కేసు పెడతాడో చూద్దామని హుంకరింపు
- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ సంఘాల నిరసన
- శశికాంత్ అరెస్ట్‌కు డిమాండ్


శశికాంత్ భూషణ్

సాక్షి, అమరావతి/భవానీపురం (విజయవాడ పశ్చిమ): వార్డు, గ్రామ వలంటీర్లు, సచివాలయాల ఉద్యోగులను కించపరుస్తూ ప్రకాశం జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి ఎద్దు శశికాంత్ భూషణ్ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. 'వైఎస్సార్‌సీపీ వాళ్లు గానీ, వలంటీర్లు గానీ ఎవరైనా గ్రామ, వార్డు సచివాలయం మెట్లెక్కితే ఆ సచివాలయంలో పనిచేసే అడ్మిన్ (సచివాలయ ఉద్యోగి) గూబ పగలగొట్టండి. ఏ పోలీసోడు కేసు పెడతాడో చూద్దాం' అంటూ ఇటీవల ఒంగోలులో జరిగిన టీడీపీ నియోజకవర్గ సమావేశంలో ఆ పార్టీ నేత ఎద్దు శశిభూషణ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆ వీడియో సోషల్ మీడియా ద్వారా వార్డు వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి చేరింది. అతడి వ్యాఖ్యలు విన్న వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు భగ్గుమంటున్నారు.

శశికాంత్ భూషణ్‌ను అరెస్ట్ చేయాల్సిందే..

ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన శశిభూషణ్‌ను చట్టపరంగా శిక్షించాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. గ్రామాలు, పట్టణాల్లో సచివాలయ ఉద్యోగులు ప్రజలకు చేరువగా ఉంటూ అవినీతికి తావులేకుండా పారదర్శకంగా సేవలందిస్తున్నారని, టీడీపీ నేత వ్యాఖ్యలు వారిని అవమానపరచేలా ఉన్నాయని పేర్కొంది. సచివాలయ ఉద్యోగులు ఏం తప్పు చేశారని ఈ విధమైన మాటలతో దాడి చేస్తున్నారో అర్థం కావట్లేదని అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని ప్రకటనలో పేర్కొంది. ఇదే అంశంపై వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీస్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు ఎండీ జానీపాషా, ప్రధాన కార్యదర్శి అంకమ్మరావు, సహ అధ్యక్షుడు జి.హరీంద్ర ఒక ప్రకటన చేస్తూ.. 'ఇలాంటి మాటలతో ఉద్యోగులను తీవ్ర మనోవేదన, భయభ్రాంతులకు గురిచేయడం అత్యంత శోచనీయం. ఆ రాజకీయ నేతను చట్టబద్ధంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నాం' అని పేర్కొన్నారు. కాగా.. వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీస్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు షేక్ మహబూబ్ సుభాని, ప్రధాన కార్యదర్శి భార్గవ్ సుతేజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.శశిధర్, ఉపాధ్యక్షుడు షేక్ బాజీబాబా మరో ప్రకటన చేస్తూ 'శశికాంత్ భూషణ్ వంటి కొందరు కావాలని ప్రభుత్వ ఉద్యోగులమైన తమను భయభ్రాంతులకు గురిచేసి దాడి చేయాలని చూస్తుండటం మంచి పద్ధతి కాదు. మమ్మల్ని ప్రభుత్వ వ్యతిరేకులుగా చిత్రీకరించేందుకు టీడీపీ నాయకులు యత్నిస్తుండటం దుర్మార్గం. టీడీపీ నాయకుడు చేసిన వ్యాఖ్యలను డీజీపీ దృష్టికి తీసుకెళ్తాం. అతని వ్యాఖ్యలను సుమోటోగా తీసుకుని కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి' అని డిమాండ్ చేశారు.

రచ్చరచ్చగా 'కూటమి' సమావేశం

సాక్షి టాస్క్‌ఫోర్స్

ఇన్‌చార్జి మంత్రి ఎదుటే వాగ్వాదానికి దిగిన నేతలు

తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి నాయకుల్లో భగ్గుమన్న అసంతృప్తి

తిరుపతిలో ఎన్డీఏ కూటమి అంతర్గత సమావేశం హాట్‌హాట్‌గా జరిగింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎదుటే నేతలు పరస్పరం బూతులతో రెచ్చిపోయి రచ్చరచ్చ చేశారు. తమకు కనీస విలువ ఇవ్వడంలేదని ఎమ్మెల్యేలు ఫైర్ అయ్యారు. బంధువులు, ముఖ్య అనుచరులకే పనులు కట్టబెట్టి వసూళ్లకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. తిరుపతిలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని ఆధ్వర్యంలో సోమవారం ఎన్డీఏ కూటమి అంతర్గత సమావేశం జరిగింది. ముందుగా జిల్లా నేతలతో మంత్రి సమావేశమయ్యారు. అనంతరం నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్సీలు, నియోజకవర్గ, మండలస్థాయి నేతలతో విడివిడిగా చర్చించారు. దాదాపు అన్ని నియోజకవర్గాల నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఎమ్మెల్యేల తీరు సరిగాలేదని ఆరోపించారు. తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలపై స్థానిక నాయకులు తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తీరుపై జనసేన నేత కోట వినూత, పలువురు టీడీపీ నేతలు భగ్గుమన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే నానిపై స్థానిక నేతలు మండిపడ్డారు.

మాకు ఎమ్మెల్యే ఆదిమూలం వద్దు..

సత్యవేడు నియోజకవర్గ నేతలు ఎమ్మెల్యే ఆదిమూలం సస్పెన్షన్ విషయాన్ని ప్రస్తావించారు. తమకు ఎమ్మెల్యే ఆదిమూలం వద్దని తెగేసి చెప్పారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. త్వరలోనే సత్యవేడు నియోజకవర్గానికి ఇన్‌చార్జిని నియమిస్తామన్నారు. ఈ క్రమంలోనే జనసేనకు చెందిన తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపై కూడా టీడీపీ నేతలు విరుచుకుపడ్డారు. సీటును త్యాగం చేశాం, గెలిపించేందుకు కష్టపడి పనిచేశాం.. కానీ, ఎమ్మెల్యే తన బంధువులు, చిత్తూరు నుంచి తీసుకొచ్చిన తన వర్గీయులకు పెత్తనం అప్పగించారని.. వార్డుల్లో కార్యక్రమాలు నిర్వహించినా తమకెలాంటి సమాచారం ఇవ్వడంలేదని మండిపడ్డారు. ప్రొటోకాల్ కూడా పాటించడం లేదన్నారు. ఇక బ్యానర్లలో స్థానిక జనసేన, బీజేపీ నాయకులకు చోటు కల్పించడంలేదని.. అలాగే, కార్పొరేషన్ కమిషనర్, టీటీడీ ఎస్టేట్ అధికారి తమకు కనీస మర్యాద ఇవ్వడంలేదని, వెంటనే వారిని బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

నేడు పులివెందులకు వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం వైఎస్సార్ జిల్లా పులివెందులలో పర్యటించనున్నారు. ఆయన ఉదయం 10.45 గంటల ప్రాంతంలో ఇడుపులపాయకు చేరుకుంటారు. ఆ తర్వాత అక్కడి నుంచి పులివెందుల వెళతారు. 3 రోజులపాటు పులివెందులలోనే అందుబాటులో ఉంటారు.

కాసులకే ఇసుక

యధావిధిగా తవ్వకం, లోడింగ్ చార్జీలు, జీఎస్టీ / రవాణా చార్జీలు తడిసి మోపెడు

సాక్షి, అమరావతి:

డబ్బులెవరికీ ఊరికే రావు..!

ఉచిత ఇసుక కూడా ఊరికే రాదు!!

డబ్బులిస్తే మాత్రం ఉచితంగానే వస్తుంది!!


పూతలపట్టులోని వావిల్‌తోట పరిసర ప్రాంతాల్లో డంప్‌చేసిన ఇసుక

విచిత్రంగా ఉన్నా ఇది నిజం! ఉచిత ఇసుక అంటూ రకరకాల విన్యాసాలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రీచ్‌లను పచ్చముఠాల చేతుల్లో పెట్టేసి ప్రజలను ముప్పు తిప్పలు పెడుతోంది. ఉచితంగా ఇస్తున్నామని నమ్మబలుకుతూ వినియోగదారుల ముక్కు పిండి వసూలు చేస్తోంది. రాష్ట్రంలో ఎక్కడ చూసినా సాధారణ ధరకు ఇసుక దొరికే పరిస్థితి లేకుండాపోయింది. 20 టన్నుల లారీ ఇసుక రూ.25 వేల నుంచి రూ.45 వేలకు పైనే పలుకుతోంది. ట్రాక్టర్ ఇసుకను రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత డబ్బులు కట్టాక ఇక ఉచితం ఏమిటని వినియోగదారులు వాపోతున్నారు. వర్షాకాలంలో అవసరాల కోసం వైఎస్సార్ సీపీ హయాంలో 80 లక్షల టన్నుల ఇసుకను నిల్వ చేయగా కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన వెంటనే 40 లక్షల టన్నులను పచ్చముఠాలు అమ్ముకుని సొమ్ము చేసుకోవడం తెలిసిందే. మిగతా ఇసుకను సైతం ఊడ్చేసి నిర్మాణ రంగాన్ని కుదేలు చేయడంతో 40 లక్షల మందికిపైగా కార్మికులు జీవనోపాధి కోల్పోయి అల్లాడుతున్నారు.

వసూళ్లు మామూలే

ఇసుకపై జీఎస్టీ, సీనరేజీ చార్జీలు రద్దు చేశామంటూ ఇటీవల మంత్రివర్గ సమావేశం అనంతరం కూటమి సర్కారు ప్రకటించింది. అయితే వసూళ్లు మాత్రం ఆగలేదు. తవ్వకం, లోడింగ్ చార్జీలతోపాటు జీఎస్టీ ముక్కుపిండి వసూలు చేస్తూ మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోంది.

రీచ్‌లన్నీ ప్రైవేట్ చేతిలో పెట్టేసి..

ఇసుక రీచ్‌లను టెండర్ల ప్రక్రియ నిర్వహించి మరీ ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించిన కూటమి సర్కారు ఉచితంగా ఇస్తున్నట్లు బుకాయించడం విడ్డూరంగా ఉందని ప్రజాసంఘాల నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. టన్ను ఇసుక తవ్వేందుకు రూ.35 నుంచి రూ.120 వరకూ వసూలు చేసేలా టెండర్ వేసి దక్కించుకున్న టీడీపీ నేతలు ఉచితంగా ఎందుకు ఇస్తారనే ప్రశ్నకు ప్రభుత్వం విచిత్రమైన సమాధానాలు చెబుతోంది. ఇసుక కావాల్సిన వారు రీచ్‌లకు నేరుగా కార్మికులను తీసుకెళ్లి తవ్వించుకుని లోడ్ చేయించుకోవాలని ఉచిత సలహాలిస్తోంది! లేదంటే కాంట్రాక్టు సంస్థలకు డబ్బులు కట్టి ఇసుకను తీసుకెళ్లాలంటోంది.

రీచ్‌లు లేని చోట్ల సొంత మనుషులకు లైసెన్సులు!

ఒకవైపు రీచ్‌లన్నింటినీ టీడీపీకి చెందిన కాంట్రాక్టర్లకు కట్టబెట్టేసి మరోవైపు వినియోగదారులు లారీలు, కార్మికులను తీసుకెళ్లి ఇసుక తవ్వించుకుని తీసుకెళ్లాలని ప్రభుత్వం చెప్పడంపై విస్మయం వ్యక్తమవుతోంది. కాంట్రాక్టర్లకు రీచ్‌లు అప్పగించిన తర్వాత వినియోగదారులు వారిని కాదని ఇసుకను తవ్వించే పరిస్థితి ఎలా ఉంటుందో ప్రభుత్వానికి తెలియాలి. ఉచితంగా ఇస్తున్నట్లు చిత్రీకరించే క్రమంలో ఇలాంటి వింత విధానాలు తెచ్చింది. సాధ్యం కాని రీతిలో ప్రజలే ఇసుకను తవ్వించుకోవాలని చెబుతూ పచ్చ ముఠాల దోపిడీకి లైన్ క్లియర్ చేసినట్లు తేటతెల్లమవుతోంది. ఇక ఇసుక రీచ్‌లు లేని జిల్లాల్లో తమ సొంత మనుషులకు మినరల్ డీలర్ లైసెన్సులు ఇచ్చి మరో తరహా దోపిడీకి రంగం సిద్ధం చేస్తున్నారు. త్వరలో ఆయా జిల్లాల్లో ఇందుకు టెండర్లు పిలవనున్నారు.

తీసుకెళ్లనివ్వని 'తమ్ముళ్లు'

స్థానిక అవసరాలకు ట్రాక్టర్లు, ఎడ్లబళ్లలో ఎవరైనా ఉచితంగా ఇసుక తీసుకెళ్లవచ్చన్న ప్రభుత్వ ప్రకటన బోగస్ అని తేలిపోయింది. ట్రాక్టర్లు తీసుకెళ్లి ఇసుకను లోడ్ చేయించుకునేందుకు టీడీపీ నేతలు ఎక్కడా ఒప్పుకోవడం లేదు. సామాజిక అవసరాలు, వ్యక్తిగత అవసరాలకు ఇసుక తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం చెబుతున్నా స్థానికంగా ఎక్కడా అందుకు అవకాశం ఇవ్వడం లేదు. ఎవరైనా సరే తమకు డబ్బు కట్టాల్సిందేనని టీడీపీ నేతలు తేల్చి చెబుతున్నారు. మరోవైపు వారే ట్రాక్టర్లలో ఇసుకను రీచ్‌ల నుంచి ప్రైవేట్ డంప్‌లకు భారీగా తరలించి అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు అక్రమ రవాణా చేస్తున్నారు. రీచ్‌ల్లో అమ్మకాల కంటే అక్రమ రవాణాయే ఎక్కువగా జరుగుతోంది. ఎవరైనా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలనుకున్నా అది అంత సులభంగా జరిగే ఆస్కారం లేకుండా పోయింది. ఎప్పుడు ఓపెన్ అవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. నానా తిప్పలు పడి ఎలాగోలా బుక్ చేసుకున్నా స్లాట్ రావడానికి నాలుగైదు రోజులు పడుతుండటంతో నిర్మాణదారులు లబోదిబోమంటున్నారు.

పూతలపట్టు నుంచి బెంగళూరుకు !

రోజూ అక్రమంగా ఇసుక తరలిస్తున్న టీడీపీ నేత

సాక్షి టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం తెచ్చిన ఇసుక పాలసీ టీడీపీ నేతలకు వరంగా మారింది. ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లలో ఇసుక తీసుకువెళ్లడానికి ఎటువంటి అనుమతి అవసరం లేదని ప్రభుత్వం ప్రకటించటంతో ఆ పార్టీ నాయకులు రెచ్చిపోతున్నారు. అడ్డగోలుగా నదులు, వాగులు, వంకలను తవ్వేస్తున్నారు. ట్రాక్టర్లతో ఇసుకను తరలించి సురక్షిత ప్రాంతాల్లో డంపింగ్ చేస్తున్నారు. అక్కడి నుంచి రాత్రిళ్లు ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. చిత్తూరు జిల్లా పూతలపట్టుకు చెందిన ఒక టీడీపీ నేత నిర్వాకమే ఇందుకు నిదర్శనం. పూతలపట్టు మండలం వావిల్‌తోట వంకలోని ఇసుకను టీడీపీ నేత తవ్వించి ట్రాక్టర్లలో తరలించి శివారు ప్రాంతంలోని వినియోగంలో లేని క్రషర్స్, వాటి పరిసర ప్రాంతాల్లో డంప్ చేస్తున్నారు. రాత్రి వేళ ఆ ఇసుకను లారీలు, కంటైనర్ల ద్వారా బెంగళూరుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తుండగా ఎవరైనా అడిగితే... తన సొంతానికి అని చెప్పి తప్పించుకుంటున్నారు. ఇలా 15 రోజులుగా నిత్యం పెద్ద ఎత్తున ఇసుకను అడ్డగోలుగా తవ్వి బెంగళూరుకు తరలిస్తున్నట్లు తెలిసింది. సదరు టీడీపీ నేత ఈ దందాలో మరికొందరు టీడీపీ నాయకులు, అధికారులకు వాటా ఇస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

పోర్టులో రెచ్చిపోయిన సోమిరెడ్డి

- పోర్టు సెక్యూరిటీ డీజీఎంపై టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి దాడి

సాక్షి ప్రతినిధి నెల్లూరు/ముత్తుకూరు: నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం పోర్టులో సెక్యూరిటీ డీజీఎం, సిబ్బందిపై ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దాడికి తెగబడిన వైనం కలకలం రేపింది. కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ పునరుద్ధరణ పనులపై యాజమాన్యంతో చర్చించే నిమిత్తం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సోమవారం తన అనుచరులతో వెళ్లారు. పోర్టు ప్రధాన ద్వారం వద్ద విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ డీజీఎం ఎమ్మెల్యే కారుతోపాటు మరికొన్ని వాహనాలను లోనికి అనుమతించారు. మిగిలిన వాహనాలను తనిఖీ చేయాలని నిలిపివేశారు. దీంతో ఆగ్రహించిన సోమిరెడ్డి కారునుంచి దిగివచ్చి కోపంతో ఊగిపోతూ అసభ్య పదజాలంతో తిట్ల దండకం అందుకున్నారు. సెక్యూరిటీ డీజీఎంపై దాడికి తెగబడి ఆయనను వెనక్కి నెట్టివేశారు. తనకు జరిగిన అవమానాన్ని పోర్టు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లే క్రమంలో పోలీసులు, నాయకులు డీజీఎంను వారించారు. కాగా.. ఇదే అంశంపై పోర్టు అడ్మిన్ భవనం వద్ద కూడా సోమిరెడ్డి ఆగ్రహం వెలిబుచ్చారు. ఎన్నికల ముందు పోర్టు కంటైనర్ టెర్మినల్ సేవలను పునరుద్ధరిస్తామని సోమిరెడ్డి హామీ ఇచ్చారు. ఈ అంశంపై ఇప్పటివరకు పోర్టు యాజమాన్యంతో చర్చలు జరపకపోవడం, ఎలాంటి కార్యాచరణ చేపట్టకపోవడంతో సీఐటీయూ నాయకులు ఆందోళనకు పిలుపునిచ్చారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి అఖిలపక్షం పేరుతో పోర్టు అధికారులతో మాట్లాడేందుకు సోమవారం వెళ్లిన సోమిరెడ్డి పోర్టు కార్యాలయంలోకి వెళ్లి సీఈఓతోనూ వాగ్వాదానికి దిగారు. ఆయనతో దురుసుగా ప్రవర్తిస్తూ కేకలు వేశారు.

'ఆస్తుల వివాదాన్ని విజయమ్మ సమక్షంలో పరిష్కరించుకోవాలి'

మాదాపూర్ (హైదరాబాద్) : వైఎస్ కుటుంబంలో ఆస్తుల వ్యవహారాన్ని విజయమ్మ సమక్షంలో పరిష్కరించుకోవాలని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆయన శనివారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వైఎస్ జగన్, షర్మిల మధ్య ఆస్తుల వివాదం బాధ కలిగిస్తోందన్నారు. నాలుగు గోడల మధ్య పరిష్కరించుకోవాల్సిన సమస్యను రాష్ట్ర సమస్యగా, అధికార కూటమి పన్నిన కుట్రగా వైఎస్ జగన్ మాట్లాడుతున్నారని అన్నారు. ఈ వివాదాన్ని మీడియా వేదికగా కాకుండా విజయమ్మ వద్ద పరిష్కరించుకోవాలని చెప్పారు. వైఎస్సార్‌సీపీలో ఉన్నప్పుడు ఎంతో ఖర్చుపెట్టుకున్నానని తెలిపారు.

పెన్నా నదిలో 'వసూళ్ల గేటు'

ఇసుక తీసుకెళుతున్న ఎడ్లబండ్లు, ట్రాక్టర్లకు డబ్బు వసూలు చేస్తున్న టీడీపీ నేత

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు మండలం రామాపురం గ్రామానికి చెందిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అనుచరుడు గుర్రప్ప అలియాస్ గురివిరెడ్డి ఏకంగా పెన్నా నదిలో అనధికార గేటు పెట్టి డబ్బు వసూలు చేస్తున్నారు. ఒంటెద్దు బండికి రూ.150, రెండు ఎడ్ల బండ్లకు రూ.300, ట్రాక్టర్‌కు రూ.1,000 నుంచి రూ.1,200 చెల్లిస్తే కానీ పెన్నా నదిలోకి అనుమతించడం లేదు. ఇందుకోసం ప్రత్యేకంగా పెన్నా నదిలో గేటు ఏర్పాటు చేశారు. గ్రామ పరిధిలోని కొందరు వ్యక్తులు పెన్నా నదిలోని ఇసుకకు మీకు ఎందుకు గేటు చార్జీలు చెల్లించాలని సోమవారం వాగ్వాదానికి దిగడంతో ఈ పంచాయితీ రూరల్ పోలీస్ స్టేషన్‌కు చేరింది. అయినా ఫలితం లేకపోయింది. గేటు దగ్గర వసూళ్లు యథాతథంగా కొనసాగుతున్నాయి.

అక్రమ రవాణాకు అడ్డా

రామాపురం గ్రామం ఇసుక అక్రమ రవాణాకు అడ్డాగా మారింది. పెన్నా నది ఒడ్డునే గ్రామం ఉండటంతో ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచే ఇక్కడ నుంచి ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. మండల పరిధిలోని పెన్నా నది పరీవాహక గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది.


ప్రొద్దుటూరు మండలం రామాపురం వద్ద పెన్నా నదికి వెళ్లేమార్గంలో టీడీపీ నాయకుడు అనధికారిక వసూళ్ల కోసం ఏర్పాటు చేసిన గేటు

ఆదిలాబాద్‌లో బీసీ కమిషన్ పర్యటన

- 'స్థానిక' ఎన్నికల రిజర్వేషన్లపై ప్రజాభిప్రాయ సేకరణ



ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్న బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు

కైలాస్‌నగర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషా ఖరారు కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన బీసీ కమిషన్ సోమవారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించింది. రాష్ట్ర చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోల్ జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, రంగు బాలలక్ష్మిలతో కూడిన బృందం ఆదిలాబాద్ జెడ్పీ సమావేశ మందిరంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. ఆయా జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల నుంచి వచ్చిన పలు బీసీ సంఘాల ప్రతినిధులు, కులస్తులు తమకు జరుగుతున్న అన్యాయం, కల్పించాల్సిన సౌకర్యాలు, రిజర్వేషన్లపై కమిషన్‌కు వివరించడంతో పాటు లిఖితపూర్వకంగా సమాచారం అందించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగిన ఈ ప్రక్రియలో మొత్తం 90 విజ్ఞప్తులు అందాయి. ఇంకా ఎవరైనా రానటువంటి వారుంటే నవంబర్ 13వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో గల తెలంగాణ బీసీ కమిషన్ రాష్ట్ర కార్యాలయం 4వ అంతస్తులో నేరుగా గానీ పోస్టు ద్వారా గానీ తమ విజ్ఞప్తులను పంపించవచ్చని చైర్మన్ సూచించారు.

ప్రతి వారం రాజ్‌పాకాల ఫామ్‌హౌజ్‌లో రేవ్‌పార్టీ

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బావమరిది రాజ్‌పాకాల ప్రతివారం తన ఫామ్‌హౌజ్‌లో రేవ్ పార్టీ నిర్వహిస్తాడని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ ఆరోపించారు. పక్కా సమాచారంతోనే పోలీసులు దాడి చేశారని, వాస్తవాలన్నింటినీ ప్రజల ముందు పెడతామని తెలిపారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేటీఆర్, ఆయన బావమ రిది ఒకసారి నార్కోటిక్ పరీక్ష చేయించుకుంటే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయన్నారు. డ్రగ్స్ అనగానే ప్రతిసారీ కేటీఆర్ ఎందుకు స్పందిస్తాడని, డ్రగ్స్‌కు, కేటీఆర్‌కు ఏం సంబంధమని ప్రశ్నించారు. తన ఫామ్‌హౌజ్‌లో పేకాట, కేసినో నిర్వహిస్తూ, డ్రగ్స్ తీసుకుంటూ రాజ్‌పాకాల అడ్డంగా దొరికిపోయాడని చెప్పారు. హవాయ్ చెప్పులు వేసుకున్న వారు ఇప్పుడు హవాయ్ బెంజ్ స్థాయికి ఎదిగారని, ఇన్ని వేల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. కేసీఆర్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు 50 మంది ఆస్తులపై వెంటనే విచారణ జరిపించాలని తాను ప్రభుత్వాన్ని కోరుతున్నానని షబ్బీర్‌అలీ వెల్లడించారు.

జన్వాడ పార్టీ కేసులో.. ఎలాంటి కఠిన చర్యలు వద్దు

పోలీసులకు, ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

- పిటిషనర్ రెండు రోజుల్లో ఆ పార్టీ వివరాలన్నీ అందజేయాలి
- ఆ తర్వాత పోలీసులు చట్టప్రకారం ముందుకెళ్లాలని స్పష్టీకరణ
- ఈ అంశంలో హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ వేసిన కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల
- అధికార పార్టీ కేటీఆర్ కుటుంబ సభ్యులను టార్గెట్ చేసింది..
- కావాలనే తప్పుడు కేసు నమోదు చేశారని ఆరోపణ
- ప్రభుత్వం చట్టప్రకారమే ముందుకెళ్తుందని కోర్టుకు తెలిపిన ఏఏజీ



సాక్షి, హైదరాబాద్: జన్వాడ పార్టీ కేసులో ఎలాంటి కఠిన చర్యలు చేపట్టవద్దని పోలీసులను, ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. పిటిషనర్ (పాకాల రాజేంద్రప్రసాద్/రాజ్ పాకాల)కు రెండు రోజులు సమయమిచ్చి.. ఆలోగా జన్వాడలో నిర్వహించిన పార్టీకి సంబంధించిన వివరాలన్నీ పోలీసులకు అందజేయాలని ఆదేశించింది. ఆ తర్వాత చట్టప్రకారం ముందుకు వెళ్లాలని పోలీసులకు సూచించింది. తనను పోలీసులు చట్టవిరుద్ధంగా అరెస్టు చేయాలని ప్రయత్నిస్తున్నారని.. కనీసం బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 35 ప్రకారం నోటీసులు కూడా జారీ చేయలేదని పేర్కొంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల హైకోర్టులో లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈనెల 27న నమోదు చేసిన కేసులో ఎలాంటి చర్యలు చేపట్టకుండా, తన వ్యక్తిగత జీవితంలో జోక్యం చేసుకోకుండా మోకిల పోలీస్‌స్టేషన్ సీఐ, ఎస్సైలకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ బి.విజయసేన్ రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది మయూర్‌రెడ్డి, ప్రభుత్వం తరఫున ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపించారు.

కేటీఆర్ కుటుంబ సభ్యులను టార్గెట్ చేశారు..

రాజకీయ విభేదాలు, కేటీఆర్ బావమరిది అయిన కారణంగానే రాజ్ పాకాలపై తప్పుడు కేసునమోదు చేశారని న్యాయవాది మయూర్‌రెడ్డి కోర్టుకు వివరించారు. "ప్రస్తుత మంత్రి ఒకరు కేటీఆర్‌పై ఇటీవల తీవ్ర పదజాలంతో వ్యాఖ్యలు చేశారు. దానిపై కేటీఆర్ పరువు నష్టం దావా కూడా వేశారు. మరో మంత్రి మీడియాతో మాట్లాడుతూ త్వరలో రాజకీయ బాంబులు పేలుతాయంటూ వ్యాఖ్యానించారు. అధికార పార్టీ కేటీఆర్ కుటుంబ సభ్యులను టార్గెట్ చేయడం, వేటాడటం ప్రారంభించింది. జన్వాడలో నూతన గృహప్రవేశ వేడుక జరుగుతుండగా, చుట్టాలు, స్నేహితులు ఉండగా.. పోలీసులు దాడులు చేశారు. అక్టోబర్ 26న రాత్రి 11.30 గంటల సమయంలో ఎక్సైజ్ అధికారులు, ఎస్‌ఓటీతో వచ్చిన మోకిలా ఇన్‌స్పెక్టర్ అనుమతి లేకుండా ఇంట్లోకి చొరబడ్డారు. నార్కోటిక్ అవశేషాల కోసమంటూ పిటిషనర్‌ను నిర్బంధించారు. చుట్టాలను, స్నేహితులను, మహిళలను, చిన్న పిల్లలను.. ఇలా అందరి నుంచి యూరిన్ శాంపిల్స్ తీసుకున్నారు. అయితే సోదాల్లో వారికి ఎలాంటి డ్రగ్స్ దొరకలేదు. అయినా తప్పుడు కేసు నమోదు చేశారు. పిటిషనర్‌కు 27-10-2024 రోజున ఉదయం 9.30 గంటలకు బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 35 (3) ప్రకారం నోటీసులు జారీ చేసి.. 28న ఉదయం 11 గంటలకు హాజరుకావాలని పోలీసులు పేర్కొన్నారు. ముందుకొచ్చి వివరణ ఇవ్వడానికి తగిన సమయం కూడా ఇవ్వలేదు. చట్టప్రకారం కనీసం 48 గంటలైనా ఇవ్వాలి. పిటిషనర్‌ను అరెస్టు చేయకుండా ఆదేశాలు ఇవ్వాలి" అని న్యాయమూర్తిని కోరారు.

చట్టప్రకారమే చర్యలు చేపడతాం..

అనంతరం ప్రభుత్వం తరఫున ఏఏజీ వాదనలు వినిపించారు. "పిటిషనర్ ఫాంహౌస్‌లో నిర్వహిస్తున్న పార్టీలో డ్రగ్స్, విదేశీ మద్యం వినియోగిస్తున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాడులు నిర్వహించారు. రాత్రి 11.30 గంటల ప్రాంతంలో చట్టప్రకారం తనిఖీలు నిర్వహించారు. అక్కడున్న వారు మద్యం తాగినట్టు తేలింది. మద్దూరి విజయ్ అనే వ్యక్తికి కొకైన్ పాజిటివ్ వచ్చింది. దీనితో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. విజయ్‌కు పిటిషనర్ (రాజ్ పాకాల) ఐదేళ్లుగా అత్యంత సన్నిహితుడు. అతడి నుంచి సేకరించిన వివరాల మేరకే కేసు నమోదు చేశాం. పిటిషనర్‌ను అరెస్టు చేసే ఆలోచన ప్రస్తుతానికి పోలీసులకు లేదు. ఎలాంటి వేధింపులు చేయడం లేదు. ఏ చర్యలు చేపట్టినా చట్టప్రకారమే ముందుకు వెళతాం. రాజకీయ విభేదాల కారణంగానే తప్పుడు కేసులు పెడుతున్నారనడం సరికాదు" అని పేర్కొన్నారు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ.. "ఒకవేళ ఏదైనా పార్టీలో డ్రగ్స్ వినియోగించే వారిని పట్టుకున్నా.. వారికి ఆరు నెలలే శిక్ష విధిస్తారు కదా.. ఇలాంటి కేసుల్లో నోటీసులు జారీ చేయవచ్చు కదా..?" అని ఏఏజీని ప్రశ్నించారు. ఈ కేసులో ఎలాంటి కఠిన చర్యలు చేపట్టవద్దని పోలీసులను ఆదేశిస్తూ విచారణను నవంబర్ 25కు వాయిదా వేశారు.

ముంపు భూములపై జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణ జరపాలి

- మహారాష్ట్ర రైతుల డిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న మహారాష్ట్ర రైతులు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లి వద్ద నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బరాజ్ కింద మహారాష్ట్ర వైపు ముంపునకు గురవుతున్న భూములపై జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని ఆ రాష్ట్ర రైతులు డిమాండ్ చేశారు. సోమవారం మహాదేవపూర్ ప్రెస్ క్లబ్‌లో మహారాష్ట్రకు చెందిన కొంతమంది రైతులు విలేకరులతో మాట్లాడారు. మేడిగడ్డ నిర్మాణ సమయంలో తెలంగాణ ఇరిగేషన్ అధికారులు గడ్చిరోలి జిల్లా సిరొంచ వైపున సుమారు 10 గ్రామాల రైతుల భూములను తప్పుగా సర్వే చేశారని, ఎక్కువ ముంపు ఉంటే తక్కువగా చూపి చేతులు దులుపుకున్నారన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వానికి తమ నిరసన తెలపగా ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ స్పందించి ముంపునకు కొంతమేర నష్టపరిహారం చెల్లించారన్నారు. ప్రస్తుతం తెలంగాణలో ఉన్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తమ భూములను రీసర్వే చేసి పూర్తి పరిహారం చెల్లించాలని వారు కోరారు. కాళేశ్వరంపై జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణ జరుపుతున్నట్లుగా, తమ భూములపైన కూడా రీ సర్వే చేసి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయనకు లేఖ పంపినట్లు పేర్కొన్నారు.

రాజ్ పాకాలకు నోటీసులు

▶ మొదటి పేజీ తరువాయి

ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇవ్వలేదని అధికారులు చెప్తున్నారు. దీంతో ఈ ఇంటికి శ్రీమాతే ప్రాపర్టీస్ పేరుతో 7- 90 ఇంటి నంబర్‌తో పంచాయతీకి పన్ను చెల్లిస్తున్నట్టు తెలిసింది.

పార్టీలో పాల్గొన్నవారి విచారణ

రాజ్ పాకాల ఇంట్లో పార్టీకి హాజరైన వారందరికీ పోలీసులు నోటీసులు ఇచ్చి విచారించనున్నారు. ఇప్పటికే ముగ్గురికి నోటీసులిచ్చి విచారించగా.. మరో ముగ్గురు స్వచ్ఛందంగా పీఎస్‌కు వచ్చి, వెళ్లినట్టు పోలీసులు తెలిపారు. మిగతా 32 మందికి రెండు రోజుల్లో నోటీసులిచ్చి, విచారిస్తామని వెల్లడించారు.

కేసుపై ఏసీపీ సమీక్ష

రాజ్ పాకాల ఇంట్లో పార్టీ కేసును నార్సింగి ఏసీపీ రమణగౌడ్ పర్యవేక్షిస్తున్నారు. సోమవారం ఆయన స్టేషన్‌కు వచ్చి, కేసు దర్యాప్తు తీరు, ఇతర వివరాలను తెలుసుకున్నారు. రాజ్ పాకాల, విజయ్ మద్దూరి విచారణకు హాజరు కాకపోతే తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై ఆయన సూచనలు చేసినట్టు తెలిసింది. ఇక ముందస్తు చర్యల్లో భాగంగా సైబరాబాద్ కమిషనరేట్ నుంచి 10 మంది ప్రత్యేక పోలీస్ సిబ్బందిని మోకిల పీఎస్‌కు పంపించారు.

ఫోన్ సీజ్‌లో ట్విస్ట్

ఈ కేసులో కొకైన్ పాజిటివ్ వచ్చిన విజయ్ మద్దూరికి సంబంధించిన డ్రగ్ టెస్ట్ కిట్‌తోపాటు ఆయన ఫోన్‌ను సీజ్ చేసినట్టు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. అయితే ఆ పార్టీలో పాల్గొన్న ఓ మహిళ తన ఫోన్ సీజ్ చేశారని పోలీసులకు తెలిపింది. దీంతో పోలీసులు ఆమె స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసుకున్నారు. కేసు కోర్టు పరిధిలోకి ఉన్నందున కోర్టు అనుమతి తర్వాత ఫోన్‌ను తిరిగిస్తామని వెల్లడించారు. విజయ్‌ను అదుపులోకి తీసుకునే సమయంలో ఆయన తన ఫోన్‌కు బదులు పక్కన ఉన్న మహిళ ఫోన్‌ను ఇచ్చి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఏపీ హైకోర్టు జడ్జీలుగా ముగ్గురు ప్రమాణం



ఏపీ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా చల్లా గుణరంజన్, తూటా చంద్ర ధనశేఖర్, కుంచం మహేశ్వరరావులతో సోమవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు.

హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తే ఊరుకోం

- బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసి ఆర్థికంగా నష్టం జరిగేలా కొందరు వ్యవహరిస్తున్నారని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. తెలంగాణలో మద్య నిషేధం లేదని, ప్రజలు స్వేచ్ఛగా విందులు, వినోదాలు చేసుకోవచ్చని, కానీ కొందరు అనుమతులు తీసుకోకుండా విదేశీ మద్యం వాడుతూ భయభ్రాంతులకు గురయ్యే శబ్దాలతో పార్టీలు, ఫంక్షన్లు చేసుకుంటున్నారని వెల్లడించారు. ఇలా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేలా వ్యవహరిస్తే ఎవరినైనా వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. సోమవారం సచివాలయంలో బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ, స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు రాజ్ పాకాల ఫామ్‌హౌజ్‌పై దాడి చేసి పోలీసులు కేసు నమోదు చేశారని, ఆయన కేటీఆర్ బావమరిది కావడంతో మీడియాలో ఎక్కువ ప్రచారమయిందని చెప్పారు. అంతేకానీ ఫలానా ఫామ్‌హౌజ్ మీద దాడి చేయాలని మంత్రులు, ముఖ్యమంత్రి చెప్పరని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రజల అభివృద్ధి కోసం పనిచేయాల్సిన మంత్రులు, ముఖ్యమంత్రికి ఎవరి ఫామ్‌హౌజ్‌లో ఏం జరుగుతుందో అవసరం లేదని చెప్పారు. రాష్ట్ర పోలీసుల ఆత్మస్థైర్యం దెబ్బతినేలా కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ మాట్లాడారని, ఆయన వ్యాఖ్యల తర్వాత పోలీసుల్లో నైరాశ్యం కలిగే అవకాశముందన్నారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్టాండ్ ఏంటో చెప్పాలని, ఈటల రాజేందర్ ఎందుకు స్పందించడం లేదని పొన్నం ప్రశ్నించారు. తాము ముందునుంచీ చెబుతున్నట్టుగా ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీ తరహాలోనే బీజేపీ, బీఆర్‌ఎస్ వ్యవహారం ఉందని మంత్రి పొన్నం విమర్శించారు.

కుల గణనలో తెలంగాణ మోడల్‌గా నిలుస్తుంది

- సామాజిక వేత్తలు, మేధావులతో సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న కులగణన దేశంలోనే ఒక మోడల్‌గా నిలవబోతోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. వచ్చే నెల 6 నుంచి కులగణనను పకడ్బందీగా నిర్వహించనున్నట్టు వెల్లడించారు. సోమవారం సచివాలయంలో సామాజికవేత్తలు, మేధావులతో సమావేశమైన ఆయన కులగణనలో చేయాల్సిన మార్పులు, చేర్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమాలోచనలు జరిపారు. కులగణనకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయడానికి మంగళవారం కలెక్టర్లతో సమావేశం నిర్వహిస్తున్నట్లు భట్టి తెలిపారు రాష్ట్రవ్యాప్తంగా 300 మంది సామాజికవేత్తలు, మేధావులు, కుల సంఘాలు, యువజన సంఘాలను పిలిచి వారి సూచనలు తీసుకుంటామని తెలిపారు. వీరితోపాటు బీసీ కమిషన్, ఎస్సీ ఎస్టీ కమిషన్ ఇతర భాగస్వాముల అభిప్రాయాలను కూడా సేకరిస్తామన్నారు. ప్రణాళిక శాఖ రూపొందించిన ప్రశ్నపత్రం సమగ్రంగా ఉందని సామాజికవేత్త యోగేంద్ర యాదవ్ లాంటి మేధావులు అభినందించిన విషయాన్ని గుర్తు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కులగణన చేస్తామని ఎన్నికలకు ముందు కామారెడ్డిలో నిర్వహించిన సభలో బీసీ డిక్లరేషన్ ప్రకటించామని, ఇప్పుడు ఆ హామీని కార్యరూపంలోకి తెస్తున్నామన్నారు. ఇప్పటికే నాలుగు జిల్లాల్లో 56 ఇళ్లు పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని కులగణన సర్వే పూర్తి చేసినట్టు తెలిపారు. న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రొఫెసర్ మురళి మనోహర్ సూచించారు. రోజుకు ఒక ఎన్యుమరేటర్ 15 ఇళ్లు సర్వే చేయడం భారమవుతుందని, ఆ సంఖ్యను పదికి కుదించాలని విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ కోదండరాం, ప్రొఫెసర్ సింహాద్రి, సామాజిక విశ్లేషకుడు పాశం యాదగిరి, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

'కాళేశ్వరం' నిర్ణయాలన్నీ కేసీఆర్‌వే!

- అంచనాల ఆమోదం, డీపీఆర్ తయారీ, బరాజ్‌లో నిల్వలపై ఆదేశాలిచ్చారు
- జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు పత్రాలను అందజేసిన మాజీ ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు



నల్లా వెంకటేశ్వర్లు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల స్థలాల ఎంపిక, వ్యాప్కోస్‌కు డీపీఆర్ తయారీ బాధ్యతల అప్పగింత, బరాజ్‌లలో నీటి నిల్వల పెంపు వంటి కీలక నిర్ణయాలను నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్నారని రామగుండం మాజీ ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు అన్నారు. వీటికి సంబంధించిన పత్రాలను రుజువులుగా జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌కు అందజేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌లపై విచారణలో భాగంగా కమిషన్ సోమవారం ఆయనకు నాలుగోసారి క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించింది. డీపీఆర్‌ల తయారీ వ్యాప్కోస్‌కు అప్పగింత నిర్ణయం ఎవరిది? డీపీఆర్‌ను ఆమోదించింది ఎవరు? అని గతంలో కమిషన్ ప్రశ్నించగా, కేసీఆరేనని తెలియజేసే పత్రాలు అందజేశారు. బరాజ్‌ల అంచనాలు, సవరణ అంచనాలకు కేసీఆర్ ఆమోదించారనే రుజువులను సైతం కమిషన్‌కు ఇచ్చారు. బరాజ్‌లలో నీటి నిల్వలను పెంచి నిరంతరం కొనసాగించాలని ప్రభుత్వ అధినేత ఆదేశించారని వెంకటేశ్వర్లు కమిషన్‌కు తెలిపారు. బరాజ్‌ల నిర్మాణంలో షీట్‌పైల్స్ వినియోగం సాధ్యంకాకపోవడంతో ప్రత్యామ్నాయంగా సికెంట్ పైల్స్ లేదా డయాఫ్రమ్ వాల్‌ను వాడాలని సీఈ సీడీఓ సిఫారసు చేశారంటూ సంబంధిత ఆధారాలను సైతం కమిషన్‌కు సమర్పించారు. మూడు బరాజ్‌ల జియోటెక్నికల్ పరీక్షలకు సంబంధించిన 14 వాల్యూమ్‌ల నివేదికలనూ కమిషన్‌కు ఇచ్చారు. బరాజ్‌ల దిగువన సరైన పరిమాణంలో టెయిల్ వాటర్ నిల్వలకు డిజైన్లు ఇవ్వకపోవడంతోనే మేడిగడ్డ బరాజ్ కుంగిందని తెలిపారు. బరాజ్‌లలో 2డీ, 3డీ అధ్యయనాలు మళ్లీ మళ్లీ చేయాల్సి వచ్చిందా? అని కమిషన్ ప్రశ్నించగా... అవునని బదులిస్తూ ఆ పత్రాలు కూడా అందించారు. బరాజ్‌లలో డీవాటరింగ్ అంచనా వ్యయాన్ని పెంచి బిల్లుల చెల్లింపులకు ఎవరు అనుమతించారని కమిషన్ అడగగా, వాటి ఆధారాలనూ సమర్పించారు.

డిజైన్ల ప్రకారం నిర్మాణం లేదు

మేడిగడ్డ బరాజ్ కుంగుబాటు, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో సీపేజీలకు డిజైన్ల ప్రకారం నిర్మాణం జరగకపోవడం, 2019 వరదల తర్వాత మరమ్మతులు నిర్వహించకపోవడమే కారణమని కమిషన్ నియమించిన ఓ నిపుణుల కమిటీ తేల్చింది. ఈ మేరకు ఓ నివేదికను కమిషన్‌కు తాజాగా సమర్పించింది. వరద ప్రవాహానికి అనుగుణంగా డిజైన్లు లేవని, డిజైన్లను ఉల్లంఘించి నిర్మాణాలు చేశారని తప్పుబట్టింది. బరాజ్‌లను కేవలం నీటి మళ్లింపు కోసం వాడాల్సి ఉండగా, నిల్వలను కొనసాగించడంతోనే ఒత్తిడి పెరిగి వాటికి నష్టం కలిగించిందని అభిప్రాయపడింది. సికెంట్ పైల్స్ నిర్మాణంలో అజాగ్రత్తలూ ఓ కారణమని నివేదించింది.

'దశాబ్దాల తర్వాత ఓబీసీలు గుర్తొస్తున్నారు'



సాక్షి, హైదరాబాద్: దశాబ్దాలుగా దేశాన్ని పరిపాలించిన కాంగ్రెస్, బీజేపీ.. ఇతర వెనుకబడిన తరగతులకు (ఓబీసీలకు) అన్యాయం జరిగిందనడం విడ్డూరంగా ఉందని బీఆర్‌ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. అనేక దశాబ్దాల తర్వాత రాహుల్, ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలకు ఓబీసీ కులగణన గుర్తుకొచ్చిందని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. బ్రిటిష్ పాలనలో దేశంలో కుల గణన జరిగిందన్నారు. ప్రస్తుతం జనాభాలో 65 శాతం ఉన్న ఓబీసీ లెక్కలు మాత్రం ప్రస్తుత ప్రభుత్వాల వద్ద లేవని విమర్శించారు. కుల గణన చేపట్టే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉన్నా.. బిహార్, మహారాష్ట్ర ముందుకొచ్చినా అంగీకరించలేదని శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. ఎన్నికలకు ముందు ఓబీసీలకిచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చాలని, మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో అన్ని వర్గాలకు సంబంధించిన లెక్కలుండాలని, కులగణన చేసే అధికారం రాష్ట్రాలకు ఇవ్వాలని కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించిందని గుర్తుచేశారు. సుప్రీం కోర్టు తీర్పునకు అనుగుణంగా బీసీ కులగణనపై రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగాలన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎంల సుదీర్ఘ భేటీ

- ఉదయం సీఎం నివాసంలో, సాయంత్రం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో..
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అధికారుల బదిలీలు, తాజా రాజకీయ పరిణామాలపై చర్చ?
- నేడు ఐపీఎస్‌ల బదిలీలు జరిగే అవకాశం

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సోమవారం సుదీర్ఘంగా సమావేశం అయ్యారు. ఉదయం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో దాదాపు మూడు గంటలు, సాయంత్రం పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నాలుగు గంటలకు పైగా ఇద్దరూ భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం... వీరి భేటీలో ముఖ్యంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఆదాయ వనరుల పెంపునకు గల మార్గాలు, ఇందుకు అవసరమైన ప్రణాళికలపై ఎక్కువసేపు చర్చించారని తెలుస్తోంది. 6వ తేదీన చేపట్టనున్న కులగణన గురించి కూడా చర్చించినట్లు సమాచారం. దీంతోపాటు ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్ అధికారులు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారుల బదిలీలు, పాలనపై పట్టు గురించి కూడా చర్చించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో సోమవారం ఐఏఎస్, ఐఎఫ్‌ఎస్ అధికారుల బదిలీలు జరగగా, మంగళవారం ఐపీఎస్‌ల బదిలీలు ఉంటాయనినే చర్చ ప్రభుత్వ వర్గాల్లో జరుగుతోంది. మరోవైపు రాష్ట్రంలో జరుగుతున్న తాజా రాజకీయ పరిణామాలు, మూసీ ప్రాజెక్టు పునరుజ్జీవనం ప్రాజెక్టు విషయంలో ఎలా ముందుకెళ్లాలి, జన్వాడ ఫామ్‌హౌస్ ఘటన, ప్రతిపక్షాల స్పందనలు తదితర అంశాలపైనా ఇద్దరు చర్చించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు, కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న విచారణ, ధరణిపైనా చర్చించిన రేవంత్, భట్టి.. ఈ విషయాల్లో అనుసరించాల్సిన వైఖరిపైనా ఓ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. వీటితోపాటు కాంగ్రెస్ పార్టీ అంతర్గత రాజకీయాలు, పీసీసీ కూర్పు, నామినేటెడ్ పోస్టుల భర్తీ గురించి కూడా చర్చ జరిగిందని గాంధీభవన్ వర్గాలు అంటున్నాయి. వాణిజ్య పన్నుల రాబడులు పెంచడంలో భాగంగా పన్ను ఎగవేతను అరికట్టే విషయంలో తీసుకోవాల్సిన చర్యల గురించీ చర్చించారు. మొత్తం మీద ఇద్దరు కీలక నేతలు ఒకేరోజు రెండు దఫాలు 7 గంటలకుపైగా సమావేశం కావడం అటు రాజకీయ, ఇటు ప్రభుత్వ వర్గాల్లో ఆసక్తిని కలిగిస్తోంది. ఇక, సాయంత్రం సీఎంతో భేటీ అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, వాణిజ్య పన్నుల శాఖ అధికారులతో భట్టి ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

ఎస్‌ఆర్ బ్రదర్స్ రెడీమేడ్ షాప్ ఓనర్ తండ్రి మృతి



లక్ష్మీనారాయణ

జనగామ: మంటల్లో రూ.లక్షల విలువైన రెడీమేడ్ దుస్తులు కాలిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కొడుకు బాధను చూసి తట్టుకోలేక ఓ తండ్రి గుండె పోటుకు గురై మృతి చెందాడు. ఈ విషాద సంఘటన జనగామ జిల్లా కేంద్రం గుండ్లగడ్డలో జరిగింది. జిల్లా కేంద్రంలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు షా పింగ్ మాల్స్‌తో పాటు ఎస్‌ఆర్ బ్రదర్స్ రెడీ మేడ్ బట్టల దుకాణం పూర్తిగా కాలిపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఎస్‌ఆర్ బ్రదర్స్ ఓనర్ శ్రీనివాస్ సుమారు రూ.70 లక్షలకు పైగా నష్టపోయాడు. కొడుకుకు జరిగిన నష్టం, అతడు పడుతున్న బాధను చూసి తట్టుకోలేని తండ్రి స్వర్గం లక్ష్మీనారాయణ (77) ఆందోళనకు గురయ్యాడు. సోమవారం మధ్యాహ్నం ఛాతీలో నొప్పి వస్తుందని ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకువెళ్లేలోపే కన్నుమూశాడు.



బైటక్ పేరుతో పేకాట శిబిరాలు!
నగరంలో ఓ రౌడీషీటర్ బంధువు బైటక్‌ల పేరిట పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నాడు. మూడు కమిషనరేట్ల పరిధిలోని ఐదు ప్రాంతాల్లో ఈ దందా సాగుతున్నట్లు తెలుస్తోంది. -10లో



వింటేజ్.. క్రేజీ ఇమేజ్
నగరం వింటేజ్ వాహనాల హబ్‌గా మారుతోంది. ఇక్కడ అత్యధిక సంఖ్యలో పాత కాలపు వాహనాలు ఉన్నాయి. వ్యయప్రయాస లున్నా సిటీజనుల్లో క్రేజ్ తగ్గలేదు. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.0/20.0
నగరంలో మంగళవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం పొడి వాతావరణం ఉంటుంది. రాత్రి వేళ చలి పెరుగుతుంది.

అక్రమ సీవరేజీ కనెక్షన్లకు చెక్!



జలమండలి కొత్త కార్యాచరణ
- బహుళ అంతస్తుల భవనాలకు సీవరేజీ కనెక్షన్లు తప్పనిసరి
- పాత ఇంటి స్థానంలో కొత్త ఇంటిని నిర్మించినా..
- నేరుగా లైన్ కలిపితే కఠిన చర్యలుంటాయని హెచ్చరిక

సాక్షి, సిటీబ్యూరో: సీవరేజీ సమస్యపై జలమండలి యుద్ధం ప్రకటించింది. సీవరేజీ పైప్‌లైన్ల ద్వారా మురుగు సాఫీగా ప్రవహించే విధంగా చర్యలు చేపడుతోంది. ఒక వైపు పైప్‌లైన్ సామర్థ్యం పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తూనే మరోవైపు బహుళ అంతస్తు భవనాల సీవరేజీ కనెక్షన్లపై దృష్టి సారించింది. కొత్తగా నిర్మించే అపార్ట్‌మెంట్లకు సీవరేజీ కనెక్షన్లను తప్పనిసరి చేసింది. పాత ఇళ్ల స్థానంలో నిర్మిస్తున్న భవన సముదాయాలకు కూడా కొత్త సీవరేజీ కనెక్షన్ కోసం తప్పనిసరిగా అనుమతి తీసుకోవాల్సిందేనని జలమండలి స్పష్టం చేస్తోంది.

నేరుగా సీవరేజీ లైన్లకు కట్టడి

కొత్త అపార్ట్‌మెంట్, పాత నివాసాల స్థానంలో కట్టిన భవన సముదాయాలకు అనధికారికంగా నేరుగా సీవరేజీ లైన్లకు కలిపే విధానాన్ని కట్టడి చేసేందుకు జలమండలి చర్యలు చేపట్టింది. వాస్తవంగా కొత్త భవన సముదాయాల నిర్మాణాల అనంతరం గుత్తేదార్లు నేరుగా సీవరేజీ లైన్ వేసి ప్రధాన పైప్‌లైన్లకు కలపడం సర్వసాధారణమైంది. మరోవైపు పాత ఇళ్ల స్థానంలో నిర్మించిన బహుళ అంతస్తులు కట్టినా సీవరేజీ లైన్‌ను మాత్రం పాత కనెక్షన్లకు కలుపుతూ వస్తున్నారు. దీంతో పైప్‌లైన్లపై ఒత్తిడి పెరిగి మురుగు బయటికి రావడం, కొన్ని సందర్భాల్లో పైపులు పగిలిపోవడం లాంటి సంఘటనలు అనేకం. ఫలితంగా వర్షకాలంతోపాటు సాధారణ రోజుల్లోనూ మురుగు సమస్య తప్పడం లేదు. దీంతో వాటిని కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టారు.

నోటీసుల జారీ..

బహుళ అంతస్తు భవన సముదాయాలకు అనుమతి లేకుండా నేరుగా డ్రైనేజీ లైన్లను వినియోగించుకోవడాన్ని జలమండలి తీవ్రంగా పరిగణించింది. దీంతో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సీవరేజీ కనెక్షన్లు తీసుకొని బహుళ అంతస్తుల భవన సముదాయాలను గుర్తించి నోటీసులు జారీ చేస్తోంది. వాస్తవంగా ఇండిపెండెంట్ ఇళ్లను కూల్చి వేసి వాటి స్థానంలో కొత్త నిర్మాణాలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలో నెలకు ఐదువేల వరకు వ్యక్తిగత ఇళ్ల నిర్మాణాలవుతుండగా దాదాపు ఐదు వందల వరకు అపార్టుమెంట్ల నిర్మాణాల అనుమతులకు దరఖాస్తులు వస్తుంటాయి. హెచ్‌ఎండీఏ పరిధిలో కూడా నెలకు దాదాపు 250 వరకు హైరైజ్ నిర్మాణాలు, విల్లాలు, టౌన్‌షిప్‌ల కోసం కోసం దరఖాస్తులు అందుతుంటాయి. ప్రత్యేకంగా సీవరేజ్ కనెక్షను పెద్ద ఎత్తున ఖర్చు అవుతుండటంతో అనధికారికంగా పైప్‌లైన్ కలపడంపైనే గుత్తేదారులు ఆసక్తి కనబరుస్తున్నారు. మరోవైపు పాత ఇళ్ల స్థానంలో నిర్మించిన అపార్ట్‌మెంట్లకు సైతం పాత కనెక్షన్లనే కలుపుతున్నారు. దీంతో భవన సముదాయాలకు నోటీసులు జారీ చేయాలని జలమండలి నిర్ణయించింది.

సీవరేజీ నెట్‌వర్క్ ఇలా..

జలమండలి పరిధిలో సీవరేజీ పైప్‌లైన్ వ్యవస్థ సుమారు 9,769.74 కిలో మీటర్ల వరకు ఉండగా, అందులో 612 కిలో మీటర్ల ట్రంక్‌లైన్ ఉంది. పైప్‌లైన్‌కు అనుసంధానంగా సుమారు 6,31,398 మ్యాన్‌హోల్స్ ఉన్నాయి. ప్రస్తుతం దినసరి 2,815 ఎంఎల్‌డీ మురుగు ఉత్పత్తి అవుతోంది. పైప్‌లైన్ సామర్థ్యాలకు మించి ఉండటంతో సీవరేజీలో నిత్యం సమస్యలు తలెత్తుతున్నాయి.

సెట్విన్ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం

మంత్రి పొన్నం ప్రభాకర్



సమీక్షలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, చైర్మన్ గిరిధర్‌రెడ్డి తదితరులు

యాకుత్‌పురా: సెట్విన్ శిక్షణ సంస్థ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం ఆయన పాతబస్తీ పురానీహవేలీలోని సెట్విన్ శిక్షణ సంస్థ ప్రధాన కార్యాలయంలో అత్యాధునిక వసతులతో ఏర్పాటు చేసిన సంస్థ చైర్మన్ నూతన కార్యాలయ ఛాంబర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం సంస్థ కార్యక్రమాలపై సెట్విన్ చైర్మన్ ఎన్.గిరిధర్ రెడ్డి, ఎండీ కె.వేణుగోపాల్ రావుతో కలసి సమీక్ష సమావేశం నిర్వహించారు. సెట్విన్ అందిస్తున్న కోర్సులు, రవాణ సేవలు, శిక్షణ కేంద్రాల పనితీరును అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ సెట్విన్ నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రాలు, ట్రాన్స్‌పోర్టు, ట్రేడింగ్ ద్వారా ఆదాయాన్ని సమాకుర్చేందుకు అన్ని విధాలా సహాయ సహకారం అందిస్తామన్నారు. నగరంలో నడుపుతున్న సెట్విన్ బస్సులను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరింపచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సంస్థ చైర్మన్ గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ... సెట్విన్ బస్సులను త్వరలోనే జడ్చర్ల, హుస్నాబాద్, నల్గొండ, మహబూబ్ నగర్ ప్రాంతాల్లో ప్రారంభించనున్నామన్నారు. రాబోయే రెండేళ్లలో 50 శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి 25 వేల మంది నిరుద్యోగులకు శిక్షణే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ అకౌంట్స్ అధికారి సురేష్ బాబు, లీగల్ అధికారి మహ్మద్ అబ్దుల్ మొహిజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగ్గారావు రచించిన సెట్విన్ స్పోకెన్ ఇంగ్లిష్ మెటీరియల్ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు.

‘ధరలు’ పేలుతున్నాయి!

గత ఏడాది కంటే 20 శాతం వరకు పెరిగిన టపాసుల రేట్లు

- కేజీ సేల్, ఫ్యామిలీ ప్యాక్‌లతో ఆఫర్లు
- భారీ అంచనాలతో దీపావళి క్రాకర్స్ స్టాల్స్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో దీపావళి సందడి మొదలైంది. ఎక్కడ చూసినా క్రాకర్స్ స్టాల్స్ అందుబాటులోకి వచ్చాయి. కొనుగోలుదారులు మాత్రం ధరలు పేలుతున్నాయని గగ్గోలుపెడుతున్నారు. దీపాలతో ఇంటిని అందంగా అలంకరించి, పిండి వంటలతో వంటింటిని ఘుమఘుమలాడించి, సాయంత్రం టపాసులు పేల్చి సంబరాలు చేసుకునే దీపావళికి అంతా సిద్ధమవుతున్నారు. గతంతో పోల్చితే ఈ ఏడాది 15 నుంచి 20 శాతం ధరలు పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. మార్కెట్‌లో కేజీ సేల్ అంటూ కొందరు వినియోగదారులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుండగా, మరి కొన్ని దుకాణాల్లో మాత్రం క్వాలిటీకే మేం ప్రాధాన్యత ఇస్తున్నాం..ధరలు ఎక్కువైనా కస్టమర్స్ మమ్మల్ని ఆదరిస్తారని అంటున్నారు. కేజీ సేల్‌లో టపాసులను తేలికైనవి, బరువైనవి రెండు రకాలుగా విభజించి కేజీ రూ.450 నుంచి రూ.1200 వరకు అమ్ముతున్నారు. ఈ కేటగిరీలో గత ఏడాది సుమారుగా రూ.350 నుంచి రూ.900 వరకు లభించేవి. ఫ్యామిలీ ప్యాక్స్ అంటూ కొన్ని రకాల ప్యాకేజీలు అందుబాటులో ఉంటున్నాయి. అందులో చిన్నపిల్లలు, పెద్దలు అన్ని వయసుల వారికి అవసరమైన టపాసులను అందిస్తున్నారు. ఒక్కో ప్యాక్ రూ.2500 నుంచి రూ.6 వేల వరకు ధర పలుకుతోంది. బాంబులతో పాటు విద్యుత్ దీపాలు, మట్టి ప్రమిదలకు మార్కెట్‌లో డిమాండ్ నెలకొంది. కొత్త మోడల్ ఎల్‌ఈడీ విద్యుత్ సీరియల్ సెట్ దీపాలు ప్రత్యేక ఆఫర్లతో ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి. చిన్నపిల్లలు కాల్చే తాళ్లు, మతాబులు, కాకరపువ్వొత్తుల, అగ్గిపెట్టెలు, ఇతర రకాల వస్తువుల కంటే మార్కెట్‌లో 1000 వాలా నుంచి 10,000 వాలా వరకు, హైడ్రోజన్, లక్ష్మీ బాంబులు, తారాజువ్వలు, చిచ్చుబుడ్డీలు, బుల్లెట్ బాంబ్, మతాబులు, ఇతర వెలుగులు విరజిమ్మే రకాలు, పెద్ద శబ్దం వచ్చే రకాల బాంబులకు గిరాకీ ఉంటుందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

ఖర్చులు పెరిగాయి..



ఆంధ్రా వెళ్లి కొనుగోలు చేస్తున్నాం. లేబర్ చార్జీలు, రవాణా, ఇతర అన్ని రకాల ఖర్చులు పెరిగాయి. గత ఏడాదితో పోల్చితే సుమారుగా 10 శాతం నుంచి 20 శాతం వరకు ధరలు పెరిగే అవకాశం ఉంది. సుమారు దశాబ్దకాలంగా ఈ వ్యాపారంలో కొనసాగుతున్నాం. గతంలో జనవరిలోనే శివకాశి వెళ్లి మనకు అవసరమైన టపాసులను ఆర్డర్ చేసేవాళ్లం. ఇప్పుడాపరిస్థితి లేదు. వ్యాపార విస్తృతి పెరిగింది. నగరంలో రూ.వందల కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా వేస్తున్నాం.
– వివేక్ గౌడ్, క్రాకర్స్ వ్యాపారి, వనస్థలిపురం

ఎమ్మార్పీకి కొంటే మోసపోతారు..

టపాసుల విషయంలో వాస్తవానికి వస్తువుల ప్యాకింగ్‌పై ఉన్న ఎమ్మార్పీ (గరిష్ట ధర) ధరలకు వినియోగదారులకు విక్రయించే ధరలకు ఏమాత్రం పొంతన ఉండటంలేదు. కొన్ని రకాల ప్యాక్‌లపై రూ.వేలల్లో ఎమ్మార్పీ ముద్రించినా ఆ ప్యాక్‌లు రూ.వందల్లోనే దొరుకుతున్నాయి. ఉదాహరణకు 10 థౌజండ్ వాలా ఎమ్మార్పీ సుమారుగా రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు ఉంటున్నాయి. అమ్మకానికి వచ్చేసరికి రూ.4,500 నుంచి రూ.8 వేలకు ఇస్తున్నారు. హైడ్రోజన్ బాంబుల (10 పీసెస్) బాక్సుపై ముద్రించిన ధర రూ.670 నుంచి రూ.950 వరకు ఉంటున్నా వీటిని మార్కెట్‌లో రూ.250 నుంచి రూ.350 మధ్యలో లభిస్తున్నాయి. ఎమ్మార్పీలో కనీసం 20 శాతం నుంచి 60 శాతం వరకు రాయితీపై అమ్ముతున్నారు.



అనుమతులు ఇక రెండంచెల్లో..

లే అవుట్లు, ఎల్‌ఆర్‌ఎస్ తదితర ఫైళ్ల పరిశీలన విధానంలో మార్పు

- మొదట స్థానిక రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులతో క్షేత్ర స్థాయిలో పరిశీలన
- ఆ తరువాత హెచ్‌ఎండీఏ ప్లానింగ్ విభాగం పరిశీలన
- అనంతరమే అనుమతులు మంజూరు



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) నిబంధనలను మరింత కఠినతరం చేసింది. వివిధ రకాల అనుమతులపై నీటిపారుదల, రెవెన్యూ విభాగాల తనిఖీలు, క్షేత్ర స్థాయి నివేదికల అనంతరమే హెచ్‌ఎండీఏ అనుమతులు లభించనున్నాయి. ఇప్పటి వరకు హెచ్‌ఎండీఏ పర్యవేక్షణలోనే అన్ని రకాల డాక్యుమెంట్లను పరిశీలించి అనుమతులు ఇచ్చే అవకాశం ఉండగా, ఇక నుంచి రెవెన్యూ, నీటిపారుదల విభాగాల అనుమతులను కూడా తప్పనిసరి చేశారు. అంటే లే అవుట్‌లు, ఎల్‌ఆర్‌ఎస్‌లు, భవన నిర్మాణాలు తదితర అనుమతుల కోసం హెచ్‌ఎండీఏకు చేరే దరఖాస్తులను రెండంచెల్లో సమగ్రంగా పరిశీలించి అనుమతులు అందజేస్తారు. ఇప్పటికే టీజీబీపాస్ ద్వారా వచ్చిన దరఖాస్తులపైన కూడా క్షేత్రస్థాయి పరిశీలనను నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఒకవైపు హెచ్‌ఎండీఏలో ఫైళ్ల పెండింగ్ జాబితా పెద్దఎత్తున పెరిగిపోతుండగా, తాజా నిబంధనల నేపథ్యంలో ఫైళ్ల పరిష్కారంలో మరింత జాప్యం చోటుచేసుకొనే అవకాశం ఉందని నిర్మాణ సంస్థలు, స్థలాల యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా అనంతరం వందల కొద్దీ ఫైళ్లు పెండింగ్‌లో పడిపోయాయి. కొన్నింటికీ అవసరం ఉన్నా లేకున్నా ఇరిగేషన్, రెవిన్యూ విభాగాల నుంచి నిరభ్యంతర పత్రాలు (ఎన్‌ఓసీ) తప్పనిసరి చేస్తున్నారు. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి అన్ని రకాల ఫైళ్లకు దరఖాస్తు దశలోనే రెవిన్యూ, ఇరిగేషన్ విభాగాల నుంచి క్లియరెన్స్‌ను కోరడం గమనార్హం.

రెండో దశలో ప్రణాళికా విభాగం..

- మొదట టీజీబీపాస్‌లకు అందిన దరఖాస్తులను రెవిన్యూ, ఇరిగేషన్ విభాగాల పరిశీలనకు పంపిస్తారు. ఇరిగేషన్‌లో అసిస్టెంట్ ఇంజనీర్, రెవిన్యూలో డిప్యూటీ తహసీల్దార్ లేదా అంతకంటే ఉన్నత స్థాయికి చెందిన అధికారులు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తారు. చెరువులు, కుంటలు, తదితర నీటి వనరులు, ప్రభుత్వ భూములు, యూఎల్‌సీ వంటి వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకొని క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహిస్తారు. అన్ని విధాలుగా ఎలాంటి ఆటంకాలు లేవని తేలిన తరువాత ఫైల్ ముందుకు వెళ్తుంది.
- రెండో దశలో హెచ్‌ఎండీఏ ప్లానింగ్ విభాగంలో సంబంధిత జోన్‌కు చెందిన ప్లానింగ్ అధికారి మరోసారి ఫైల్‌ను పరిశీలిస్తారు. రెవిన్యూ, ఇరిగేషన్ విభాగాల నుంచి వచ్చిన క్లియరెన్స్‌పైన సంతృప్తి చెందితేనే ఫైల్ పైకి వెళ్తుంది.
- అనంతరం ప్లానింగ్ అధికారి నుంచి వచ్చే నివేదిక ఆధారంగా ప్లానింగ్ డైరెక్టర్ పరిశీలించి కమిషనర్ ఆమోదం కోసం ఫైల్‌ను అందజేస్తారు.

మాస్టర్‌ప్లాన్ ఒక్కటే కాదు..

వివిధ రకాల అనుమతులపైన ఇప్పటి వరకు హెచ్‌ఎండీఏ అధికారులు 2013 లో రూపొందించిన 2031 మాస్టర్‌ప్లాన్‌ను ప్రామాణికంగా తీసుకున్నారు. మాస్టర్‌ప్లాన్‌లో నమోదైన ప్రకారంగా అనుమతులను ఇచ్చారు. కానీ ఇప్పుడు హైడ్రా రాకతో మాస్టర్ ప్లాన్‌ను పక్కన పెట్టారు. ట్రోపోగ్రఫీ ఆధారంగా నీటివనరులను గుర్తిస్తున్నట్లు ఒక అధికారి తెలిపారు. ‘ మాస్టర్ ప్లాన్‌లో చెరువులు, కుంటలు, నివాస ప్రాంతాలు, రోడ్లు, పరిశ్రమలు, అటవీప్రాంతాలు వంటి వివిధ కేటగిరీలు స్పష్టంగా ఉన్నాయి. అందులో సూచించిన విధంగానే అనుమతులను ఇచ్చాం. ఇప్పుడు హైడ్రా సూచన మేరకు ట్రోపోగ్రఫీని కూడా పరిగణనలోకి తీసుకోవలసి వస్తుంది' అని వివరించారు. 'ఇలాంటి సందర్భాల్లో ట్రోపోగ్రఫీ ఆధారంగా కాలువలు, వరద కాలువలు ఉన్నట్లుగా అనుమానం వస్తే ఇరిగేషన్ అనుమతిని కోరుతున్నాం.' అని చెప్పారు. దీంతో సొంత ఇల్లు కట్టుకోవాలని ఆశించే మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వర్గాలకు కొంత ఇబ్బందిగానే ఉంటుంది.

ఇలా వివిధ దశలను దాటుకొని ఉన్నతాధికారుల ఆమోదం పొందిన తరువాత మాత్రమే లే అవుట్‌లు, భవననిర్మాణాలు, ఎల్‌ఆర్‌ఎస్ తదితర అన్ని రకాల అనుమతులు లభిస్తాయి. షార్ట్‌ఫాల్స్ నెపంతో దరఖాస్తుల పరిశీలనలో కాలయాపనకు తావు లేకుండా వారం, పది రోజుల్లోనే అనుమతులను ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కానీ ఇప్పటి వరకు ఉన్న పద్ధతికి భిన్నంగా మరో రెండు విభాగాల అనుమతులను తప్పనిసరి చేయడం వల్ల మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని దరఖాస్తుదారులు పేర్కొంటున్నారు.

కర్ఫ్యూ కాదు.. దీపావళితో సంబంధం లేదు

- కొందరు ఆందోళనలు చేస్తారనే సమాచారంతోనే...
- నగరంలో నిషేధాజ్ఞలపై క్లారిటీ ఇచ్చిన కొత్వాల్
- వచ్చే నెల 28 వరకు నగరంలో ఆంక్షలు అమలు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో సుదీర్ఘకాలం తర్వాత నిషేధాజ్ఞలు విధించడంపై రకరకాలైన పుకార్లు షికారు చేస్తున్నాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వేర్వేరు ప్రచారాలు జరుగుతుండటంతో సిటీ కొత్వాల్ సీవీ ఆనంద్ సోమవారం ‘ఎక్స్’ ద్వారా స్పందించారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఆదివారం సాయంత్రం నుంచి వచ్చే నెల 28వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు 163 సెక్షన్ (గతంలో 144 సెక్షన్) విధించిన విషయం విదితమే. దీపావళి పండుగపై ఆంక్షలు విధిస్తున్నారని, నగరంలో కర్ఫ్యూ అమలులో ఉందని పలువురు నెటిజనులు వ్యాఖ్యానిస్తున్నారు. వీటిపై స్పందించిన పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ 'నగరంలో ఎలాంటి కర్ఫ్యూ అమలులో లేదు. ఆంక్షలు విధిస్తూ జారీ చేసిన నోటిఫికేషన్‌కు, దీపావళి సంబరాలకు ఎలాంటి సంబంధం లేదు. కొన్ని వర్గాలు సున్నిత ప్రాంతాల్లో హఠాత్తుగా నిరసన కార్యక్రమాలకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం ఉంది. సచివాలయం, సీఎం నివాసం, డీజీపీ కార్యాలయం, రాజ్‌భవన్ తదితర ప్రాంతాల్లో ఇవి జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అలాంటి ఆందోళనలు చేసే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం కోసమే ఈ నోటిఫికేషన్ జారీ చేశాం. వారికి అరెస్టు చేయడానికి, నిర్బంధించడానికి ఇది ఉపకరిస్తుంది. దేశ వ్యాప్తంగా అన్ని పోలీసు విభాగాలు అవసరాన్ని బట్టి ఇలాంటి ఆదేశాలు ఇస్తూ ఉంటాయి. కొందరు చెప్తున్నట్లు ఇది కర్ఫ్యూ కూడా కాదు. అంతా రిలాక్స్‌గా ఉండండి' అని వివరణ ఇచ్చారు.

రంగారెడ్డి జిల్లాకు కొత్త కలెక్టర్

నారాయణరెడ్డి నియామకం
- ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల విభాగం కమిషనర్‌గా శశాంక బదిలీ
- ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు సైతం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రంగారెడ్డి జిల్లా నూతన కలెక్టర్‌గా సి.నారాయణరెడ్డి నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన శశాంకను రాష్ట్ర ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల విభాగం కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త కలెక్టర్‌గా నారాయణరెడ్డి మంగళవారం ఉదయం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.



రైతు కుటుంబంలో పుట్టి..

నారాయణరెడ్డిది మహబూబ్‌నగర్ జిల్లా నర్వ మండలంలోని శ్రీపురం. తండ్రి చెన్నారెడ్డి, నర్సింగమ్మ, నలుగురు అన్నలు, ఒక అక్క. నాన్న, సోదరులతో కలిసి వ్యయసాయం చేసేవారు. ఏడో తరగతి చదువుతున్నప్పుడే నాన్న చనిపోయారు. చదువు ఆపేద్దామని నిర్ణయించుకుని, పొలం బాట పట్టారు. ఆ తర్వాత అక్షరాలపై ఉన్న మమకారంతో మళ్లీ చదువుపై దృష్టిసారించారు. ఒకవైపు పొలం పనులు చేస్తూనే మరోవైపు చదువుకునే వాడు. పదో తరగతిలో మంచి మార్కులు వచ్చాయి. దీంతో హైదరాబాద్‌కు చేరుకున్నారు. పెట్రోల్ బంక్‌లో పనిచేస్తూనే..ఇంటర్ పూర్తి చేశారు. ఉస్మానియాలో బీఈడీ, ఎంఎస్సీ చేశారు. కష్టాలెన్ని ఎదురైనా చదువును మాత్రం నిర్లక్ష్యం చేయలేదు. 2006 డీఎస్సీలో మహబూబ్‌నగర్ జిల్లా టాపర్‌గా నిలిచారు. ఆ డీఎస్సీ అభ్యర్థులకు పోస్టింగ్ ఇవ్వడంలో జాప్యం చోటు చేసుకోవడంతో మక్తలోని ఓ ప్రైవేటు స్కూల్లో ఉపాధ్యాయుడిగా పని చేశారు. పెద్ద చదువులు చదివి తక్కువ జీతానికి, చిన్న స్కూల్లో ఎలా పని చేస్తున్నావని అంతా ప్రశ్నించేవారు. అయినా ఆయన మాత్రం అధైర్యపడలేదు.

ఏడాది గడవక ముందే..

ఏడాది వ్యవధిలోనే జిల్లాలో ముగ్గురు కలెక్టర్లు మారడం గమనార్హం. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి కలెక్టర్ హరీశ్‌పై ఎన్నికల కమిషన్ బదిలీ వేటు వేయగా, ఆయన స్థానంలో బాధ్యతలు స్వీకరించిన భారతి హోళికేరి ధరణి దరఖాస్తుల పరిష్కారంలో పలు ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఆ తర్వాత మేడ్చల్ కలెక్టర్ గౌతం పోట్రుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి, ఆ తర్వాత శశాంకను పూర్తిస్థాయి కలెక్టర్‌గా నియమించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ భూములను పరిరక్షించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన కలెక్టర్ శశాంకను తాజాగా ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల కమిషనర్‌గా బదిలీ చేయడం కొసమెరుపు.

ఆర్డీఓల నియామకం

నర్సాపూర్ ఆర్డీఓగా పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ ఎస్.జగదీశ్వర్‌రెడ్డి కందుకూరు ఆర్డీఓగా నియమితులయ్యారు. జీఏడీ ఎస్టేట్ ఆఫీసర్‌గా పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ కె.చంద్రకళను చేవెళ్ల ఆర్డీఓ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్‌గా, చీఫ్ ఎలక్షన్ ఆఫీస్‌లో పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ ఎస్‌ఆర్ సరిత షాద్‌నగర్ ఆర్డీఓగా నియమితులయ్యారు. జల్‌పల్లి, మీర్‌పేట్, బడంగ్‌పేట్, తుక్కుగూడ, ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్లకు స్థాన చలనం కల్పించడం విశేషం.

వెంగళరావునగర్‌లో హైడ్రా కమిషనర్ పర్యటన

వెంగళరావునగర్: నగరంలోని వెంగళరావునగర్‌లో వివాదంలో ఉన్న స్థలాన్ని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం పరిశీలించారు. మోతీనగర్ మార్గంలో ఉన్న ఈ పార్కు స్థలం కబ్జాకు గురైందని స్థానికుల గతంలో హైడ్రాకు ఫిర్యాదు చేశారు. నలంద స్కూల్‌కు చేరువలో ఉన్న ఈ 9800 చదరపు గజాల స్థలం పార్కు కోసం కేటాయించారని. అయితే కొందరు అది తమదే అంటూ ఆక్రమించారని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీని ఆధారంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ, హైడ్రా అధికారులతో కలిసి స్థానికుల సమక్షంలో క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. ఆ స్థలంపై హక్కులు ఉన్నట్లు చెప్పున్న వారు సంబంధిత పత్రాలను తీసుకుని రావాలని సూచించారు. వాటిని పరిశీలించిన తర్వాతే అది పార్కు స్థలమా, ప్రైవేట్‌దా అనేది తేలుస్తామని రంగనాథ్ పేర్కొన్నారు. అప్పటి వరకు అక్కడ ఆక్రమణలు తొలగించి జీహెచ్‌ఎంసీకి చెందిన స్థలంగా బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు హైడ్రా కమిషనర్‌ను కోరారు.



డాక్యుమెంట్లు పరిశీలిస్తున్న రంగనాథ్

నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే అగ్నిప్రమాదం

బొగ్గులకుంట ఉదంతంపై అగ్నిమాపక శాఖ నిర్ధారణ

- టపాసుల విక్రయానికి ఇచ్చిన తాత్కాలిక లైసెన్స్ రద్దు
- ఘటనాస్థలిని పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్



ఘటనాస్థలిలో హైడ్రా కమిషనర్ రంగనాథ్

సాక్షి, సిటీబ్యూరో: బొగ్గులకుంటలోని పరాస్ బాణాసంచా విక్రయ దుకాణంలో ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకోవడానికి నిర్వాహకుల నిర్లక్ష్యమే కారణమని అగ్నిమాపక శాఖ అధికారులు తేల్చారు. ఈ మేరకు ఆ విభాగం డీజీ వై.నాగిరెడ్డి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పరాస్ దుకాణం నిర్వాహకులు బహిరంగ ప్రదేశంలో బాణాసంచా విక్రయం కోసం తాత్కాలిక లైసెన్స్ పొందారు. అయితే జీ ప్లస్ మెజనైన్ ఫ్లోర్‌తో నిర్మించిన కట్టడంలో వీటిని విక్రయిస్తున్నట్లు అగ్నిమాపక శాఖ అధికారులు గుర్తించారు. ఎలాంటి అగ్ని నిరోధక చర్యలు చేపట్టలేదని, ఈ కారణంగానే అగ్నిప్రమాదం జరిగిందని తేల్చారు. లైసెన్స్ నిబంధనలు ఉల్లంఘించిన అగ్నిప్రమాదానికి కారణమైన పరాస్ బాణాసంచా దుకాణం నిర్వాహకులపై కేసు నమోదు చేయడంతో పాటు వారి లైసెన్స్ రద్దు చేసినట్లు నాగిరెడ్డి తెలిపారు. అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సోమవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. బాణాసంచా దుకాణంతో పాటు పక్కనే ఉండి అగ్నికీలలు వ్యాపించడంతో దగ్ధమైన హోటల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ... దీపావళి నేపథ్యంలో టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారులు భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లోనే దుకాణాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతంలో ఈ టపాసుల దుకాణం నిర్వహణకు అనుమతి లేదని, బహిరంగ ప్రదేశంలో విక్రయానికి అనుమతి పొంది, ఇలా షట్టర్లో దుకాణం ఏర్పాటు చేసి విక్రయించారని స్థానికులు రంగనాథ్ దృష్టికి తీసుకువెళ్లారు.

టపాసుల దుకాణాల్లో హైడ్రా తనిఖీలు

బొగ్గులకుంట ప్రమాదం నేపథ్యంలో రాజధాని వ్యాప్తంగా ఏర్పాటైన టపాసుల దుకాణాల్లో హైడ్రా బృందాలు సోమవారం నుంచి తనిఖీలు ప్రారంభించాయి. ఈ విభాగం ఆధీనంలో డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్‌ఎఫ్) అధికారులు, సిబ్బంది ప్రాంతాల వారీగా దుకాణాల్లో భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. నిర్వాహకులతో పాటు వినియోగదారులకూ తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని వివరిస్తున్నారు.

బ్యాంకాక్‌కు థాయ్ ఎయిర్ ఏషియా విమాన సర్వీసులు



శంషాబాద్: హైదరాబాద్ నుంచి బ్యాంకాక్‌కు థాయ్ ఎయిర్ ఏషియా విమాన సర్వీసులను ఆదివారం రాత్రి నుంచి ప్రారంభించింది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి వారం రోజుల్లో సోమ, బుధ, శుక్ర, ఆదివారాల్లో రాత్రి 11.25 గంటలకు ఇక్కడి నుంచి బయలుదేరి బ్యాంకాక్‌లోని డాన్ మయాంగ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి తెల్లవారు జామున 4.30 గంటలకు చేరుకుంటుంది. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణీకర్ మాట్లాడుతూ.. పర్యాటక ప్రాంతమైన బ్యాంకాక్‌కు హైదరాబాద్ నుంచి నేరుగా సర్వీసులు పెంచడం ప్రయాణికులకు మరింత సౌలభ్యం పెరుగుతోందన్నారు.

హైదరాబాద్ అదనపు కలెక్టర్‌గా ముకుంద రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా జీ ముకుంద రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ ఆర్డీఓగా కే రామకృష్ణకు పోస్టింగ్ లభించగా ఇక్కడ పనిచేసిన మహిపాల్ నర్సాపూర్‌కు బదిలీ అయ్యారు. సికింద్రాబాద్ ఆర్డీవోగా సాయిరామ్ నియమితులు కాగా, ఇక్కడ పనిచేసిన దశరథ హెచ్ఎండీకి బదిలీ అయ్యారు. హైదరాబాద్ ఎస్టేట్ అధికారిగా పనిచేస్తున్న చంద్రకళ చేవెళ్ల ఆర్డీవోగా నియమితులయ్యారు.

యూబీడీ అడిషనల్ కమిషనర్‌గా సుభద్రాదేవి

జీహెచ్ఎంసీ పట్టణ జీవవైవిధ్య విభాగం(యూబీడీ) అడిషనల్ కమిషనర్‌గా ఐఎఫ్ఎస్ అధికారిణి వీవీఎల్ సుభద్రాదేవి నియమితులయ్యారు. సోమవారం జరిగిన ఐఎఫ్ఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా ఆమెను జీహెచ్ఎంసీకి బదిలీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

కీసర ఆర్డీఓగా సైదులు..

మేడ్చల్ జిల్లా పరిశ్రమల శాఖ భూసేకరణ అధికారిగా పనిచేస్తున్న సైదులు కీసర ఆర్డీవోగా నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన వెంకట ఉపేందర్‌రెడ్డి సిరిసిల్ల ఆర్డీవోగా బదిలీ అయ్యారు. మేడ్చల్ జిల్లా సంక్షేమ అధికారి పనిచేస్తున్న ఎం కృష్ణారెడ్డి భువనగిరి ఆర్డీవోగా బదిలీ కాగా, ఆయన స్థానంలో వెయింటింగ్‌లో ఉన్న కే స్వర్ణలతకు పోస్టింగ్ లభించింది. మేడ్చల్ జిల్లా పరిషత్ సీఈఓ దిలీప్‌కుమార్ నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో ఎవరినీ నియమించలేదు.

వామ్మో..మోమోస్..

రోడ్లపక్కన ఆహార విక్రయాలపై కరువైన నిఘా

- పట్టించుకోని ఫుడ్‌సేఫ్టీ అధికారులు
- యథేచ్ఛగా కల్తీ పదార్థాల విక్రయం
- అనారోగ్యం పాలవుతున్న ప్రజలు



మోమోస్ విక్రయిస్తున్న వ్యక్తి



మోమోస్ తిని ఆస్పత్రి పాలైన మహిళ

బంజారాహిల్స్: వారాంతపు సంతల్లో విక్రయిస్తున్న మోమోస్ ప్రజల పాలిట ప్రాణాంతకంగా మారుతున్నాయి. జీహెచ్ఎంసీ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణ లోపం ఫుడ్ సేఫ్టీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. తాజాగా బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని సింగాడిబస్తీకి చెందిన రేష్మా బేగం అనే మహిళ మోమోస్ తిని ఫుడ్‌పాయిజన్‌తో మృతి చెందగా, ఆమె ఇద్దరు పిల్లలు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలయ్యారు. బంజారాహిల్స్ రోడ్‌నెం. 14లోని నందినగర్ ఆంజనేయస్వామి టెంపుల్ పూజారి విక్రమ్‌తో పాటు ఇదే ప్రాంతానికి చెందిన 25 మంది మోమోస్ తిని కడుపు నొప్పితో బాధపడుతూ ఆస్పత్రుల్లో చేరారు. బాధితులు ఫస్ట్‌లాన్సర్‌లోని రిలీఫ్ ఆస్పత్రితో పాటు అపోలో ఆస్పత్రి, శ్రీ నగర్ కాలనీలోని తస్వీర్ ఆస్పత్రి, గౌరీ శంకర్ కాలనీలోని స్వాతి ఆస్పత్రి, కాబా ఆస్పత్రి, ద్వారకామాయి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరందరూ గత శుక్ర, శనివారాల్లో జరిగిన సంతల్లో రోడ్డు పక్కన విక్రయించిన మోమోస్ తినడం వల్లనే ఫుడ్‌పాయిజనింగ్‌కు గురైనట్లు బాధితులు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పరిశుభ్రత కొరవడడంతో ఆహార పదార్థాలు కలుషితమై ఈ సమస్య తలెత్తినట్లుగా పోలీసుల దర్యాప్తులో తేలింది. రోడ్ల పక్కన తోపుడుబండ్లపై విక్రయిస్తున్న ఆహార పదార్థాలపై నిఘాలేకపోవడంతో ఇష్టానుసారంగా విక్రయాలు జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

మోమోస్ విక్రేతల అరెస్ట్

కలుషిత ఆహార పదార్థాలతో తయారు చేసిన మోమోస్ విక్రయించి పలువురి అనారోగ్యానికి కారకులైన వ్యక్తులపై బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. నందినగర్‌కు చెందిన జాకాటి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు పోలీసులు ఫుడ్‌పాయిజనింగ్‌కు కారణమైన మోమోస్ విక్రేతలు ఎండీ అర్మాన్, ఎండీ రజీక్‌లపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఈ నెల 25న తన కుమార్తెలు, శివానీ, శ్వేత, అల్లుడు ఆంటోని నందినగర్‌లోని ఢిల్లీ హాట్ మోమోస్‌లో మోమోస్ తిని ఇంటికి వచ్చారని, కొద్దిసేపటికే తీవ్ర కడుపు నొప్పి, వాంతులు విరేచనాలతో ఇబ్బంది పడుతుండడంతో అపోలో ఆస్పత్రికి తరలించామన్నారు. అదే ప్రాంతానికి చెందిన ప్రభాకర్, లావణ్య, వారి కుమారుడు రిత్విక్ కూడా ఫుడ్ పాయిజన్‌తో ఆస్పత్రి పాలయ్యారని ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



చింతల్‌బస్తీలో తనిఖీలు చేస్తున్న అధికారులు

ఫుడ్ శాంపిల్స్ సేకరణ

బంజారాహిల్స్‌లో మోమోస్ తిని ఫుడ్ పాయిజన్‌తో ఓ మహిళ మృతి చెందడంతో అప్రమత్తమైన జీహెచ్ఎంసీ అధికారులు చింతల్ బస్తీలోని మోమోస్ తయారు చేసే ప్రధాన కేంద్రం వావ్ హాట్ మోమోస్‌తో పాటు ఢిల్లీ హాట్ మోమోస్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఫుడ్ శాంపిల్స్‌ను సేకరించి రాష్ట్ర ఫుడ్ ల్యాబరేటరీకి పంపించారు. మోమోస్ తయారీ కేంద్రానికి ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ లేదని, ఎటువంటి అనుమతులూ లేకుండా ఈ వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించారు. సదరు కేంద్రాన్ని సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

బైటక్ పేరుతో పేకాట శిబిరాలు!

- మూడు కమిషనరేట్లలోని ఐదు ప్రాంతాల్లో నిర్వహణ
- కొత్త కమిషనరేట్‌కు కూతవేటు దూరంలో ఓ డెన్
- అర్ధరాత్రి ఒంటి గంట నుంచి తెల్లవారుజాము వరకు
- వ్యవస్థీకృతంగా నిర్వహిస్తున్న ఓ రౌడీషీటర్ బంధువు
- కొందరు పోలీసులు ఇతడితో మిలాఖత్ అయినట్లు సందేహాలు



సాక్షి, సిటీబ్యూరో: నిర్మానుష్య ప్రాంతాలు... కోడ్ వర్డ్స్... అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము దాకా వ్యవహారం... డెన్ చుట్టూ గస్తీ నిర్వహించే యువకులు... రోజుకు రూ.లక్షల్లో లావాదేవీలు... నగరానికి చెందిన ఓ ఘరానా రౌడీషీటర్ సమీప బంధువు నేతృత్వంలో సాగుతున్న పేకాట శిబిరాల కథ ఇది. రాజధానిలోని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలోని ఐదు ప్రాంతాల్లో నిర్ణీత రోజులు, సమయాల్లో ఈ వ్యవహారాలు నడుస్తున్నాయి. బంజారాహిల్స్‌లోని రోడ్ నం.12లో ఉన్న కొత్త కమిషనరేట్‌కు కూతవేటు దూరంలోనూ ఓ 'బ్రాంచ్' ఉండటం గమనార్హం. కొందరు పోలీసులతో మిలాఖత్ అయిన నేపథ్యంలో ఈ దందా జోరుగా నడుస్తోందని తెలుస్తోంది.

కోడ్ వర్డ్స్‌తో సాగుతున్న దందా...

నగరానికి చెందిన ఓ రౌడీషీటర్ నేతృత్వంలోని గ్యాంగ్ ఈ పేకాట శిబిరాలను నిర్వహిస్తోంది. మూడు ముక్కలాట, అందర్-బాహర్ ఆడించే వీటికి వాళ్లు పెట్టిన పేరు బైటక్. తమకు ఎలాంటి ఆటంకం లేకుండా శిబిరం నిర్వహణ చేయడానికి ఈ గ్యాంగ్ నగరంలోని ఐదు ప్రాంతాలను ఎంచుకుంది. నిర్మానుష్యంగా చెట్లు, పొదలతో ఉన్న వాటినే ఎంపిక చేసుకుంది. బంజారాహిల్స్‌లోని తెలంగాణ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఎదురుగా ఉన్న భవనాల వెనుక ఖాళీ ప్రదేశం, ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణం, రాజేంద్రనగర్, మీర్‌పేట శివార్లలోని నిర్మానుష్య ప్రాంతాల్లో బైటక్‌లు నిర్వహిస్తోంది. వీటికి చర్చ్, క్యాంపస్, వర్సిటీ... ఇలా కోడ్ నేమ్స్ పెట్టుకున్నారు. వీటిలో ఎక్కడైనా, ఎప్పుడైనా పోలీసుల దాడి జరిగితే... తాత్కాలికంగా ఈ శిబిరాలను నాంపల్లిలో ఉన్న కొన్ని లాడ్జిల్లో నిర్వహిస్తోంది. దీనికి స్టేషన్ అని కోడ్ పెట్టుకున్నారు.

వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారం...

ఈ శిబిరాలకు వచ్చి పేకాట ఆడేవారిలో సామాన్యుల నుంచి సంపన్నుల వరకు ఉంటున్నారు. నిర్వాహకులు ఈ జూదప్రియులతో కొన్ని వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేశారు. ఏ రోజు, ఏ ప్రాంతంలో బైటక్ జరుగుతుంది అనేది వీటి ద్వారానే ప్రచారం చేస్తున్నారు. ఆ రోజు అర్ధరాత్రి ఒంటి గంటల నుంచి మొదలయ్యే శిబిరం మరుసటి రోజు తెల్లవారుజామున 5 గంటల వరకు జరుగుతుంది. ఎక్కువగా వీకెండ్స్‌తో పాటు సెలవు దినాల్లో బైటక్స్ నడుస్తున్నాయి. వీటికి హాజరయ్యే జూదరులు తమ వాహనాలను చుట్టు పక్కల ఉన్న రోడ్లతో పాటు గల్లీల్లో పార్క్ చేసుకుంటున్నారు. ఓ ప్రాంతంలో భారీ పార్కింగ్‌తో హడావుడి ఉండకూడదని, వీటిని చూసే వారు స్థానికులకు చెందినవిగా భావించాలని ఇలా చేస్తున్నారు. ఈ వాహనాలతో పాటు బైటక్ జరుగుతున్న ప్రాంతం చుట్టూ నిర్వాహకులు ఏర్పాటు చేసిన ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ గస్తీ నిర్వహిస్తుంటారు. పోలీసుల కదలికల్ని గుర్తించేలా, 'కస్టమర్ల' వాహనాల భద్రతల కోసం ఇలా చేస్తుంటారు.

అన్ని విభాగాల్లో కొందరితో మిలాఖత్...

కొన్ని నెలలుగా చెట్ల కింద, పొదల్లో, దీపాలతో పాటు క్యాండిల్స్ వెలుగులో సాగుతున్న ఈ బైటక్‌ల్లో భారీ మొత్తమే చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. ఒక్కో బైటక్‌లో రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు 'టర్నోవర్' జరుగుతోంది. ఈ బైటక్‌లో గెలిచిన వ్యక్తి తనకు వచ్చిన మొత్తంలో నుంచి 15 శాతం నిర్వాహకులకు ఇవ్వాల్సి ఉంటుంది. ఇటీవల సైబరాబాద్ అధికారులు రాజేంద్రనగర్‌లోని ఓ బైటక్‌పై దాడి చేశారు. ఇలా కొన్ని నెలలుగా ఈ పేకాట శిబిరాలు నిర్విరామంగా జరగడం వెనుక కొందరు పోలీసుల సహకారం ఉన్నట్లు తెలుస్తోంది. స్థానిక అధికారులతో పాటు ప్రత్యేక విభాగాలకు చెందిన వాళ్లు మిలాఖత్ అవడంతోనే వీరి దందా ఈ స్థాయిలో జరుగుతోందని సమాచారం. ఏదైనా పోలీసు విభాగం దాడి చేయాలని ప్రయత్నించినా... ఆ సమాచారం సైతం ముందే బైటక్ నిర్వాహకులకు లీక్ అవుతోందని తెలిసింది. ఇంత వ్యవస్థీకృతంగా సాగుతున్న ఈ దందాపై ఉన్నతాధికారులు దృష్టి పెడితేనే అడ్డుకట్టపడే అవకాశం ఉంది.

యువకుడి దారుణ హత్య

బాలానగర్: ఓ యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన సోమవారం బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నరసింహ రాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సోమవారం ఉదయం ఐడీపీఎల్ అటవీ ప్రాంతంలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడిని పంచశీల కాలనీకి చెందిన రాజ్‌కుమార్ (21)గా గుర్తించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాజ్‌కుమార్ రెండేళ్లుగా పంచశీల కాలనీలో నివాసం ఉంటూ లేత్ మిషన్ వర్కర్‌గా పని చేసేవాడు. అతడి గొంతు, వీపుపై గాయాలు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అతడిని గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి ఉండవచ్చునని భావిస్తున్నారు. మృతుడి బంధువు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ట్రాలీ మీదపడి వ్యక్తి మృతి



సురేష్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

నిజాంపేట్: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ట్రాలీ తలపై పడడంతో ట్రాక్టర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, ముదిగొండ గ్రామానికి చెందిన సురేష్(40) ప్రగతినగర్‌లో ఉంటూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో చెత్త సేకరించే ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం అతను ప్రగతినగర్ నుంచి బాచుపల్లిలోని డంపింగ్ యార్డుకు చెత్తను తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో ట్రాక్టర్ ట్రాలీ కింద ఉన్న అట్టలు తీసేందుకు ట్రాలీ జాకీ పైకి లేపాడు. సురేష్ ట్రాలీ కింద అట్టలు తీస్తుండగా ట్రాలీ సురేష్ మెడపై పడటంతో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పెండింగ్ పనులు వేగవంతం చేయాలి

- జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజినీర్ల సమీక్ష సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ విశ్వ నగరంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో వివిధ విభాగాల్లో జరుగుతున్న పనుల్లో అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం ఆయన జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజినీర్ల సమీక్ష సమావేశంలో జీహెచ్ఎంసీ ఎస్ఆర్డీపీ, ఎస్ఎన్డీపీ ప్రాజెక్టుల్లో భాగంగా చేపట్టిన ఫ్లై ఓవర్లు, నాలాల నిర్మాణాలపై జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజనీర్లు ఇతర ఉన్నతాధికారులతో సచివాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించడానికి ఎస్ఆర్డీపీ లో భాగంగా 48 ఫ్లై ఓవర్లను నిర్మాణం చేపట్టామన్నారు. ఎస్ఆర్డీపీ వర్క్స్‌లో భాగంగా జీహెచ్ఎంసీకి సంబంధించి 42 పనులు ఉండగా ఇప్పటికే 36 పనులు పూర్తయ్యాయని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఎస్ హెచ్‌లో భాగంగా చేపట్టిన అంబర్ పేట ఫ్లై ఓవర్, ఉప్పల్ - నారపల్లి ఫ్లైఓవర్ల నిర్మాణం వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. ఆరాంఘర్ శాస్త్రీపురం మధ్య నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ పనులను డిసెంబర్‌లోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వచ్చే వర్షాకాలంలోపు వాటర్ లాగింగ్ పాయింట్స్ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొత్త ఫ్లై ఓవర్లు, కొత్త నాలాలు అవసరమైన చోట ప్రతిపాదనలు సిద్ధం చేసి నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. సీఆర్ఎంపీ రోడ్లలో భాగంగా జీబ్రా క్రాసింగ్ లైన్ సైనేజ్ బోర్డులు ఇతర రోడ్డు మార్కింగ్‌ల పనులు పూర్తి చేసి, కొత్త రోడ్లపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రస్తుతం నగరంలో 141 వాటర్ లాగింగ్ పాయింట్స్ ద్వారా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో 50 స్ట్రక్చర్స్ నిర్మించాల్సి ఉన్నప్పటికీ మొదటి దశ చేపట్టిన రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ 18 ప్రాంతాల్లో 23 సంపుల పురోగతి పై ఆరా తీశారు. సమావేశంలో జీహెచ్ఎంసీ ఎస్ఆర్డీపీ ప్రాజెక్ట్ చీఫ్ ఇంజినీర్ దేవానంద్, ఎస్ఎన్డీపీ సీఈ కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో సెంట్రింగ్ కార్మికుడి మృతి

- మరొకరికి గాయాలు



రఘుపతి (ఫైల్)

మోతీనగర్: విద్యుదాఘాతంతో ఓ సెంట్రింగ్ కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందగా పాటు మరో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన తడాల రఘుపతి (34) నగరానికి వలసవచ్చి జగద్గిరిగుట్ట, ఏవిబి పురంలో ఉంటూ సెంట్రింగ్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఇతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సోమవారం అతను ధర్మారావు అనే వ్యక్తితో కలిసి శ్రీ వివేకానందనగర్‌లో ఓ ఇంటి నిర్మాణానికి సంబంధించి సెంట్రింగ్ పని నిమ్మిం ఇనప టేప్‌తో కొలతలు తీసుకుంటుండగా పైన ఉన్న విద్యుత్ హైటెన్షన్ వైర్లు తగలడంతో రఘుపతి అక్కడికక్కడే మృతి చెందాడు. ధర్మారావుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ధర్మారావును ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రఘుపతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కరెంటు కట్ చేశాడని..

విద్యుత్ లైన్‌మెన్‌ను చితకబాదిన మొబైల్ షాప్ నిర్వాహకులు



విద్యుత్ ఉద్యోగులను బెదిరిస్తున్న మొబైల్ షాప్ నిర్వాహకుడు

జియాగూడ: బిల్లు కట్ట లేదని కరెంటు కట్ చేసినందుకు విద్యుత్ లైన్‌మెన్‌పై మొబైల్‌షాప్ నిర్వాహకులు దాడి చేసిన సంఘటన కుల్సుంపురా పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సునీల్, కార్వాన్ అసిస్టెంట్ ఇంజినీర్ విజయ్ కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కార్వాన్ విద్యుత్ కార్యాలయం పరిధిలోని జియాగూడ లక్ష్మి నర్సింహ నగర్లోని శ్రీ భోలేనాథ్ మొబైల్ షాప్‌నకు సంబంధించి నాలుగు నెలల కరెంటు బిల్లు రూ. 4402 బకాయి ఉన్నారు. ఈ నేపథ్యంలో లైన్‌మెన్ శ్రీనివాస్ రావు సదరు షాప్ విద్యుత్ కనెక్షన్ కట్ చేసి వెళ్లాడు. దీంతో మొబైల్ షాప్ యజమాని రాహుల్ శర్మ విద్యుత్ కార్యాలయానికి వెళ్లి బిల్లు బకాయి మొత్తాన్ని చెల్లించాడు. అనంతరం కనెక్షన్ పునరుద్ధరించేందుకు వచ్చిన లైన్‌మెన్ శ్రీనివాస్ రావుతో పాటు మరో ముగ్గురు షాప్ వెనుక ఉన్న మీటర్‌కు కనెక్షన్ ఇచ్చి తిరిగి వెళుతుండగా శ్రీనివాస్ రావును దుకాణంలోకి లాక్కెళ్లిన నిర్వాహకులు అతడిని చితకబాదారు. దీంతో బయట ఉన్న వారు ఏఈ విజయ్ కుమార్‌కు సమాచారం అందించడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్ రావును చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ విక్రయిస్తున్న బీటెక్ విద్యార్థి అరెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: డ్రగ్స్ విక్రయిస్తున్న బీటెక్ విద్యార్థిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ అంజిరెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నెల్లూరులో బీటెక్ పూర్తి చేసిన కట్టమంచి జాన్ అనే యువకుడు జేఎన్‌టీయూలో సాఫ్ట్‌వేర్ కోర్సులు నేర్చుకుంటున్నాడు. సోమవారం అతను వనస్థలిపురం సుష్మా థియేటర్ వద్ద డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 7 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్,బైక్, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు గ్రాము ఎండీఎంఏను రూ.2500 చొప్పున తీసుకువచ్చి రూ.5000 గ్రాము చొప్పున విక్రయిస్తున్నట్లు అధికారుల విచారణలో వెల్లడైంది.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మియాపూర్: నిర్మాణంలో ఉన్న భవనంలో కరెంట్‌షాక్ తగలడంతో మూడవ అంతస్తు నుండి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ కె. క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగాం జిల్లా తరిగోపులకు చెందిన శివరాత్రి యాదగిరి(45) బతుకుదెరువు కోసం 7 సంవత్సరాల క్రిందట నగరానికి వచ్చి జగద్గిరిగుట్టలో కుటుంబంతో నివాసముంటున్నాడు. భవన నిర్మాణాల్లో క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో కరెంట్ షాక్ తగలడంతో మూడవ అంతస్తు పై నుండి కిందఉన్న ఇటుకలపై పడడంతో తీవ్ర గాయాలై యాదగిరి అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న మృతుడి కుటుంబ సభ్యులు భవనం వద్దకు చేరుకుని తమకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఎఫ్ఎంసీ అభివృద్ధికి ప్రత్యేక కృషి



మాట్లాడుతున్న శేష్ నారాయణ్

గన్‌ఫౌండ్రీ: ఫతేమైదాన్ క్లబ్ (ఎఫ్ఎంసీ)ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తానని క్లబ్ నూతన చైర్మన్ శేష్ నారాయణ్ అన్నారు. అందరి సహకారంతో క్లబ్ సభ్యులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎఫ్ఎంసీ క్లబ్ ఎన్నికల్లో హౌస్ సబ్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన టి.శేషునారాయణ్, నూతన కమిటీ సభ్యులను సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శేషు నారాయణ్ మాట్లాడుతూ సామాజిక, సాంస్కృతిక, క్రీడలు ఇతర రంగాల్లో క్లబ్ మెంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. నూతన కమిటీ చైర్మన్‌గా టి.శేషునారాయణ్, సభ్యులుగా కె.సునిత రెడ్డి, ఎస్ఆర్.విజయరాజ్, ఎస్.వెంకట్‌ప్రసాద్ రెడ్డి, జి.శ్రీనివాస్ గౌడ్, హేమంత్ ఎన్నికయ్యారు.

సృజనాత్మకతతో ఉపాధి అవకాశాలు

మొయినాబాద్: ఇంజనీరింగ్ చదివే విద్యార్థులు చదువుతోపాటు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని సంగారెడ్డిలోని సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నర్సింహ సూచించారు. మండల పరిధిలోని కేజీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్-2024ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విద్యార్థులు ఇలాంటి ఫెస్ట్‌లతో ఎంతో విజ్ఞానం సంపాదించుకుంటారన్నారు. కొత్త ఆవిష్కరణలు, నూతన సాంకేతికతలను తెలుసుకుంటారన్నారు. టెక్నికల్ ఫెస్ట్‌లో విద్యార్థుల కోసం ఎనిమిది విభిన్న క్లబ్‌లలో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీటి ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక వెలికి వస్తుందన్నారు. దీంతో ఉపాధి అవకాశాలు మెరుగు అవుతాయన్నారు. ఈ ఫెస్ట్‌లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డెటా సైన్స్, యాప్ అండ్ వెబ్ డెవలప్‌మెంట్, ఐఓటీ, బ్లాక్ చైన్, గ్రీన్ కన్‌స్ట్రక్షన్ క్లబ్(జీసీసీ), త్రీడీ ప్రింటింగ్ క్లబ్, ఎలక్ట్రిక్ వెహికల్స్ తదితర వాటిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీటితోపాటు వినోదం కోసం జెంగా, వీఆర్ క్రికెట్, వైర్‌లూప్, మైండ్ కార్డ్‌లు తదితర అనేక సరదా కార్యక్రమాలు విద్యార్థులను అలరించబోతున్నాయన్నారు. ఈ ఫెస్ట్‌లో రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి దాదాపు 50కి పైగా కళాశాలల విద్యార్థులు పాల్గొంటారన్నారు. రెండు రోజులపాటు ఈ ఫెస్ట్ కొనసాగుతుందన్నారు.

లిడ్‌క్యాప్‌ను పునరుద్ధరించి, నిధులు కేటాయించాలి

తెలంగాణ మాదిగ చర్మకారుల రాష్ట్ర సంఘాల జేఏసీ



సమావేశంలో మాట్లాడుతున్న కూసపాటి శ్రీనివాస్

కాచిగూడ: రాష్ట్రంలో మూతపడిన లిడ్ క్యాప్‌ను పునరుద్ధరించి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, రూ. 2 వేల కోట్ల నిధులు కేటాయించాలని తెలంగాణ మాదిగ చర్మకారుల రాష్ట్ర సంఘాల జేఏసీ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జేఏసీ కన్వీనర్ కూసపాటి శ్రీనివాస్, ఎంఆర్‌సీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి సతీష్ మాదిగ, చింతస్వామి, మేరి మాదిగ, జన్ను జకారియా మాట్లాడుతూ లిడ్ క్యాప్‌ను పునరుద్ధరిస్తే మాదిగ, మాదిగ ఉపకులాలు చెందిన లక్ష మందికి ఉపాధి కల్పిస్తుందన్నారు. లిడ్ క్యాప్ పాలక మండలిని ఏర్పాటు చేయాలని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీలో చర్మకారుల కోర్సును ప్రవేశపెట్టి మాదిగలకే పూర్తిస్థాయి సీట్లు కేటాయించాలన్నారు. గచ్చిబౌలిలోని లిడ్‌క్యాప్‌ను సీఎం రేవంత్‌రెడ్డి సందర్శిస్తే వాస్తవాలు తెలుస్తాయన్నారు. నిజామాబాద్, నాగర్ కర్నూల్, ఖమ్మం, జనగాం, మంచిర్యాల, నల్గొండ, మెదక్, కరీంనగర్ జిల్లాల్లో ఉన్న లిడ్ క్యాప్ ఆస్తులను కబ్జా నుంచి కాపాడాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు మాదిగ ఎమ్మెల్యేలతో చర్చలు జరిపి లిడ్‌క్యాప్ లెదర్ పరిశ్రమను పునరుద్ధరించేలా తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు విజయ, ఆర్య, సంగీత, రాజలింగం, రామూర్తి, పాలడుగు శ్రీనివాస్, ఏ.శివ, ఎస్.లింగన్న, కోకల కిరణ్‌మాదిగ, నర్సింగ్‌రావు, రాములు తదితరులు పాల్గొన్నారు.

సదర్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించడం హర్షణీయం

సీఎం రేవంత్‌రెడ్డికి యాదవుల పక్షాన ధన్యవాదాలు : మధుకర్ యాదవ్



ఖైరతాబాద్: దశాబ్దాలుగా యాదవులు ఎంతో భక్తిశ్రద్ధలతో వైభవంగా జరుపుకునే సదర్ ఉత్సవాలను ఎట్టకేలకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర పండుగగా గుర్తించడం పట్ల యాదవులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలంగాణ ప్రదేశ్ కమిటీ కార్యదర్శి మంశారపు మధుకర్ యాదవ్ తెలిపారు. సోమవారం ఖైరతాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మధుకర్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనముల రేవంత్‌రెడ్డి ఈ దీపావళి సందర్భంగా యాదవ సోదరులు, సోదరీమణులకు సదర్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించడంతో పాటు రాష్ట్ర సాంస్కృతిక శాఖ నుంచి నిధులు కేటాయించడం పట్ల యాదవుల పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఎన్నో దశాబ్దాలుగా సదర్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా గుర్తించాలని వస్తున్న డిమాండ్‌ను ముందుకు తీసుకువెళ్లిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు, ప్రత్యేక చొరవ చూపిన మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు ధన్యవాదాలు తెలిపారు. యాదవులు పెద్దన్న పాత్ర పోషిస్తూ ముందుకు సాగుతారని మాపై నమ్మకం ఉంచిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటను నిలబెడుతూ రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు యాదవుల పక్షాన తెలంగాణ సంస్కృతికి నీరాజనాలు తెలుపుతున్నామన్నారు.

ఉత్సాహంగా స్టూడెంట్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్







ఫిలింనగర్: జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో విద్యార్థుల్లో వ్యాపార నైపుణ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో స్టూడెంట్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ ఫెస్ట్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో సృజనాత్మకత, కొత్త ఆవిష్కరణల దిశగా వారిని తీర్చిదిద్దేందుకు వివిధ రకాల కార్యక్రమాలకు రూపకల్పన చేసి అమలు చేశారు. ప్రముఖ వ్యాపారవేత్త రతన్‌టాటాను స్ఫూర్తిగా తీసుకుని వ్యాపార రంగంలో శిఖరాగ్రానికి చేరుకోవాలని ఈ సందర్భంగా పలువురు సూచించారు. సేవాతత్పరతను జోడించడం ద్వారా సుస్థిర స్థానాన్ని సంపాదించుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా సృజనాత్మక ఆలోచనలు, ఐడియాలపై పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీలకు నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ఆలోచనలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీలతానాయర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రియేటివిటీని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. ముఖ్యంగా విద్యార్థుల ఆలోచనలను పరస్పరం పంచుకునేందుకు ఇదో మంచి వేదిక అన్నారు. భవిష్యత్తులో ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా ఎదిగేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగం ఎంతో ఉంటుందన్నారు.

అంబేడ్కర్ వర్సిటీలో కొనసాగుతున్న నిరసనలు



నిరసన తెలుపుతున్న అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగులు

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పదెకరాల స్థలం జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చరల్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి ఏమాత్రం సరిపోదని జేఎన్ఏఎఫ్ఏయూ పూర్వ విద్యార్థి దేవకీనందన్ పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్సిటీ ఐక్యకార్యాచరణ సమితి సభ్యులు లంచ్ అవర్ డెమోన్‌స్ట్రేషన్‌లో భాగంగా నాలుగో రోజు సోమవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసనలో జేఎన్ఎఫ్ఏయూ పూర్వ విద్యార్థులు తమ ఆలోచనలను తెలియజేశారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ వడ్డాణం శ్రీనివాస్, చైర్‌పర్సన్ పల్లవీ కాబ్డే, అకాడమిక్ డైరెక్టర్ పుష్పా చక్రపాణి, అవినాష్, కిషోర్, జేఏసీ నేతలు అధ్యాపక, అధ్యాపకేతర, అడ్మినిస్ట్రేటివ్, టెక్నికల్ అసోసియేషన్, టైం స్కేల్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు విశ్వవిద్యాలయంలోని అకాడమిక్ భవనం ముందు నిరసన తెలిపారు.

జాతీయ స్థాయి పోటీల్లో రీజెన్సీ కాలేజీ విద్యార్థుల ప్రతిభ



పతకాలు అందుకుంటున్న రీజెన్సీ విద్యార్థులు

బంజారాహిల్స్: జాతీయ స్థాయిలో శాస్త్ర నైపుణ్యంపై నిర్వహించిన పోటీల్లో బంజారాహిల్స్‌లోని రీజెన్సీ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీ విద్యార్థులు ప్రతిభను కనబర్చారు. ఢిల్లీలో బనార్సిదాస్ చాందివాల హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీ నిర్వహించిన పోటీల్లో 25 రాష్ట్రాలకు చెందిన హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజీల విద్యార్థులు వివిధ అంశాల్లో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. మూడు రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో రీజెన్సీ కాలేజీ విద్యార్థులు నాలుగు బంగారు, నాలుగు వెండి పతకాలతో ఓవరాల్ చాంపియన్‌గా నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ కుమార్‌రెడ్డి తెలిపారు. బంగారు పతకాలు సాధించిన వారిలో శివసాయి జె. అరవింద్ జోడి, ఎస్. కార్తీక్, నందకుమార్, షఫీ, జె. అరవింద్ ఉన్నారు. సిల్వర్ మెడల్ సాధించిన వారిలో ఎస్‌కార్తీక్- షఫీ, జె. అరవింద్- కిరణ్ జైస్, శివసాయి-కిరణ్ జైస్, సాత్విక్-కిరణ్ జైస్ జోడీలు ఉన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో నగరానికి గుర్తింపు తెచ్చేలా తమ విద్యార్థులు ప్రతిభచాటడం ఎంతో ఆనందంగా ఉందని ఈ సందర్భంగా రమేష్ కుమార్‌రెడ్డి తెలిపారు.

నేత్రపర్వంగా శ్రీవారి పవిత్రోత్సవాలు





స్నపన తిరుమంజన వేడుకలు నిర్వహిస్తున్న అర్చకులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ టీటీడీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారికి నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం ఆలయంలో యాగశాల ప్రవేశంతో పాటు విశేష ద్రవ్యాలతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ ఏడాది పొడవునా నిత్య కైంకర్యాలలో భాగంగా భక్తులు, అర్చకులు, ఆచార్యులు, యజమానులు నిర్వహించిన పూజాదికాల్లో జరిగే దోషాల్లో భాగంగా ప్రాయశ్చిత్తంగా ఈ పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరుమలలో కూడా ఇదే విధంగా నిర్వహిస్తారని అన్నారు. పూజల్లో భాగంగా ఆలయంలో స్వామివారికి స్నపన తిరుమంజన వేడుకలు ఘనంగా నిర్వహించారు. యజమానులకు, ఆచార్యులకు, రుత్వికులకు కంకణదారణ కార్యక్రమం నిర్వహించారు. పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.



మోమోస్ బాధితులకు పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న మన్నె గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్ కవిత

వెంకటేశ్వరకాలనీ: వెంకటేశ్వరకాలనీ డివిజన్ నందినగర్‌లో మోమోస్ తిని మహిళ మృతి చెందడంతో పాటు 20 మంది అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్ కవితారెడ్డిలు హాస్పిటల్‌కు వెళ్లి బాధితులను పరామర్శించి బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మోమోస్ దుకాణదారుల మీద బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

ఓలా డ్రైవర్ నిర్లక్ష్యంతో మహిళకు గాయాలు

వెంగళరావునగర్: ఓలా డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా మహిళకు గాయాలైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... నిజామాబాద్ జిల్లాకు చెందిన యాకూబీ ఈనెల 27వ తేదీన చార్మినార్ సమీపంలో ఉంటున్న తన పెద్ద కుమార్తె ఇంటి నుంచి మోతీనగర్‌లోని తన మరో అల్లుడు పి.రవి ఇంటికి ఓలా ఆటోలో బయలుదేరింది. యూసుఫ్‌గూడ బస్తీ వద్దకు రాగానే ఓలా ఆటోను డ్రైవర్ డి.రాము నిర్లక్ష్యంగా నడపడం వల్ల యాకూబీ స్వల్ప గాయాలయ్యాయి. ఆమె విషయాన్ని తన అల్లుడికి తెలియజేసింది. దీంతో రవి ఆమెను ఆసుపత్రికి తరలించిన అనంతరం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని ఫార్మసిస్ట్‌కు గాయాలు

వెంగళరావునగర్: రోడ్డు దాటుతున్న ఫార్మసిస్ట్‌ను కారు ఢీకొనడంతో గాయాలైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... సిద్దిపేట ప్రాంతానికి చెందిన ఎం.మంజుల మధురానగర్ హాస్టల్‌లో ఉంటూ బంజారాహిల్స్‌లోని ప్రైవేట్ హాస్పిటల్‌లో ఫార్మసిస్ట్‌గా విధులు నిర్వహిస్తుంది. ఆదివారం సాయంత్రం ఆమె విధులకు వెళ్ళడానికి మైత్రీవనం వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఆమెను ఢీకొట్టింది. దీంతో ఆమెకు గాయాలయ్యాయి. క్షతగాత్రురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌టీసీ బస్సు ఢీకొని కారు ధ్వంసం

వెంగళరావునగర్: ఆర్‌టీసీ బస్సు ఢీకొని కారు ధ్వంసం అయిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం... అత్తాపూర్ ప్రాంతానికి చెందిన ఆర్. సురేంద్రవర్మ ఆదివారం రాత్రి మైత్రీవనం మీదుగా యూసుఫ్‌గూడ బస్తీకి వచ్చి రత్నదీప్ సమీపంలో తన కారును నిలిపివేశాడు. ఈ సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆర్‌టీసీ బస్సు (టీజీ 10 టి 1470) ఆగి ఉన్న కారును ఢీకొంది. ఈ సంఘటనలో కారు ముందు, వెనుక భాగాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరో నూతన రాజకీయ పార్టీ ఆవిర్భావం



మాట్లాడుతున్న జిలుకర రవికుమార్

కాచిగూడ: తెలంగాణ ప్రజారాజ్యం పేరుతో రాష్ట్రంలో మరో నూతన రాజకీయ పార్టీ ఆవిర్భావం జరిగింది. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ వేదికగా సోమవారం పార్టీ అధ్యక్షుడు జిలుకర రవికుమార్ పార్టీ అవిర్భావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా తమ పార్టీ అవతరించబోతుందని స్పష్టం చేశారు. వివిధ పార్టీల నేతలు కొందరు ప్రజలను ప్రలోభాలకు గురిచేస్తూ అధికారం రావడం కోసం ఎంతకైనా దిగజారుతున్నారని, తమ పార్టీ వాటికి విరుద్ధంగా ఉంటుందన్నారు. యువత రాజకీయాల వైపు రాణించేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చి నేటికి హామీల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేలా తమ పార్టీ తరపున రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామన్నారు. నవంబర్ 2వ వారంలో హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఎల్‌బీ స్టేడియంలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి తమ పార్టీ విధి విధానాలను ప్రకటిస్తామని వెల్లడించారు. తప్పుడు హామీలతో కాలం వెళ్లదీస్తున్న పాలకులకు ప్రజలు తగిన గుణపాఠవ చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో దాసరి శ్యామ్‌రావు, సోమయ్య, బి.రవికుమార్, నరేందర్, రత్నరాజ్, జి.శైలేష్, బంగారి రమేష్, జ్ఞానేందర్ తదితరులు పాల్గొన్నారు.

మూసీ నిర్వాసితులకు ఆప్ పార్టీ అండ

ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ కన్వీనర్ దిడ్డి సుధాకర్



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

పంజగుట్ట: మూసీ సుందరీకరణ కోసం లక్ష 50 వేల కోట్లు ఎక్కడ నుంచి తెస్తారు?, ఎలా ఖర్చుపెడతారు?, ఎలా సుందరీకరిస్తారు? అనే ప్రతీ విషయం ప్రజలముందు బహిర్గతం చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. మూసీ నిర్వాసితులకు శాశ్వత పునరావాసం కలిపించాకే కూల్చివేతలు ప్రారంభించాలని ఆయన కోరారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆప్ ఆధ్వర్యంలో మూసీ బాధితుల సమస్యలు పరిష్కరించేందుకు మూసీ బాధితులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ తాము మూసీ సుందరీకరణకు వ్యతిరేకం కాదని కానీ ఎన్నో దశాబ్దాలుగా అక్కడ నివసిస్తూ అక్కడే చిన్నా చితక పనులు చేసుకుంటున్న వారి సమస్యలు తీర్చకుండా ఒక్కసారిగా మీ ఇళ్ళు కూల్చేస్తాం అంటూ భయాందోళనకు గురిచేయడం సరికాదన్నారు. మూసీ బాధితులకు అండగా తాము ఉంటామని, వారికి తగిన పరిహారం, ఉపాధి, నివాసం ఇవ్వకుండా కూల్చేస్తామంటే సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో మూసీ బాధితుల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ అఫ్సా సలాం, వైస్ చైర్మన్ సుధారాణి, ఆప్ తెలంగాణ కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాములుగౌడ్, మహిళా వింగ్ అధ్యక్షురాలు హేమ జిల్లోజు, డాక్టర్స్ వింగ్ అధ్యక్షురాలు లక్ష్య నాయుడు, దివ్యాంగ కమిటీ అధ్యక్షులు రమేష్ దర్శనం, జావిద్, షరీఫ్, కాలిం బాబా, ఠాకూర్, రాకేష్ సింగ్, సోహైల్ తదితరులు పాల్గొన్నారు.

షౌకత్‌నగర్ యూపీహెచ్‌సీని తనిఖీ చేసిన అధికారులు





సాక్షి ఎఫెక్ట్

బంజారాహిల్స్: వైద్యులు లేరు..మందు బిల్లలు లేవు శీర్షికన సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించారు. హైదరాబాద్ జిల్లా ఏఎంహెచ్‌ఓతోపాటు సంబంధిత అధికారులు ఆసుపత్రిలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో షౌకత్‌నగర్ మెడికల్ ఆఫీసర్ వెళ్లిపోయారని దీంతో ఈ పోస్టు ఖాళీగా ఉందని వెల్లడించారు. ఆయన స్థానంలో సమీపంలోని యూపీహెచ్‌సీ నుంచి మరో మెడికల్ ఆఫీసర్‌ను వారానికి మూడుసార్లు వచ్చేవిధంగా నియమించడం జరిగిందన్నారు. స్టాఫ్ నర్సుతో పాటు ఇతర పారామెడికల్ సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. అన్ని ఆరోగ్య కార్యక్రమాలు సాఫీగా సంతృప్తికరంగా సాగుతున్నాయన్నారు. ప్రతీ రోజు 80 నుంచి 90 మంది రోగులను పరిశీలిస్తున్నామని తెలిపారు.

అల్లుకున్న ప్రమాదం!

బంజారాహిల్స్ రోడ్డు-14 నందినగర్‌లో ఓ ట్రాన్స్‌ఫార్మర్‌పై పచ్చని తీగలు పరదాల్లా అల్లుకొని కనవిందు చేస్తోంది. అయితే ఈ తీగలు ట్రాన్స్‌ఫార్మర్‌పై ఇలా అల్లుకోవడం వల్ల షార్ట్‌సర్క్యూట్‌తోపాటు వర్షకాలంలో తీగలకు విద్యుత్ సరఫరా అయి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌పై అల్లుకున్న తీగలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

- బంజారాహిల్స్



ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి

లిబర్టీ: ప్రభుత్వం విద్యార్థులకు వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తూ ఆదేశాలు జారీ చేయాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వి.కృష్ణస్వరూప్ కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు పడుతున్న బాధలు వర్ణనాతీతమని పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వేలాదిమంది విద్యార్థులు రోడ్ల మీదకు వచ్చి ఆందోళన చేస్తున్నారని ఆయన గుర్తు చేశారు. ఫీజు రియంబర్స్‌మెంట్ రాక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల కుటుంబాలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులను మానసికంగా వేధిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యను పూర్తి చేసి ఉన్నత విద్యకు వెళ్లాలంటే సంబంధిత సర్టిఫికెట్లు అవసరమని ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని ముడిపెట్టి వేధించడం ఎంత వరకు సమంజసమని కృష్ణ స్వరూప్ ప్రశ్నించారు. విద్యార్థులను వేధించకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరుతో సర్టిఫికెట్లును ఆపకూడదని హైకోర్టు సైతం స్పష్టం చేసిన న్యాయమూర్తుల తీర్పును విద్యాసంస్థల యాజమాన్యాలు లెక్క చేయడం లేదని అన్నారు. ఇపటికైనా ప్రభుత్వం వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

లీకేజీ సమస్యలను పరిష్కరించాలి



వెంకటేశ్వరనగర్ బస్తీలో పర్యటిస్తున్న కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని వెంకటేశ్వర నగర్ బస్తీలో మంచినీరు వచ్చే సమయంతో పాటు సాధారణ సమయాల్లో లీకేజీల కారణంగా మంచినీటిలో మురుగునీరు కలుస్తుందని తక్షణమే ఈ సమస్య పరిష్కరించాలని వెంకటేశ్వర కాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్న కవితారెడ్డి కోరారు. సోమవారం ఆమె బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా సమస్యను జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. అదే విధంగా బస్తీలో సీసీ రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నదని ఏఈ సతీష్‌కు ఇక్కడ సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు.

ప్రతి ఇంట్లో దీపావళి కాంతులు వెలగాలి



దీపావళి మిలాన్ కార్యక్రమంలో ఎస్.ఆదినారాయణ

లిబర్టీ: ప్రతి ఇంట్లో దీపావళి కాంతులు వెలగాలని ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఆదినారాయణ అన్నారు. దీ పావళి కాంతులతో ప్రతి వ్యక్తి జీవితంలో కొత్త వెలుగులు నిండాలని ఆయన ఆకాంక్షించారు. ఆదిలీలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దీపావళి మిలాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని కోరారు. అదే విధంగా తగు జాగ్రత్తలు పాటిస్తూ దీపావళి వేడుకలు చేసుకోవాలని సూచించారు.

మత సామరస్యానికి ప్రతీక గ్యార్మీ ఉత్సవాలు



గ్యార్మీ షరీఫ్ వేడుకల్లో విజయారెడ్డి

పంజగుట్ట: మతసామరస్యానికి ప్రతీక గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి అన్నారు. సోమవారం ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని ఎర్రమంజిల్ కాలనీ, పంచాయతీరాజ్ కార్యాలయం సమీపంలోని దర్గాలో గ్యార్మీ షరీఫ్ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అన్నదానం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఐ ఫోన్‌పై ఆశపడితే..

రూ. 28 వేలు పోయాయి

వెంగళరావునగర్: తక్కువ ధరకే ఐ ఫోన్ వస్తుందని ఆశపడి ఓ యువకుడు రూ. 28 వేలు పోగొట్టుకున్న సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... జవహర్‌నగర్‌కు చెందిన షేక్ రహమాన్ ఈనెల 26న ఐఫోన్ కోసం ఓఎల్‌ఎక్స్‌లో వెతకగా, అతనికి రూ.28 వేలకు ఐఫోన్ ఇస్తానని ప్రకటన కనిపించింది. దీంతో ప్రకటన పెట్టిన వ్యక్తి మణికంఠకు ఫోన్ చేసి వివరాలు అడిగాడు. తనకు ఫోన్ కావాలని రహమాన్ చెప్పగా తన సోదరుడు హరీశ్‌కు ఫోన్ ఇచ్చి పంపుతాను, నగదు ఇవ్వాలని చెప్పాడు. అనుకున్న ప్రకారం హరీశ్‌తో పాటుగా మరో వ్యక్తి వచ్చి రహమాన్‌కు ఐఫోన్ చూపించగా రహమాన్ రూ.20వేలు ఆన్‌లైన్‌లో, రూ.8 వేలు నగదుగా హరీశ్‌కు ఇచ్చాడు. అనంతరం హరీశ్ రహమాన్‌కు ఐఫోన్ ఇవ్వకుండా ఫోన్ కేబుల్ తీసుకువస్తానని తమ వెంట రావాలని సూచించారు. కొద్దిదూరం నడవగానే వారు కనిపించలేదు. రహమాన్ ఆ ఇరువురు యువకుల కోసం వెతికినా కనిపించలేదు. బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



తెలంగాణ రాష్ట్ర రెవన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేకంగా ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న సాఫ్ట్‌లైన్ అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ సత్య చన్నూరి.

నగరంలో నేడు

- ఏపీ కాలేజీ ఆఫ్ జర్నలిజం ఆధ్వర్యంలో సతీష్ చందర్ రచించిన సామాజిక వ్యంగ్య నవల 'బృహన్నలపేట' ఆవిష్కరణ సభ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని దొడ్డి కొమురయ్య హాలులో సాయంత్రం 5.30గంటలకు జరుగుతుంది.
- దీపావళి మహా మహోత్సవ్–2024 చార్మినార్‌లోని శ్రీభాగ్యలక్ష్మి మందిర్ వద్ద ధన్‌తేరస్ వేడుకలు కొనసాగుతాయి.
- బషీర్‌బాగ్ కింగ్‌కోఠి రోడ్డులోని భారతీయ విద్యా భవన్‌లో ఉదయం 9.30గంలకు రోజ్‌గార్ మేళా ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

భారతీయ మూలాల్లోనే సాంకేతికత

– ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.బాలకిష్టారెడ్డి



మాట్లాడుతున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.బాలకిష్టారెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ: సాంకేతికత(టెక్నాలజీ) కొత్తగా వచ్చిన పదం కాదని, భారతీయ మూలాల్లోనే ఉందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.బాలకిష్టారెడ్డి అన్నారు. ఓయూ క్యాంపస్ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో ఆధునిక మేథో విజ్ఞానం–భారతీయ జ్ఞాన వ్యవస్థలు అనే అంశంపై మూడు రోజుల జాతీయ సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఓయూ వీసీ ప్రొ.కుమార్ అధ్యక్షత వహించగా ప్రొ.బాలకిష్టారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నేటికీ అనేక సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారం దిశగా విజ్ఞానాన్ని వినియోగిస్తే భారత్‌కు ప్రపంచంలో తిరుగు ఉండదన్నారు. వీసీ ప్రొ.కుమార్ మాట్లాడుతూ విద్యా సామాజిక బాధ్యతగా అధ్యాపకుల పరిశోధనలు సమాజానికి ఉపయోగపడాలన్నారు. కాలం విసిరే సవాళ్లు కొత్త అవకాశాలను సృష్టిస్తాయన్నారు. బలమైన విద్యా వ్యవస్థను నిర్మించడంతో నైపుణ్యం గల విద్యావేత్తల ఆవశ్యకతను అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం) ప్రధాన కార్యదర్శి గుంత లక్ష్మణ్ చెప్పారు. సదస్సులో శ్రీవెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం వీసీ ప్రొ.రాణి సదాశివ మూర్తి ఐకేఎస్ త్వాతిక, శాస్త్రీయ ఔచిత్యాన్ని తన కీలకోపన్యాసంలో వివరించారు. ప్రొ.గంటా చక్రపాణి, ప్రొ.మృణాళిని, ప్రిన్సిపల్ ప్రొ.రవీందర్ మూర్తి, డాక్టర్ ధర్మతేజ పాల్గొన్నారు.

ఏజీ వర్సిటీ వీసీని కలిసిన విద్యా కమిషనర్



ఏజీవర్సిటీ: తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నూతన వీసీ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యను కలిశారు. విశ్వవిద్యాలయ భవనంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. రాష్ట్రంలోని విద్యారంగానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించినట్లు సమాచారం. విశ్వవిద్యాలయంలో అభివృద్ధి కోసం తీసుకుంటున్న విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్రంలో టెన్నిస్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



తెలంగాణ స్టేట్ టెన్నిస్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

లక్డీకాపూల్: రాష్ట్రంలో టెన్నిస్ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలంగాణ స్టేట్ టెన్నిస్ అసోసియేషన్(టీఎస్‌టీఏ) అధ్యక్షుడు కేఆర్ రామన్ తెలిపారు. ఎంజీ రోడ్‌లోని హోటల్ ఆత్రాని ఇంటర్నేషనల్‌లో వార్షిక సర్వసభ్య సమావేశం జరిగింది. అసోసియేషన్ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించింది. ఈ క్రమంలో అసోసియేషన్‌ను పారదర్శకంగా నిర్వహించే దిశగా చేపట్టాల్సిన అంశాలపై చర్చలు జరిగినట్లు టీఎస్‌టీఏ కార్యదర్శి వెల్మటి నారాయణ్‌దాస్ పేర్కొన్నారు.

జలమండలిలో 20 మంది ఇంజినీర్ల రిలీవ్

సాక్షి, సిటీబ్యూరో: జలమండలిలో మేనేజర్లుగా డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న సుమారు 20 మంది ఇంజినీర్ల సోమవారం రిలీవ్ అయ్యారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నేపథ్యంలో డిప్యూటేషన్ రద్దు కావడంతో తిరిగి మాతృ సంస్థకు బదిలీ అయ్యారు. మరో వారంలో మిగిలిన 15 మంది రిలీవ్ కానున్నారు.

రూ.2.78 కోట్ల విలువైన గంజాయి, డ్రగ్స్ దహనం



సాక్షి, సిటీబ్యూరో: ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హైదరాబాద్ డివిజన్‌లోని మూడు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన 79 కేసుల్లో పట్టుబడిన గంజాయి, డ్రగ్స్‌ను ఎక్సైజ్ పోలీసులు సోమవారం దహనం చేశారు. డ్రగ్ నిర్వీర్య కమిటీ చైర్మన్ కేఏబీ శాస్త్రి ఆదేశాల మేరకు ఏఈఎస్ సికింద్రాబాద్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రూ.2.78 కోట్ల విలువైన గంజాయి, డ్రగ్స్‌ను దహనం చేశారు. అమీర్‌పేట్, చార్మినార్, గోల్కొండ స్టేషన్ల పరిధిలో మోదైన 79 కేసుల్లో 135.8 కేజీల గంజాయి, 174.8 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్, 1939.5 కేజీల పాపిస్ట్రా, 2.1 గ్రాముల హష్ ఆయిల్, 300.6 గ్రాముల చరస్, 5.14గ్రాముల కొకైన్, 25 ఎల్ఎస్‌డీ బాస్టలు, 9.8 కిలోల అల్ప్రజోలం, 14 గ్రాముల ఎస్టోస్టి పీల్స్‌ను ఎక్సైజ్ అధికారులు దహనం చేశారు. మూడు పోలీస్ స్టేషన్ల సీఐలు, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

పేరుకే నిబంధనలు

- అడ్డగోలుగా బాణాసంచా దుకాణాలు
- ప్రమాదకరంగా ఏర్పాటు



సాక్షి, సిటీబ్యూరో: ఫొటోలో కనిపిస్తున్నవి బాణాసంచా విక్రయాల కోసం ఏర్పాటవుతున్న దుకాణాలు. ముషీరాబాద్ చౌరస్తా దగ్గరి పార్కు చుట్టూ ఏర్పాటవుతున్న ఈ దుకాణాలు ప్రధాన రహదారి ఫుట్‌పాత్‌లపైనే ఏర్పాటవుతున్నాయి. ఇక్కడ జనసంచారం ఎక్కువ. సికింద్రాబాద్, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, కవాడిగూడ, వారాసిగూడ తదితర ప్రాంతాలకు ప్రయాణాలు సాగించే వారు ఈ మార్గం మీదుగా వెళ్లాల్సిందే. అంతేకాదు.. వివిధ ప్రాంతాల నుంచి సచివాలయం.. దాని మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు కూడా ఇక్కడి నుంచే వెళ్తారు. ఈ చౌరస్తాలో ట్రాఫిక్ జామ్‌ను కంట్రోల్ చేయలేకే, ట్రాఫిక్ సిగ్నల్స్ సైతం తొలగించి గాంధీ ఆస్పత్రి దగ్గరగా యూటర్న్ ఏర్పాటు చేశారు. ఇంతటి రద్దీ ఉన్న ఈ ప్రాంతంలో ఏర్పాటవుతున్న ఈ దుకాణాలు చూస్తే.. జీహెచ్‌ఎంసీ కమిషనర్ పేర్కొన్న నిబంధనలు తుంగలో తొక్కినట్లే కనిపిస్తోంది. నిబంధనల మేరకు ఫుట్‌పాత్‌లు, జనావాసాలు, రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటు చేయరాదు. కాలనీలు, బస్తీలకు దూరంగా ఓపెన్ గ్రౌండ్‌లో / పెద్ద హాల్‌లో మాత్రమే తగిన ఫైర్‌సేఫ్టీతో ఏర్పాట్లు చేసుకోవాలి. కానీ.. వీటన్నింటికీ తిలోదకాలిచ్చి ఇవి ఏర్పాటవుతున్నాయి. ఇది నగరంలో ఏర్పాటవుతున్న బాణాసంచా దుకాణాలకు ఒక ఉదాహరణ. నగరంలోని పలు ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి. అయినా సంబంధిత స్థానిక అధికారులు పట్టించుకుంటున్న దాఖలాల్లేవు.

ఆన్‌లైన్ సదుపాయమేది?

వీటి ఏర్పాటుకు తాత్కాలిక ట్రేడ్ లైసెన్సు తీసుకోవాల్సిందేనని కమిషనర్ స్పష్టం చేశారు. అందుకు ఆన్‌లైన్ సదుపాయాన్ని కూడా వినియోగించుకోవచ్చని సూచించారు. కానీ.. జీహెచ్‌ఎంసీ వెబ్‌సైట్‌లో మాత్రం ఈ తాత్కాలిక లైసెన్సులకు సంబంధించిన లింకే లేదు. ఆన్‌లైన్‌లో సదుపాయం లేకపోవడాన్ని ప్రస్తావించగా, అధికారుల వద్ద సరైన సమాధానం లేదు. సిటిజెన్ సర్వీస్‌సెంటర్ల ద్వారా ట్రేడ్‌లైసెన్సుల ఫీజులు చెల్లిస్తున్నారని చెప్పారు. అక్కడ ఫీజులు చెల్లించినా, ఉన్న ప్రాంతాల్లో దుకాణాల ఏర్పాటుకు ఎలా అనుమతులిస్తున్నారో సంబంధిత అధికారులకే తెలియాలి. ఫైర్, పోలీసు విభాగాల అనుమతులు ఉన్నందునే జీహెచ్‌ఎంసీ బాణాసంచా దుకాణాల ఏర్పాటుకు అనుమతిస్తాం



దని దిగువస్థాయి సిబ్బంది చెబుతున్నారు. ఇప్పటికే బొగ్గులకుంటలోని ఓ బాణాసంచా దుకాణంలో భారీ అగ్నిప్రమాదం జరగడం తెలిసిందే. ఇక జనసంచారం అధికంగా ఉండే చౌరస్తాల్లో, నిర్విరామంగా వాహనాల రాకపోకలు సాగే ప్రాంతాల్లో, ఖాళీ ప్రదేశమే కనిపించని చోట్ల ఎలా అనుమతులిస్తున్నారో సంబంధిత అధికారులకే తెలియాలి.

ఏర్పాటులో అవినీతి?

బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేసేవారికి, జీహెచ్‌ఎంసీ స్థానిక అధికారులకు ఉండే లాలూచీ వల్లే రద్దీ ప్రాంతాల్లోనూ బాణాసంచా దుకాణాలు వెలుస్తున్నాయనే ఆరోపణలున్నాయి. అంతేకాదు.. హోల్‌సేల్‌గా విక్రయించే షాపులకు రిటైల్ ట్రేడ్ లైసెన్సు ఫీజు చెల్లించడం, ఒక్క లైసెన్సుతోనే రెండు, మూడు దుకాణాలు నిర్వహించడం వంటివి జరుగుతుంటాయని చెబుతున్నారు. వీటి విక్రయాల్లో అనుభవమున్న వారే ప్రతియేటా దుకాణాలు ఏర్పాటు చేస్తారని, వారికి అధికారులకు ఉండే లాలూచీ వల్లే భద్రత గురించి పట్టించుకోవడం లేదని వినిపిస్తోంది. ఊహించని ప్రమాదాలు జరిగితే అందుకు బాధ్యత వహించేదెవరు..?

లైఫ్ సైన్సెస్‌లో పెరుగుతున్న మహిళల ప్రాతినిధ్యం



- ఐకేపీ నాలెడ్జ్ పార్క్‌లో ఇంటర్నేషనల్ నాలెడ్జ్ మిలీనియం కాన్ఫరెన్స్
- ఈ వేదికగా ఆధునిక బయోమాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌కు ప్రతిపాదన
- ఐకేపీ స్థాపకులు నారాయణన్ వాఘుల్ జ్ఞాపకార్థం న్యూ అడ్మినిస్ట్రేటివ్ హబ్ ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: ఎస్ఎంఈ, వృద్ధి దశలోని కంపెనీలకు సహకరించడానికి క్లినికల్ మెటీరియల్స్ ఉత్పత్తి కోసం ఆధునిక బయోమాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌ను స్థాపించేందుకు నగరంలోని ఐకేపీ నాలెడ్జ్ పార్క్ ప్రతిపాదించింది. ఐకేపీ నాలెడ్జ్ పార్క్ ఆధ్వర్యంలోని ఇంటర్నేషనల్ నాలెడ్జ్ మిలీనియం కాన్ఫరెన్స్ 2024లో భాగంగా ఈ ప్రతిపాదన చేశారు. పరిశోధనా రంగంలో అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన జీనోమ్ వ్యాలీ వేదికగా.. దేశంలో లైఫ్ సైన్సెస్ కోసం మొదటి సైన్స్ పార్కుగా ఏర్పాటైన ఐకేపీ నాలెడ్జ్ పార్క్, 25 సంవత్సరాలుగా 'లారస్ ల్యాబ్స్, డుపాంట్, యూఎస్పీ, సాయి లైఫ్ సైన్సెస్'తో సహా లైఫ్ సైన్స్ రంగంలోని అనేక ప్రముఖ కంపెనీలకు వేదికగా మారి విశేష సేవలు అందిస్తోంది. ఈ 25 వసంతాల సందర్భంగా ఐకేపీ నాలెడ్జ్ పార్క్‌లో సోమవారం నిర్వహించిన ఇంటర్నేషనల్ నాలెడ్జ్ మిలీనియం కాన్ఫరెన్స్ 2024లో నూతనంగా నిర్మించిన నారాయణన్ వాఘుల్ బిల్డింగ్‌ను ప్రారంభించారు. ఐకేపీ స్థాపకులు దివంగత నారాయణన్ వాఘుల్ జ్ఞాపకార్థం న్యూఅడ్మినిస్ట్రేటివ్ హబ్‌ను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగానే సీఎక్స్ఓ కాన్‌క్లేవ్‌ను కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐకేపీ చైర్మన్, సీఈవో దీపన్వితా చటోపాధ్యాయ మాట్లాడుతూ.. భారత్‌లో లైఫ్ సైన్సెస్ అభివృద్ధి కోసం వాఘుల్ చేసిన కృషి అనిర్వచనీయమని తెలిపారు. సీఎక్స్ఓ కాన్‌క్లేవ్‌లో భాగంగా ఐకేపీ తదుపరి 25 సంవత్సరాల ప్రణాళికల గురించి చర్చించాం అన్నారు. కార్యక్రమంలో యూఎస్పీ వైస్ ప్రెసిడెంట్ మృణాల్ జయవంత్, బయోకాన్ గ్రూప్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు



అబిడ్స్: నగర పోలీస్ కమిషనర్ సీవీ.ఆనంద్‌ను ఇటీవల నూతనంగా ఎన్నికైన ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధి బృందం సోమవారం కలిశారు. ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు కె.నిరంజన్, కార్యదర్శి బి.సురేందర్‌రెడ్డి, కోశాధికారి డాక్టర్ ప్రభాశంకర్, సభ్యులు ధీరజ్‌కుమార్ జైస్వాల్ ఆయనను కలిసి జనవరి 1వ తేదీన ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ప్రారంభమయ్యే 84వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనశాలకు అనుమతి ఇవ్వాలని మెమోరాండం అందజేశారు. ప్రతి సంవత్సరం జనవరి 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 15వ తేదీ 46 రోజుల పాటు ఎగ్జిబిషన్ కొనసాగుతుందని వివరించారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల ఉత్పత్తులతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల ఉత్పత్తులు ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉంటాయని వారు తెలిపారు.

నేడు డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్స్ వెరిఫికేషన్

సాక్షి, సిటీబ్యూరో: డీఎస్సీ 2024–ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం ఉదయం 10 నుంచి నాంపల్లి ఎల్బీ స్టేడియం ఎదురుగా ఉన్న మోడల్ ఆలియా గవర్నమెంట్ ఉన్నత పాఠశాలలో సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి తెలిపారు. అభ్యర్థుల జాబితాను deebhyderabad.webnode.in లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అభ్యర్థులందరూ రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, అన్ని సర్టిఫికెట్లు ఒక సెట్, ఒరిజినల్, ఒక సెట్ జిరాక్స్(గెజిటెడ్ అటెస్టేషన్)తో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరు కావాలని కోరారు.

శక్తి, నైపుణ్యాన్ని కంపెనీకి అంకితం చేయాలి

రాయదుర్గం: సింగరేణి కాలరీస్ లాభాల్లో సాగాలంటే కార్మిక సంఘాలు కీలకపాత్ర పోషించాలని సింగరేణి కాలరీస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎం.బలరామ్ సూచించారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో సింగరేణి కాలరీస్‌లో పనిచేసే ట్రేడ్ యూనియన్ నాయకులకు సోమవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి కాలరీస్ సంస్థను లాభాల్లో కొనసాగించాల్సిన అవసరం ఉందని అన్నారు. సింగరేణి శ్రామికశక్తి నిబద్ధతతో పనిచేయడం, కార్మిక సంఘాలు కీలకంగా వ్యవహరించడం ఎంతో అవసరమన్నారు. కార్మికుల మధ్య ఐక్యత, అనుకూలతను పెంపొందించడం అవసరమన్నారు. శతాబ్దానికి పైగా సింగరేణి వారసత్వాన్ని వేలాది మంది కార్మికుల కష్టంపై నిర్మితమైందన్నారు. కార్మికులు, కార్మిక నాయకులు తమ శక్తి, నైపుణ్యాన్ని కంపెనీకి అంకితం చేయాలన్నారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు మాట్లాడుతూ ఎస్కీ మైనింగ్ విభాగంలో కీలకపాత్ర పోషించిందని గుర్తుచేశారు. కార్మికల సంఘాల నాయకులు వి.సీతారామయ్య, రాజ్‌కుమార్, జనక్ ప్రసాద్, అమర్‌నాథ్, అధ్యాపకులు కృష్ణ, సత్యలక్ష్మీ, కవితానాయుడు, దిలీప్‌కుమార్, జ్ఞానసుందరం, ఎస్‌కే సాహు, రాజేంద్ర ప్రసాద్ అధికారులు పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించడంలో ముందుంటాం

కాంటినెంటల్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి

రాయదుర్గం: క్రీడలను ప్రోత్సహించడంలో తాము ముందుంటామని కాంటినెంటల్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి పేర్కొన్నారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్‌తో సోమవారం హెచ్ఎఫ్‌సీ ఫుట్‌బాల్ టీమ్‌కు మెడికల్ స్పాన్సర్‌గా ఉండేందుకు భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా ఆస్పత్రిలో కొత్తజెర్సీని ఆయన ఆస్పత్రి వైద్యబృందం, పాలకమండలి, హెచ్ఎఫ్‌సీ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 13వ ఫుట్‌బాల్ క్లబ్‌గా గుర్తింపు తెచ్చుకున్న హెచ్ఎఫ్‌సీకి హెల్త్ పార్టనర్‌గా ఉండటం చాలా సంతోషం ఉందన్నారు. ప్రతి క్రీడాకారుడు ఒక్కో సీజన్‌లో సగటున రెండు గాయాలకు గురవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయని పేర్కొన్నారు. దీని ఫలితంగా 25 మందితో కూడిన జట్టుకు ఏటా దాదాపు 50 గాయాలు సంభవిస్తున్నాయన్నారు. ఒక అథ్లెట్ రికవరీ ప్రయాణంలో ప్రతి దశకు అత్యాధునికతతో మద్దతు ఇవ్వ



హెచ్ఎఫ్‌సీ జట్టు గోల్డెన్ కార్డులను ప్రదర్శిస్తున్న ఆస్పత్రి చైర్మన్ గురు ఎన్ రెడ్డి, హెచ్ఎఫ్‌సీ సీఈఓ ధృవ్‌సూద్ తదితరులు

డానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. హైడ్రోథెరపీ, రోబోటిక్ నడక శిక్షణ, స్పోర్ట్స్ మెడిసిన్–శిక్షణ పొందిన వైద్యుల బృందం వంటి ఆర్ట్ సర్వీస్‌లు హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్‌తో కలిసి ఆరోగ్యం, అథ్లెటిక్ ఎక్సలెన్స్ ప్రమాణాలకు పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ సీఈఓ ధృవ్‌సూద్ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ఆరోగ్య సంరక్షణ మూల స్తంభాలైన కాంటినెంటల్ ఆస్పత్రితో భాగస్వామ్యంపై సంతోషంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో కాంటినెంటల్ ఆస్పత్రి డైరెక్టర్ రఘు ఎన్ రెడ్డి, హెచ్ఎఫ్‌సీ హెడ్ కోచ్ తంగబాయిసింగ్తో తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ బిషప్స్ కౌన్సిల్ నూతన రాష్ట్ర పాలకవర్గం



లాలాపేట: తెలంగాణ రాష్ట్రంలోని క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేయాలని తెలంగాణ బిషప్స్ కౌన్సిల్ డిమాండ్ చేసింది. ఈ మేరకు తార్నాకలోని ఐనోస్ చర్చిల్లో దాదాపు 250 మంది సభ్యులతో తెలంగాణ బిషప్స్ కౌన్సిల్ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా నూతన పాలక వర్గాన్ని ఎన్నుకున్నారు. తెలంగాణ బిషప్ కౌన్సిల్ ప్రెసిడెంట్‌గా బిషప్ ధన్‌రాజ్‌కోటా, వైస్ ప్రెసిడెంట్‌గా బిషప్ శామ్యూల్ జాన్, జనరల్ సెక్రటరీగా బిషప్ భాస్కర్ ములకల, జాయింట్ సెక్రటరీ జి.ఫిలిప్, ట్రెజరర్ పి.సాలమన్, మెంబర్స్‌గా బిషప్ విద్యాసాగర్, బిషప్ మార్కండేయా, బిషప్ అనుపమ, తెలంగాణ బిషప్ కౌన్సిల్ మోడరేటర్‌గా బిషప్ విల్సన్ సింఘం తదితరులు ఎన్నికయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ త్వరలో జిల్లా కమిటీలు, మండల కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి అన్ని డినామినేషన్స్ నుంచి ఇండిపెండెంట్ చర్చిల సభ్యులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సమన్యాయమే కమ్యూనిస్టు పార్టీ లక్ష్యం



- బీసీ ఉద్యమాలకు కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ మద్దతు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కాచిగూడ: సమాజంలో అన్ని రంగాలు, వర్గాల కోసం మొదటి నుంచీ ఉద్యమిస్తున్నది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అధ్యక్షతన సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జనగణనలో కులగణనపై రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమసమాజం కోసం కమ్యూనిస్టు పార్టీ జరిపిన వర్గ పోరాటాల చైతన్యమే నేటి కుల చైతన్యానికి స్ఫూర్తి అన్నారు. సమాజంలో అన్ని వర్గాలకు సమన్యాయం దక్కాలన్నదే కమ్యూనిస్టు పార్టీ లక్ష్యమని తెలిపారు. తరతరాలుగా బీసీలకు జరుగుతున్న అన్యాయం నేపథ్యంలో వారికి న్యాయం కోసం జరుగుతున్న బీసీ ఉద్యమాలకు కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. దేశ భౌతిక పరిస్థితులను పూర్తిగా అర్థం చేసుకున్న కమ్యూనిస్టు పార్టీ అన్ని వర్గాల అభ్యున్నతికి సమసమాజం కోసం ఉద్యమించిందన్నారు. మతాలు, కులాలలను అడ్డం పెట్టుకుని ఎప్పుడూ రాజకీయం చేయలేదన్నారు. అదే చేసి ఉంటే కమ్యూనిస్టులు ఎప్పుడో అధికారంలో ఉండేవారని తెలిపారు. ప్రస్తుతం కులం అనేది ఈ సమాజాన్ని ఓ భూతంలా పీడిస్తోందని, దాని కోరలు పీకాలంటే అదివాసి, గిరిజన, దళిత, బీసీ వర్గాలకు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వారికి దక్కాల్సిందేనని, అందుకే కమ్యూనిస్టు పార్టీగా తాము సైతం ఉద్యమిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేష్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.చిరంజీవులు, ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, బీసీ సంఘాల నేతలు కోల జనార్దన్, ఆర్.అంజయ్య నాయక్, కె.కాంతయ్య, జి.సాయిలుగౌడ్, బొడ్డుపల్లి కృష్ణ, డీటీ నర్సయ్య, ధనంజయ నాయక్, వెంకటేశ్వరరావు, పి.యాదయ్య, మెరుగు కుమార్, కె.ప్రమీల, శ్రావణ్ కుమార్, ఎస్.రాజమౌళి, దశరథ, జె.లక్ష్మీ, చీమల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మా ప్లాట్లు మాకు ఇప్పించండి

- మాజీ కలెక్టర్ అమయ్‌కుమార్ అన్యాయం చేశారు
- మధురానగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి

సాక్షి, సిటీబ్యూరో: 'అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తట్టిఅన్నారంలో సర్వే నంబర్ 108, 109, 110, 111లలోని 70.39 ఎకరాల్లో 1980లో వెలసిన మధురానగర్ వెంచర్స్‌లో తాము ప్లాట్లు కొనుగోలు చేశామని, తమ ప్లాట్లను మాజీ కలెక్టర్ అమయ్ కుమార్ అమోద బిల్డర్స్ పేరున మార్చి, తమకు తీరని అన్యాయం చేశారు' అని మధురానగర్ ప్లాట్ ఓనర్స్ సంక్షేమ సంఘం సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంక్షేమ సంఘం సభ్యులు ఆంజనేయులు, సత్యనారాయణ మాట్లాడారు. మద్ది సత్యనారాయణ, మద్ది బాల్‌రెడ్డి, అచ్చిరెడ్డిల నుంచి జీపీఏ హోల్డర్ ఎంవీ రంగాచారి కొనుగోలు చేసి, 840 ప్లాట్లు చేసి, దశలవారీగా విక్రయించారని తెలిపారు. ఈ ప్లాట్లను తాము కొనుగోలు చేశామని, తమ వద్ద అన్ని డాక్యుమెంట్లు ఉన్నాయని, తీరా ధరణి వచ్చిన తర్వాత తమ ప్లాట్లు ఉన్న భూమిని అమోద బిల్డర్స్ పేరున అప్పటి కలెక్టర్ అమయ్‌కుమార్ మార్చేసి, తమకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. కనీసం తమ డాక్యుమెంట్లను కూడా పరిశీలించకుండా ఏకపక్షంగా ఆయన వ్యవహరించారని ప్రకటించారు. వివాదాస్పద ఈ భూమిని గుట్టుగా అమోద బిల్డర్‌కు కట్టబెట్టి వారి నుంచి పెద్దఎత్తున అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు. కలెక్టర్ చర్యల వల్ల ప్రస్తుతం ఆ భూమిలోకి తాము వెళ్లలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంచర్ చుట్టూ ప్రైవేటు సైన్యాన్ని మోహరించి, భూమిలోకి ఎవరూ రాకుండా అడ్డుకుంటున్నారని, మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి తాలూకు అని చెప్పి, తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వారి నుంచి తమకు ప్రాణహాని ఉందని, తమకు రక్షణ కల్పించి, కబ్జాదారుల కబంద హస్తాల్లో చిక్కుకున్న తమ ప్లాట్లను తమకు విడిపించి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలోనూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆర్ట్ యూనివర్సిటీకి 10 ఎకరాలు కేటాయించడం సంతోషం

పంజగుట్ట: జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నిరుపయోగంగా ఉన్న 10 ఎకరాల స్థలాన్ని కేటాయించడం ఎంతో సంతోషమని, ఇందుకు సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ బోధన, బోధనేతర, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూనివర్సిటీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ గంగాధర్, అకాడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ వినోద్ మాట్లాడుతూ.. జేఎన్‌టీయూలో ఒక కళాశాలగా ఉన్న తమ కాలేజీని లలితకళల, వాస్తుశిల్ప శాస్త్రాల ప్రత్యేకతను గుర్తించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 2008లో జేఎన్‌టీయూ నుంచి విడదీసి ఒక విశ్వవిద్యాలయంగా మార్చారని గుర్తుచేశారు. ఈ యూనివర్సిటీకి ప్రత్యేక విశాలమైన స్థలం కేటాయించి దేశంలోనే గొప్ప యూనివర్సిటీగా తీర్చిదిద్ది గ్రామీణ ప్రాంత విద్యార్థులకు లలితకళలు, వాస్తు



ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతూ ఫ్లకార్డులు ప్రదర్శిస్తున్న యూనివర్సిటీ ఉద్యోగులు

శిల్ప కళలు అందుబాటులోకి తీసుకురావాలన్న ఆయన సంకల్పం ఆయన మరణంతో మరుగున పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా కళాకారుడే కావడంతో తమ కళను గుర్తించి ఉస్మానియా ఓపెన్ యూనివర్సిటీలో 10 ఎకరాల స్థలం కేటాయించడం హర్షణీయమని పేర్కొన్నారు. సమావేశంలో యూనివర్సిటీ ఎగ్జామినేషన్ డైరెక్టర్ ఎస్.కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మాసూమ్ అలీ, ఎస్.కాంతా రెడ్డి, ప్రొఫెసర్ ఆనంద్, విష్ణువర్ధన్, జే.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జేబీఎస్ మెట్రో స్టేషన్‌లో కేఎఫ్ ఇన్‌టెక్ కార్యాలయం



సాక్షి, సిటీబ్యూరో: క్యాపిటల్ మార్కెటింగ్ రంగంలో విస్తృత సేవలను అందిస్తున్న ప్రముఖ సాంకేతిక సంస్థ కేఎఫ్ ఇన్ టెక్నాలజీస్ లిమిటెడ్స్ సంస్థ నూతన కార్యాలయాన్ని జేబీఎస్ పరేడ్ గ్రౌండ్స్ మెట్రో స్టేషన్‌లో సోమవారం ప్రారంభించారు. ఇప్పటి వరకు షాపింగ్‌మాల్స్, స్టాళ్లు వంటివి మెట్రో స్టేషన్‌లలో ఎక్కువగా ఏర్పాటవుతుండగా, మొదటిసారి ఒక కార్పొరేట్ సంస్థ కార్యాలయం మెట్రోస్టేషన్ నుంచి సేవలను ప్రారంభించిందని అధికారులు తెలిపారు. జేబీఎస్ పరేడ్ గ్రౌండ్స్ మెట్రోస్టేషన్ 2వ అంతస్తులో సుమారు 25వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన కేఎఫ్ ఇన్ టెక్ సంస్థ కార్యాలయం దేశంలోనే మెట్రోస్టేషన్‌లో ప్రారంభించిన అతిపెద్ద కార్పొరేట్ ప్రాంగణం అని పేర్కొన్నారు. కార్యాలయంలో 600 మంది ఉద్యోగులు విధులు నిర్వహించనున్నారు. ఇన్సూర్ సొల్యూషన్స్, కాంటాక్ట్ సెంటర్, బిజినెస్ సపోర్ట్ వంటి వివిధ రకాల విధులను ఈ ప్రాంగణంలో నిర్వహించనున్నారు. మ్యూచువల్ ఫండ్ సేవలను అందించే కొత్త శాఖ కూడా అందుబాటులో ఉంది. సంస్థ ఎండీ, సీఈఓ శ్రీకాంత్ నాదెళ్ల మాట్లాడుతూ.. నగరం టెక్నాలజీ హబ్‌గా అభివృద్ధి చెందిందన్నారు. జేబీఎస్ పరేడ్ గ్రౌండ్ మెట్రో స్టేషన్‌లో తమ కొత్త కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం ద్వారా తమ సేవలను మరింత విస్తరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ, సీఈఓ కేవీబీ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ మెట్రో కేవలం రవాణా వ్యవస్థ మాత్రమే కాదని, వాణిజ్య, వ్యాపార సంస్థల కార్యకలాపాలకు కూడా ఒక ప్లాట్‌ఫామ్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు.

గో సంజీవని పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: ఆవు అమ్మతో సమానమని పలువురు వక్తలు అన్నారు. రవీంద్రభారతిలో రైతునేస్తం పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో గో సంజీవని పుస్తకావిష్కరణ సభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఆవు హిందూ సంప్రదాయంలో అంతర్భాగమని, ఏ పూజ చేసినా, ఏ వ్రతం చేసినా ఆవు ప్రస్తావన లేకుండా ఉండదని తెలిపారు. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు అన్నీ గోవు గొప్పదనాన్ని చెప్పాయని గుర్తుచేశారు. గోశాల నిర్వాహకులు, గోసేవకులు అంతా భగవంతుడి అనుగ్రహ పాత్రులేనన్నారు. రైతునేస్తం పబ్లికేషన్స్ అధినేత, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ యన్లపల్లి వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. దేశంలో ఉన్న పాడి రైతులకు పలు రకాల వైద్య సలహాలతో ముద్రించిన ఈ పుస్తకాన్ని అన్ని భాషల్లో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అదనపు సంచాలకులు డాక్టర్ సుబ్బారాయుడు, ఎస్వీ వెటర్నరీ విశ్వవిద్యాలయం డీన్ వీరబ్రహ్మయ్య, పుస్తక రచయిత డాక్టర్ ఎం.శివరామ్ తదితరులు పాల్గొన్నారు.



సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, మంగళవారం, 29, అక్టోబర్, 2024

హైలైఫ్ ఎగ్జిబిషన్ 8 నుంచి



బంజారాహిల్స్: హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను నవంబర్ 8 నుంచి హెచ్ఐసీసీ నోవోటెల్‌లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం బంజారాహిల్స్ రోడ్ నెం.10లో ఇందుకు సంబంధించిన సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. పలువురు మోడల్స్ పాల్గొని ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించబోయే వజ్రాభరణాలు, డిజైనరీ దుస్తులు ధరించి హొయలు పోయారు. అనంతరం ఎగ్జిబిషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో లగ్జరీ ఫ్యాషన్ ఉత్పత్తులతో పాటు వెడ్డింగ్, లైఫ్ స్టైల్ డిజైనరీ దుస్తులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. దేశ వ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన డిజైనర్లు రూపొందించిన ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శిస్తారని తెలిపారు.



చందానగర్‌లో తనిష్క్ జ్యువెలరీ

చందానగర్: గంగారంలో అతి పెద్ద తనిష్క్ జ్యువెలరీ షోరూమ్ సోమవారం సౌత్ రీజనల్ బిజినెస్ మేనేజర్ వాసుదేవరావు ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 స్టోర్‌లు ఉన్నాయని, నగరంలోని ఆధునిక, ఫ్యాషన్–పరంగా ముందున్న కస్టమర్ల స్ఫూర్తితో చందానగర్‌లో నూతన షోరూమ్ ప్రారంభించామన్నారు. దీపావళి పండుగ నేపథ్యంలో ఆభరణాల్లో కొత్త డిజైన్లు అందుబాటులో ఉన్నాయని, సరసమైన ధరలకు నూతన డిజైన్లతో బంగారు ఆభరణాలు వినియోగదారులకు అందుబాటులో ఉంచామన్నారు. ఈ నెల 31 వరకూ 20 శాతం తగ్గింపుతో రిటైల్ విస్తరణ ప్రయాణంలో ఒక శక్తివంతమైన మైలురాయిని సూచిస్తుందన్నారు.



జట్టు కట్టి.. జంటనగరాలకు చూపెట్టి..

జంటనగరాల్లో వింటేజ్ కార్లు, బైకుల యజమానులు పలు క్లబ్స్, బృందాలుగా జట్టు కట్టారు. పరస్పరం అనుభవాలను పంచుకోడంతో పాటు సమస్యలను చర్చించుకోడం వంటివి చేస్తున్నారు. దీంతోపాటే వింటేజ్ కార్ల ప్రదర్శనలు సైతం ప్రధానంగా మారాయి. నగరంలో ఆగస్టు 15, రిపబ్లిక్ డే వంటి ముఖ్యమైన సందర్భాలను ఎంచుకుని తమ క్లబ్స్/సంఘాల తరపున వాహనాల ప్రదర్శన నిర్వహిస్తున్నారు. దీంతో నగరవాసులకు వైవిధ్యభరిత వాహనాలను వీక్షించే అవకాశం లభిస్తోంది.



వింటేజ్.. క్రేజీ..ఇమేజ్

అత్యధిక సంఖ్యలో నగరంలో పాతకాలపు వాహనాలు

పలు నగరాల నుంచి రిపేర్లకు తరలివస్తున్న వైనం

వ్యయ ప్రయాసలున్నా సిటిజనుల్లో తరగని క్రేజ్..

దేశంలోనే వింటేజ్ వాహనాల హబ్‌గా మారుతోన్న సిటీ

మెడికల్ టూరిజమ్ సహా మరెన్నింటితో దేశంలోనే మన నగరం రాజధానిగా ఉందని మనకు తెలుసు.. కానీ పాతకాలం నాటి వాహనాలకు సైతం హబ్‌గా మారిందని బహుశా మనలో అతి తక్కువ మందికే తెలుసు. నాలుగు శతాబ్దాలు పైబడిన ఘన చరిత్రకు చిరునామాగా మారింది.. అంతేకాదు ఆ చారిత్రక వైభవ సాక్ష్యాలను పరిరక్షించుకోవడంలోనూ ఘనతను చాటుకుంటోంది.

- సాక్షి, సిటీబ్యూరో

నగరంలో దాదాపు 4,000 పాతకాలపు కార్లు, బైకులు ఉంటాయని అంచనా. ఇందులో కొన్ని వందేళ్ల, అంతకన్నా పైబడినవి కూడా ఉన్నాయి. ఆయా వాహనాల యజమానులు ఏర్పాటు చేస్తున్న క్లబ్స్, గ్రూప్స్ నిర్వహించే ర్యాలీల సమయంలో ఇవి నగరవాసులకు తరచూ కనువిందు చేస్తున్నాయి.

రి'పేరు'కు పేరొందాం..

నగరం క్లాసిక్ వాహనాలకు ముఖ్యంగా పాతకాలపు జీపులను పునరుద్ధరించడంలో నైపుణ్యానికి పేరొందింది. దాంతో దేశవ్యాప్తంగా పాతకాలపు కార్లకు హైదరాబాద్ గమ్యస్థానంగా మారుతోంది. నగరంలో నైపుణ్యంతో పాటు తక్కువ ఖర్చుతో కూడిన క్లాసిక్ కార్ల రిపేర్ సేవలు మహారాష్ట్ర, కర్నాటక, గుజరాత్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి క్లాసిక్ కార్ల యజమానులను ఆకర్షిస్తున్నాయి. ముంబై, ఢిల్లీ వంటి మెట్రో నగరాలతో పోలిస్తే సిటీలో రిపేరింగ్ చాలా చౌక అని క్లాసిక్ మోటార్ వెహికల్స్ అసోసియేషన్ చీఫ్ శశిధర్ బచ్చు చెబుతున్నారు. 'ఇంధన ట్యాంక్ తయారీ, కలర్ మ్యాచింగ్, ఛాసిస్ పునరుద్ధరణ వంటి అనేక రకాల సేవలు ఇక్కడ చౌక' అని ఆయన చెప్పారు. ఆటోమొబైల్ ఇంజినీర్ ప్రముఖ పాతకాలపు కార్ల రిపేర్లకు పేరొందిన నగరంలోని చెకర్డ్ ఫ్లాగ్ యజమాని జైన్ బిల్‌గ్రామి మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా పాతకాలపు వాహనాలను రిపేర్ చేస్తున్నామని, 1980 మోడల్ క్లాసిక్ కార్లతో పాటు డాడ్జ్, లింకన్, కర్మన్ ఘియా 1960ల నాటి మెర్సిడీజ్ వంటి మోడళ్ల కార్ల యజమానులు తమను సంప్రదిస్తారని చెప్పారు.

పాతకాలపు కారును పరిరక్షించుకోడం, రిపేరింగ్ అంత తేలికైన పని కాదు. 'ఈ ప్రక్రియ చాలా సమయం తీసుకుంటుంది. ఖరీదైనది కూడా. దీనికి సహనం ఇచ్ఛ్చి తత్వం రెండూ అవసరం. బహదూర్‌పురా, మాదాపూర్ వంటి ప్రాంతాల్లోని నైపుణ్యం కలిగిన మెకానిక్‌లు ఈ

ఓర్చుకుంటేనే.. మార్చగలం..

టైమ్‌లెస్ వెహికల్స్ పునరుద్ధరించడానికి అందుబాటులో ఉన్నారు. ఈ పాతకాలపు కార్ల విడిభాగాలను ఇంగ్లాండ్, యునైటెడ్ స్టేట్స్, జర్మనీ, దుబాయ్ వంటి దేశాల నుంచి దిగుమతి చేసుకోవాలి. వీటికి అధిక దిగుమతి సుంకాలు వర్తిస్తాయి. ఉదాహరణకు 1956 నాటి ఓ కార్ ఇంజిన్‌ను పునర్నిర్మించడానికి రూ.3.15 లక్షలు ఖర్చయితే, 2020 మోడల్ వాహనం ఇంజిన్‌ను పునరుద్ధరించడానికి దాదాపు రూ.80,000 వరకూ ఖర్చు అవుతుంది' అంటూ మరో వింటేజ్ కార్ల ఓనర్ ముఖేస్ వివరించారు.



ఏడాదిలోనే.. కార్ హుషార్..

గతేడాది జూన్‌లో కార్స్ ఎన్ కాఫీ స్టార్ట్ చేశాం. పదుల సంఖ్యలో ఫ్రెండ్స్‌తో మొదలై కేవలం ఏడాదిన్నర లోపే మా సభ్యుల సంఖ్య 2 వేలు దాటిపోయింది. ప్రతి ఆదివారం మేము 20 నుంచి 30 మందిమి సంజీవయ్య పార్క్‌లో కలుస్తాం. నచ్చిన కాఫీ రుచులను ఆస్వాదించి.. కార్లు, బైకులకు సంబంధించిన విషయాలు పంచుకుంటాం. అలాగే ప్రతి 3 నెలలకు ఒకసారి ఓ మెగామీట్ నిర్వహిస్తాం. ఇప్పటివరకూ హైదరాబాద్ పోలో రైడింగ్ క్లబ్‌లో రెండు, సికింద్రాబాద్ ఇంపీరియల్ గార్డెన్‌లో మరో మూడు నిర్వహించాం. ప్రతి మెగా మీట్‌లో 200 నుంచి 300 మంది దాకా వాహనాలతో పాల్గొంటారు' అని చెప్పారు కార్స్ ఎన్ కాఫీ నిర్వాహకులు దీపక్‌కాంత్ గిర్.

వ్యయప్రయాసలున్నా.. తగ్గేదేలేదంటూ..

'నా దగ్గర 1951 వాక్స్‌హాల్ వెలోక్స్, 1950 ఫోర్డ్ ప్రిఫెక్ట్, 1951 సన్‌బీమ్, 1950 విల్లీస్ జీప్ ఉన్నాయి. వీటి రిపేర్ల కోసం 25 సంవత్సరాలుగా స్థానిక మెకానిక్‌లతో కలిసి పని చేస్తున్నాను. వారి వల్లే ఈ క్లాసిక్ అందాలను భవిష్యత్ తరాలకు భద్రపరచగలను' అని ఆరు క్లాసిక్ కార్లను కలిగిన నగరవాసి ప్రవీందర్ రావు అంటున్నారు. నిజామ్ కాలం నాటి కార్లను కూడా ఇంకా భద్రంగా పరిరక్షిస్తున్న వింటేజ్ ప్రియులూ నగరంలో ఉన్నారు. 'నగరంలో 1900 సంవత్సరం ప్రాంతంలో ఖరీదైన కార్లకు కేరాఫ్‌గా మా 'గిర్'ఫ్యామిలీ ఉండేది. ఓ 95 ఏళ్ల క్రితం మా ముత్తాత గారు కొన్న క్యాడిలాక్‌కు చెందిన ఎం లస్సాల్ అనే పేరున్న కార్ మా దగ్గర ఇప్పటికీ ఉంది. దానిని అప్పటి నిజామ్ ప్రభుత్వంలో పోలీస్ కమిషనర్ వినియోగించేవారు' అంటూ సగర్వంగా చెప్పారు నగరవాసి దీపక్‌కాంత్ గిర్.





యూట్యూబ్ షాపింగ్ విస్తరణకు చర్యలు



సాక్షి, సిటీబ్యూరో: యూట్యూబ్ షాపింగ్‌ను విస్తరించేందుకు యూట్యూబ్ షాపింగ్ అనుబంధ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్నట్లు నగరానికి చెందిన యూ ట్యూబ్ ప్రతినిధులు తెలిపారు. దీని ద్వారా క్రియేటర్లు తమ ఆదాయాలను మరింత విభిన్నంగా పొందడానికి, అలాగే వీక్షకులు తమ అభిమాన క్రియేటర్ల ద్వారా ఉత్పత్తులను తెలుసుకునేందుకు మరిన్ని అవకాశాలు కలుగుతాయని, అర్హతగల క్రియేటర్లు తమ వీడియోలలో ఉత్పత్తులను ట్యాగ్ చేసేందుకు, వీక్షకులు వాటిని కొనుగోలు చేసినప్పుడు ఆదాయాన్ని ఆర్జించడానికి యూట్యూబ్ షాపింగ్ అనుబంధ ప్రోగ్రామ్ అవకాశం అందిస్తుందన్నారు. దీని వల్ల అర్హత కలిగిన క్రియేటర్‌లు తమ స్టోర్‌లను వారి యూట్యూబ్ ఛానెల్స్‌కు లింక్ చేయడం ద్వారా వారి సొంత వస్తువులను కూడా ప్రమోట్ చేసుకోవచ్చని వివరించారు.

నగరంలో ఇండియాస్ బిగ్గెస్ట్ అలెన్ సోలి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని బంజారాహిల్స్ వేదికగా ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్ హౌస్ ఆధ్వర్యంలో అలెన్ సోలి తమ నూతన బ్రాండ్‌కు గుర్తింపుగా దేశంలోనే అతిపెద్ద స్టోర్‌ను ప్రారంభించింది. ఈ నూతన స్టోర్ పది వేలకు పైగా వినూత్న స్టైల్స్, ఫ్యాషన్ హంగులతో ఫ్యాషన్ లవర్స్‌ను అలరిస్తుంది. ఈ సందర్భంగా అలెన్ సోలి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రిచా పాయ్ మాట్లాడుతూ.. తమ నాటింగమ్ వారసత్వం నుంచి ప్రేరణ పొందిన ఈ నూతన ఆవిష్కరణలు నగర ఫ్యాషన్ ఔత్సాహికులను సంతృప్తి పరుస్తాయని అన్నారు. అంతర్జాతీయ అధునాతన స్టైల్స్‌ను ఆస్వాదించే భారతీయులకు అనుగుణంగా ఈ వేదికను ప్రారంభించామన్నారు. ఇందులో హెరిటేజ్‌తో సరికొత్త ఫ్యాషన్ ట్రెండ్ సమ్మిళితం చేస్తున్నామన్నారు.

నాటింగమ్ వారసత్వం నుంచి ప్రేరణ పొందిన స్టైల్స్



స్ట్రోక్‌పై అవగాహన పెంచిన ర్యాలీ..

సాక్షి, సిటీబ్యూరో: వరల్డ్ స్ట్రోక్ డే (మంగళవారం)ను పురస్కరించుకుని వ్యాధిపై అవగాహన మరింత పెంచడానికి నగరానికి చెందిన స్ట్రోక్ రిహాబిలిటేషన్ సెంటర్ హెల్త్ కేర్ ఎట్ యువర్ హోమ్ (హెచ్‌సీఏహెచ్) ఆధ్వర్యంలో నగరంలో సోమవారం వాక్‌థాన్‌ను నిర్వహించింది. అదే విధంగా స్ట్రోక్‌ల ప్రభావం గురించి, సకాలంలో చికిత్సపై అవగాహన పెంచాలని సూచిస్తూ సోమాజిగూడ నుంచి గచ్చిబౌలి వరకూ బైక్ ర్యాలీ చేపట్టింది. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సంరక్షణ నిపుణులు, పక్షవాతం బారిన పడి కోలుకున్నవారు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు. హెచ్‌సీఏహెచ్ సీఈఓ వివేక్ శ్రీవాత్సవ్, కిమ్స్ ఆస్పత్రికి చెందిన న్యూరోసర్జన్ డా.మానస్ కుమార్ పాణిగ్రాహి తదితరులు వ్యాధిపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరాన్ని గురించి విశదీకరించారు.

కళాకారులకు చేయూత ఆర్ట్ ఫర్ హోప్

సాక్షి, సిటీబ్యూరో: కళలు, కళాకారులను ప్రోత్సహించేందుకు హ్యుందయ్ మోటార్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్ట్ ఫర్ హోప్ పేరిట ఓ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని ఫౌండేషన్ నగర ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిత్రకారులకు ఆర్థికంగా నిధులను మంజూరు చేయడంతో పాటు వారి ప్రతిభను ప్రదర్శించేందుకు జాతీయస్థాయి వేదికను కూడా ఏర్పాటు చేస్తామని, దివ్యాంగ చిత్రకారులకు సైతం శిక్షణ, మెంటార్‌షిప్ అందిస్తామని వివరించారు. పెయింటింగ్, శిల్పకళ, డిజిటల్ ఆర్ట్, సంగీతం, సంప్రదాయ హస్త కళలు.. ఇలా ఏ కళలోనైనా సరే రాణించాలనుకున్న వారు ఈ కార్యక్రమం ద్వారా సహకారం అందుకోవచ్చన్నారు. ఆసక్తి కలిగినవారు తమ దరఖాస్తులను hyundaiartforhope.comకు వచ్చే నవంబరు 10వ తేదీలోగా పంపవచ్చన్నారు.











అలంకరణ అదిరేలా..

దీపావళి అంటేనే వెలుగుల పండుగ. రకరకాల విద్యుత్ దీపాలు, హ్యాంగింగ్స్‌తో ఇళ్లను అలంకరించడం ఆనవాయితీ. హైదరాబాద్ నగరంలో అయితే దీనికి మరింత ప్రాధాన్యత ఉంటుంది. ఇక ఉత్తరాది రాష్ట్రాల నుంచి వచ్చిన వారు గృహాలంకరణకు మక్కువ చూపిస్తుంటారు.. దీంతో నగరంలోని ఉస్మాన్‌గంజ్‌లోని గృహాలంకరణ షాపులు కొనుగోలు దారులతో రద్దీగా మారాయి. దుకాణాల్లోనూ వినియోగదారుల అభిరుచి మేరకు రకరకాల అలంకరణ వస్తువులు, విద్యుత్ దీపాలు అందుబాటులో ఉంచారు అమ్మకందారులు. - సాక్షి, సిటీబ్యూరో







క్లుప్తంగా...

ఈఆర్సీ చైర్మన్‌గా జస్టిస్ దేవరాజు నాగార్జున్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ) చైర్మన్‌గా జస్టిస్ దేవరాజు నాగార్జున్‌ను నియమిస్తూ సోమవారం ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదవిలో ఆయన మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. ప్రస్తుత ఈఆర్సీ చైర్మన్ టి.శ్రీరంగారావు, సభ్యులు ఎండీ మనోహర్ రాజు, బండారు కృష్ణయ్య పదవీకాలం మంగళవారం సాయంత్రంతో ముగియనుంది. ఆ వెంటనే జస్టిస్ దేవరాజు నాగార్జున్ బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తికి చెందిన ఆయన గుల్బర్గాలోని ఎస్ఎస్ఎల్ కళాశాలలో న్యాయశాస్త్ర విద్యను అభ్యసించారు. ఉస్మానియా వర్సిటీలో ఎల్ఎల్ఎం చేశారు. 1986లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకున్నారు. 1991, మే 1న జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. 2022, అక్టోబర్ 18న హైకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు. 2023, ఏప్రిల్ 6న మద్రాస్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. అక్కడే పదవీ విరమణ చేశారు. మరో ఇద్దరు ఈఆర్సీ సభ్యుల నియామకానికి ప్రభుత్వం త్వరలో ప్రకటన జారీ చేయనుంది.

దీపావళికి ప్రత్యేక రైళ్లు

సాక్షి, హైదరాబాద్: దీపావళి, ఛత్ పర్వదినాల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని అన్ని ప్రధాన స్టేషన్ల నుంచి 850 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ప్రణాళికలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, విజయవాడ, వరంగల్, తదితర ప్రధాన స్టేషన్లలో 14 జనరల్ టికెట్ కౌంటర్లను అదనంగా ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికుల రద్దీ మేరకు అదనపు కోచ్‌లను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. సీసీటీవీలతో పాటు అన్ని చోట్ల ఆర్పీఎఫ్ భద్రతను పెంచినట్లు తెలిపారు.

ఈఏపీ సెట్ ద్వారా 10,436 బైపీసీ సీట్ల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: టీజీఈఏపీ సెట్ (బైపీసీ) అర్హత సాధించిన 10,436 మందికి సోమవారం తొలిదశలో సీట్లు కేటాయించినట్టు సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ కోర్సుకు సంబంధించి 127 ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో 8,845 సీట్లు ఉంటే, 8,453 సీట్లు కేటాయించినట్టు వెల్లడించారు. ఫార్మాడీకి సంబంధించి 74 కాలేజీల్లో 1,648 సీట్లు అందుబాటులో ఉంటే, 1,627 సీట్లు కేటాయించామని తెలిపారు. బయోమెడికల్‌లో 2 కాలేజీల్లో 58 సీట్లు ఉంటే మొత్తం కేటాయించామని, ఫార్మాస్యూటికల్స్‌లో 3 కాలేజీల్లో 122 సీట్లు ఉంటే, 117 సీట్లు భర్తీ చేశామని వెల్లడించారు. బయో టెక్నాలజీలో 4 కాలేజీల్లో 181 సీట్లు ఉంటే మొత్తం భర్తీ అయినట్టు పేర్కొన్నారు. ఫార్మసీలో 54 కాలేజీల్లో వంద శాతం సీట్ల కేటాయింపు ఉన్నట్టు స్పష్టం చేశారు. కౌన్సెలింగ్ ద్వారా సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 30 తేదీలోగా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు.

ఉన్నత విద్యలో టీ-శాట్ తోడ్పాటు




టీ-శాట్ కార్యాలయంలో మాట్లాడుతున్న బాలకిష్టారెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యలో నాణ్యత పెంచేందుకు టీ-శాట్ సేవలను వినియోగించుకోవాలని ఉన్నత విద్యా మండలి భావించింది. డిజిటల్ బోధన ప్రణాళికలో అత్యున్నత సాంకేతికతను టీ-శాట్ ద్వారా అందుకోవాలని నిర్ణయించింది. విశ్వవిద్యాలయాలు, సాంకేతిక విద్యా సంస్థల్లో నిపుణులైన ఫ్యాకల్టీ గుర్తింపులోనూ ఆ సంస్థ తోడ్పాటు తీసుకునే దిశగా అవగాహన ఒప్పందం చేసుకునేందుకు సిద్ధమైంది. టీ-శాట్ కార్యాలయాన్ని సోమవారం ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తం, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ సందర్శించారు. టీ-శాట్ సీఈవో బి.వేణుగోపాల్ రెడ్డితో ఎంఓయూపై చర్చించారు.

ప్రమోషన్లు, పోస్టింగుల్లో అన్యాయం జరగొద్దు

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



సాక్షి, హైదరాబాద్: సింగరేణి సంస్థల్లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్లు, పోస్టింగుల్లో ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. సోమవారం సింగరేణి భవన్‌లో సింగరేణి సీఎండీ ఎన్.బల రామ్, అధికారులతో కమిషన్ సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులకు ప్రమోషన్లు కల్పించే కమిటీ, రక్షణ కమిటీల్లో ఎస్సీ, ఎస్టీ కులాల నుంచి కనీసం ఇద్దరిని సభ్యులుగా చేర్చాలని సూచించారు. తద్వారా ఆ కులాల వారికి అన్యాయం జరగకుండా చూసే అవకాశం ఉంటుందన్నారు.

సార్లేం చేస్తున్నారు?

- ప్రభుత్వ పాఠశాలలకు వారి హాజరు, బోధనపై ఎప్పటికప్పుడు నివేదికలు
- వాటి ఆధారంగా టీచర్లు, స్కూళ్లకు గ్రేడింగ్ ఇచ్చే యోచన
- మండల విద్యాశాఖ అధికారులకు ప్రభుత్వం బాధ్యతలు.. నేటి నుంచి శిక్షణ



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో నిఘా పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. టీచర్ల హాజరు, బోధన విధానం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టనుంది. ఇందుకోసం మండల విద్యాశాఖాధి కారులకు మంగళవారం నుంచి హైదరాబాద్‌లో శిక్షణ ఇవ్వనుంది. ఇటీవల 602 ఎంఈవో పోస్టులను పదోన్నతుల ద్వారా సీనియర్ హెచ్ఎంలతో భర్తీ చేసిన ప్రభుత్వం వారికి సరైన విధివిధానాలు పొందుపర్చలేదు. కేవలం పర్యవేక్షణ పోస్టులు కావడంతో అవసరమైన పనులు అప్పగించాలని భావిస్తోంది. ముఖ్యంగా ప్రతి స్కూల్లోనూ నిఘా వ్యవస్థను పటిష్టం చేయడం, స్థానిక ప్రజాప్రతి నిధుల సహకారంతో ప్రభుత్వ స్కూళ్ల బలోపేతా నికి కృషి చేయడం ఎంఈవోల బాధ్యతగా ప్రభుత్వం చెప్పబోతోంది.

లోపాలు ఎక్కడ?


ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో లోపాలపై సీఎం ఇటీవల ఆరా తీశారు. విద్యాశాఖ అధికారుల నుంచి నివేదికలు తెప్పించారు. ప్రధా నంగా ప్రభుత్వ పాఠశాలల నిర్వాహణలో టీచర్ల లోపాలను అధికారులు గుర్తించారు. సకాలంలో బోధన చేపట్టకపోవడం, విద్యార్థులను ఆకట్టు కొనే బోధనా పద్ధతులు అనుసరించకపోవ డం ప్రధాన సమస్యగా తేల్చారు. ఇంతకాలం పర్యవే క్షణ లేకపోవడం కూడా టీచర్ల మందకొడితనానికి కారణమని భావిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరుతున్నా సరైన బోధనా విధానం లేక మళ్లీ ప్రైవేటు స్కూళ్లకే విద్యార్థులు వెళ్తున్నా రు. దీన్ని నివారించేందుకు ప్రణాళిక లను రూపొందించారు. ఎంఈవోల నేతృత్వంలో దీన్ని అమలు చేయాలని భావిస్తున్నారు. ప్రతి నెలా హెచ్ఎంలు, టీచర్ల పనితీరుపై నివేదిక ఇవ్వాలని ఎంఈవోలకు సూచించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

అభ్యసనపై దృష్టి...

ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు కూడా కనిపించడం లేదని సర్వేలో గుర్తించిన కేంద్ర విద్యాశాఖ ఆయా బడుల్లో నాణ్యత పెంచేందుకు తొలిమెట్టు కార్యక్రమాన్ని, ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఉన్నతి పేరుతో మరో కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. అయితే వాటి అమలుపై అనేక సందేహాలున్నాయి. స్కూల్ టీచర్లు దీనిపై దృష్టి పెట్టట్లేదని అధికారులు సీఎంకు నివేదించారు. మరోవైపు పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించడం మొక్కుబడి వ్యవహారంగా ఉంటోందన్న విమర్శలు ఉన్నాయి. దీంతో ఈ అంశంపైనా ప్రత్యేక నిఘా పెట్టాలని ఎంఈవోలను ప్రభుత్వం ఆదేశించనుంది. టీచర్ల పనితీరుపై ఎంఈవోలు ఎప్పటికప్పుడు నివేదించేలా ప్రభుత్వం ప్రత్యేక యాప్ రూపొందించనుంది. ఆ నివేదికల ఆధారంగా ఆయా పాఠశాలల పరిస్థితి, ఉపాధ్యయుల పనితీరును అంచనా వేయనున్న ప్రభుత్వం.. వాటి ప్రాతిపదికనే టీచర్లు, స్కూళ్లకు గ్రేడింగ్ ఇచ్చే యోచనలో ఉన్నట్లు తెలిసింది.

రెండు కేటగిరీల్లో తీవ్ర పోటీ!

- బీసీ–డీ కోటాలో ఒక్కో పోస్టుకు సగటున 175 మంది అభ్యర్థుల పోటీ
- బీసీ–బీ కింద ఒక్కో కొలువుకు పోటీలో సగటున 128 మంది అభ్యర్థులు
- గ్రూప్–1 జవాబుపత్రాల మూల్యాంకనానికి కనీసం రెండున్నర నెలల సమయం!
- అతిత్వరలో కసరత్తు మొదలుపెట్టనున్న టీజీపీఎస్సీ



కేటగిరీ	పోస్టులు	అభ్యర్థులు	పోటీ
ఓపెన్	209	2,384	11.40669856
ఈడబ్ల్యూఎస్	49	1778	36.28571429
బీసీ-ఏ	44	1648	37.45454545
బీసీ-బీ	37	4743	128.1891892
బీసీ-సీ	13	527	40.53846154
బీసీ-డీ	22	3,847	174.8636364
బీసీ-ఈ	16	661	41.3125
ఎస్సీ	93	3,503	37.66666667
ఎస్టీ	52	1983	38.13461538
స్పోర్ట్స్	4	19	4.75
పీహెచ్	24	1,299	54.125


సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోని 563 గ్రూప్–1 పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ చేపట్టిన మెయిన్స్ పరీక్షలపర్వం ముగిసింది. దీంతో జవాబు పత్రాల ముల్యాంకనాన్ని అతిత్వరలో చేపట్టేందుకు కమిషన్ కసరత్తు చేస్తోంది. తొలుత జవాబు పత్రాల క్రోడీకరణ, మూల్యాంకనానికి నిపుణుల అర్హతలను సంస్థ నిర్ధారించనుంది. ప్రొఫెసర్ల ఎంపిక అనంతరం జవాబు పత్రాల మూల్యాంకనం మొదలుకానుంది. ఈ ప్రక్రియ నిర్వహించేందుకు కనీసం రెండున్నర నెలల సమ యం పట్టొచ్చని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. గతంలో నిర్వహించిన గ్రూప్–1 పరీక్షల మూల్యాంకనం ప్రక్రియ కనిష్టంగా మూడు నెలలు పట్టిందని చెబుతున్నాయి. మెయిన్స్‌లో జనరల్ ఇంగ్లిష్‌తోపాటు ఆరు పేపర్లను అభ్యర్థులు రాశారు. అయితే జనరల్ ఇంగ్లిష్‌లో అభ్యర్థులు సాధించే మార్కులను కేవలం అర్హతగానే పరిగణించనున్న కమిషన్.. మిగిలిన 6 సబ్జెక్టుల్లో అభ్యర్థులు సాధించే మార్కుల ఆధారంగానే ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది.

అత్యధిక పోటీ వారి మధ్యే..

మెయిన్స్ పరీక్షలకు 1:50 నిష్పత్తిలో రిజర్వేషన్ల వారీగా అభ్యర్థులు ఎంపికైనప్పటికీ ప్రస్తుతం ఆయా అభ్యర్థులందరికీ (స్పోర్ట్స్ అభ్యర్థులు మినహా) ఓపెన్ కేటగిరీలో పోటీకి అర్హత ఉంది. అయితే ఒకవేళ ఓపెన్ కేటగిరీలో ఎంపిక కాకుంటే రిజర్వుడ్ కేటగిరీలో పోటీ పడాల్సి ఉంటుంది. ఇందులో అత్యధిక పోటీ బీసీ–డీ, బీసీ–బీ కేటగిరీల్లో ఉంది. బీసీ–డీ కేటగిరీలో 22 పోస్టులు ఉండగా ఈ కేటగిరీలో ఒక్కో పోస్టుకు సగటున 175 మంది పోటీ పడుతున్నారు. అదే విధంగా బీసీ–బీ కేటగిరీలో 37 పోస్టులు ఉండగా ఒక్కో పోస్టుకు సగటున 128 మంది పోటీలో ఉన్నారు. ఆ తర్వాత బీసీ–ఈ, బీసీ–సీ కేటగిరీల్లో పోటీ ఉంది. స్పోర్ట్స్ కేటగిరీలో ఎంపికైన అభ్యర్థుల్లో ఒకరిద్దరు మినహా మిగిలిన వారు ఆ కేటగిరీకే పరిమితం కానున్నారు. హైకోర్టు తీర్పుతో స్పోర్ట్స్ కేటగిరీలో 20 మంది అభ్యర్థులకు టీజీపీఎస్సీ చివరి నిమిషంలో మెయిన్స్‌కు అవకాశం కల్పించినా 19 మందే అన్ని పరీక్షలకూ హాజరయ్యారు. ఇక డిజేబుల్డ్ కేటగిరీలో 24 పోస్టులున్నాయి. ఇందులో 1,299 మంది అభ్యర్థులు ఎంపికైనా వారికి ఓపెన్, కమ్యూనిటీ రిజర్వేషన్లలోనూ అవకాశం లభించనుంది.

తప్పిన విద్యుత్ భారం

- రూ. 1,200 కోట్ల మేర చార్జీలు పెంచాలన్న డిస్కంల ప్రతిపాదనను తిరస్కరించిన ఈఆర్సీ
- నామమాత్రంగా రూ. 30 కోట్ల ఫిక్స్‌డ్ చార్జీల పెంపునకే అనుమతి
- విద్యుత్ సబ్సిడీలను రూ. 11,499 కోట్లకు పెంచేందుకు సర్కారు ఓకే



ఈఆర్సీ సభ్యులు మనోహర్‌రాజు, బండారు కృష్ణయ్యతో కలిసి టారిఫ్ ఆర్డర్‌ను విడుదల చేస్తున్న చైర్మన్ శ్రీరంగారావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపునకు రాష్ట్ర విద్యుత్ సంస్థలు చేసిన విజ్ఞప్తిని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ) తిరస్కరించింది. ఎనర్జీ (విద్యుత్) చార్జీలు, ఫిక్స్‌డ్ చార్జీలు కలిపి మొత్తం రూ. 1,200 కోట్ల చార్జీల పెంపునకు ఉత్తర/దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్/టీజీఎస్పీడీసీఎల్)లు అనుమతి కోరగా నామమాత్రంగా రూ. 30 కోట్ల ఫిక్స్‌డ్ చార్జీల పెంపునకు మాత్రమే ఈఆర్సీ అనుమతిచ్చింది. హెచ్‌టీ కేటగిరీలోని 11 కేవీ కనెక్షన్లతో సమానంగా 33 కేవీ, 132 కేవీ కనెక్షన్ల విద్యుత్ చార్జీలను పెంచాలన్న ప్రతిపాదనలను ఈఆర్సీ తిరస్కరించింది. ఈ మేరకు 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రిటైల్ సప్లై టారిఫ్ ఆర్డర్‌ను సోమవారం రాత్రి ప్రకటించింది. ఈఆర్సీ చైర్మన్ టి. శ్రీరంగారావు, సభ్యులు ఎండీ మనోహర్ రాజు, బండారు కృష్ణయ్యతో కలిసి తమ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు కొత్త టారిఫ్ ఉత్తర్వులు అమలు కానున్నాయి. డిస్కంలు, జెన్‌కో, ట్రాన్స్‌కో, సిరిసిల్లలోని విద్యుత్ సరఫరా సహకార సంఘానికి (సెస్) సంబంధించిన మొత్తం 8 వేర్వేరు పిటిషన్లను పరిష్కరిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు శ్రీరంగారావు తెలిపారు.

తప్పిన రూ. 4 వేల కోట్ల చార్జీల పెంపు

2024–25లో మిగిలిన 5 నెలల్లో రూ. 1,200 కోట్ల చార్జీల పెంపునకు డిస్కంలు అనుమతి కోరగా ఆ లెక్కన వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ. 4 వేల కోట్లకుపైగా ప్రజలపై అదనపు భారం పడేది. ఈఆర్సీ తిరస్కరణతో ప్రజలకు భారీ ఊరట లభించింది.

సబ్సిడీ పెరగడంతో తప్పిన చార్జీల పెంపు

2024–25లో రూ. 57,728.9 కోట్ల ఆదాయం అవసరమని డిస్కంలు అంచనా వేయగా దాన్ని రూ. 54,183.28 కోట్లకు ఈఆర్సీ తగ్గించి ఆమోదించింది. ఆదాయ లోటు అంచనాలను సైతం రూ. 13,022.25 కోట్ల నుంచి రూ. 11,156.4 కోట్లకు తగ్గించింది. సిరిసిల్ల సెస్ ఆదాయ లోటును రూ. 494.95 కోట్ల నుంచి రూ. 343.11 కోట్లకు తగ్గించింది. మొత్తం రూ. 11,499.52 కోట్ల ఆదాయ లోటును ఆమోదించగా ఆ మేరకు విద్యుత్ సబ్సిడీలను పెంచుతామని రాష్ట్ర ప్రభుత్వం ఈఆర్సీకి సోమవారం సాయంత్రం లేఖ ద్వారా హామీ ఇవ్వడంతో విద్యుత్ చార్జీల పెంపు భారం నుంచి ప్రజలకు ఈఆర్సీ ఉపశమనం కల్పించింది. గతేడాది 2023–24తో పోల్చితే రూ. 2,374.7 కోట్లు (26 శాతం) అదనపు సబ్సిడీని ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది.

తగ్గిన టారిఫ్ భారం..

తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) 2023–24కు సంబంధించి రూ. 969 కోట్ల ట్రూఅప్ చార్జీలను డిస్కంల నుంచి వసూలు చేసేందుకు అనుమతి కోరగా డిస్కంలకే రూ. 296.57కోట్ల ట్రూడౌన్ చార్జీలను చెల్లించాలని ఈఆర్సీ ఆదేశించింది. గడువులోగా టారిఫ్, ఎంవైటీ పిటిషన్లు దాఖలు చేయలేదని జెన్‌కోపై రూ. 396 కోట్లు, ట్రాన్స్‌కో, ఎస్ఎల్‌డీసీపై రూ.119 కోట్లు, డిస్కంలపై రూ. 69 కోట్లు కలిపి మొత్తం రూ. 584 కోట్ల జరిమానాలు విధించింది. రూ. 296.57 కోట్ల ట్రూడౌన్ చార్జీలు, రూ. 584 కోట్ల జరిమానాలు కలిపి మొత్తం రూ. 880.57 కోట్లను వినియోగదారులకు బదిలీ చేస్తూ ఆ మేరకు చార్జీల పెంపు భారం నుంచి ఉపశమనం కల్పించింది. దీంతో ప్రస్తుత విద్యుత్ టారిఫ్‌తో పోల్చితే కొత్త టారిఫ్‌తో వినియోగదారులపై 0.47% చార్జీల భారం తగ్గిందని ఈఆర్సీ చైర్మన్ శ్రీరంగారావు తెలిపారు.

టారిఫ్ ఆర్డర్‌లో ముఖ్యాంశాలు

- ఎల్టీ కేటగిరీలో 300 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగించే గృహ కనెక్షన్ల ఫిక్స్‌డ్ చార్జీలను రూ. 10 నుంచి రూ. 50కి పెంచాలన్న ప్రతిపాదనల తిరస్కృతి. 800 యూనిట్లు, ఆపై వాడితేనే రూ. 10 నుంచి రూ. 50కి పెంపునకు అనుమతి.
- ఇక ఎల్టీ గృహేతర వినియోగదారుల ఫిక్స్‌డ్ చార్జీలు రూ. 70 నుంచి రూ. 150కి పెంచాలన్న ప్రతిపాదనలకు పాక్షిక అనుమతి. 0–300 యూనిట్లలోపు వాడేవారికి పెంపు లేదు. 300 నుంచి 500 యూనిట్లు వాడితే రూ.100కి, 500 యూనిట్లకుపైగా వాడితే రూ.150కి ఫిక్స్‌డ్ చార్జీలు పెరుగుతాయి.
- హెచ్‌టీ కేటగిరీ వినియోగదారుల ఫిక్స్‌డ్ చార్జీలను రూ.475 నుంచి రూ.500కు పెంచాలన్న ప్రతిపాదనలకు అనుమతి.

కనీస చార్జీలు రద్దు

గృహ కేటగిరీలో కనీస ఎనర్జీ చార్జీలను ఈఆర్సీ రద్దు చేసింది. గృహేతర/వాణిజ్య కేటగిరీలో 50 యూనిట్లలోపు విద్యుత్ వాడే వారి ఫిక్స్‌డ్ చార్జీలను కిలోవాట్‌కు రూ. 60 నుంచి రూ. 30కి తగ్గించింది. ఇదే కేటగిరీలో కనీస ఎనర్జీ చార్జీలను సింగిల్ ఫేజ్‌కు రూ. 65 నుంచి రూ. 50కి, త్రీఫేజ్‌కు రూ. 200 నుంచి రూ. 100కు తగ్గించింది.

జనవరి 22 నుంచి జేఈఈ మెయిన్స్

- ఏప్రిల్ 1 నుంచి 8 వరకు రెండో దశ పరీక్ష
- మొదలైన ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ
- తొలి దశ ఫలితాలు ఫిబ్రవరి 12న, ఏప్రిల్ 17న.. రెండో దశ రిజల్ట్స్
- నోటిఫికేషన్ విడుదల చేసిన జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ

సాక్షి, హైదరాబాద్: దేశంలోని ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలతో పాటు కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సాంకేతిక కళాశాలల్లో ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్, ప్లానింగ్ కోర్సుల్లో ఏటా ప్రవేశాలకు ఉద్దేశించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (జేఈఈ మెయిన్స్–2025) నోటిఫికేషన్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సోమవారం విడుదల చేసింది. రెండు దఫాలుగా మెయిన్స్‌ను నిర్వహించనున్నట్లు వెల్లడించింది. మొదటి సెషన్‌ను జనవరి 22 నుంచి 31 వరకు... రెండో సెషన్‌ను ఏప్రిల్ 1 నుంచి 8 వరకు నిర్వహిస్తామని తెలిపింది. మొదటి విడత ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ సోమవారం సాయంత్రం నుంచి మొదలైంది. నవంబర్ 22 రాత్రి 9 గంటల వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తారు. అదేరోజు రాత్రి 11:50 గంటల్లోగా పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. రెండో విడత దరఖాస్తుల స్వీకరణ వచ్చే ఏడాది జనవరి 31 నుంచి మొదలు కానుంది. ఫిబ్రవరి 24న రాత్రి 9 గంటల వరకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తారు. తొలి దశ ఫలితాలను ఫిబ్రవరి 12న, రెండో దశ ఫలితాలను ఏప్రిల్ 17న ప్రకటిస్తారు. జేఈఈ మెయిన్స్‌లో అర్హత సాధించిన వారిలో 2.5 లక్షల మందిని ఐఐటీల్లో ప్రవేశాలకు అర్హత పరీక్ష అయిన జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక చేస్తారు. అందులో అర్హత సాధించిన వారికి ఐఐటీలు ప్రవేశాలు కల్పిస్తాయి.

సెక్షన్–బీలో చాయిస్ ఎత్తివేత

జేఈఈ మెయిన్స్–సెక్షన్–బీలో మూడేళ్లుగా కొనసాగుతున్న చాయిస్‌ను ఈసారి ఎత్తేశారు. జేఈఈ మెయిన్స్‌లో ఒక్కో ప్రశ్నకు 4 మార్కుల చొప్పున 75 ప్రశ్నలతో మొత్తం 300 మార్కులకు ప్రశ్నపత్రం ఇచ్చేవారు. గణితం, భౌతిక, రసాయన శాస్త్రాల నుంచి 25 చొప్పున ప్రశ్నలు ఉండేవి. కోవిడ్ నేపథ్యంలో విద్యార్థులకు వెసులుబాటు ఇచ్చేందుకు ప్రతి సబ్జెక్టులో చాయిస్ ప్రశ్నలు ఇచ్చారు. జేఈఈ మెయిన్స్ 2021 నుంచి ఒక్కో సబ్జెక్టులో 30 చొప్పున మొత్తం 90 ప్రశ్నలు ఇస్తూ వచ్చారు. ప్రతి సబ్జెక్టులో ఏ, బీ సెక్షన్లు ఉండేవి. సెక్షన్–ఏలో 20 ప్రశ్నలకు మొత్తం జవాబులు రాయాలి. సెక్షన్–బీలో 10 ఇచ్చి ఐదు ప్రశ్నలకు సమాధానాలు గుర్తించేలా చాయిస్ ఇస్తున్నారు. ఈసారి నుంచి ఆ చాయిస్ తీసేస్తున్నారు.

జేఈఈ మెయిన్స్-2025 షెడ్యూల్ ఇలా..

తొలి దశ మెయిన్స్...

28-10-2024 నుంచి 22-11-2024 ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

22-1-2025 నుంచి 31-1-2025 మెయిన్స్ పరీక్ష

12-2-2025 ఫలితాల ప్రకటన

రెండో దశ మెయిన్స్

31-1-2025 నుంచి 24-2-2025 దరఖాస్తుల స్వీకరణ

1-4-2025 నుంచి 8-4-2025 మెయిన్స్ పరీక్ష

17-4-2025 ఫలితాల ప్రకటన

బీబీనగర్ ఎయిమ్స్‌లో డ్రోన్ సేవలు

- నేడు ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- హైదరాబాద్ నైపర్‌లో ఎక్స్‌లెన్స్ సెంటర్‌కు శంకుస్థాపన

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలోని బీబీనగర్ ఎయిమ్స్‌లో అత్యవసర వైద్యం అందించేందుకు వీలుగా డ్రోన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. వైద్య రంగ సేవల్లో సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని పెంచేందుకు, ఆరోగ్య సంరక్షణను మరింత అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో దేశవ్యాప్తంగా 11 తృతీయ ఆరోగ్య సంరక్షణ సంస్థలలో డ్రోన్ సేవలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం ప్రారంభించనున్నారు. అలాగే బల్క్ డ్రగ్స్ కోసం దేశంలోని మరో మూడు ప్రాంతాలతో పాటు హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైపర్)లో ఎక్స్‌లెన్స్ సెంటర్‌కు శంకుస్థాపన జరగనుంది. మరోవైపు మెడికల్ పరికరాలు, బల్క్ డ్రగ్స్ కోసం ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) పథకం కింద ప్రారంభించే ఐదు ప్రాజెక్టుల్లో ఒకటి హైదరాబాద్‌కు కేటాయించారు. ఆయా సేవలు, ప్రాజెక్టులకు ప్రధాని ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ధన్వంతరి జయంతి, తొమ్మిదవ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా భారతదేశంలో ఆరోగ్య సంరక్షణ రంగానికి మరింత ఊతమిచ్చేలా మొత్తం రూ.12,850 కోట్ల విలువైన బహుళ ఆరోగ్య సంబంధిత ప్రాజెక్టులకు ప్రధాని శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో భాగంగా ఆదాయంతో సంబంధం లేకుండా ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎం-జేఏవై)కి కొనసాగింపుగా 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరికీ ఆరోగ్య కవరేజీని విస్తరింపజేసే పథకం కూడా ప్రారంభం కానుంది. టీకా ప్రక్రియను పూర్తిగా డిజిటలైజ్ చేయడం ద్వారా గర్భిణీ స్త్రీలు, శిశువులకు ప్రయోజనం చేకూర్చే యూ-విన్ పోర్టల్‌ను పీఎం ప్రారంభించనున్నారు.

తను పాఠాలు చెప్పే పాఠశాలలోనే కుమారుడికి అడ్మిషన్

ఆదర్శంగా నిలిచిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు



కుమారుడిని పాఠశాలలో చేర్పిస్తున్న టీచర్ గిద్దె శ్రుతి

మహబూబాబాద్ రూరల్: డీఎస్సీ–2024 ద్వారా మహబూబాబాద్ మండలంలోని బ్రాహ్మణపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా నియామకమైన గిద్దె శ్రుతి తన కుమారుడు సాహస్ అభినందన్‌ను అదే పాఠశాలలో చేర్పించి పలువురికి ఆదర్శంగా నిలిచారు. కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినందుకు ఉపాధ్యాయురాలు శ్రుతిని హెచ్ఎం ధారావత్ భద్రు అభినందించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించడం ద్వారా సమాజంలో ఆయా పాఠశాలల పట్ల నమ్మకం పెంచినవారవుతారని పేర్కొన్నారు.

అధునాతనం.. సువిశాలం





యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ భవన నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసిన డిజైన్లు ఇవి. వర్సిటీలో పరిపాలనా భవనంతోపాటు అకడమిక్ బ్లాక్, వర్క్‌షాప్‌లు, హాస్టల్ భవనాలు, డైనింగ్ హాల్, సిబ్బంది నివాస సముదాయాలు, ఆడిటోరియం, లైబ్రరీ, సువిశాల మైదానం నిర్మించేలా డిజైన్లు రూపొందించారు. 6 వేల మందికి శిక్షణ అందించేలా రూపుదిద్దుకోనున్న ఈ వర్సిటీ ప్రాంగణాన్ని కాంక్రీట్ జంగిల్‌లా కాకుండా పచ్చదనంతో పరుచుకున్నట్లుగా డిజైన్ చేశారు. ప్రధాన భవనం ముందు నీటి కొలను, అన్ని భవనాలపై సోలార్ ప్యానెళ్లు, వర్క్‌షాప్‌లు, అకడమిక్ బ్లాక్‌లో గాలి, వెలుతురు ధారాళంగా ప్రసరించేలా భవనాల నమూనాలకు తుదిరూపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో సుమారు 57 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకోనున్న స్కిల్స్ వర్సిటీకి ప్రముఖ ఇన్‌ఫ్రా సంస్థ మేఘా ఇంజనీరింగ్ రూ. 200 కోట్ల విరాళం అందించడంతోపాటు భవనాలను నిర్మించనుండటం తెలిసిందే. ఈ వర్సిటీ నిర్మాణ పనులు నవంబర్ 6న ప్రారంభం కానున్నాయి.

బీసీ గురుకుల సొసైటీలో కొత్తగా 8 సీఓఈలు

సాక్షి, హైదరాబాద్: బీసీ గురుకుల సొసైటీ పరిధిలో కొత్తగా 8 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ)లను ఏర్పాటు చేయాలని బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ నిర్ణయించింది. సోమవారం సచివాలయంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇతర గురుకుల సొసైటీలతో పోలిస్తే బీసీ సొసైటీలో ఎక్కువ సంఖ్యలో పాఠశాలలున్నప్పటికీ కేవలం 2 సీఓఈలు మాత్రమే ఉన్నాయి. దీంతో వీటి సంఖ్య పెంపు అనివార్యం కావడంతో ప్రస్తుతానికి 8 సీఓఈల ఏర్పాటుకు బోర్డు నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా ఈ సీఓఈల్లో ఐఐటీలు, ఎన్ఐటీలు, నీట్‌లో ఎక్కువ మంది విద్యార్థులు అర్హత సాధించేలా శిక్షణ ఇవ్వనున్నారు. ప్రస్తుతం విద్యార్థులకు ఇస్తున్న రెండు స్కూల్ డ్రెస్సులు, ఒక స్పోర్ట్స్ డ్రెస్‌తో పాటుగా రెండు నైట్ డ్రెస్సులు కూడా ఇవ్వాలని, 90 ప్రాంతాలలో ఉన్న 104 గురుకుల పాఠశాలల్లో ఆర్ఓ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రతి గురుకుల విద్యాసంస్థలో సోలార్ వాటర్ హీటర్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యా ర్థుల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, పరిశుభ్రమైన కిచెన్‌తోపాటుగా స్కూల్ ఆవరణలో శుభ్రత పాటించాలని మంత్రి పొన్నం అధికారులకు సూచన చేశారు.

పత్తి రైతుకు ధరాఘాతం



ఖమ్మం మార్కెట్‌లో వ్యాపారుల జెండా పాటే రూ.6,700
అది కూడా కేవలం ఒకరిద్దరు రైతులకే దక్కిన వైనం

- మిగతా వారికి తేమ పేరుతో రూ.5,500 నుంచి రూ.6,500 చెల్లింపు
- కేవలం 3 సీసీఐ కేంద్రాలే ఏర్పాటు కావడంతో రైతుల ఇక్కట్లు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఈ ఏడాది పత్తి సాగు చేసిన రైతులకు తీరని నష్టం ఎదురవుతోంది. ఓవైపు అధిక వర్షాలతో పంట దెబ్బతిని దిగుబడి తగ్గగా.. మరోవైపు మిగిలిన పత్తికి ధర పలకక పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం జిల్లాతో పాటు భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, నల్లగొండ, మహబూబాబాద్, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాల నుంచి రైతులు పత్తి తీసుకొచ్చారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,521 కాకపోయినా రూ.7 వేలైనా లభిస్తుందని ఆశించగా జెండా పాటే గరిష్టంగా రూ.6,700 పలికింది. కానీ చాలామంది రైతులకు వ్యాపారులు నాణ్యత/తేమ పేరిట అంత కన్నా తక్కువే చెల్లించడం గమనార్హం. అధిక వర్షాల నేపథ్యంలో తేమ శాతం ఎక్కువగా ఉంటుండడంతో దాన్ని అదనుగా చేసుకుని వ్యాపారులు రైతుల్ని దగా చేస్తున్నారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఈనెల 1నుంచి పత్తి కొనుగోళ్లు మొదలయ్యాయి. ఆదివారం వరకు వ్యాపారులు 55,548.2 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారు. కేంద్ర ప్రభుత్వం 8–12 శాతం తేమ ఆధారంగా పత్తికి క్వింటాల్‌కు రూ.7,521 కనీస మద్దతు ధర నిర్ణయించింది. కానీ తేమ అంతకంటే ఎక్కువగా ఉంటే ఆ పత్తిని కొనేందుకు సీసీఐ నిరాకరిస్తోంది. దీంతో వ్యాపారులు రూ.5,500 నుంచి రూ.6,500కే కొనుగోలు చేస్తుండడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

వివిధ ప్రాంతాల నుంచి సోమవారం ఖమ్మం మార్కెట్‌కు తీసుకొచ్చిన పత్తి



అరకొరగా సీసీఐ కొనుగోళ్లు

పత్తి తీసే ప్రక్రియ 60 శాతం పూర్తవుతున్నా సీసీఐ కేంద్రాల ఏర్పాటులో జాప్యం జరుగుతోంది. తొమ్మిది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాల్సి ఉన్నా ఇప్పటివరకు మూడు చోట్లే కొనుగోళ్లు జరుగుతున్నాయి. ఇంతవరకు కేవలం 347.9 క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేశారు. దీంతో వ్యాపారులదే ఇష్టారాజ్యంగా మారుతోంది. దీపావళి సమీపిస్తుండటంతో పెట్టుబడులు, ఇతర అవసరాల కోసం రైతులు సోమవారం దాదాపు 35 వేల బస్తాల పత్తి తీసుకొచ్చారు. అయితే క్వింటాల్ పత్తికి జెండా పాట 6,700 మాత్రమే పలికింది అదికూడా ఒకరిద్దరికే దక్కింది.

దూరం నుంచి వచ్చినా..



పదెకరాల్లో సాగు చేసిన పత్తిలో తొలుత 45 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మా దగ్గర సీసీఐ కేంద్రాలు తెరవకపోవడంతో ఖమ్మం వచ్చా. తేమ పేరుతో తగ్గిస్తున్నారని తెలిసి ఎండ బెట్టి మరీ తీసుకొచ్చా. కానీ జెండా పాట రూ.6,700గా నిర్ణయించిన వ్యాపారులు అంతకన్నా తక్కువకే అడిగినా ఏం చేయలేకపోయా.
– మునుకూరు సురేందర్‌రెడ్డి, బుర్కచర్ల, సూర్యాపేట జిల్లా

ఇంటి దగ్గర అమ్ముకున్నా పోయేది



మూడెకరాల్లో సాగు చేస్తే 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. నాణ్యమైన పత్తిని తీసుకొస్తే క్వింటాల్ రూ.6,700కే కొన్నారు. ఇంటి దగ్గర ప్రైవేట్ వ్యాపారులు రూ.6,500కు అడిగారు. ఖమ్మం మార్కెట్‌కు తీసుకొస్తే రూ.7 వేలు వస్తాయనుకుంటే ఇలా జరిగింది.
– బానోతు జైత్‌రాం, గట్టుసింగారం, ఖమ్మం జిల్లా

ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు కొనుగోలు చేసిన పత్తి **55,896.1** క్వింటాళ్లు | వ్యాపారులు కొనుగోలు చేసింది **55,548.2** క్వింటాళ్లు | సీసీఐ కొనుగోళ్లు **347.9** క్వింటాళ్లు

ఇంజనీర్ల సలహాలు కీలకం

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్



ఖైరతాబాద్: హైదరాబాద్ మహానగరాన్ని వరదల ముంపు నుంచి అరికట్టేందుకు ఇంజనీర్ల సలహాలు కీలమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ తెలంగాణ స్టేట్ సెంటర్ 10వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హైడ్రా కమిషనర్ రంగనాథ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ రంగంలో ఉన్నవారి అనుభవాలను, సూచనలను పాటించి మహానగరాన్ని వరదనీటి ముంపు బారిన పడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. తాను కూడా మెకానికల్ ఇంజనీర్‌నని గుర్తుచేశారు. హైడ్రా అంటే భయపడాల్సిన అవసరం లేదని, ప్రజల ఆస్తులను పరిరక్షించడంతోపాటు వారికి అండగా ఉంటామన్నారు. విపత్తు, ఆపద పరిస్థితుల్లో మాత్రమే కాకుండా రోజు వారి జీవితంలో మంచి వాతావరణం, పర్యావరణం, వరదల నుంచి పట్టణ ప్రజలకు భద్రత కల్పించేందుకు ప్రభుత్వం తీసుకున్న సాహసోపేత నిర్ణయంతోనే హైడ్రా ఏర్పాటైందన్నారు. హైడ్రా ప్రధాన కార్యాలయంలో జల వనరులు, ప్రజారోగ్యం, పర్యావరణం, రోడ్లు, భవనాలు మొదలైన రంగాలకు చెందిన నిపుణులందరితో సంప్రదించి పట్టణ వరదలను తగ్గించేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు.

ఖాకీలకే వసూల్ రాజా!

బయటి వసూళ్లతోపాటు డిపార్ట్‌మెంట్‌లోనూ..

- కానిస్టేబుల్ నుంచి సీఐ ర్యాంకు వరకు కప్పం కట్టాల్సిందే.. డబ్బులిస్తే కేసులున్నా, వివాదాస్పదులైనా పోస్టింగులు
- వసూళ్ల కోసం ఓ కానిస్టేబుల్ నియామకం
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా పోలీసు ఉన్నతాధికారి నిర్వాకం
- ఇంటెలిజెన్స్ రిపోర్టుతో బదిలీకి రంగం సిద్ధం



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఓ పోలీసు ఉన్నతాధికారి వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అత్యంత అవినీతిపరుడిగా పేరొందిన ఆ ఉన్నతాధికారి ఆగడాలను తట్టుకోలేక డిపార్ట్‌మెంట్‌లో కిందిస్థాయి అధికారులు నలిగిపోతుండగా.. డిపార్ట్‌మెంటుకు మచ్చ తెస్తున్న ఆయన తీరుపై పెద్దలు తలలు పట్టుకుంటున్నారు. సాధారణంగా కొందరు పోలీసులు ఇతరుల వద్ద డబ్బులు వసూలు చేసిన ఘటనలు చూస్తుంటాం. కానీ, ఆయన సొంత డిపార్ట్‌మెంట్ వారి వద్ద కూడా వసూలు చేసుకుంటూ సాగుతున్నాడు. ఆయన అక్రమాలపై ఇప్పటికే ఇంటెలిజెన్స్ రిపోర్టు ఇచ్చిన నేపథ్యంలో ఆయన బదిలీ తథ్యమనే ప్రచారం జోరందుకుంది.

జనవరిలోనే దందా మొదలు..

వాస్తవానికి అయ్యవారి లీలలు గత జనవరిలోనే వెలుగుచూశాయి. అప్పట్లో మైనింగ్ వాళ్ల నుంచి దాదాపు రూ.30 లక్షలు వసూలు చేసినట్లు ఇంటెలిజెన్స్ వాళ్లు గుర్తించారు. అప్పటి నుంచి ఇక వెనుదిరిగి చూడలేదు. అప్పుడు ఉన్నతాధికారులు ఏమీ అనలేదనో.. లేక రాజకీయంగా కొందరి అండ దొరికిందని అనుకున్నాడో కానీ.. డిపార్ట్‌మెంట్‌లో వసూళ్ల వేగం పెంచాడు. ఇతని ఏరియాలో ఉన్న మైనింగ్, క్వారీ, ఇటుకబట్టీలు తదితరాల నుంచి వసూళ్లను దండుకుంటున్నాడు. గుట్కాతోపాటు అన్ని రకాల అక్రమ వ్యాపారులతో మిలాఖత్ అయ్యాడు. వసూళ్ల కోసం తనకు అనుకూలంగా ఉన్న ఓ కానిస్టేబుల్‌ను నియమించుకున్నాడు. ప్రతీ వసూళ్లలో అతనికి 10% వాటా ఇస్తాడు. ఒకటి రెండు కేసుల్లో నిందితులను అనుకూలంగా మలుచుకున్నారన్న ప్రచారం కూడా ఉంది.

ఎస్‌హెచ్‌వో కావాలంటే 2 లక్షలివ్వాలి

ఈ అధికారి వద్ద ఎస్సై నుంచి సీఐ వరకు ఎస్‌హెచ్‌వోగా చేరాలంటే తొలుత రూ.2 లక్షలు చెల్లించాలి. ఆపై ప్రతీ నెల సీఐ రూ.50వేలు, ఎస్సై రూ.40 వేలు ప్రతీ నెలా కప్పం కట్టి 'రెన్యువల్'చేయించుకోవాలి. లేకపోతే వారి పనిలో లోపాలు చూపి వేధించి, వారే వెళ్లిపోయేలా చేస్తాడు. అదే సమయంలో డిపార్ట్‌మెంట్‌లో కేసులు నమోదై అవినీతి, మిస్‌కండక్ట్ ఆరోపణలు ఎదుర్కొంటూ లూప్‌లైన్‌లో ఉన్న వారంతా ఇతన్ని ఆశ్రయిస్తున్నారు. వారి వద్ద డబ్బులు తీసుకుని ఆయన పోస్టింగులు ఇస్తున్నాడు. ఇటీవల జరిగిన కానిస్టేబుల్ బదిలీల్లోనూ తలా రూ.10వేల చొప్పున రూ.లక్షలు వసూలు చేశాడని డిపార్ట్‌మెంట్ కోడై కూస్తోంది. ఇటీవల ఓ కానిస్టేబుల్ అక్రమాలు పెరిగిగాయని అతని పైఅధికారి బదిలీ వేటేశాడు. కానీ..అయ్యవారు సదరు కానిస్టేబుల్‌కి పాత స్థానంలో పోస్టింగ్ ఇచ్చి తన 'పెద్ద'మనసు చాటుకున్నాడు.

కీలక నేత వద్ద భంగపాటు

సదరు అధికారిపై అవినీతి ఆరోపణలు రోజురోజుకు మితిమీరి పోయాయి. అయితే, ఇంటెలిజెన్స్ తన ఆగడాలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తుందన్న విషయాన్ని సదరు అధికారి ఆలస్యంగా గుర్తించాడు. రేపోమాపో బదిలీ వేటు పడబోతుందని ముందే తెలుసుకున్నాడు. వెంటనే ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఓ సీనియర్ నేతను ఆశ్రయించాడు. అయితే, సదరు అధికారి అక్రమాలపై అప్పటికే ఆగ్రహంతో ఉన్న ఆయన ఎలాంటి హామీ ఇవ్వలేదని సమాచారం. ఇతని ఆగడాలపై విసిగి వేసారిన పలువురు పోలీసు అధికారులే స్వయంగా మంత్రులను కలిసి ఫిర్యాదులు చేస్తుండటంతో ఇతనిపై వేటు తప్పదన్న ప్రచారం జరుగుతోంది.

పామాయిల్ టన్నుకు రూ.20 వేలు వచ్చేలా చేస్తాం..: తుమ్మల



దమ్మపేట: తెలంగాణ రాష్ట్రాన్ని పామాయిల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని, పామాయిల్ టన్ను కనీస ధర రూ.20 వేలు వచ్చేలా కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఇటీవల మలేసియా పర్యటనకు వెళ్లొచ్చిన మంత్రి.. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గండుగులపల్లిలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఆ దేశంలో పామాయిల్ సాగులో అవలంబించే సాంకేతిక విధానాలు, ప్రాసెసింగ్, రిఫైనరీ ప్లాంట్లను అధికారులతో కలసి పరిశీలించామని, ఆ దేశ వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి, ఎక్స్‌టర్నల్ ట్రేడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, పామాయిల్ బోర్డు డైరెక్టర్లతో సమావేశమై తెలంగాణలో వాణిజ్య అవకాశాలు, వ్యాపార సంబంధాలు, పామాయిల్ సాగుకు తోడ్పాటు తదితర అంశాలపై చర్చించామని వివరించారు. రాష్ట్రంలోని 31 జిల్లాలు పామాయిల్ సాగుకు అనుకూలంగా ఉన్నందున త్వరలోనే ప్రతి ఉమ్మడి జిల్లా కేంద్రంలో ఆయిల్ ఫెడ్ కేంద్రాలను విస్తరింపజేస్తామని చెప్పారు. పామాయిల్ సాగులో ఎక్కువ దిగుబడి ఇచ్చేలా మలేసియా సహకారం, సాంకేతికతతో రాష్ట్రంలో పామాయిల్ సీడ్ గార్డెన్, ఆయిల్ రిఫైనరీల ఏర్పాటుకు కృషి చేస్తామని వెల్లడించారు. పామాయిల్ సాగులో వినియోగించే యంత్రాలు, పరికరాలను మలేసియా నుంచి దిగుమతి చేసుకుంటామన్నారు. పామాయిల్ వ్యర్థాల నుంచి పలు ఉత్పత్తులను తయారుచేసేలా ఫ్యాక్టరీలు నెలకొల్పాలని మలేసియా ప్రతినిధులను ఆహ్వానించామని తెలిపారు. పామాయిల్, కొబ్బరి సాగులో అంతరపంటలుగా కోకో, వక్క, మిరియాలు, మునగ వంటివి సాగుచేస్తే ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు.

వీఐపీ దర్శనాలు రద్దు చేయండి

సుప్రీంకోర్టులో పిటిషన్..

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో వీఐపీ దర్శనాలను రద్దుచేయాలని విజయ్‌కిశోర్ గోస్వామి అనే వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆలయాల్లో వీఐపీ దర్శనాలు సమానత్వ హక్కు ఉల్లంఘన కిందకు వస్తాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న దేవాలయాల్లో రోజురోజుకీ ఈ వీఐపీ దర్శనాలు, ప్రత్యేక చెల్లింపు దర్శనాలు పెరుగుతున్నందున వీటిని రద్దుచేయాలంటూ ఆయన పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిసెంబరులో విచారించనుంది.

వీఐపీకి చట్టంలో నిర్వచనంలేదు..

'వీఐపీ'(చాలా ముఖ్యమైన వ్యక్తి) అనే పదానికి చట్టంలో ఎక్కడా నిర్వచనం లేదని విజయ్‌కిశోర్ గోస్వామి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ వీఐపీల వల్ల సామాన్య భక్తులకు ఇబ్బంది కలుగుతోందని.. దీంతో వారు సరైన రీతిలో దేవుని దర్శనానికి నోచుకోలేకపోతున్నారని తెలిపారు. అసలు దేవుని దర్శనానికి ప్రత్యేకమైన చెల్లింపులు ఏమిటని.. అధిక మొత్తం చెల్లించగలిగే స్తోమత కలిగిన వారిని ప్రత్యేకంగా చూడడం ఏమిటని.. డబ్బులేని వారు తమ పూజా హక్కును కోల్పోవడమేనా? అంటూ ప్రశ్నలు లేవనెత్తారు. ఎటువంటి ప్రత్యేక కేటగిరీ లేకుండా భక్తులందరినీ సమానంగా చూడాలని, దీనికోసం జాతీయ స్థాయిలో ఒక బోర్డును ఏర్పాటుచేయాలంటూ గోస్వామి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర సాంస్కృతిక–పర్యాటక శాఖలు, ఏపీ సహా పలు రాష్ట్రాలను ప్రతివాదులుగా చేర్చారు. పిటిషన్‌ను స్వీకరించిన ధర్మాసనం డిసెంబరు 10న విచారించనుంది.

ఒంటిపై పెట్రోల్ పోసుకుని..

- ప్రజావాణిలో వ్యక్తి హల్‌చల్
- డీసీ, ఏసీపీలను సస్పెండ్ చేయాలని డిమాండ్
- అధికారులు తన ఫిర్యాదును పట్టించుకోలేదని ఆరోపణ



ప్రజావాణి కార్యక్రమంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్న అనిల్‌ను అడ్డుకుంటున్న సిబ్బంది

సాక్షి, హైదరాబాద్: జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన 'ప్రజావాణి'కార్యక్రమంలో రాంనగర్‌కు చెందిన అనిల్‌కుమార్ అనే వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకోవడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. ప్రజావాణికి అందరిలాగే వచ్చిన ఆయన బాటిల్‌లో పెట్రోల్‌తీసుకురావడాన్ని ఎవరూ గమనించలేదు. ఆయన ఒక భవన నిర్మాణానికి సంబంధించిన ఫిర్యాదును వేదికమీది అధికారులకు అందించారు. వారు దానిని పరిశీలిస్తుండగానే ఆయన ఒంటిపై పెట్రోల్ పోసుకోవడంతో వెంటనే అప్రమత్తమైన విజిలెన్స్, పోలీసు సిబ్బంది అడ్డుకున్నారు. జోనల్ ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా, ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదు చేసినా, అధికారులెవరూ తన సమస్యను పట్టించుకోవడం లేదని, పూర్తిగా అవినీతిలో మునిగిన సంబంధిత సర్కిల్ డీసీ, ఏసీపీలను సస్పెండ్ చేయాలని కోరారు. రాంనగర్‌లో ఒక భవన నిర్మాణాన్ని ఆపాల్సిందిగా ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, సదరు స్థలంలో తనకు వాటా రావాలని, అధికారుల చర్యల వల్ల తనకు ఎంతో నష్టం జరిగిందని ఆయన విచారం వ్యక్తం చేశారు. ముషీరాబాద్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ దేవేందర్ లంచం తీసుకొని తనకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

హుటాహుటిన క్షేత్రస్థాయికి అధికారులు..: ఊహించని ఈ పరిణామంతో సీపీ సహా టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణంగా అనిల్ పేర్కొన్న భవనం వద్దకు చేరుకున్నారు. వివరాలిచ్చేందుకు రావాల్సిందిగా భవనం నిర్మిస్తున్న వ్యక్తికి ఫోన్లు చేసినా ఆయన రాలేదని అధికారులు తెలిపారు. కాగా, గతంలో ఉన్న క్వార్టర్‌ను కూల్చిన స్థలంలో భవన నిర్మాణం జరుగుతుండగా, అందులో తనకు వాటా రావాలనేది అనిల్ వాదనగా తెలిసింది. అయితే ఆయన వాటాకు సంబంధించి ఎలాంటి డాక్యుమెంట్లు చూపించలేదని జీహెచ్‌ఎంసీ వర్గాల సమాచారం.

కుమారుడి మృతదేహం పక్కనే మూడు రోజులుగా..!

- కొడుకు చనిపోయిన విషయాన్ని గుర్తించలేని స్థితిలో అంధ దంపతులు
- పిలిచినా స్పందన రాక.. తిండి తిప్పలు లేక దీనావస్థ..
- మానవత్వం చాటుకున్న నాగోలు సీఐ, సిబ్బంది

నాగోలు: అసలే వృద్ధ దంపతులు.. ఆపై అంధత్వం. వారి ఆలనాపాలన చూసుకుంటున్న చిన్న కుమారుడు గత మూడు రోజులు క్రితం ఇంట్లోనే చనిపోయాడు. అయితే కనీసం కుమారుడు చనిపోయాడన్న విషయం కూడా తెలియని ఆ వృద్ధ దంపతులు కుమారుడిని పిలిచీ పిలిచీ మూడు రోజులుగా ఆకలి దప్పికతో అలమటించిపోయారు. ఈ విషాద ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాగోలు సీఐ సూర్య నాయక్ తెలిపిన వివరాల ప్రకారం... నాగోలు డివిజన్ పరిధిలోని జైపురికాలనీలో నివాసం ఉండే వృద్ధదంపతులు కొలా రమణ, శాంతకుమారి అంధులు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు ప్రదీప్‌కుమార్ వేరే చోట ఉండటంతో దీంతో చిన్న కుమారుడు ప్రమోద్‌కుమార్ (32)తో కలిసి వృద్ధ దంపతులు ఉంటున్నారు. పెయింటర్‌గా పనిచేసే ప్రమోద్‌కుమార్ మద్యానికి బానిస కావడంతో భార్య దూరంగా ఉంటోంది. ఈ క్రమంలో ప్రమోద్‌కుమారే తల్లిదండ్రులను చూసుకుంటున్నాడు. అయితే మద్యం మత్తులో మూడురోజుల క్రితం ప్రమోద్‌కుమార్ ఇంట్లోనే చనిపోయాడు. అంధులైన తల్లిదండ్రులు కుమారుడు చనిపోయిన విషయం తెలియక పిలిచీపిలిచీ తిండితిప్పలు లేక దీనావస్థలో ఉండిపోయారు. కాగా వారి ఇంటి నుంచి చుట్టుపక్కల వారికి దుర్వాసన రావడంతో వారు నాగోలు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే నాగోలు సీఐ సూర్యనాయక్, ఎస్‌ఐ శివ నాగప్రసాద్, ఇతర సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఒకవైపు కుళ్లిపోయిన మృతదేహం, మరోవైపు దీనావస్థలో ఉన్న వృద్ధ దంపతులను చూసి చలించిపోయారు. దీంతో వెంటనే వారికి బయటకు తీసుకువచ్చి ఆ దంపతులకు స్నానం చేయించి ఆహారపదార్థాలను అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. అనంతరం వృద్ధులతో మాట్లాడి వారి చిన్న కొడుకు చనిపోయాడని తెలియజేసి, పెద్ద కుమారుడు ప్రదీప్‌కుమార్‌ను పిలిపించి వృద్ధ దంపతులను అప్పజెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.



అంధ దంపతులు రమణ-శాంతికుమారి

మీరేం చేస్తున్నారో.. మాకు తెలుసు...

- వాట్సాప్ గ్రూపుల్లో పెడుతున్న పోస్టులపై నిఘా ఉంది
- ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోల్లో పాల్గొనవద్దు
- సచివాలయ పోలీసు సెక్యూరిటీ సిబ్బందికి చీఫ్ సెక్యూరిటీ అధికారి ఆదేశం



సాక్షి, హైదరాబాద్: 'మీరేం చేస్తున్నారో.. మాకు తెలుసు.. సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టడం.. లైక్‌లు కొట్టడం.. లాంటివి జరుగుతున్నాయి. మీ కదలికలను గమనిస్తున్నాం. సోషల్ మీడియాలో గ్రూపు అడ్మిన్‌లుగా ఉంటే వెంటనే బయటకు వచ్చేయండి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టి అనవసర విషయాల్లో జోక్యం చేసుకోవద్దు'అంటూ సచివాలయంలో విధులు నిర్వహించే తెలంగాణ స్పెషల్ పోలీసు (టీజీఎస్పీ)లకు సచివాలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జారీ చేసిన మెమో చర్చనీయాంశమైంది. సచివాలయంలో సెక్యూరిటీ, యాక్సెస్ కంట్రోల్ విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది అనవసర విషయాల్లో జోక్యం చేసుకోవద్దని హెచ్చరించారు.

'రాష్ట్రానికి అతి ముఖ్యమైన సచివాలయంలో విధులు నిర్వహించే పోలీసులు ఏం చేస్తున్నారు, ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరిని కలుస్తున్నారు. ఎవరితో మాట్లాడుతున్నారు. సోషల్ మీడియాలో ఏ పోస్టులు పెడుతున్నారు అనే దానిపై నిఘా ఉంటుంది. సోమవారం నుంచి సచివాలయం చుట్టూ రెండు కిలోమీటర్ల వరకు 144 సెక్షన్ అమల్లో ఉన్న నేపథ్యంలో ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడి ఉన్నా, ధర్నాలు, రాస్తారోకోలు, సచివాలయ ముట్టడిలాంటి వాటిల్లో పాల్గొంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. ఈ విషయాన్ని మీ కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులకు తెలపండి. మీరు వివిధ వాట్సాప్ గ్రూప్‌లలో అడ్మిన్‌గా ఉంటూ టీజీఎస్పీ వ్యవస్థ గురించి, పోలీసు ఆఫీసర్స్ గురించి రెచ్చగొట్టేలా పోస్టులు పెడుతున్నారు. అలాంటి గ్రూప్‌ల నుంచి తక్షణమే ఎగ్జిట్ అవ్వండి'అని మెమోలో స్పష్టం చేశారు. 'మీరు, మీ కుటుంబ సభ్యులు కూడా ఎటువంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, అనుమతిలేని కార్యక్రమాల్లో పాల్గొనవద్దు, అలా చేయడం వలన అనేక ఇబ్బందులు ఎదుర్కొనాల్సి ఉంటుంది'అని హెచ్చరించారు. పొరపాటున తప్పులు చేసి దొరికితే తక్షణమే శాఖాపరమైన చర్యలు తీసుకుంటారని, వీటిని దృష్టిలో పెట్టుకుని విధులు నిర్వర్తించాలని సచివాలయ చీఫ్ సెక్యూరిటీ అధికారి స్పష్టంచేశారు.

21 మంది టీజీఎస్పీ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

- ధర్నాచౌక్‌లో నిరసన తెలుపుతూ అరెస్టయిన సిబ్బంది
- వారిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టినట్టు టీజీఎస్పీ అదనపు డీజీ సంజయ్‌కుమార్ జైన్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద సోమవారం నిరసనలో పాల్గొని అరెస్టయిన 21 మంది టీజీఎస్పీ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. క్రమశిక్షణ రాహిత్యానికి పాల్పడినందున మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో తెలపాలంటూ నోటీసులు జారీ చేసినట్టు టీజీఎస్పీ అడిషనల్ డీజీ సంజయ్‌కుమార్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. కొందరు టీజీఎస్పీ సిబ్బంది బెటాలియన్ ప్రాంగణంలో, బయట నిరసనలకు పాల్పడ్డారని.. పదే పదే హెచ్చరించినా పోలీసుశాఖ ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరించారని పేర్కొన్నారు. హైదరాబాద్ నగర పరిధిలో సమావేశాలు, ర్యాలీలు, బహిరంగ ప్రదర్శనలను నిషేధిస్తూ పోలీస్ కమిషనర్ ఆదేశాలు జారీచేసినా.. 21 మంది టీజీఎస్పీ సిబ్బంది అనధికారిక నిరసనలో పాల్గొనడంతో వారిని అరెస్టు చేశారని తెలిపారు.

కొనసాగిద్దామా ఆపేద్దామా?

ఆందోళనలపై టీజీఎస్పీ సిబ్బందిలో తర్జనభర్జన!

- వద్దని సీనియర్లు.. ఇప్పుడుకాకపోతే ఇంకెప్పుడని జూనియర్లు..
- పోలీసు ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకుంటుండటమే కారణం
- ఇప్పటికే పది మంది డిస్మిస్, 39 మంది సస్పెన్షన్
- నిరసనల నేపథ్యంలో సచివాలయం, డీజీపీ ఆఫీస్ వద్ద బందోబస్తు

సాక్షి, హైదరాబాద్

'ఏక్ పోలీస్'విధానం, సెలవులు, ఇతర అంశాలపై ఆందోళన బాట పట్టిన తెలంగాణ స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ) సిబ్బంది అంతర్మథనంలో పడినట్టు తెలిసింది. ఆందోళన కొనసాగిద్దామా? ఇంతటితో ఆపేద్దామా? అనే తర్జనభర్జన పడుతున్నట్టు సమాచారం. పోలీసు ఉన్నతాధికారులు కఠిన వైఖరి తీసుకోవడమే దీనికి కారణమని చెబుతున్నారు. అయితే చాలా వరకు సీనియర్లు 'ఆందోళనలు వద్దు.. ఇబ్బందులు కొనితెచ్చుకోవద్దు'న్న యోచనలో ఉండగా.. 2018 తర్వాత భర్తీ అయిన యువ సిబ్బంది మాత్రం ఆందోళన విషయంలో వెనక్కితగ్గవద్దనే భావన వ్యక్తం చేస్తున్నారు. నిజానికి ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్నారని గుర్తించిన 39 మంది టీజీఎస్పీ సిబ్బందిని సస్పెండ్ చేస్తూ అధికారులు తొలుత హెచ్చరికలు పంపారు. ఆ సస్పెన్షన్లను ఎత్తివేయాలంటూ కొన్నిచోట్ల మళ్లీ ఆందోళనలు చేయడంతో ఉన్నతాధికారులు ఆగ్రహించారు. ఈ క్రమంలోనే క్రమశిక్షణ ఉల్లంఘించారంటూ పది మందిని డిస్మిస్ చేశారు.

మెత్తబడిన సీనియర్లు!

తాము ఉద్యోగంలో చేరిన నాటి పరిస్థితులతో పోలిస్తే.. ఇప్పుడు టీజీఎస్పీ సిబ్బందికి మెరుగైన సదుపాయాలే అందుతున్నాయని కొందరు టీజీఎస్పీ సీనియర్లు చెప్తున్నారు. సెలవుల్లో మార్పుల ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేయడం, అన్ని బెటాలియన్లలో దర్బార్లు ఏర్పాటు చేసి సిబ్బంది సమస్యలు చెప్పుకొనేందుకు అవకాశం కల్పించడం, టీజీఎస్పీ అడిషనల్ డీజీ సంజయ్‌కుమార్ జైన్ సైతం నేరుగా తనకు సమస్యలు చెప్పుకోండి అంటూ ఈ–మెయిల్ ఐడీ, వాట్సాప్ నంబర్లు ఇవ్వడాన్ని సానుకూల అంశంగా వారు పేర్కొంటున్నట్టు తెలిసింది. అయితే దశాబ్దాలుగా ఉన్న సమస్యలపై ఉన్నతాధికారులు ఇప్పుడిప్పుడే దృష్టి పెడుతున్నందున.. ఇంకాస్త పట్టుదలతో ఉంటే 'ఏక్ పోలీస్'విధానం, ఇతర డిమాండ్లు సాధించుకోవచ్చని జూనియర్లు పేర్కొంటున్నట్టు సమాచారం.

సర్దిచెబుతున్న ఉన్నతాధికారులు

ఉన్నతాధికారులు బెటాలియన్లలో క్షేత్ర స్థాయి అంశాలపై దృష్టిపెట్టడంతోపాటు సిబ్బందికి వాస్తవ పరిస్థితులను క్షుణ్నంగా వివరించే ప్రయత్నం కొనసాగిస్తున్నారు. సర్వీస్ నిబంధనలు, డిమాండ్ల అమలుపై సాధ్యాసాధ్యాలను వివరిస్తున్నారు. అదే సమయంలో ఆందోళనలకు దిగితే వేటు తప్పదన్న హెచ్చరికలూ చేస్తున్నారు. మరోవైపు సోమవారం సైతం టీజీఎస్పీ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టే అవకాశం ఉందన్న నిఘావర్గాల సమాచారం మేరకు.. సచివాలయం, డీజీపీ కార్యాలయం సహా పలుచోట్ల ముందస్తుగా భద్రత ఏర్పాటు చేశారు. ఆ భద్రత విధుల్లో ఎక్కువ శాతం టీజీఎస్పీ సిబ్బందే ఉండటం గమనార్హం.

నల్లబ్యాడ్జీలతో బైఠాయించి నిరసన

ఖిలా వరంగల్: వరంగల్ మామునూరు టీజీఎస్పీ నాలుగో బెటాలియన్ ప్రాంగణంలో సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి రోడ్డుపై బైఠాయించారు. ఏక్ పోలీస్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని.. సస్పెన్షన్, డిస్మిస్ చేసిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని నినాదాలు చేశారు. దీనితో బెటాలియన్ ఎదుట సివిల్ పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. టీజీఎస్పీ సిబ్బంది బయటికి వస్తే అరెస్ట్ చేయడానికి సిద్ధమయ్యారు. కానీ వారు బెటాలియన్ ప్రాంగణంలోనే నిరసన తెలిపారు.



పోలీసులను అరెస్టు చేసిన పోలీసులు

కవాడిగూడ (హైదరాబాద్): కొందరు టీజీఎస్పీ సిబ్బంది తమ సమస్యలను పరిష్కరించాలంటూ సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దోమలగూడ పోలీసులు వారిని అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం టీజీఎస్పీ సిబ్బంది మీడియాతో మాట్లాడారు. తనకు పోలీసుల సమస్యలు తెలుసని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏక్ పోలీస్ విధానాన్ని అమలుచేస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సిబ్బంది సస్పెన్షన్లు, డిస్మిస్‌లపై ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడు, కర్ణాటక మాదిరిగా తెలంగాణలోనూ ఏక్ పోలీస్ విధానం అమలు చేయాలని కోరారు.

సాక్షి
స్పోర్ట్స్
మంగళవారం
29-10-2024



రాణి రాంపాల్‌పై ప్రశంసలు కురిపించిన ప్రధాని మోదీ

భారత హాకీ స్టార్, ఇటీవలే రిటైర్మెంట్ ప్రకటించిన రాణి రాంపాల్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. అసమాన ప్రతిభకు జెర్సీ నంబర్ 28 చిరునామాగా మారిందని ఆయన అన్నారు. 29 ఏళ్ల రాణి భారత మహిళల హాకీ అత్యుత్తమ ప్లేయర్లలో ఒకరిగా గుర్తింపు తెచ్చుకుంది. ఆమె సారథ్యంలోనే టోక్యో ఒలింపిక్స్‌లో జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. 'భారత హాకీలో అసమాన ప్రతిభ, అత్యున్నత స్థాయి లక్ష్యాలకు నీ 28 నంబర్ జెర్సీ చిరునామాగా నిలిచింది. ఇకపై మైదానంలో ఆ ఆట కనిపించకపోవచ్చు గానీ ఒక అత్యుత్తమ క్రీడాకారిణిగా నువ్వు అందించిన జ్ఞాపకాలు ఎప్పటికీ అభిమానుల గుండెల్లో నిలిచి ఉంటాయి. అతి పిన్న వయసులో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన నువ్వు నీ ఆటతో భారత జట్టుకు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించావు. సారథిగా ముందుండి నడిపించిన నువ్వు ఇప్పుడు రిటైర్మెంట్ తర్వాత కూడా కొత్త బాధ్యతతో ఆటలోనే కొనసాగడం సంతోషకరం' అని మోదీ తన సోషల్ మీడియా ద్వారా అభినందించారు.

విక్కీ, సుజీత్, అభిషేక్‌లకు కాంస్యాలు



కాంస్య పతకాలతో భారత రెజ్లర్లు విక్కీ, సుజీత్, అభిషేక్

టిరానా (అల్బేనియా): ప్రపంచ అండర్-23 రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలను భారత రెజ్లర్లు తొమ్మిది పతకాలతో ముగించారు. పురుషుల ఫ్రీస్టయిల్ విభాగంలో ఆదివారం చిరాగ్ చికారా 57 కేజీల విభాగంలో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకోగా... విక్కీ (97 కేజీలు), సుజీత్ కల్కాల్ (70 కేజీలు), అభిషేక్ ఢాకా (61 కేజీలు) కాంస్య పతకాలను దక్కించుకున్నారు. కాంస్య పతక బౌట్‌లలో విక్కీ 7-2తో ఇవాన్ ప్రిమచెంకో (ఉక్రెయిన్)పై, సుజీత్ 13-4తో ముస్తఫా అహ్మదోవ్ (తజికిస్తాన్)పై, అభిషేక్ 3-1తో మికితా అబ్రమోవ్ (ఉక్రెయిన్)పై విజయం సాధించారు. ఫలితంగా ఈ పోటీల్లో ఒక స్వర్ణం, మూడు కాంస్యాలతో కలిపి నాలుగు పతకాలతో భారత్ తమ అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. క్రితంసారి భారత్‌కు రెండు కాంస్య పతకాలు లభించాయి. ఇదే టోర్నీలోని మహిళల ఫ్రీస్టయిల్ విభాగంలో భారత రెజ్లర్లు అంజలి (59 కేజీలు) రజతం నెగ్గగా, నేహా శర్మ (57 కేజీలు), శిక్ష (65 కేజీలు), మోనిక (68 కేజీలు) కాంస్యాలు సాధించారు. పురుషుల గ్రీకో రోమన్ విభాగంలో విశ్వజిత్ మోరే (55 కేజీలు) భారత్‌కు ఏకైక కాంస్య పతకాన్ని అందించాడు.

పాక్ కోచ్ పదవికి కిర్‌స్టెన్ రాజీనామా

గిలెస్పీకి వన్డే, టి20 జట్ల అదనపు బాధ్యతలు



కరాచీ: పాకిస్తాన్ జట్టు వన్డే, టి20 టీమ్‌లకు హెడ్ కోచ్‌గా ఉన్న దక్షిణాఫ్రికా దిగ్గజం గ్యారీ కిర్‌స్టెన్ తన పదవికి రాజీనామా చేశాడు. ఈ బాధ్యతల నుంచి తక్షణమే తప్పుకుంటున్నట్లు అతను ప్రకటించాడు. పాక్ కోచ్‌గా కిర్‌స్టెన్ ఆరు నెలలు కూడా పని చేయలేదు. రెండేళ్ల కాంట్రాక్ట్ వ్యవధితో ఈ ఏడాది ఏప్రిల్‌లో కిర్‌స్టెన్‌ను హెడ్ కోచ్‌గా పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) నియమించింది. మరో వారం రోజుల్లో పాక్ జట్టు వన్డే, టి20 సిరీస్‌ల కోసం ఆస్ట్రేలియా వెళ్లనున్న నేపథ్యంలో కిర్‌స్టెన్ తప్పుకోవడం గమనార్హం. జట్టు ఎంపిక విషయంలో తనకు ఉన్న అధికారాలను తప్పించడంతోనే కిర్‌స్టెన్ రాజీనామా చేసినట్లు సమాచారం. పరిమిత ఓవర్ల జట్లకు కెప్టెన్‌గా ఎంపిక చేసే విషయంలో తన సూచనలను కనీసం పరిగణనలోకి తీసుకోకపోగా... అతను దేశంలోనే లేని సమయంలో జట్టును ప్రకటించడంపై పీసీబీ అధికారులతో కిర్‌స్టెన్ వాదనకు దిగినట్లు తెలిసింది. ఇటీవల ఇంగ్లండ్ చేతిలో పాకిస్తాన్ తొలి టెస్టులో చిత్తయిన తర్వాత పీసీబీ కొత్త సెలక్షన్ కమిటీని నియమించింది. ఇందులో జోక్యం చేసుకోవద్దని కిర్‌స్టెన్‌కు పీసీబీ సూచించింది. టెస్టు టీమ్ హెడ్ కోచ్‌గా ఉన్న జాసన్ గిలెస్పీ కూడా ఇదే విషయంలో అసంతృప్తితో ఉన్నా... ఇంగ్లండ్‌తో తర్వాతి రెండు టెస్టుల్లో ఘన విజయం సాధించి పాక్ సిరీస్ గెలుచుకోవడంతో ఈ అంశం కాస్త వెనక్కి వెళ్లింది.

ఒక్క వన్డే ఆడకుండా...

కిర్‌స్టెన్ కోచ్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత పాకిస్తాన్ టి20 వరల్డ్ కప్‌లో బరిలోకి దిగింది. గ్రూప్ దశలో భారత్, అమెరికా చేతుల్లో పరాజయంతో సూపర్-8 దశకు కూడా చేరకుండానే నిష్క్రమించింది. అయితే భారత్‌కు 28 ఏళ్ల తర్వాత వన్డే వరల్డ్ కప్ గెలిపించిన రికార్డు ఉన్న కిర్‌స్టెన్‌ను ఎంపిక చేసినప్పుడు ప్రధానంగా తమ వన్డే టీమ్‌ను తీర్చిదిద్దే విషయంపైనే బాధ్యతలు అప్పగించారు. 2025లో పాకిస్తాన్ వేదికగా జరిగే చాంపియన్స్ ట్రోఫీలో తమ టీమ్‌ను విజేతగా నిలపాలని...అందు కోసం ఆయన ఆలోచనల ప్రకారం జట్టును మలిచే అధికారాన్ని పీసీబీ ఇచ్చింది. అయితే ఈ ఆరు నెలల వ్యవధిలో పాక్ ఒక్క వన్డే కూడా ఆడకపోవడం విశేషం! మరోవైపు ప్రస్తుతం టెస్టు కోచ్‌గా ఉన్న ఆసీస్ మాజీ పేస్ బౌలర్ గిలెస్పీకి వన్డే, టి20 కోచ్‌గా తాత్కాలిక బాధ్యతలు అప్పగించినట్లు పీసీబీ ప్రకటించింది. ఆసీస్ గడ్డపై పాక్ ఆడే మూడు వన్డేలు, మూడు టి20 వరకు మాత్రమే తాను కోచ్‌గా పని చేస్తానని... పూర్తి స్థాయిలో బాధ్యతలు తీసుకునే ఉద్దేశం లేదని గిలెస్పీ ఇప్పటికే పాక్ బోర్డుకు సమాచారం అందించాడు.



హర్మన్

సిరీస్ తేల్చే సమరం

నేడు భారత్, న్యూజిలాండ్ మహిళల మూడో వన్డే

- బ్యాటింగ్ లోపాలపై హర్మన్‌ప్రీత్ జట్టు దృష్టి
- మధ్యాహ్నం గం. 1:30 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



సోఫీ డివైన్

అహ్మదాబాద్: 'భారత జట్టు విజయం సాధించేందుకు కనీస ప్రయత్నం కూడా చేయలేదు. ఇది సిగ్గు పడాల్సిన విషయం'... ఆదివారం జరిగిన రెండో వన్డేపై న్యూజిలాండ్ మహిళల జట్టు కెప్టెన్ సోఫీ డివైన్ చేసిన వ్యాఖ్య ఇది. ప్రత్యర్థి సారథి కాస్త ఘాటుగానే చెప్పినా మన జట్టు బ్యాటింగ్ బలహీనతను అది చూపించింది. గత మ్యాచ్‌లో 260 పరుగుల లక్ష్య ఛేదనలో 18వ ఓవర్లోనే 77 పరుగులకు భారత టాప్-5 వెనుదిరగడంతోనే ఓటమి దాదాపుగా ఖాయమైంది. 9వ నంబర్ బ్యాటర్ రాధా యాదవ్ ఆదుకోకపోతే పరిస్థితి ఇంకా ఘోరంగా ఉండేది. కీలకమైన చివరి పోరులోనైనా బ్యాటింగ్‌లో రాణిస్తే సొంతగడ్డపై సిరీస్ గెలుచుకునేందుకు మనకు అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో నేడు జరిగే చివరిదైన మూడో వన్డేలో భారత్, కివీస్ టీమ్‌లు తలపడనున్నాయి. తొలి వన్డేలో కూడా భారత్ మెరుగైన బౌలింగ్ ప్రదర్శనతోనే నెగ్గింది. రెండు వన్డేల్లో కలిపి మన బ్యాటర్లు ఎవరూ కనీసం అర్ధ సెంచరీ కూడా నమోదు చేయలేకపోయారు. చివరి మ్యాచ్‌లో నెగ్గాలంటే ముగ్గురు ప్రధాన బ్యాటర్లు స్మృతి మంధాన, షఫాలీ వర్మ, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ చెలరేగాల్సి ఉంది. ముఖ్యంగా స్మృతి సుదీర్ఘ కాలంగా వరుసగా విఫలమవుతూ తీవ్రంగా నిరాశపరుస్తోంది. ఈ సిరీస్‌లో ఆమె 5, 0 స్కోర్లకే పరిమితమైంది. ఇదే సిరీస్‌తో అరంగేట్రం చేసిన తేజల్‌ను తప్పు పట్టలేం కానీ జెమీమా కూడా మిడిలార్డర్‌లో ఆశించిన స్థాయిలో రాణించడం లేదు. అందరూ సమష్టిగా చెలరేగితేనే కివీస్‌పై ఆధిపత్యం ప్రదర్శించవచ్చు. మరోవైపు న్యూజిలాండ్ గత విజయం తర్వాత ఉత్సాహంగా బరిలోకి దిగుతోంది. రెండో వన్డేలో బ్యాటర్లు మూడు అర్ధ సెంచరీలు నమోదు చేయడం విశేషం. ఓపెనర్లు సుజీ బేట్స్, జార్జియా ప్లిమ్మర్, హ్యాలిడే, మ్యాడీ గ్రీన్‌లతో జట్టు బ్యాటింగ్ పటిష్టంగా ఉంది. ఇక కెప్టెన్ సోఫీ డివైన్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అటు ఆల్‌రౌండ్ ప్రదర్శనతో పాటు ఇటు సారథిగా కూడా ఆమె జట్టును సమర్థంగా నడిపిస్తోంది. సీనియర్ పేసర్ తహుహు ఆఫ్‌స్పిన్నర్ ఈడెన్ కార్సన్‌లు ఎలాంటి బ్యాటర్లనైనా ఇబ్బంది పెట్టగల సమర్థులు. ఇలాంటి స్థితిలో స్వదేశంలో సిరీస్ కోల్పోరాదంటే హర్మన్ బృందం రెట్టింపు శ్రమించాల్సి ఉంది.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: హర్మన్ కౌర్ (కెప్టెన్), షఫాలీ, స్మృతి, యస్తిక, జెమీమా, తేజల్, దీప్తి శర్మ, అరుంధతి రెడ్డి, రాధా యాదవ్, సైమా ఠాకూర్, ప్రియా మిశ్రా/శ్రేయాంక పాటిల్.

న్యూజిలాండ్: సోఫీ డివైన్ (కెప్టెన్), సుజీ బేట్స్, ప్లిమ్మర్, లారెన్ డాన్, హ్యాలిడే, గ్రీన్, ఇసబెల్లా, జెస్ కెర్, తహుహు, కార్సన్, జొనాస్.



పవన్ సెహ్రావత్

తెలుగు టైటాన్స్ గెలుపు బాట

సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్‌లో తెలుగు టైటాన్స్ జట్టు 'హ్యాట్రిక్' పరాజయాల తర్వాత రెండో విజయాన్ని నమోదు చేసింది. తొలి మ్యాచ్‌లో శుభారంభం చేసిన తెలుగు టైటాన్స్ జట్టు తర్వాత గెలిచేందుకు ఐదో మ్యాచ్ దాకా పోరాడాల్సి వచ్చింది. సోమవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన పోరులో టైటాన్స్ 28-26 స్కోరుతో మాజీ చాంపియన్ పట్నా పైరేట్స్‌పై రెండు పాయింట్ల తేడాతో గట్టెక్కింది. రెయిడర్లు ఆశిష్ నర్వాల్ (9 పాయింట్లు), కెప్టెన్ పవన్ సెహ్రావత్ (5) రాణించారు. మిగతా వారిలో ఆల్‌రౌండర్ విజయ్ మలిక్ 3, డిఫెండర్లు అంకిత్ 4, క్రిషన్ 2 పాయింట్లు చేశారు. పట్నా జట్టులో రెయిడర్లు దేవాంక్ (7), ఆర్యన్ (6) ఆకట్టుకున్నారు. అంతకుముందు జరిగిన తొలి మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 41-34తో దబంగ్ ఢిల్లీపై గెలిచింది. హరియాణా ఆల్‌రౌండర్ మొహమ్మద్ రెజా (10), రెయిడర్ శివమ్ (8) అదర గొట్టారు. మిగతా వారిలో కెప్టెన్ జైదీప్ (5), సంజయ్, నవీన్ చెరో 4 పాయింట్లు సాధించారు. ఢిల్లీ జట్టు రెయిడర్ అశు మలిక్ (13) చక్కని పోరాటం చేశాడు. తర్వాత సబ్‌స్టిట్యూట్‌లో వచ్చిన వినయ్ (8) రాణించాడు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో బెంగాల్ వారియర్స్‌తో పుణేరి పల్టన్; బెంగళూరు బుల్స్‌తో దబంగ్ ఢిల్లీ తలపడతాయి.

కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో రష్మిక

సాక్షి, హైదరాబాద్: మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో తెలంగాణ అమ్మాయి శ్రీవల్లి రష్మిక కెరీర్‌లో అత్యుత్తమ స్థానానికి చేరుకుంది. సోమవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో రష్మిక మూడు స్థానాలు ఎగబాకి 300వ ర్యాంక్‌లో నిలిచింది. తెలంగాణకే చెందిన సహజ యామలపల్లి మూడు స్థానాలు పడిపోయి 287వ ర్యాంక్‌కు చేరుకుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా

ఎవరు... ఏంటి... ఎక్కడ



కిరణ్ అబ్బవరం

''క' సినిమా క్లైమాక్స్‌ను కొత్తగా చెప్పేందుకు ప్రయత్నించాం. నాకు తెలిసి ఈ తరహా క్లైమాక్స్ ఇప్పటివరకూ రాలేదు. అందుకే క్లైమాక్స్‌ను ఆడియన్స్ కొత్తగా ఫీలవుతారని, వాళ్లు ఆ అనుభూతికి లోను కాకపోతే నేను సినిమాలు చేయననే బోల్డ్ స్టేట్‌మెంట్ ఇచ్చాను. మేం ఓ కొత్త ప్రయత్నం చేశామని ప్రేక్షకులు కచ్చితంగా అనుకుంటారని గట్టిగా నమ్ముతున్నాను. అయితే ఈ కొత్త ప్రయత్నాన్ని ఎలా రిసీవ్ చేసుకుంటారనే భయం కూడా ఉంది'' అని కిరణ్ అబ్బవరం అన్నారు. కిరణ్ అబ్బవరం హీరోగా, నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించిన పీరియాడికల్ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ 'క'. సుజీత్-సందీప్ దర్శకత్వంలో చింతా వరలక్ష్మి సమర్పణలో చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం హీరో కిరణ్ అబ్బవరం చెప్పిన విశేషాలు.

- కృష్ణగిరి అనే ఊరికి పోస్ట్‌మ్యాన్‌గా వచ్చిన అభినయ వాసుదేవ్ కథ ఇది. ఇతని ప్రేయసిగా సత్యభామ (నయన్) కనిపిస్తుంది. మరొకటి రాధ (తన్వీ రామ్) పాత్ర. వాసుదేవ్, సత్యభామ పాత్రలతో రాధ కనెక్షన్ ఏంటి? అనేది సినిమాలో తెలుస్తుంది. ఈ సినిమా కథను సుజీత్, సందీప్ చెప్పినప్పుడు చాలా కొత్తగా ఫీలయ్యాను. నెక్స్ట్ ఏం జరుగుతుందో ఊహించలేకపోయాను. 'ఎవరు... ఏంటి... ఎక్కడ' అనే పాయింట్స్‌తో 'క' చిత్రం ఉంటుంది. 1970 నేపథ్యంలో సాగే కథ ఇది. ఈ సినిమా కంటెంట్ ట్రీట్‌మెంట్ కొత్తగా ఉంటుంది. అందుకే పదే పదే మా మూవీ ఫ్రెష్‌గా ఉంటుందని చెబుతున్నాం.
- 'క' అంటే కొంత మంది కిరణ్ అబ్బవరం అనుకుంటున్నారు. కానీ 'క' ఏంటో సినిమా క్లైమాక్స్‌లో తెలుస్తుంది. సైకలాజికల్ సస్పెన్స్‌తో ఈ సినిమా ముందుకు వెళ్తుంది. ఇక మా సినిమాకు ఇద్దరు దర్శకులు ఉండటం బాగానే అనిపించింది. ఈ సినిమాని మలయాళంలో దుల్కర్ సల్మాన్‌గారి నిర్మాణ సంస్థ రిలీజ్ చేయాల్సింది. కానీ ఆయన సినిమా 'లక్కీ భాస్కర్' మా సినిమా విడుదల తేదీనే వస్తుంది. తమిళంలో కూడా సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. అందుకే 'క' రిలీజ్‌ను ప్రస్తుతానికి తెలుగుకే పరిమితం చేశాం.
- ఈ మధ్యే పెళ్లి ('రాజా వారు రాణిగారు' సినిమాలో తన సరసన హీరోయిన్‌గా నటించిన రహస్యా గోరక్‌ని కిరణ్ పెళ్లి చేసుకున్నారు) చేసుకున్నాను. నా మ్యారీడ్ లైఫ్ బాగుంది. నా పెళ్లి తర్వాత విడుదలవుతున్న తొలి సినిమా కాబట్టి 'క' విజయం సాధిస్తే సంతోషంగా ఉంటుంది.

నన్ను నేను సవాల్ చేసుకుంటాను



మీనాక్షీ చౌదరి

''ఫలానా పాత్రలే చేయాలి. వయసుకు తగ్గ పాత్రలే చేయాలని నేనేం పరిమితులు పెట్టుకోలేదు. ఒకే తరహా పాత్రలు చేస్తే నటిగా నాకే కాదు... స్క్రీన్‌పై నన్ను చూసే ఆడియన్స్‌కు కూడా బోర్ కొడుతుంది. అందుకే నటిగా ఎప్పటికప్పుడు నన్ను నేను సవాల్ చేసుకుంటుంటాను. వైవిధ్యమైన పాత్రలు చేయడానికి ఇష్టపడతాను. 'లక్కీ భాస్కర్' సినిమాలో తొలిసారిగా నేను అమ్మ పాత్ర చేశాను. ఇక 'మట్కా, మెకానిక్ రాకీ' చిత్రాల్లోనూ డిఫరెంట్ రోల్స్ చేశాను'' అన్నారు హీరోయిన్ మీనాక్షీ చౌదరి. దుల్కర్ సల్మాన్, మీనాక్షీ చౌదరి జంటగా నటించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న విడుదల కానుంది. ఈ సందర్భంగా మీనాక్షీ చౌదరి చెప్పిన విశేషాలు.

- 'లక్కీ భాస్కర్'లో మధ్యతరగతి గృహిణి సుమతి పాత్ర చేశాను. ప్రేమను పంచే కుటుంబం, జీవించడానికి అవసరమైనంత డబ్బు ఉంటే చాలనుకునే స్వభావం భాస్కర్ (దుల్కర్ పాత్ర)ది. కానీ ఎక్కువ డబ్బు, దురాశల కారణంగా భాస్కర్-సుమతిల మధ్య ఏం జరిగింది? అనేది ఈ సినిమాలో ఆసక్తికరంగా ఉంటుంది. ఒకప్పుడు మాది మధ్యతరగతి ఫ్యామిలీయే. నా చిన్నప్పుడు మా అమ్మ ఎలా ఉంటారో తెలుసుకుని, అందుకు తగ్గట్లుగా ఈ పాత్ర చేశాను. సుమతి పాత్రతో తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువ అవుతాననుకుంటున్నాను.
- నేను నటించిన 'మట్కా, మెకానిక్ రాకీ' సినిమాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి. ప్రస్తుతం వెంకటేశ్‌గారితో ఒక సినిమా చేస్తున్నాను.



అమితాబ్ బచ్చన్‌కి పాదాభివందనం చేస్తున్న చిరంజీవి



సుబ్బరామిరెడ్డి, నాగార్జున, చిరంజీవి, అమితాబ్ బచ్చన్, వెంకట్ అక్కినేని, నాగసుశీల

నా సినీ జీవితానికి పరిపూర్ణత ఇచ్చిన అవార్డు ఇది

● ఏఎన్ఆర్ అవార్డు అందుకున్న సందర్భంగా హీరో చిరంజీవి

''సినీ పరిశ్రమను నా ఇల్లు అనుకుంటే... ఈ పరిశ్రమలో గెలిచే అవకాశం వజ్రోత్సవాలప్పుడు (2007) వచ్చింది. అందరూ కలిసి నాకు లెజెండరీ అవార్డు ప్రదానం చేస్తుంటే హ్యాపీ ఫీలై, ఎంత ధన్యుణ్ణి అనుకున్నా. కానీ... కొన్ని ప్రతికూల పరిస్థితులు... కొంతమంది హర్షించని ఆ సమయంలో ఆ అవార్డు తీసుకోవడం సముచితంగా అనిపించలేదు. అందుకే ఈ టైమ్ క్యాప్సూల్లో అవార్డు ఉంచి, నాకు అర్హత ఎప్పుడైతే ఉందో అప్పుడే తీసుకుంటాను అన్నాను. ఆ రోజు నేను ఇంట గెలవలేదు. ఈ రోజు ది గ్రేట్ ఏఎన్నార్ అవార్డును పుచ్చుకున్న రోజున... అదీ అమితాబ్‌గారి చేతుల మీదుగా పుచ్చుకున్న రోజున... నా మిత్రుడు... నా సోదరుడు నాగ్ మనస్ఫూర్తిగా ఈ అవార్డుకు మీకు అర్హత ఉంది... తీసుకోండి అని అన్న రోజున ఇప్పుడు ఇంట గెలిచాను... రచ్చా గెలిచాను'' అని హీరో చిరంజీవి ఎంతో భావోద్వేగంగా ప్రసంగించారు. లెజండరీ నటుడు 'ఏఎన్నార్' అవార్డు అందుకున్న సందర్భంగా చిరంజీవి ఈ విధంగా పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో అక్కినేని నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు, పలువురు చిత్రరంగ ప్రముఖుల సమక్షంలో జరిగిన ఈ వేడుకలో బిగ్ బి అమితాబ్ బచ్చన్ చేతుల మీదగా 'ఏఎన్నార్ అవార్డు' అందుకున్నారు చిరంజీవి.

ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ- ''పద్మభూషణ్‌లు, పద్మ విభూషణ్‌లు, పర్సనాలిటీ ఆఫ్ ఫిల్మ్ ఇండస్ట్రీ, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు... ఇలా ఎన్ని అవార్డులు వచ్చినా సరే...



ఏఎన్ఆర్ అవార్డుగ్రహీత చిరంజీవి, ముఖ్య అతిథి అమితాబ్ బచ్చన్‌తో అక్కినేని కుటుంబ సభ్యులు

ఏఎన్ఆర్ అవార్డు నాకు ప్రత్యేకం. ఎందుకంటే నా వాళ్లు నన్ను గుర్తించి, ప్రశంసించి, ఇలాంటి అవార్డులు ఇచ్చినప్పుడు అది నిజమైన అచీవ్‌మెంట్ అని ఫీలయ్యాను. అందుకే నాగ్‌తో ఇది ప్రత్యేకమైన అవార్డు అని చెప్పాను.

అమితాబ్‌గారి మాటలు ఎనర్జీ ఇచ్చాయి

నాకు పద్మభూషణ్ అవార్డు వచ్చినప్పుడు ఫిల్మ్ ఇండస్ట్రీ నన్ను సత్కరించింది. ఆ వేడుకకు ముఖ్య అతిథిగా వచ్చి, అమితాబ్ బచ్చన్‌గారు 'చిరంజీవి ద కింగ్ ఆఫ్ ఇండియన్ సినిమా' అన్నారు. నా హిందీ 'ప్రతిబంధ్' సినిమా చూసి, అమితాబ్‌గారు 'పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్. డన్ ఏ గుడ్ జాబ్. ప్రయోజనాత్మక సినిమా' అన్నారు. ఆ మాటలు ఎనర్జీ ఇచ్చాయి.

నాన్న పొగడాలనుకున్నాను

మా నాన్నగారికి నటనంటే చాలా ఇష్టం. కానీ నన్ను పొగిడేవారు కాదు... ఏంటమ్మా... నాన్నగారు ఏం అనరు.. మాట్లాడరు. బయట ఎంత గెలిచినా ఇంట గెలవమంటుంటారు కదా అనేవాడిని. 'చాలా పొగుడుతారు... కానీ తల్లిదండ్రులు పిల్లలను పొగడకూడదు. అది వారికి ఆయుక్షీణం' అని మా అమ్మ అన్నారు. ఆ రోజు అనిపించింది... నేను ఎప్పుడో ఇంట గెలిచాను అన్నమాట. అలాగే రచ్చ కూడా గెలిచాను.

మా అమ్మ ఏఎన్నార్ సీనియర్ మోస్ట్ ఫ్యాన్

ఏఎన్నార్‌గారి ఫ్యాన్స్‌లో సీనియర్ మోస్ట్ ఫ్యాన్ మా అమ్మ. ఆమె నిండు గర్భిణీతో ఉన్నప్పుడు ఏఎన్నార్‌గారి 'రోజులు మారాయి' సినిమా చూడాలనుకుంది. అమ్మ తన పుట్టింట్లో మొగల్తూరులో ఉండేది. నర్సాపూర్ దాటి పాలకొల్లు వెళ్లి, సినిమా చూడాలి. నాన్న జట్కా బండి ఏర్పాటు చేశారు. గతుకుల రోడ్డు. మొగల్తూరు వైపు వెళుతున్న బస్సు ఈ బండికి ఎదురుగా వచ్చింది. దానికి దారి ఇచ్చే క్రమంలో జట్కా బండి పొలాల్లో దొర్లింది. బండిలో ఉన్న అందరూ కిందపడ్డారు. నాన్న కంగారుపడి, అమ్మతో 'పద.. ఇంటికి వెళ్లిపోదాం' అన్నా 'సినిమా చూడాల్సిందే' అని పట్టుబట్టి వెళ్లింది. ఆ తర్వాత రెండు నెలలకు నన్ను బయట పడేసింది. ఏఎన్ఆర్‌గారి మీద నాకు ఉన్న అభిమానం అమ్మ ద్వారా... ఆ బ్లడ్ ద్వారా వచ్చిందేమో.

చిరంజీవికి ఎముకలు లేవన్నారు ఏఎన్ఆర్‌గారు

నాకు నాగేశ్వరరావుగారి సినిమాల్లో డ్యాన్సులంటే ఇష్టం. ఆయన పాటలకు నాకు తెలిసిన పద్ధతిలో డ్యాన్సులు వేసుకునేవాడిని. నాకు డ్యాన్సుల్లో ఇన్‌స్పిరేషన్ ఎవరంటే అక్కినేనిగారు. అయితే ఆయన నా గురించి ఓ ఇంటర్వ్యూలో 'నాకు ఎముకలు ఉన్నాయి... కానీ చిరంజీవికి లేవు. ఈ ఫిల్మ్ ఇండస్ట్రీకి డ్యాన్సులు పరిచయం చేసింది నేనే. కానీ ఆ డ్యాన్సులకి స్పీడు పెంచింది, గ్రేసు పెంచింది చిరంజీవి' అన్నారు. 'ఇది గొప్ప గొప్ప అవార్డులతో సమానం' అనిపించింది. అలాగే ఇండస్ట్రీ మద్రాసు నుంచి ఇక్కడికి రావడానికి కృషి చేసిన మహానుభావుడు ఏఎన్ఆర్‌గారు. 'కాలేజీ బుల్లోడు' హండ్రెడ్ డేస్ ఫంక్షన్‌కి నన్ను పిలిస్తే వెళ్లాను. అందరూ ఒకటే కేరింతలు... కేకలు. ఆయన పక్కకి తిరిగి, 'ఎవరి కోసం అవన్నీ అనుకున్నావ్...' అంటే 'మీ కోసం' అన్నాను. 'మాది అయిపోయింది. నీ కోసమే' అంటూ, నన్ను ఎంకరేజ్ చేశారు. అలా ప్రశంసించే గొప్ప మనసు చాలామందికి ఉండదు. ఆ తర్వాత ఆయనతో 'మెకానిక్ అల్లుడు' చేసే గొప్ప చాన్స్ వచ్చింది. ఆయన్ను చూస్తే నాకో 'ఫాదర్లీ ఫీలింగ్'.

నాగ్ నాకు డాక్టర్‌లాంటి వాడు

ఆరోగ్య సూత్రాలు పాటించడం, ఎక్సర్‌సైజుల విషయంలో, యంగ్‌గా ఉండటానికి చూపించే శ్రద్ధలో నాగ్ నాకెంతో ఇన్‌స్పిరేషన్. నాకు ఆరోగ్య సూత్రాలు తెలిపే డాక్టర్. ఇక దేవానంద్, లతా మంగేష్కర్, అమితాబ్, బాలచందర్ గార్లు... ఇలా గొప్ప గొప్పవారికి ఇచ్చిన ఏఎన్నార్ అవార్డు రావడం అనేది నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. నా సినీ జీవితానికి ఒక పరిపూర్ణత ఇచ్చిన అవార్డులా భావిస్తున్నాను'' అన్నారు.

ఏఎన్ఆర్‌ని ఎవరూ మ్యాచ్ చేయలేరు
- అమితాబ్ బచ్చన్

"ఇండియన్ సినిమాకు ఏఎన్నార్‌గారు చేసిన కాంట్రిబ్యూషన్‌ను ఎవరూ మ్యాచ్ చేయలేరు. ఈ సందర్భంగా నా తండ్రి రాసిన ఓ హిందీ పద్యంలోని ఓ లైన్‌ను ఇక్కడ ప్రస్తావించాలనుకున్నాను. "నా కుమారులైనంత మాత్రాన... నా కుమారులు నాకు వారసులు కాలేరు. ఎవరైతే నా వారసులవుతారో వారే కుమారులు" అని ఉంది. గొప్ప వ్యక్తి ఏఎన్నార్ గారికి నిజమైన వారసులుగా, కుమారులుగా నాగార్జున ఆయన కుటుంబం నిరూపించుకుంది. నా ఫ్రెండ్ చిరంజీవికి ఈ అవార్డును అందించేందుకు నన్ను ఎంపిక చేసిన నాగ్‌కు థ్యాంక్స్.

ఆ ఇద్దరూ ఏబీసీ ఆఫ్ ఇండియన్ సినిమా
- నాగార్జున

"ఏఎన్ఆర్... ఈ మూడు అక్షరాలే నాకు ప్రపంచం. ఏ లెజెండ్ లివ్స్ ఆన్. భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలిచే గొప్ప వ్యక్తులని గౌరవించడం ఏయన్నార్ అవార్డు ముఖ్యోద్దేశం. ఈ రోజు అలాంటి గొప్ప వ్యక్తులు ఇద్దరు. ఇండియన్ సినిమాకు ఏబీ (అమితాబ్) సి (చిరంజీవి).. అమితాబచ్చన్‌గారు, మెగాస్టార్ చిరంజీవిగారు. చిరంజీవిగారికి అవార్డు ప్రదానం చేయడానికి అమితాబచ్చన్‌గారు రావడం ఆనందంగా ఉంది. ఏఎన్ఆర్ శతజయంతి సందర్భంగా ఇది మాకు ఎంతో ప్రత్యేకం. అమితాబ్ గారి సామాజిక బాధ్యతకు మేం సెల్యూట్‌చేస్తున్నాం. 1985లో నేను సినిమాల్లోకి వద్దాం అనుకున్నప్పుడు.. నాన్నగారు అన్నపూర్ణ స్టూడియోలో చిరంజీవిగారి షూటింగ్ జరుగుతుంటే ఆయన డాన్స్ చూడమని చెప్పారు. ఆ డాన్స్, గ్రేస్, కరిష్మా చూసి ఆయనలా డాన్స్ చేయగలనా అనిపించింది. చేయలేం... కెరీర్‌లో మరో దోవ వెతుక్కుందామనుకుని బయటకు వచ్చాను. మనం సొసైటీ నుంచి ఏదైనా తీసుకున్నప్పుడు మళ్లీ తిరిగి ఇవ్వాల్సిన బాధ్యత మన మీద ఉంటుందని నాన్నగారు అనేవారు. చిరంజీవిగారు, అమితాబచ్చన్ గారు అదే చేసి చూపించారు. ఒకటే చెప్పగలను... ఈ ఇద్దరూ 'ఏబీసీ ఆఫ్ ఇండియన్ సినిమా'. ఈ వేడుకకు విచ్చేసిన అందరికీ థ్యాంక్స్. 'ఏఎన్ఆర్ లివ్స్ ఆన్'. ఈ వేడుకలో కీరవాణి ఆధ్వర్యంలో ఏఎన్ఆర్ హిట్ పాటలను పలువురు గాయనీ గాయకులు ఆలపించారు. ఇక ఆస్కార్ విజేత కీరవాణిని ఈ వేదికపై నాగార్జున ప్రత్యేకంగా సన్మానించారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
29-10-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
603	158
80,005	24,339

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	18,598	▲ 79
డోజోన్స్	42,400	▲ 285
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,286	▲ 37
డాక్స్	19,530	▲ 66
షాంఘై (శుక్రవారం ముగింపు)	3,322	▲ 23
నికాయ్	38,606	▲ 692

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	78,245
బంగారం (99.5 స్వచ్ఛత)	77,932
వెండి (కిలో)	96,086

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	83.68	84.70
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	107.61	110.46
€	యూరో	ఒకటి	89.51	92.13
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.10	55.48
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.41	56.60
S$	సింగపూర్ డాలర్	భాయిడీకీ	61.57	66.24
SAR	సౌదీ రియాల్	భాయిడీకీ	21.53	23.07
UAE D	యూఏఈ దిర్హామ్	భాయిడీకీ	22.01	23.77
¥	చైనా యువాన్	భాయిడీకీ	10.92	12.75

ఎయిర్‌టెల్ లాభం హైజంప్

క్యూ2లో రూ. 3,593 కోట్లు ● గోపాల్ విఠల్‌కు కొత్త బాధ్యతలు



న్యూఢిల్లీ: మొబైల్ టెలికం రంగ దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం మూడు రెట్లు ఎగసి రూ. 3,593 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 1,341 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 12 శాతం బలపడి రూ. 41,443 కోట్లను తాకింది. భారత్, ఆఫ్రికా మార్కెట్లలో బిజినెస్ పుంజుకోవడం ఇందుకు సహకరించింది. దేశీ బిజినెస్ ఆదాయం 17 శాతం ఎగసి రూ. 31,561 కోట్లను తాకింది. కాగా.. గత 12 సంవత్సరాల నుంచి కంపెనీ ఎండీ, సీఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న గోపాల్ విఠల్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్‌గా పదవీ స్వీకారం చేయనున్నట్లు కంపెనీ పేర్కొంది. 2026 జనవరి 1నుంచి కొత్త బాధ్యతలు చేపట్టనున్నట్లు వెల్లడించింది. అప్పటినుంచి ప్రస్తుత సీవోవో శాశ్వత్ శర్మ ఎండీ, సీఈవోగా పదవీ బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలియజేసింది. దీనిలో భాగంగా కన్జూమర్ బిజినెస్ ఎండ్‌టుఎండ్ కార్యకలాపాలను శర్మ పర్యవేక్షించనున్నట్లు వివరించింది. సీఈవోగా ఎంపికైన శర్మ బాధ్యతలు స్వీకరించేలోపు విఠల్ మార్గదర్శిగా వ్యవహరించనున్నట్లు కంపెనీ తెలియజేసింది.

ఫలితాల నేపథ్యంలో ఎయిర్‌టెల్ షేరు ఎన్‌ఎస్‌ఈలో నామమాత్ర లాభంతో రూ. 1,665 వద్ద ముగిసింది.

పీఎన్‌బీ లాభం రెట్టింపు

క్యూ2లో రూ. 4,306 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం రెండున్నర రెట్లు పెరిగి రూ. 4,306 కోట్లను తాకింది. వడ్డీ ఆదాయం, రికవరీలు పుంజుకోవడం ఇందుకు తోడ్పాటునిచ్చింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 1,756 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 29,383 కోట్ల నుంచి రూ. 34,447 కోట్లకు ఎగసింది. వడ్డీ ఆదాయం రూ. 26,355 కోట్ల నుంచి రూ. 29,875 కోట్లకు బలపడింది. నికర వడ్డీ ఆదాయం రూ. 9,923 కోట్ల నుంచి రూ. 10,517 కోట్లకు మెరుగుపడింది. ఈ కాలంలో రూ. 4,000 కోట్ల రికవరీలు అందుకుంది. రూ. 350 కోట్లమేర ఫ్లోటింగ్ ప్రొవిజన్ చేపట్టింది. 2.92 శాతం గ్లోబల్ నికర వడ్డీ మార్జిన్లు సాధించింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 6.96 శాతం నుంచి 4.48 శాతానికి, నికర ఎన్‌పీఏలు 1.47 శాతం నుంచి 0.46 శాతానికి దిగివచ్చాయి.

ఫలితాల నేపథ్యంలో పీఎన్‌బీ షేరు ఎన్‌ఎస్‌ఈలో 3.4 శాతం జంప్‌చేసి రూ. 99 వద్ద ముగిసింది.

ఐపీవో కార్నర్...

నవంబర్ 6న స్విగ్గీ ఐపీవో!

ఇష్యూ ధర శ్రేణి రూ. 371–390

న్యూఢిల్లీ: నిత్యావసరాలు, ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ ప్రతిపాదిత రూ. 11,300 కోట్ల పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) నవంబర్ 6న ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఇందుకోసం ధరల శ్రేణి ఒక్కో షేరుకు రూ. 371 నుంచి 390 వరకు ఉంటుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇష్యూ నవంబర్ 8న ముగుస్తుందని, యాంకర్ ఇన్వెస్టర్లకు బిడ్డింగ్ తేదీ నవంబర్ 5గా ఉంటుందని వివరించాయి. ఐపీవో కింద రూ. 4,500 కోట్ల విలువ చేసే షేర్లను తాజాగా జారీ చేయనుండగా, ఆఫర్ ఫర్ సేల్



మార్గంలో రూ. 6,800 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించనున్నట్లు సంబంధిత వర్గాలు వివరించాయి. ప్రారంభ దశలో ఇన్వెస్ట్ చేసిన యాక్సెల్, ఎలివేషన్ క్యాపిటల్, నార్వెస్ట్ వెంచర్స్ వాటాలను విక్రయించడం ద్వారా తమ పెట్టుబడులపై 35 రెట్లు రాబడులు పొందనున్నట్లు తెలిపాయి. తాజా ఇష్యూ ద్వారా సేకరించిన నిధుల్లో రూ. 137 కోట్ల మొత్తాన్ని అనుబంధ సంస్థ స్కూట్సీ రుణాలను తీర్చేందుకు, రూ. 982 కోట్లను క్విక్ కామర్స్ సెగ్మెంట్‌లో డార్క్ స్టోర్ నెట్‌వర్క్ విస్తరణకు కంపెనీ వినియోగించనుంది. 2014లో ఏర్పాటైన స్విగ్గీ వేల్యుయేషన్ ఈ ఏడాది ఏప్రిల్‌లో 13 బిలియన్ డాలర్లుగా ఉండగా, 2023 మార్చి 31 నాటికి వార్షికాదాయం 1.09 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

ఎన్‌టీపీసీ గ్రీన్, అవాన్స్‌కు ఓకే

న్యూఢిల్లీ: ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ, ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ అవాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రతిపాదిత పబ్లిక్ ఇష్యూలకు (ఐపీవో) మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ రూ. 10,000 కోట్లు, అవాన్స్ రూ. 3,500 కోట్లు సమీకరించే యోచనలో ఉన్నాయి. రెండు కంపెనీలు తమ ఐపీవో పత్రాలను జులై–సెప్టెంబర్ మధ్య సెబీకి సమర్పించగా అక్టోబర్‌లో అనుమతులు వచ్చాయి. ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ ఇష్యూ పూర్తిగా కొత్త షేర్ల జారీ రూపంలో ఉండనుంది. సమీకరించిన నిధుల్లో రూ. 7,500 కోట్ల మొత్తాన్ని అనుబంధ సంస్థ ఎన్‌టీపీసీ రెన్యూవబుల్ ఎనర్జీ (ఎన్‌ఆర్‌ఈఎల్) రుణాలను తిరిగి చెల్లించేందుకు ఉపయోగించుకోనుంది. అవాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఐపీవో కింద రూ. 1,000 కోట్ల విలువ చేసే షేర్లను కొత్తగా జారీ చేయనుండగా, ఓఎఫ్‌ఎస్ కింద రూ. 2,500 కోట్ల షేర్లను సెల్లింగ్ షేర్‌హోల్డర్లు విక్రయించనున్నారు.

హెచ్‌సీజీపై కేకేఆర్ కన్ను

- సీవీసీ వాటాల కొనుగోలు కోసం ఒప్పందం
- డీల్ విలువ సుమారు 3,614 కోట్లు



న్యూఢిల్లీ: ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం కేకేఆర్ తాజాగా బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న క్యాన్సర్ ఆస్పత్రుల చెయిన్ హెల్త్‌కేర్ గ్లోబల్‌పై (హెచ్‌సీజీ) దృష్టి సారించింది. సంస్థలో మెజారిటీ వాటాలను దక్కించుకునేందుకు సీవీసీ క్యాపిటల్‌తో కేకేఆర్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వాటాల కొనుగోలు కోసం పలు సంస్థలు పోటీపడినప్పటికీ కేకేఆర్‌కి అవకాశం లభించినట్లు పేర్కొన్నాయి. 2020లో హెచ్‌సీజీలో సీవీసీ రూ. 1,049 కోట్లతో మెజారిటీ వాటాలు కొనుగోలు చేసింది. ప్రస్తుతం సీవీసీకి ఉన్న 60.36 శాతం వాటాల విలువ రూ. 3,614 కోట్లుగా ఉంటుంది. ఈ వాటాలను దక్కించుకుంటే కేకేఆర్ మరో 26 శాతం వాటాల కోసం ఓపెన్ ఆఫర్ ప్రకటించాల్సి రానుంది. వ్యవస్థాపకులు బీఎస్ అజయ్‌కుమార్, ఆయన కుటుంబానికి సంస్థలో 10.87 శాతం వాటాలు ఉన్నాయి.

2016లో పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ. 650 కోట్లు సమీకరించిన హెచ్‌సీజీకి దేశీయంగా, ఆఫ్రికాలో 22 క్యాన్సర్ సెంటర్స్ నెట్‌వర్క్ ఉంది. మిలన్ బ్రాండ్ కింద ఏడు ఫెర్టిలిటీ సెంటర్లు నిర్వహిస్తోంది. జూన్ క్వార్టర్‌లో ఆదాయం 14 శాతం పెరిగి రూ. 526 కోట్లకు, లాభం 59 శాతం ఎగసి రూ. 12 కోట్లకు చేరింది. ఇటీవలే వైజాగ్‌కి చెందిన మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో రూ. 414 కోట్లతో 51 శాతం వాటాను కొనుగోలు చేసింది. మరోవైపు, 2022లో మ్యాక్స్ హెల్త్‌కేర్‌లో వాటాలను 2 బిలియన్ డాలర్లకు విక్రయించి, నిష్క్రమించడం ద్వారా కేకేఆర్ భారీగా లాభాలను ఆర్జించింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..

ఎకానమీ పనితీరు పర్వాలేదు: ఆర్థిక శాఖ	హైదరాబాద్‌లో ఇళ్ల ధరలు 7% అప్

బుల్స్ బ్యాక్!


అయిదు రోజుల నష్టాలకు బ్రేక్

- కనిష్ఠ స్థాయిల వద్ద కొనుగోళ్లు
- ప్రభుత్వ బ్యాంకు షేర్లకు డిమాండ్
- మళ్లీ 80 వేల ఎగువకు సెన్సెక్స్
- 158 పాయింట్లు పెరిగిన నిఫ్టీ

ముంబై: అయిదురోజుల వరుస **నష్టాల నుంచి స్టాక్ సూచీలు** సోమవారం బలంగా **పుంజుకున్నాయి.** బ్యాంకులు, మెటల్, ఫార్మా, రియల్టీ, **టెలికం, షార్ట్ కవరింగ్** కొనుగోళ్లతో దాదాపు **ఒకశాతం మేర** లాభపడ్డాయి. సంస్థాగత ఇన్వెస్టర్ల **కొనుగోళ్ల దన్ను,** క్రూడాయిల్ ధరల తగ్గుదల అంశాలు కలిసొచ్చాయి. సెన్సెక్స్ 603 పాయింట్లు పెరిగి 80,005 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 158 పాయింట్లు లాభపడి 24,339 వద్ద నిలిచింది. ప్రపంచ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాల్లో మొదలయ్యాయి. ఇటీవల పతనంలో భాగంగా కనిష్ఠ స్థాయిలకు దిగివచ్చిన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఒక దశలో సెన్సెక్స్ 1,138 పాయింట్లు బలపడి 81,763 వద్ద, నిఫ్టీ 312 పాయింట్లు ఎగసి 24,498 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. బీఎస్ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు 1%, 0.65 శాతం చొప్పున రాణించాయి. రంగాల వారీగా, **కమోడిటీస్ ఇండెక్స్ 1.79%, రియల్టీ సూచీ 1.50%, టెలికం, హెల్త్‌కేర్ మెటల్ సూచీలు ఒక శాతం రాణించాయి. జపాన్‌లో సంకీర్ణ ప్రభుత్వం లిబరల్ డెమొక్రటిక్ పార్టీ ఓటమి, యెన్ 3 నెలల కనిష్ఠ స్థాయి పతనం పరిణామాలతో జపాన్ నికా**య్ ఇండెక్స్ 2% లాభపడింది. చైనా, కొరియా, హాంగ్‌కాంగ్ సూచీలు ఒకశాతం పెరిగాయి. యూరప్ మార్కెట్లు అరశాతం రాణించాయి.

→ ఐసీఐసీఐ బ్యాంకు(3%), ఎంఅండ్ఎం (2.35%), ఇన్ఫోసిస్(1%), ఎస్‌బీఐ(1%) షేర్లు రాణించి సూచీలు కోలుకునేందుకు దోహదపడ్డాయి. సెన్సెక్స్ **ఆర్జించిన మొత్తం పాయింట్లలో ఈ షేర్లను వాటాయే 365 పాయింట్లు కావడం విశేషం. సన్ ఫార్మా, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌యూఎల్, టీసీఎస్ షేర్లు లాభపడి ర్యాలీకి తమ వంతు తోడ్పాటు అందించాయి.**

→ ప్రభుత్వరంగ బ్యాంకు షేర్లకు భారీ డిమాండ్ నెలకొంది. అత్యధికంగా ఇండియన్ బ్యాంక్ 11% లాభపడింది. కెనరా బ్యాంక్ 7%, సెంట్రల్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లు 4% పెరిగాయి. పీఎన్‌బీ, పీఎస్‌బీ, యూకో బ్యాంక్, ఐఓబీ షేర్లు 2% రాణించాయి.



'వారీ'వ్వా లిస్టింగ్!



ఐపీఓకు దరఖాస్తుల విషయంలో రికార్డు సృష్టించిన వారీ ఇంజనీరింగ్స్ లిస్టింగ్‌నూ వారెవ్వా అనిపించింది. ఇష్యూ ధర (రూ.1503)తో పోలిస్తే బీఎస్ఈలో 69.66% ప్రీమియంతో రూ.2,550 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 73% ఎగసి రూ.2,600 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 55% లాభంతో రూ.2,345 వద్ద లిస్టయ్యింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.67,132 కోట్ల నమోదయ్యాయి.

→ దీపక్ బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ లిస్టింగ్ నిరాశపరిచింది. బీఎస్ఈలో ఇష్యూ ధర (రూ.203)తో పోలిస్తే 2% డిస్కౌంట్‌తో రూ.198 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో మరింత అమ్మకాల ఒత్తిడికి లోనైంది. ఒక దశలో 21% క్షీణించి రూ.160 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 20% నష్టపోయి రూ.162 వద్ద ముగిసింది.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌ఎండీసీ లిమిటెడ్, హైదరాబాద్‌లో 153 జూనియర్ ఆఫీసర్(ట్రైనీ) పోస్టులు

హైదరాబాద్ మసాబ్‌ట్యాంక్‌లో ఉన్న నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ).. జూనియర్ ఆఫీసర్(ట్రైనీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 153.
» **విభాగాల వారీగా ఖాళీలు:** కమర్షియల్–04, ఎన్విరాన్‌మెంట్–01, జియో అండ్ క్వాలిటీ కంట్రోల్–03, మైనింగ్–56, సర్వే–09, కెమికల్–04, సివిల్–09, ఎలక్ట్రికల్–44, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్–03, మెకానికల్–20.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో డిప్లొమా, సీఏ/ఐసీఎంఏ, డిగ్రీ/ఇంజనీరింగ్ డిగ్రీ, పీజీ(ఎంబీఏ) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 32 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **స్టైపెండ్:** నెలకు రూ.37,000 నుంచి రూ.1,30,000.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్, స్కిల్ టెస్ట్, సర్టిఫికెట్ల పరిశీలన, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరితేది:** 10.11.2024.
» **వెబ్‌సైట్:** https://www.nmdc.co.in

ఎన్ఐసీఎల్, కోల్‌కతాలో 500 అసిస్టెంట్ పోస్టులు

కోల్‌కతాలోని నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్(ఎన్ఐసీఎల్).. దేశవ్యాప్తంగా ఉన్న ఎన్ఐసీఎల్ బ్రాంచ్‌ల్లో ఓపెన్ మార్కెట్ ప్రాతిపదికన క్లాస్–3 కేడర్‌లో అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 500
» **తెలుగు రాష్ట్రాల్లో ఖాళీలు:** ఆంధ్రప్రదేశ్–21, తెలంగాణ –12.
» **అర్హత:** ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులవ్వాలి. అభ్యర్థి దరఖాస్తు చేసే రాష్ట్రానికి సంబంధించి ప్రాంతీయ భాష చదవడం, రాయడం, మాట్లాడం అవసరం.
» **వయసు:** 01.10.2024 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **పే స్కేల్:**నెలకు రూ.22,405నుంచి రూ.62,265
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ ప్రిలిమినరీ, మెయిన్ ఎగ్జామినేషన్, రీజనల్ లాంగ్వేజ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** రెండు దశల్లో పరీక్ష జరుగుతుంది. ప్రిలిమనరీ, మెయిన్ పరీక్షలు ఉంటాయి.
» **ప్రిలిమినరీ ఎగ్జామినేషన్:** పరీక్షలో మొత్తం 100 మార్కులకు 100 ప్రశ్నలు ఉంటాయి. ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ ఆబ్జెక్టివ్ టెస్ట్. ఇంగ్లిష్ లాంగ్వేజ్ ఆబ్జెక్టివ్(30 ప్రశ్నలు–30 మార్కులు), రీజనింగ్ ఎబిలిటీ ఆబ్జెక్టివ్(35 ప్రశ్నలు–35 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (35 ప్రశ్నలు–35 మార్కులు) సబ్జెక్ట్‌ల నుంచి ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం 60 నిమిషాలు.
» **మెయిన్ పరీక్ష:** మొత్తం 200 మార్కులకు 200 ప్రశ్నలు ఉంటాయి. టెస్ట్ ఆఫ్ రీజనింగ్(40 ప్రశ్నలు–40 మార్కులు), టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్(40 ప్రశ్నలు–40 మార్కులు), టెస్ట్ ఆఫ్ న్యూమరికల్ ఎబిలిటీ(40 ప్రశ్నలు–40 మార్కులు), టెస్ట్ ఆఫ్ జనరల్ అవేర్‌నెస్(40 ప్రశ్నలు–40 మార్కులు), టెస్ట్ ఆఫ్ కంప్యూటర్ నాలెడ్జ్(40 ప్రశ్నలు–40 మార్కులు) నుంచి ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం 120 నిమిషాలు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది:** 11.11.2024.
» **వెబ్‌సైట్:** https://nationalinsurance.nic.co.in

టీఐఎఫ్ఆర్, హైదరాబాద్‌లో వివిధ ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్(టీఐఎఫ్ఆర్) తాత్కాలిక ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్త పోస్టుల సంఖ్య:** 05.
» **పోస్టుల వివరాలు:** మెడికల్ ఆఫీసర్–01, పార్ట్ టైమ్ సైకాలజిస్ట్–01, ప్రాజెక్ట్ నర్స్–01, ప్రాజెక్ట్ సైంటిఫిక్ అసిస్టెంట్–01, ప్రాజెక్ట్ క్లర్క్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, ఎండీ, పీజీ, పీహెచ్‌డీ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్షలు, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.11.2024.
» **వెబ్‌సైట్:** https://recruitment.tifrh.res.in

కేంద్ర కొలువుకు ఇంజనీరింగ్ సర్వీసెస్

ఈఎస్ఈ.. ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్! కేంద్ర స్థాయిలో ఉద్యోగాల భర్తీకి యూపీఎస్సీ నిర్వహించే కీలక పరీక్ష!! ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్‌కు చెందిన కొన్ని విభాగాల్లోని పోస్ట్‌ల భర్తీకీ ఈఎస్ఈ పరీక్షలో ఉత్తీర్ణతను పరిగణనలోకి తీసుకోవాలని తాజాగా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఈఎస్ఈ-2025 దరఖాస్తుకు మరోసారి అవకాశం కల్పించనున్నట్లు యూపీఎస్సీ వెల్లడించింది! పరీక్ష తేదీలను కూడా రీ-షెడ్యూల్ చేసినట్లు ప్రకటించింది. ఈ నేపథ్యంలో.. ఈఎస్ఈ-2025 తాజా మార్పులు, కొత్తగా చేర్చిన పోస్టుల వివరాలు, అర్హతలు, ఎంపిక విధానం తదితర సమాచారం..

» కీలక మార్పులతో కొత్తగా ఈఎస్ఈ 2025 నోటిఫికేషన్
» కొత్తగా ఐఆర్ఎంఎస్ పోస్ట్‌లను చేర్చుతూ నిర్ణయం
» ఈఎస్ఈ ద్వారా ఐఆర్ఎంఎస్ ఇంజనీరింగ్ పోస్ట్‌ల భర్తీ
» ఈఎస్ఈ–2025 దరఖాస్తుకు మరో అవకాశం
» మొత్తం 457కు పెరిగిన పోస్ట్‌ల సంఖ్య



ప్రస్తుతం ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వ శాఖల్లోని సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగాల్లోని ఉద్యోగాలను యూపీఎస్సీ భర్తీ చేస్తోంది. తాజాగా.. ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్‌కు చెందిన కొన్ని విభాగాల్లోని పోస్ట్‌ల భర్తీకీ ఈఎస్ఈ పరీక్షలో ఉత్తీర్ణతను పరిగణనలోకి తీసుకోనుంది.

విద్యార్హతలు

- దరఖాస్తు చేయదలచుకుంటున్న విభాగానికి సంబంధించిన బ్రాంచ్‌తో బీటెక్ ఉత్తీర్ణత, చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే వీరు పర్సనల్ ఇంటర్వ్యూ సమయానికి ఉత్తీర్ణత పొంది సర్టిఫికెట్ అందించాల్సి ఉంటుంది.
- వయసు: జనవరి 1, 2025 నాటికి 21–30 ఏళ్ల మధ్యలో ఉండాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు నిబంధనల మేరకు గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

సివిల్స్, ఈఎస్ఈ

తాజా మార్పుల ప్రకారం–ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్‌కు సంబంధించిన కొన్ని పోస్ట్‌లను ఈఎస్ఈ ర్యాంకుతో నియామకాలు చేపడతారు. మరికొన్ని పోస్టులను సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్‌లో ర్యాంకు ఆధారంగా భర్తీ చేస్తారు. సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ ర్యాంకుతో.. రైల్వే శాఖలోని ట్రాఫిక్, పర్సనల్ అండ్ అకౌంట్స్ విభాగాల్లోని పోస్ట్‌లను భర్తీ చేయనున్నారు. ఈఎస్ఈ ర్యాంకు ఆధారంగా.. రైల్వే శాఖలోని సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, సిగ్నల్ అండ్ టెలి కమ్యూనికేషన్స్, స్టోర్స్ విభాగాల్లోని ఉద్యోగాలు భర్తీ చేస్తారు.

ఈఎస్ఈ పెరిగిన పోస్ట్‌ల సంఖ్య

ఐఆర్ఎంఎస్‌లోని నిర్దేశిత విభాగాల్లోని పోస్ట్‌లను కూడా ఈఎస్ఈ ద్వారా భర్తీ చేయాలని నిర్ణయించడంతో ఈఎస్ఈ–2025లో పోస్ట్‌ల సంఖ్య పెరిగింది. తొలి నోటిఫికేషన్‌లో 232 పోస్ట్‌లనే పేర్కొనగా.. ఐఆర్ఎంఎస్‌లోని పోస్ట్‌లను కూడా కలపడంతో మొత్తం పోస్ట్‌ల సంఖ్య 457కు పెరిగింది.

మళ్లీ దరఖాస్తు అవకాశం

ఈఎస్ఈ–2025 దరఖాస్తు ప్రక్రియ అక్టోబర్ 8న ముగిసింది. అయితే కొత్తగా ఐఆర్ఎంఎస్‌లోని విభాగాలను కూడా ఈఎస్ఈ ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఈఎస్ఈ–2025కు దరఖాస్తు చేసుకునేందుకు మరో అవకాశం కల్పిస్తున్నారు. అక్టోబర్ 18 నుంచి నవంబర్ 22 వరకు కొత్త అప్లికేషన్ విండో అందుబాటులో ఉంటుంది. కొత్తగా దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు ఈ విండో ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఈఎస్ఈ–2025 రీ-షెడ్యూల్

ఈఎస్ఈ–2025 పరీక్షలను కూడా రీ–షెడ్యూల్ చేశారు. తొలిదశ ప్రిలిమినరీ పరీక్షను 2025 ఫిబ్రవరి 9 బదులుగా 2025 జూన్ 8న; అదే విధంగా.. రెండో దశ మెయిన్ ఎగ్జామినేషన్‌ను 2025 జూన్ 22బదులు 2025 ఆగస్టు 10న నిర్వహించనున్నారు.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

ఈఎస్ఈ నియామక ప్రక్రియలో మూడు దశలు ఉంటాయి. మొదటి రెండు దశలు రాత పరీక్షలు కాగా, మూడో దశను పర్సనల్ ఇంటర్వ్యూగా పేర్కొన్నారు. అవి..స్టేజ్–1(ప్రిలిమినరీ ఎగ్జామినేషన్); స్టేజ్–2(మెయిన్ ఎగ్జామినేషన్); స్టేజ్–3 (పర్సనాలిటీ టెస్ట్).

తొలిదశ ప్రిలిమినరీ

- ఎంపిక ప్రక్రియలో స్టేజ్–1గా పేర్కొనే ప్రిలిమినరీ పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో జరుగుతుంది. ఈ పరీక్షలో అభ్యర్థులు రెండు పేపర్లు రాయాల్సి ఉంటుంది. అవి.. పేపర్–1 (జనరల్ స్టడీస్ అండ్ ఇంజనీరింగ్ ఆప్టిట్యూడ్);పేపర్–2 (ఇంజనీరింగ్ సంబంధిత సబ్జెక్ట్).
- పేపర్–1ను 200 మార్కులు, పేపర్–2ను 300 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.ప్రిలిమినరీ పరీక్షలోని పేపర్–1 అన్ని విభాగాల అభ్యర్థులకు ఒకే మాదిరిగా ఉంటుంది. నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంది.
- పేపర్–2 మాత్రం అభ్యర్థి దరఖాస్తు సమయంలో పేర్కొన్న సబ్జెక్ట్‌తో జరుగుతుంది.

రెండో దశ మెయిన్‌కు 600 మార్కులు

ఈఎస్ఈ ఎంపిక ప్రక్రియలో రెండో దశ మెయిన్ పరీక్ష పూర్తిగా డిస్క్రిప్టివ్(వ్యాస రూపం) విధానంలో జరుగుతుంది. ప్రిలిమినరీ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు ఏడుగురు లేదా ఎనిమిది మందిని చొప్పున మెయిన్ ఎగ్జామినేషన్‌కు ఎంపిక చేస్తారు. మెయిన్ పరీక్షను రెండు పేపర్లుగా నిర్వహిస్తారు. ఒక్కో పేపర్‌కు 300 మార్కులు చొప్పున మొత్తం ఆరు వందల మార్కులకు పరీక్ష ఉంటుంది. అభ్యర్థులు ఎంపిక చేసుకున్న విభాగానికి సంబంధించిన పేపర్లలో ఈ పరీక్ష జరుగుతుంది.

చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ

ఈఎస్ఈ ఎంపిక ప్రక్రియలో చివరి దశ పర్సనాలిటీ టెస్ట్‌గా పేర్కొనే పర్సనల్ ఇంటర్వ్యూ. స్టేజ్–2 మెయిన్ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. ఒక్కో పోస్ట్‌కు ఇద్దరిని చొప్పున (1:2 నిష్పత్తిలో) ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. పర్సనల్ ఇంటర్వ్యూలో అభ్యర్థులకు ఇంజనీరింగ్ సర్వీసెస్ పట్ల ఉన్న ఆసక్తి, అందులోనూ ప్రభుత్వ రంగంలో పని చేయాలనుకునేందుకు గల కారణాలు, వ్యక్తిత్వం వంటి అంశాలను పరిశీలిస్తారు. ఇంటర్వ్యూ ప్రక్రియను 200 మార్కులకు నిర్వహిస్తారు.

ఎంపిక ప్రక్రియలో విజయం సాధించేలా!

తొలి దశకు ఇలా

తొలి దశ ప్రిలిమ్స్ పేపర్–1(జనరల్ స్టడీస్ అండ్ ఇంజనీరింగ్ ఆప్టిట్యూడ్)లో మొత్తం పది అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. వీటిలో మొదటి టాపిక్‌గా పేర్కొన్న జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యం సంతరించుకున్న సమకాలీన అంశాలు; ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధిని మినహాయిస్తే మిగతా తొమ్మిది టాపిక్స్ కూడా ఇంజనీరింగ్ విద్యార్థులు తమ అకడమిక్స్‌లో అభ్యసించేవే. అకడమిక్స్ పరంగా బేసిక్స్, అప్లికేషన్ ఓరియెంటేషన్ ఉంటే.. ఈ పేపర్‌లో రాణించడం సులభమే. ప్రిలిమ్స్ పేపర్–2లో అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న విభాగానికి సంబంధించిన ప్రశ్నలతో ఉంటుంది. అకడమిక్‌గా సంబంధిత సబ్జెక్ట్‌లో పట్టున్న అభ్యర్థులు సులభంగా ఈ పేపర్‌ను గట్టెక్కొచ్చు.

మెయిన్ మరింత పటిష్టంగా

స్టేజ్–1 ప్రిలిమినరీ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా.. ఒక్కో పోస్ట్‌కు ఆరు నుంచి ఏడుగురు అభ్యర్థులను (1:6 లేదా 1:17 నిష్పత్తిలో) మెయిన్‌కు ఎంపిక చేస్తారు. మెయిన్‌లో ఆయా టెక్నికల్ టాపిక్స్‌కు సంబంధించి తాజా సామాజిక పరిస్థితులను అన్వయిస్తూ చదవడం కూడా ఉపకరిస్తుంది. ఉదాహరణకు టెలికమ్యూనికేషన్స్‌నే పరిగణనలోకి తీసుకుంటే.. ఇటీవల కాలంలో ప్రాధాన్యం పొందుతున్న 5–జి టెక్నాలజీస్‌ను అకడమిక్ అంశాలతో అనుసంధానం చేసుకుంటూ చదవడం లాభిస్తుంది. అదే విధంగా మెకానికల్ ఇంజనీరింగ్‌లో రోబోటిక్స్‌కు సంబంధించి తాజా వాస్తవ పరిస్థితులను అన్వయించుకుంటూ అధ్యయనం చేయాలి. ఇదే వ్యూహాన్ని ఇతర విభాగాల (ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్) అభ్యర్థులు కూడా అనుసరించాలని నిపుణులు సూచిస్తున్నారు.

కో-ఆర్డినేషన్

ఈఎస్ఈ అభ్యర్థులు ప్రిపరేషన్ సమయంలో.. అనుసంధాన దృక్పథంతో అడుగులు వేయాలి. స్టేజ్–1 ప్రిలిమ్స్‌లోని పేపర్–2, మెయిన్ ఎగ్జామినేషన్‌లోని రెండు సబ్జెక్ట్ పేపర్లు అభ్యర్థులు చదివిన ఇంజనీరింగ్ సబ్జెక్ట్‌లకు సంబంధించినవే. వీటిని అనుసంధానం చేసుకుంటూ చదివే అవకాశం ఉంది. అభ్యర్థులు ముందుగా ప్రిలిమ్స్‌లో గట్టెక్కే విధంగా ఎక్కువ దృష్టి పెట్టాలి. యూపీఎస్సీ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం–ప్రిలిమ్స్ తర్వాత మెయిన్స్‌కు దాదాపు ఆరు నెలల సమయం అందుబాటులో ఉంది. కాబట్టి ప్రిలిమ్స్ పూర్తి చేసిన తర్వాత మెయిన్స్‌పై ఎక్కువ దృష్టి సారించాలి.

కాన్సెప్ట్స్, అప్లికేషన్ అప్రోచ్

ఇంజనీరింగ్ సర్వీసెస్‌లో విజయానికి ఆయా సబ్జెక్ట్‌లలోని కాన్సెప్ట్స్‌పై పూర్తి అవగాహన పొందడమే కాకుండా.. వాటిని అన్వయ దృక్పథంతో అధ్యయనం చేయడం ముఖ్యం. ఫలితంగా పరీక్షల్లో ప్రశ్నలు ఎలా అడిగినా సమాధానం ఇచ్చే సంసిద్ధత లభిస్తుంది. ప్రీవియస్ పేపర్లను సాధన చేయడం, మాక్ టెస్ట్‌లకు హాజరవడం మేలు చేస్తుంది. ప్రిలిమ్స్‌లో నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంది. మెయిన్స్ కోణంలో అకడమిక్‌గా తమకు పట్టున్న టాపిక్స్‌పై మరింత అవగాహన పెంచుకుంటే ఉపయుక్తంగా ఉంటుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- దరఖాస్తుకు చివరి తేదీ: 2024, నవంబర్ 22
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం: నవంబర్ 23 నుంచి 29 వరకు.
- ప్రిలిమినరీ (స్టేజ్–1) పరీక్ష తేదీ: 2025 జూన్ 8
- మెయిన్ ఎగ్జామినేషన్ (స్టేజ్–2) పరీక్ష తేదీ: 2025 ఆగస్టు 10
- తెలుగు రాష్ట్రాల్లో ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలు: తిరుపతి, విశాఖపట్నం, హైదరాబాద్
- తెలుగు రాష్ట్రాల్లో మెయిన్ ఎగ్జామ్ పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విశాఖపట్నం
- వివరాలకు వెబ్‌సైట్: www.upsc.gov.in

సైబర్ దొంగ.. ఏఐకూ బెంగ!

కృత్రిమ మేధను తలదన్నేలా హ్యాకింగ్ టూల్స్ రూపొందిస్తున్న సైబర్ దొంగలు

మైక్రోసాఫ్ట్, మెటా సహా ఎన్నో గ్లోబల్ కంపెనీల సర్వర్లు హ్యాక్

81 శాతం కంపెనీలు సొమ్ములతో సెటిల్ చేసుకుంటున్న తీరు

ఈ ముప్పుపై అంతర్జాతీయ కంపెనీల ఫోకస్.. సైబర్ సెక్యూరిటీకి భారీగా నిధులు

డేటా సెక్యూరిటీ, రెసిలెన్స్ సంస్థ 'వీమ్' అధ్యయనంలో వెల్లడి

కడవంత గుమ్మడికాయ అయినా కత్తిపీటకు లోకువ అన్నది సామెత. ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థల పరిస్థితి కూడా ఇలానే ఉంది. అద్భుతాలు సృష్టించే కృత్రిమ మేధోశక్తి (ఏఐ) గుప్పిట్లో ఉన్నా.. సైబర్ దొంగల 'చోరకళ' మాత్రం ఆ సంస్థలను భయ పెడుతూనే ఉంది. ఏఐతో సమానంగా పనిచేస్తూ, డేటాను దొంగిలించే టూల్స్‌ను వారు రూపొందిస్తున్నారు. ఏఐ ప్రపంచంలోకి వెళ్తున్న బహుళ జాతి ఐటీ కంపెనీలు వాటిని ఎదుర్కొనేందుకు ఎన్ని కోట్లయినా వెచ్చించేందుకు సిద్ధమవడం గమనార్హం. ప్రముఖ డేటా సెక్యూరిటీ, రెసిలెన్స్ సంస్థ 'వీమ్'ఇటీవల సైబర్ దాడులపై చేసిన అధ్యయన నివేదికలో ఈ వివరాలను వెల్లడించింది.



- సాక్షి, హైదరాబాద్

వీమ్ అధ్యయనం ప్రకారం.. 2023లో మైక్రోసాఫ్ట్, మెటా, ఓపెన్ ఏఐ వంటి పలు గ్లోబల్ సంస్థలు కూడా సైబర్ క్రిమినల్స్ చేతికి చిక్కాయి. వారు ర్యాన్సమ్‌వేర్‌ను తేలికగా ఆయా సంస్థల సర్వర్లలోకి పంపారు. కొన్ని కంపెనీల డేటా బ్యాకప్, రికవరీ, సెక్యూరిటీ, ఇంటెలిజెన్స్ వ్యవస్థలను గుప్పిట్లోకి తీసుకున్నారు. కంపెనీల నిర్వహణ, రహస్య సమాచారం,

సైబర్ దొంగల చేతుల్లో గ్లోబల్ డేటా..

వ్యాపార లావాదేవీల డేటాను చోరీ చేశారు. సర్వర్లను ఎన్‌క్రిప్ట్ చేశారు. ఇలా సైబర్ దాడు లకు గురైన సంస్థల్లో 81 శాతం కంపెనీలు చేసేదేమీ లేక, సైబర్ నేరస్తులకు గుట్టుచప్పుడు కాకుండా సొమ్మును ముట్టజెప్పాయని తేలింది. ఇలా డబ్బులు ఇచ్చినా కూడా మూడింట ఒకవంతు సంస్థలు, వ్యక్తులు డేటాను తిరిగి పొందలేకపోయారని అధ్యయనంలో తేలింది. 45 కోట్ల వినియోగ దారులున్న మైక్రోసాఫ్ట్.. 5.5 కోట్ల కస్టమర్ల డేటానే పూర్తిస్థాయిలో తిరిగి పొందగలిగిందని నివేదిక పేర్కొంది. అంతపెద్ద కంపెనీలే నిస్సహాయ స్థితికి వెళ్తుంటే.. పరిస్థితి ఏమిటని వీమ్ సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది.

ఎదురవుతున్న సవాళ్లు..

ప్రపంచవ్యాప్తంగా కంపెనీలన్నీ కృత్రిమ మేధతో పనిచేయడం అనివార్యమైంది. అన్ని సంస్థలూ ఇందుకోసం టూల్స్‌ను సమకూర్చుకుంటున్నాయి. డిజిటల్ లావాదేవీలు, ఈ–కామర్స్, స్మార్ట్ సిటీలు, ప్రత్యేక క్లౌడ్ బేస్డ్ టెక్నాలజీతో పెద్ద ఎత్తున డిజిటల్ డేటాను సృష్టిస్తున్నాయి. ఈ క్రమంలోనే సైబర్ నేరస్తులూ అప్‌డేట్ అవుతున్నారు. ఏఐ ఆధారిత మాల్‌వేర్లు, వైరస్‌లను రూపొందిస్తున్నారు. వాటితో కంపెనీల సర్వర్లపై దాడులు చేస్తున్నారు. ఏఐని అభివృద్ధి చేస్తున్న మేధావులే.. ఈ వినాశకర శక్తుల జాబితాలోనూ ఉంటున్నారని అంతర్జాతీయ సైబర్ సంస్థలు అంటున్నాయి. 'ఎండ్ టు ఎండ్ సెక్యూరిటీ విధానాలపై, సైబర్ సెక్యూరిటీ చైన్ లింక్'పై అధ్యయనం చేసిన వారే సైబర్ దాడుల్లో ప్రధాన భూమిక పోషిస్తున్నారని పేర్కొంటున్నాయి.

రక్షణ వ్యవస్థలపై ఫోకస్

ఏఐ ఆధారిత వ్యవస్థలను రక్షించే వ్యవస్థలపై కంపెనీలు ఫోకస్ చేశాయి. ప్రతీ కంపెనీ కూడా దీనిపై కోట్ల రూపాయలను వెచ్చిస్తోంది. దీన్ని మరింత విస్తృతం చేయాలని, పరిశోధన విధానాలను ప్రతీ కంపెనీలు అభివృద్ధి చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. డేటా స్టోరేజీ గతం కన్నా భిన్నంగా ఉంటోందని.. ఇందుకోసం మైక్రో ఇంటెలిజెన్స్ వ్యవస్థలను అభివృద్ధి చేయాలని పేర్కొంటున్నారు.

సైబర్ నేరాల లెక్కలివీ..

- వరల్డ్ సైబర్ క్రైం ఇండెక్స్– 2024 ప్రకారం.. సైబర్ నేరాల ఆనవాళ్లు రష్యాలో ఎక్కువగా ఉన్నాయి. ఉక్రెయిన్, చైనా, అమెరికా, నైజీరియా, రొమేనియా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.
- గ్లోబల్ సైబర్ క్రైమ్ నివేదిక ప్రకారం 2025 నాటికి ఏటా 10ట్రిలియన్ డాలర్లకు పైగా సైబర్ నేరాలపై ఖర్చు పెట్టాల్సి వస్తుంది.
- సైబర్ నేరాలు గడచిన 11 ఏళ్లలో 15.63 ట్రిలియన్ డాలర్లకు చేరినట్టు స్టాటిస్టా సర్వే చెబుతోంది. ఇది 2029 నాటికి మూడు రెట్లు పెరిగే వీలుందని పేర్కొంది.

బాణసంచా దుకాణాలు జాగ్రత్తలు పాటించాలి

అగ్నిమాపకశాఖ డీజీ నాగిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: బాణాసంచా కాల్చే సమయంలో, విక్రయాల సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని అగ్ని మాపకశాఖ డైరెక్టర్ జనరల్ నాగిరెడ్డి సూచించారు. నిబంధనలు పాటించని దుకాణదారులపై తెలంగాణ ఫైర్ సర్వీసెస్ యాక్ట్ ప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని బొగ్గులకుంట ప్రాంతంలో అగ్నిప్రమాదం జరిగిన పరాస్ కార్పొరేషన్‌కు ఇచ్చిన తాత్కాలిక లైసెన్స్‌ను రద్దు చేసినట్టు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.



ఏదైనా అగ్నిప్రమాదం సంభవించినా, మరే అత్యవసరం అయినా వెంటనే ఫైర్ కంట్రోల్ రూం 101, లేదా 9949991101కు ఫిర్యాదు చేయాలని డీజీ సూచించారు. అనధికారికంగా ఎవరైనా బాణసంచా విక్రయిస్తున్నట్టు గుర్తిస్తే ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

రంగుల లిపి.. చేర్యాల నకాషీ



పెయింటింగ్ వేస్తున్న వైకుంఠం దంపతులు

ఖండాలు దాటిన చిత్రకళ.. మన్‌కీ బాత్‌లో ప్రధాని మోదీ సైతం ప్రస్తావన

అది చిత్రకళా రూపం. పేరు నకాషీ చిత్రకళ.. అలా చిత్రాలు వేసే వారిని నకాషీలుగా పిలుస్తారు. ఈ చిత్ర కళా రూపాన్ని వారసత్వంగా కొనసాగిస్తున్నారు సిద్దిపేట జిల్లా చేర్యాలకు చెందిన దనాలకోట వైకుంఠం కుటుంబసభ్యులు. అంతరించిపోతున్న కళకు జీవంపోస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ప్రధాని మోదీ 'మన్‌కీ బాత్'లో కూడా వైకుంఠం పేరును ప్రస్తావించిన విషయం విదితమే. ఇప్పటికే పలు ఎగ్జిబిషన్లు, మేళాల్లో తమ కళను ప్రదర్శించి జాతీయ స్థాయి అవార్డులు కూడా పొందారు. కుటుంబ కళగా పేరొందిన నకాషీ చిత్ర కళ, కళలో మమేకమైన వారి కుటుంబ జీవితం గురించి వైకుంఠం కుటుంబ సభ్యుల మాటల్లో..

– చేర్యాల (సిద్దిపేట)

ఇది మా పూర్వీకుల కళ.. మా కులస్తులు దనాలకోట వెంకటరామయ్య నుంచి ఈ కళ మొదలైనట్లు ఆధారాలు చెబుతున్నాయి. తరతరాలుగా ఈ కళను వారసత్వంగా ముందుకు తీసుకెళ్తున్నాం. ప్రస్తుతం ఎనిమిది కుటుంబాలు ఈ కళను కొనసాగిస్తుండగా, నేర్చుకున్న కుటుంబాలు రెండున్నాయి. ఈ కళ గురించి చెప్పాలంటే మొదట చరిత్ర తెలుసుకోవాలి. నిజాం ప్రభువుల దగ్గర అద్భుతమైన అలంకరణ వస్తువులను తయారు చేసిన కళాకారులను ప్రభువు నక్షి కళాకారులుగా పిలిచేవారట. 'నక్షి' అంటే ఉర్దూలో 'ఫైన్ వర్క్' అని అర్థం. కాలక్రమంలో నక్షిల పేరు నకాషీగా మారిందని ఒక ప్రచారం.


నకాషీ పెయింటింగ్ వేస్తున్న వెంకటరామయ్య (ఫైల్)

రంగుల వాడకం.. తయారీ

నకాషీ పెయింటింగ్స్‌కు సహజసిద్ధమైన రంగులనే వాడతాం. కనుకనే పెయింటింగ్స్ చాలాకాలం మన్నుతున్నాయి. మొదట గంజి, సుద్దమట్టి, బంకతో ఒకరకమైన ద్రావణాన్ని తయారు చేస్తాం. దీన్ని ఖాదీబట్టపై కోటింగ్‌వేసి గట్టిపడేలా చేస్తాం. తర్వాత ఆ బట్టపైనే కావాల్సిన బొమ్మను పెన్సిల్‌తో డ్రాయింగ్ వేస్తాం. రంగురాళ్ల నూరి తయారు చేసిన రంగులను తిరుమణి చెట్ల నుంచి తీసిన బంకతో తయారు చేసిన ద్రావణాన్ని కలిపి కాన్వాస్‌పై రంగులద్దుతాం.

బ్రిటిష్ మ్యూజియంలోనూ..

హైదరాబాద్ సాలార్జంగ్ మ్యూజియంలో మా పూర్వీకులు వేసిన 17వ శతాబ్దం నాటి పెయింటింగ్స్ ఉన్నాయి. లండన్, ప్యారిస్ నగరాల్లోని మ్యూజియాల్లోనూ చేర్యాల నకాషీ పెయింటింగ్స్ ఉన్నాయి. బ్రిటిష్ మ్యూజియంలో ఓ పుస్తకం కవర్‌పేజీపై నకాషీ పెయింటింగ్ కనిపిస్తుంది. ఈ చిత్రాలు వందల ఏళ్లయినా చెక్కు చెదరకుండా ఉంటాయి. వరంగల్‌లోని హరిత కాకతీయ హోటల్స్, గోల్కొండ, లేపాక్షి, శిల్పారామం, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లోనూ ఈ పెయింటింగ్స్ అందుబాటులో ఉన్నాయి. రామాయణ, మహాభారతం, పురాణాలు, స్థానిక జానపద కథలను కూడా ఈ కళలో చిత్రిస్తాం. పెయింటింగ్ నేర్చుకునేందుకు వచ్చిన వారికి శిక్షణ ఇస్తూ వర్క్‌షాప్ కూడా నిర్వహిస్తున్నాం.


ఆదరణ పెరిగింది..



ఈ కళను మా తాత, ముత్తాతల నుంచి వారసత్వంగా వచ్చిన సంపదగా భావిస్తాం. మా నాన్న దనాలకోట వైకుంఠం. ఆయన జాతీయ అవార్డు గ్రహీత. ప్రధాని మోదీ మన్‌కీ బాత్‌లో కూడా మా నాన్న పేరు ప్రస్తావించారు. అది మాకు ఎంతో ఆనందాన్నిచ్చింది. నేను బీటెక్ చదివాను. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వైపు వెళ్లకుండా వారసత్వంగా వచ్చిన నకాషీ కళను కాపాడటం నా బాధ్యతగా భావించి పెయింటింగ్స్ వేస్తున్నాను. గతంతో పోలిస్తే ఆదరణ పెరిగింది.

– దనాలకోట రాకేశ్, నకాషీ కళాకారుడు

రైతు జీవన శైలిని చూపే పెయింటింగ్.



ప్రజాప్రభుత్వ ఏర్పాటులో ఎన్నారైల పాత్ర కీలకం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటులో ఎన్నారైలు కీలకపాత్ర పోషించారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. లండన్ పర్యటనలో భాగంగా అక్కడ ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఎన్నారైలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వంఏర్పాటైన అతి తక్కువ కాలంలో విదేశీ పర్యటనలు చేపట్టిన సీఎం, మంత్రులు రాష్ట్రానికి రూ.40 వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చారన్నారు. ప్రపంచంలోని ఏ ప్రాంతంలోనైనా ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకునే విధంగా వారిని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. మూసీ నది ప్రక్షాళన కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, హైదరాబాద్ నగరాన్ని ప్రపంచంలోని నగరాలతో పోటీపడే విధంగా అభివృద్ధి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నారై విభాగం ప్రతినిధులు గంప వేణుగోపాల్, సుధాకర్ గౌడ్, సుబ్బురు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తులో టీజీసీఎస్‌బీ మద్దతు కేంద్రంగా పనిచేయాలి

- టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో సమీక్షలో డీజీపీ జితేందర్



సాక్షి, హైదరాబాద్: కేసుల దర్యాప్తులో అన్ని పోలీస్ యూనిట్లకు తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) ఒక మద్దతు కేంద్రంగా వ్యవహరించాలని డీజీపీ జితేందర్ సూచించారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోను సందర్శించిన డీజీపీ జితేందర్.. బ్యూరో పనితీరుపై టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోని పోలీసు యూనిట్లు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించడానికి ఒక వ్యవస్థను రూపొందించుకోవాలని సూచించారు. ఇందుకోసం టికెట్ రైజింగ్ మాడ్యూల్‌ను రూపొందించాలన్నారు. సైబర్ నేరాలను అరికట్టడంలో తమ ప్రయత్నాలను కొనసాగించాలని టీజీసీఎస్‌బీ అన్ని యూనిట్ల అధికారులను డీజీపీ ప్రోత్సహించారు. అలాగే అన్ని యూనిట్లలో సైబర్ భద్రతపై దృష్టి పెట్టాల్సిన అవసరముందని పేర్కొన్నారు. తెలంగాణ పౌరులకు సురక్షితమైన డిజిటల్ వాతావరణాన్ని సృష్టించడంలో బ్యూరో గణనీయమైన పురోగతిని సాధిస్తోందని డీజీపీ అభినందించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో పని చేస్తున్న పలు ఫంక్షనల్ యూనిట్ల గురించి శిఖాగోయల్ వివరించారు. ప్రస్తుతం ఉన్న ఫంక్షనల్ యూనిట్ల పునర్వ్యవస్థీకరణ, పీటీ వారెంట్ల అమలు కోసం జాయింట్ ఆపరేషన్స్ యూనిట్ ఏర్పాటు, సైబర్‌నేరాలకు అలవాటుపడిన నేరస్థులపై సస్పెక్ట్ షీట్‌లను తెరవడం వంటి అంశాలను వివరించారు. నవంబర్‌లో జరగనున్న సైబర్ జాగ్రూకా దివస్ ఏర్పాట్లపై చర్చించారు. సైబర్‌నేరాల ట్రెండ్స్‌ను, టీజీసీఎస్‌బీ సాధించిన విజయాలు, భవిష్యత్ ప్రణాళికలను సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆపరేషన్స్ ఎస్పీ దేవేందర్ వివరించారు. ఇంటర్నెట్‌లో చిన్నారులపై లైంగిక నేరాల కట్టడికి నూతనంగా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ (సీపీయూ) ఏర్పాటు చేసినట్టు ఎస్పీ హర్షవర్ధన్ తెలిపారు.

యాదాద్రి ఆలయం.. సాంస్కృతిక సౌరభం

వారంలో రెండు రోజులపాటు కళారూపాలు • దేశ, విదేశాల నుంచి వచ్చి ప్రదర్శనలిస్తున్న కళాకారులు ఆకట్టుకుంటున్న సురభి నాటకాలు, పేరిణి నృత్యాలు • భక్తులను అలరిస్తున్న వివిధ సంగీత కార్యక్రమాలు

సాక్షి, యాదాద్రి: యాదాద్రి కొండపైన జరిగే సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరిస్తున్నాయి. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనర్సింహస్వామి సన్నిధిలో ప్రతి శుక్ర, శనివారాలు భక్తుల్లో మానసిక ఉల్లాసం, ఆధ్యాత్మిక భావన పెంపొందించే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శ్రీస్వామివారి దర్శనం అనంతరం భక్తులకు మనోల్లాసం కలిగించడానికి నాటకం, నాట్యం, భక్తి సంగీతం ప్రధానాంశాలుగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలకు విశేష స్పందన లభిస్తోంది. విదేశీయులతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు తమ కళారూపాలను ప్రదర్శించి భక్తులను ఆకట్టుకుంటున్నారు. గతేడాది ఉగాది పర్వదినం నుంచి భక్తుల కోసం వారంలో రెండు రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఆధ్యాత్మిక, మానసిక ప్రశాంతతను కల్పిస్తున్నారు.

నాటకం, నాట్యం, భక్తిసంగీతం

యాదాద్రి కొండపైన వారంలో రెండురోజుల పాటు భక్తి సంగీతం, నాట్యం, నాటకం వంటి కళారూపాలను ప్రదర్శిస్తున్నారు. 2024 ఏప్రిల్ నుంచి అక్టోబర్ 18 వరకు 150 కార్యక్రమాల వరకు దేశంలోని వివిధ ప్రాంతాల కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమాలు నెల రోజుల ముందుగానే నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందులో ప్రధానంగా పేరిణి నృత్యం, కూచిపూడి, భరతనాట్యం, సురభి నాటకాలు, భక్తి సంగీతంలో అన్నమాచార్య కీర్తనలు ఉంటాయి. జూన్ 27 నుంచి 30 వరకు సురభి నాటకాలు (భక్త ప్రహ్లాద, మాయాబజార్, పాతాళభైరవి, శ్రీకృష్ణ లీలలు) భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దేవస్థానంలో ప్రతినెలా సుమారు 16 కార్యక్రమాలు జరుగుతున్నాయి. హైదరాబాద్, వరంగల్, నల్లగొండ, ఆదిలాబాద్, భద్రాచలం, ఏపీలోని రాజమండ్రి, ముంబై, బెంగళూరు, చెన్నైతోపాటు దుబాయ్ వంటి దేశాల్లో ఉంటున్న ఎన్నారైల పిల్లలు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.


భక్త ప్రహ్లాద నాటకంలో సన్నివేశం

భక్తులు ఆదరిస్తున్నారు



కొండపైన దేవస్థానం నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలను భక్తులు ఆదరిస్తున్నారు. ప్రతివారం క్రమం తప్పకుండా రెండు రోజులపాటు నాటకం, నాట్యం, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. దేశ, విదేశాల కళాకారులు వచ్చి తమ ప్రదర్శనలు ఇస్తున్నారు. ఎంతో మంది కళాకారులు ఇక్కడ తమ కళలో అరంగేట్రం చేస్తున్నారు. కళాకారులకు దేవస్థానం తరఫున వసతి కల్పించి సముచితంగా గౌరవిస్తున్నాం. కళాకారుల కోసం అనుభవజ్ఞులైన సంగీత వాయిద్య కళాకారులు, పరికరాలను అందుబాటులో ఉంచే అంశాన్ని పరిశీలిస్తున్నాం.

– ఎ.భాస్కర్‌రావు, యాదాద్రి దేవస్థానం ఈవో

కళాకారులకు సముచిత గౌరవం

సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే కళాకారులను దేవస్థానం సముచితంగా గౌరవిస్తోంది. గతంలో కేవలం బ్రహ్మోత్సవాల సమయంతోపాటు మరో రెండుసార్లు మాత్రమే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేవారు. ప్రస్తుత ఈఓ ఏపూరి భాస్కర్‌రావు వారంలో రెండు రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే విధంగా దేవస్థానంలో ఏర్పాట్లు చేశారు. కళాకారులకు దేవస్థానం తరఫున గౌరవ పారితోషికం, ప్రశంసాపత్రం, శేష వస్త్రం, లడ్డూ ప్రసాదం, ఉచిత దర్శనం కల్పిస్తున్నారు.

బ్రహ్మోత్సవాల్లో సంగీత సభలు

యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా 8 రోజులపాటు ధార్మిక, సాహిత్య, సంగీత మహాసభలను నిర్వహించేవారు. అలాగే స్వామివారి జయంతి ఉత్సవాల్లో గతంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగేవి. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. కొండపైన తొలుత బాపట్ల లక్ష్మీకాంతయ్య సాంస్కృతిక సభలకు శ్రీకారం చుట్టారు. బాపట్ల లక్ష్మీకాంతయ్య స్వామి వారిని కీర్తిస్తూ అనేక రచనలు చేసి స్వామికే అంకితమిచ్చారు. సంవత్సరానికి ఒకసారి వచ్చే బ్రహ్మోత్సవాల సందర్భంగా ధార్మిక, సాహిత్య, సంగీత మహాసభలను ఏర్పాటు చేసి కళలు, కళాకారులను ప్రోత్సహించడం ద్వారా ఈ ప్రాంతం సుభిక్షంగా ఉంటుందని ఆయన భావించారు. అదేవిధంగా కళల ద్వారా స్వామివారిని సేవిస్తే ముక్తి లభిస్తుందని నమ్మకం. దీంతో ఆయన ఈ ప్రాంతంలోని కళాకారులను విరివిగా ప్రోత్సహిస్తూ సభలకు శ్రీకారం చుట్టారు. శ్రీ స్వామివారి మహత్యాన్ని, అవతారాలను యాదగిరిగుట్ట క్షేత్ర విశేషాలను తెలియజేస్తూ స్వామి వారిని కీర్తిస్తూ అప్పట్లో వివిధ కళారూపాలను తయారు చేసి ప్రదర్శించేవారు. క్రమంగా ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, హరికథలు, శాస్త్రీయ నృత్యాలు, పౌరాణిక నాటకాలకు చోటు కల్పించారు.


సురభి నాటకం వారి శ్రీ కృష్ణ లీలలు సన్నివేశం


శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నృత్య కళాకేంద్రం నల్లగొండ కళాకారుల ప్రదర్శన

ఎస్‌జీడీసీల బదిలీల వివరాలివి..

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
జి.ముకుందరెడ్డి	ఎల్‌ఏ బీమా ప్రాజెక్టు	అడిషనల్ కలెక్టర్, హైదరాబాద్
జి.వీరారెడ్డి	ఎస్టేట్ ఆఫీసర్, హెచ్‌ఎండీఏ	అడిషనల్ కలెక్టర్, భువనగిరి
బి.ఎస్.లత	అడిషనల్ కలెక్టర్, సూర్యాపేట	అడిషనల్ కలెక్టర్, జగిత్యాల
ఎం. నగేశ్	అడిషనల్ కలెక్టర్, వనపర్తి	అడిషనల్ కలెక్టర్, మెదక్
జి.వెంకటేశ్వర్లు	అడిషనల్ కలెక్టర్, మెదక్	అడిషనల్ కలెక్టర్, వనపర్తి
పి. రాంబాబు	అడిషనల్ కలెక్టర్, జగిత్యాల	అడిషనల్ కలెక్టర్, సూర్యాపేట
పి. శ్రీనివాస్‌రెడ్డి	అడిషనల్ కలెక్టర్, సిద్దిపేట	అడిషనల్ కలెక్టర్, ఖమ్మం
అబ్దుల్ హమీద్	సీఈవో కార్యాలయం, తెలంగాణ	అడిషనల్ కలెక్టర్, సిద్దిపేట
పి.బెన్‌షాలోమ్	అడిషనల్ కలెక్టర్, భువనగిరి	అడిషనల్ కలెక్టర్, నారాయణపేట
పి.అశోక్‌కుమార్	అడిషనల్ కలెక్టర్, నారాయణపేట	అడిషనల్ కలెక్టర్, భూపాలపల్లి
సి.మహేందర్‌జీ	అడిషనల్ కలెక్టర్, ములుగు	అడిషనల్ కలెక్టర్, మహబూబాబాద్
ఎం. డేవిడ్	అడిషనల్ కలెక్టర్, మహబూబాబాద్	అడిషనల్ కలెక్టర్, ములుగు
డి. వేణు	అడిషనల్ కలెక్టర్, ఆసిఫాబాద్	అడిషనల్ కలెక్టర్, పెద్దపల్లి
జి.వి.శ్యాం ప్రసాద్	అడిషనల్ కలెక్టర్, పెద్దపల్లి	అడిషనల్ కలెక్టర్, ఆసిఫాబాద్
వి.విక్టర్	డీసీ, హెచ్‌ఎండీఏ	అడిషనల్ కలెక్టర్, కామారెడ్డి
ఎం. విజయలక్ష్మి	సెక్రటరీ, జీడబ్ల్యూఎంసీ	డీఆర్‌వో, వరంగల్
పి. అమరేందర్	ఆర్డీవో, భువనగిరి	డీఆర్‌వో, నల్లగొండ
డి.వి.మాధవరావు	ఆర్డీవో, షాద్‌నగర్	డీఆర్‌వో, మహబూబాబాద్
వి.భుజంగరావు	ఎస్‌డీసీ, నిర్మల్	డీఆర్‌వో, ఖమ్మం
డి. మధుసూదన్‌నాయక్	అడిషనల్ కలెక్టర్, ఖమ్మం	స్పెషల్ కలెక్టర్, ఎల్‌ఏ, బీమా ప్రాజెక్టు
టి. పూర్ణచంద్ర	అడిషనల్ కలెక్టర్, నల్లగొండ	తెలంగాణ వక్ఫ్ ట్రిబ్యునల్
కె. శ్రీనివాస్	డీఆర్‌వో, వరంగల్	ఎస్‌డీసీ, యూఎల్‌సీ, రంగారెడ్డి
డి. రాజ్యలక్ష్మి	ఆర్‌వో, నల్లగొండ	హెచ్‌ఎండీఏ

'క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్‌కు ఉత్తర్వులివ్వండి'

సాక్షి, హైదరాబాద్: కరువు భత్యం వాయిదాల విడుదలతో పాటు అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ లభించేలా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంయుక్త కార్యాచరణ సమితి చైర్మన్ కె.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి టి.శుభాకర్‌రావు కోరారు. ఖజానా ఖాళీ అని పెన్షనర్లు, ఉద్యోగులకు ఎగ్గొట్టే విధానాలు మానుకోవాలని సోమవారం ఒక ప్రకటనలో హితవు పలికారు. స్పెషల్ టీచర్లుగా సేవలందించిన కాలానికి నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, మిగిలిన పెన్షనర్ల సమస్యలు పరిష్కారానికి పెన్షనర్ల సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు.

30న కులగణనపై కాంగ్రెస్ భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన కులగణనపై చర్చించేందుకు కాంగ్రెస్ పార్టీ ఈనెల 30న సమావేశం కానుంది. గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రులు, విప్‌లు, డీసీసీ అధ్యక్షుడు హాజరవుతారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

• చంద్వాడ్ నియోజకవర్గంలో మంత్రి సీతక్క ప్రచారం


మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా నాసిక్ జిల్లాలోని చంద్వాడ్ నియోజకవర్గంలో తెలంగాణ మంత్రి, సీనియర్ అబ్జర్వర్ సీతక్క పర్యటించారు. కాంగ్రెస్ అభ్యర్థి శిరీష్ కొత్వాల్ తో కలిసి ద్రాక్ష, ఉల్లి రైతులతో భేటీ అయ్యారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతు వ్యతిరేక ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా...

గవర్నర్‌తో ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్ భేటీ



ఆంధ్రప్రదేశ్ సర్వీస్ కమిషన్ చైర్‌పర్సన్ ఏఆర్ అనురాధ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో భేటీ అయ్యారు. ఇటీవల కమిషన్ బాధ్యతలు చేపట్టిన ఆమె సోమవారం రాజ్ భవన్‌లో గవర్నర్‌ను కలిశారు.

– సాక్షి, అమరావతి

కళాశాల విద్య డైరెక్టర్‌గా భరత్‌గుప్తా

సాక్షి, అమరావతి: కళాశాల విద్య డైరెక్టర్‌గా డి.నారాయణ్ భరత్‌గుప్తాను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన సోమవారం మంగళగిరిలోని కళాశాల విద్యా శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో కళాశాల విద్య పనితీరుపై చర్చించారు.

న్యాయాధికారుల కేడర్ స్ట్రెంత్‌ను ఖరారు చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: న్యాయాధికారుల కేడర్ స్ట్రెంత్‌ను 630గా ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో జిల్లా జడ్జీలు 164, సీనియర్ సివిల్ జడ్జీలు 138, జూనియర్ సివిల్ జడ్జీలు 328గా ఖరారు చేసింది. గతంలో కేడర్ స్ట్రెంత్ 608గా ఉండేది. దీనిని పెంచాలని హైకోర్టు రిజిస్ట్రీ అభ్యర్థన మేరకు అదనంగా 22 మంది న్యాయాధికారులను చేర్చింది. దీంతో కేడర్ స్ట్రెంత్ 630గా ఖరారైంది. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి వి.సునీత ఉత్తర్వులు జారీచేశారు.

విద్యుత్ చార్జీల పెంపుపై మాట్లాడే అర్హత జగన్‌కు ఉందా?

మంత్రి గొట్టిపాటి రవికుమార్

సాక్షి, అమరావతి: విద్యుత్ చార్జీల పెంపుపై మాట్లాడే అర్హత జగన్‌కు ఉందా? అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రశ్నించారు. విద్యుత్ చార్జీల పెంపుపై మాజీ సీఎం జగన్ 'ఎక్స్'లో చేసిన వ్యాఖ్యలపై మంత్రి సోమవారం స్పందించారు. మిగులు విద్యుత్ రాష్ట్రంగా అప్పగిస్తే జగన్ నాశనం చేశారని.. అస్మదీయులకు దోచిపెట్టారన్నారు. 2022–23, 2023–24 ఇంధన సర్దుబాటు చార్జీలను ప్రజలపై మోపాలని డిస్కంలకు అనుమతిచ్చింది జగనేనని.. అప్పుడే ఏపీ ఈఆర్సీ అనుమతి కోరారని ఆరోపించారు.

వైఎస్సార్‌సీపీ సగం మునిగిన నావ

టీడీపీ సీనియర్ నేత యనమల

సాక్షి, అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సగం మునిగిపోయిన నావని టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రామకృష్ణుడు విమర్శించారు. పూర్తిగా మునిగిపోకముందే అందరూ దూకేయడం బెటర్ అన్నారు. సోమవారం ఆయన మంగళగిరిలో మీడియాతో మాట్లాడారు. అందుకే ఆ పార్టీ నుంచి బయటకు వచ్చేయడానికి నాయకులు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఎన్సీఎల్‌టీలో తల్లి, చెల్లిపై కేసులేయడం ద్వారా జగన్ పూర్తిగా పాతాళానికి కూరుకుపోయారన్నారు. అది ఆస్తుల వివాదం కాదని, రాజకీయ ఆత్మహత్యని విమర్శించారు.

కుటుంబ సంక్షేమ కమిషనర్ బాధ్యతల స్వీకారం

సాక్షి, అమరావతి: ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్‌గా వాకాటి కరుణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరిలోని ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ నుంచి ఏపీలో రిపోర్ట్ చేసిన ఆమెను ప్రభుత్వం ఆదివారం కమిషనర్‌గా నియమించిన విషయం తెలిసిందే.

ధరల పెరుగుదలపై ఆందోళన

సాక్షి, న్యూఢిల్లీ: ఉపాధి హామీ, ధరల పెరుగుదల, వలసలు, భూమి ఇళ్ల స్థలాలు, సాంఘిక వివక్షపై దేశవ్యాప్త ఆందోళన చేపట్టనున్నట్లు అఖిల భారత వ్యవసాయ సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ తెలిపారు. సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ అంశాల్లో కేంద్రం ప్రజలపై వివక్ష చూపుతోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ నవంబర్ 26న దేశవ్యాప్తంగా ఆందోళనలు చేయనున్నట్లు చెప్పారు. తెలుగు రాష్ట్రాలకు ఉపాధి హామీ నిధులను తగ్గిస్తూ అన్యాయం చేస్తోందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు గతంలో కంటే 57శాతం పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు స్పందించాలని డిమాండ్ చేశారు.

బీసీ సంక్షేమ శాఖ జేడీకి అదనపు బాధ్యతలు

సాక్షి, అమరావతి: బీసీ సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్(జేడీ) ఆర్.శ్రీధర్‌రెడ్డికి ప్రభుత్వం పలు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఏపీ ఆర్య వైశ్య, బ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్లకు ఎండీగాను, ఏపీ క్షత్రియ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్‌కు పర్సన్ ఇన్‌చార్జిగాను ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. నవంబర్ 25 వరకు ఆయన ఈ అదనపు బాధ్యతలు నిర్వహిస్తారని పేర్కొంది.



బాపట్ల బీచ్‌లో బాదుడే బాదుడు

ఒక్కొక్కరి నుంచి రూ.20 ప్రవేశరుసుం వసూలుకు నిర్ణయం

- 'సూర్యలంక' తీరంలో దోపిడీకి పచ్చనేతలు పాగా
- వాహనాలకు ఇక నేరుగా డబ్బులు వసూళ్లు
- ఇక్కడకు సందర్శకుల తాకిడి ఎక్కువైనందునే దీనిపై తమ్ముళ్ల కన్ను
- ఇప్పటికే చీరాలలో ఇదే రీతిలో వసూళ్లు

సాక్షి ప్రతినిధి, బాపట్ల : గత ప్రభుత్వ హయాంలో విశాఖ రుషికొండలోని బ్లూఫ్లాగ్ బీచ్‌లో ప్రవేశరుసుం వసూలు చేయాలని సంకల్పిస్తే నానా యాగీచేసిన పచ్చబ్యాచ్ ఇప్పుడు బాపట్ల సూర్యలంక బీచ్‌లో సిగ్గూఎగ్గూ లేకుండా అదే పనికి బరితెగిస్తున్నారు. ఇక్కడకు వచ్చే పర్యాటకుల నుంచి భారీగా పిండుకునేందుకు రంగం సిద్ధం చేశారు. బీచ్‌కు వచ్చే ఒక్కొక్కరి నుంచి రూ.20 చొప్పున వసూలుచేయాలని నిర్ణయించారు. అంతేకాదు.. ఇప్పటి వరకూ వేలంపాట నిర్వహించి తద్వారా వాహనాల నుంచి టోల్‌గేట్‌లో డబ్బులు వసూలుచేసేవారు. ఇప్పుడు ఆ వేలంపాట ఎత్తేసి పంచాయతీ ముసుగులో తెలుగు తమ్ముళ్లే ఈ తతంగం మొత్తం నిర్వహించి బీచ్‌ను తమ గుప్పెట్లో పెట్టుకోనున్నారు. బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ శుక్రవారం జరిగిన బాపట్ల మున్సిపల్ సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించగా సభ్యులు, అధికారులు చప్పట్లతో స్వాగతించారు. ఈనెలాఖరు నుంచే పచ్చబ్యాచ్ వాహనాల నుంచి డబ్బులు వసూలుచేయనుండగా ఆ తర్వాత సందర్శకుల నుంచి వసూలు చేయనున్నారు. మరోవైపు.. పక్కనే ఉన్న చీరాలలో కూడా కొద్దిరోజులుగా ఇదే రీతిలో వసూళ్ల పర్వం సాగుతుండడంతో అక్కడ పచ్చనేతల దోపిడీపై పర్యాటకులు మండిపడుతున్నారు.

వేలంపాటకు మంగళం..

నిజానికి.. ఇప్పటివరకూ వేలంపాటలో టోల్‌గేట్ నిర్వహణను దక్కించుకున్న వారు సందర్శకుల నుంచి వాహనాలకు డబ్బులు వసూలు చేసేవారు. కానీ, ఇప్పుడు గ్రామ పంచాయతీ మాటున పచ్చ మాఫియాయే నేరుగా టోల్‌గేట్ వసూళ్లతోపాటు తీరంలో టాయిలెట్లు, ఇతరత్రా రాబడి వనరులన్నింటినీ తమ గుప్పెట్లోకి తీసుకుని దందా సాగించేందుకు సిద్ధమయ్యారు. ఎందుకంటే.. వారంలో ప్రతి శని, ఆదివారాల్లో ఇక్కడికి విపరీతంగా పర్యాటకులు వస్తారు. వారాంతంలో రెండ్రోజులు దాదాపు 20 వేల మంది పర్యాటకులు వస్తుండగా.. మిగిలిన ఐదురోజుల్లో 10 నుంచి 15 వేల మంది చొప్పున నెలకు 1.20 లక్షల మందికి తగ్గకుండా పర్యాటకులు వస్తున్నారు. ఈ లెక్కన నెలకు రూ.24 లక్షల రాబడి ఉంటుంది. దీంతో పచ్చ తమ్ముళ్లు దీనిని పాడికుండలా భావించి దీనిపై కన్నేశారు. అలాగే, టూవీలర్‌కు రూ.15, ఆటోకు రూ.30, కారుకు రూ.50, బస్సుకు రూ.100 చొప్పున ధరలు నిర్ణయించారు. గత ఏడాది ఇది వేలంపాటలో రూ.30 లక్షలు పలికింది. దీంతోపాటు ఇక్కడి కొన్ని టాయిలెట్స్, వాష్‌రూములు ఏర్పాటుచేసి నిర్వహణ కోసం వేలంపాట పెట్టగా అదీ ఏడాదికి రూ.5 లక్షలు పలికింది. ఇవికాకుండా బల్లలు, గుర్రాలు, తీరంలో పర్యాటకులను తిప్పే బైక్‌లు నడిపేవారు పంచాయతీకి పన్నులు చెల్లిస్తున్నారు. మొత్తంగా ఏడాదికి రూ.38 లక్షల వరకు తీరంపై రాబడి ఉంది. ఇలా ఇవన్నీ వేలంపాటలు కావడంతో రాబడిపై అందరికీ స్పష్టత ఉంది. కానీ, ఇప్పుడు ఈ వ్యవహారాన్నింట్లో ఇక తెలుగు తమ్ముళ్లదే పెత్తనం కావడంతో రాబడిపై అనేక అనుమానాలు ముసురుకుంటున్నాయి. ఎందుకంటే.. ఇప్పుడు ఎంత వస్తుందో అన్నది ఎవరికీ తెలిసే అవకాశంలేదు. అధికార పార్టీ కనుక అడిగేవారూ ఉండరు. ఇదే ఆలోచనకు వచ్చిన ఎల్లోగ్యాంగ్ తీరంలో పాగా వేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక కొద్దిరోజుల్లో కార్తీక మాసం ప్రారంభమవుతుండడంతో పచ్చనేతలకు పండగే పండగ. కారణం.. ఈ మాసంలో జనం లక్షల్లో తీరానికి వస్తారు. పెద్దఎత్తున వాహనాల రానుండటంతో రూ.లక్షల్లో వసూలుచేసుకునే అవకాశముంది. ఇదిచూసి.. పచ్చనేతల సొంత లాభం కోసమే పర్యాటకుల నుంచి డబ్బులు వసూళ్లకు దిగుతున్నారని ఆ పార్టీ నేతలే వ్యాఖ్యానించడం కొసమెరుపు.

వైద్య కళాశాలల్లో ప్రిన్సిపల్స్, సూపరింటెండెంట్‌ల బదిలీ

రాష్ట్రంలో పలు ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల ప్రిన్సిపల్స్, సూపరింటెండెంట్‌లను బదిలీ చేస్తూ సోమవారం వైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీచేశారు.

– సాక్షి, అమరావతి:

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
డాక్టర్ ఎస్.వి. సుందరాచారి	ప్రిన్సిపల్, మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాల	ప్రిన్సిపల్, గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల
డాక్టర్ టి.టి.కె. రెడ్డి	ప్రిన్సిపల్, గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల	ప్రిన్సిపల్, మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాల
డాక్టర్ ఎస్.ఎస్.వి. రమణ	ప్రొఫెసర్, ఆర్థోపెడిక్స్, గుంటూరు జీజీహెచ్	సూపరింటెండెంట్, గుంటూరు జీజీహెచ్
డాక్టర్ వై. కిరణ్	సూపరింటెండెంట్, జీజీహెచ్, గుంటూరు	ప్రొఫెసర్, జనరల్ సర్జరీ గుంటూరు జీజీహెచ్
డాక్టర్ వెంకటేశ్వరరావు	సూపరింటెండెంట్, విజయవాడ జీజీహెచ్	ఏడీఎంఈ, డీఎంఈ కార్యాలయం
డాక్టర్ వెంకటేశ్వరరావు	ప్రొఫెసర్, అనస్తీషియా విజయవాడ జీజీహెచ్	సూపరింటెండెంట్, విజయవాడ జీజీహెచ్
డాక్టర్ కె. వెంకటేశ్వర్లు	ప్రొఫెసర్, ఆర్థోపెడిక్స్, కర్నూలు జీజీహెచ్	సూపరింటెండెంట్, కర్నూలు జీజీహెచ్

ప్రతి ఇంటి నుంచి పారిశ్రామికవేత్తను తయారు చేస్తాం

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు ఆకాంక్ష మేరకు రాష్ట్రంలోని ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేసేందుకు కృషి చేస్తామని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో సోమవారం ఆయా శాఖల అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏపీలో స్వయం సహాయక సంఘాల్లో ఉన్న సభ్యులను సూక్ష్మ, చిన్న పారిశ్రామికవేత్తలుగా మార్చడంలో భాగంగా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వారిని పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలన్నారు. సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల సంస్థ సీఈవో నందిని సలారియా, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈవో శేఖర్ బాబు, జాతీయ చిన్నతరహా పరిశ్రమల సంస్థ, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డ్, జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ, మత్స్య, ఉద్యానవన, వ్యవసాయ, పశుగణాభివృద్ధి శాఖల అధికారులతో పాటు నాబార్డ్, కైతీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొని ఆయాశాఖలతో అనుసంధానమైన పథకాల గురించి వివరించారు.

'స్ట్రోక్'ను దెబ్బతీద్దాం



చాలా మందిలో స్ట్రోక్ అంటే ఇప్పటికీ గుండెపోటు అనే అపోహ ఉంది. పరిభాషలో పలకాలంటే స్ట్రోక్ అంటే మెదడు పోటు. పూర్తిగా మెదడుకి సంబంధించిన అత్యయిక స్థితి. ఈ స్ట్రోక్ ప్రస్తుతం కలవరపెడుతోంది. స్ట్రోక్‌కి గురవుతున్న వారి సగటు వయసు నానాటికీ తక్కువవుతోంది. పదేళ్ల క్రితం కనీసం 40 ఏళ్లు సరాసరిగా ఉన్న బాధితుల వయసు.. ప్రస్తుతం 26కి చేరిందంటే పరిస్థితి ఎంతగా దిగజారిందో అవగతమవుతోంది.

నేడు వరల్డ్ స్ట్రోక్ డే

25 ఏళ్లు పైబడ్డ వారికీ రిస్క్

'బి గ్రేటర్ దేన్ స్ట్రోక్' ఈ ఏడాది నినాదం

కాకినాడ క్రైం: ప్రజల్లో ఈ విపత్తుపై అవగాహన పెంచేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఏటా అక్టోబర్ 29న వరల్డ్ స్ట్రోక్ డేగా ప్రకటించింది. ప్రజల్లో విస్తృత అవగాహన పెంపొందించి, స్ట్రోక్‌కు స్టాప్ చెప్పడమే ప్రస్తుతం ప్రపంచం ముందున్న లక్ష్యం.

స్ట్రోక్ అంటే..

స్ట్రోక్‌ను వాడుక భాషలో పక్షవాతం అంటారు. బ్రెయిన్ అటాక్ అని కూడా పిలుస్తారు. మెదడులో రక్తనాళాలు పూడుకున్నా, పగిలినా, ధమనులు, సిరల్లో ఆటంకాలు ఏర్పడినా, మెదడుకు రక్తం సరఫరా నిలిచిపోతుంది. తద్వారా స్ట్రోక్ వస్తుంది. అప్పటివరకు చురుగ్గా ఉన్న మనిషి జీవచ్ఛవమవుతాడు. ఒక్క ముక్కలో చెప్పాలంటే, జీవితమంతా నరకప్రాయమవుతుంది.

స్ట్రోక్ సంభవిస్తే..

మెదడుకు ప్రవహించే రక్తంలో అంతరాయం ఏర్పడుతుంది. దీంతో మెదడు పనితీరు క్షీణిస్తుంది. 80 శాతానికి పైగా స్ట్రోక్ బాధితుల్లో మూతి వంకర్లు పోవడం, నత్తి, కాళ్లు చేతులు చచ్చుబడటం, మాట్లాడలేకపోవడం, కళ్లు మసకబారడం, చూపు శాశ్వతంగా కోల్పోవడం వంటి లక్షణాలుంటాయి. 15 శాతం మందికి పైగా బాధితుల్లో మెదడులో నరాలు చిట్లి, అంతర్గత రక్తస్రావం అవుతుంది. ఈ స్థితి మరణానికీ దారితీయవచ్చు.

లక్షణాలివీ..

మాటల్లో తడబాటు, అకస్మాత్తుగా ముఖం, చేయి, కాలు తిమ్మిర్లు, బలహీనంగా లేదా పట్టు వదిలేసినట్లు అనిపించడం. ఒకటి లేదా రెండు కంటి చూపుల్లో ఇబ్బందులు ఏర్పడి.. చూడడంలో సమస్య, శరీరాన్ని బ్యాలెన్స్ చేయలేకపోవడం, అకారణంగా విపరీతమైన తలనొప్పి స్ట్రోక్ లక్షణాలు.

రావడానికి కారణాలు

- ఆడవారితో పోలిస్తే మగవారిలో ఎక్కువగా స్ట్రోక్ వచ్చే ప్రమాదం అధికం.
- ధూమపానం, శారీరక శ్రమ లేకపోవడం, అనారోగ్యకర ఆహారపు అలవాట్లు, ఇష్టానుసారంగా మత్తు పానీయాల వినియోగం, రక్తపోటు, ఏట్రియల్ ఫిబ్రిలిఏషన్, అధిక కొలెస్ట్రాల్ స్థాయి, ఊబకాయం, జన్యుపర నిర్మాణంతో పాటు, మానసిక సమస్యలు కూడా స్ట్రోక్‌కు కారణమవుతాయి.

గురి కాకూడదంటే..

స్ట్రోక్‌కి గురి కాకూడదంటే జీవన శైలిలో సానుకూల మార్పులను ఆహ్వానించాలి. సమయానుగుణంగా ఆహారం, నిద్ర అవసరం. ధూమపానం, మద్యపానం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. పోషకాహారం తీసుకోవాలి. ఆహారంలో మంచి మార్పుల వల్ల స్ట్రోక్ నుంచి తప్పించుకోవచ్చు. సీజనల్ పండ్లు, తృణధాన్యాలు, చేపలు, కొవ్వు తక్కువగా ఉండే పాల పదార్థాలు, వ్యాయామం, నడక, ధ్యానం దోహదం చేస్తాయి.



డాక్టర్ ఆర్.గౌతమ్ ప్రవీణ్, న్యూరో ఫిజీషియన్, కాకినాడ

ఫాస్ట్ ఫార్ములాతో సేఫ్

స్ట్రోక్ వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. రోగి వయసు, హెల్త్ హిస్టరీకి అనుగుణంగానే స్ట్రోక్ నుంచి తేరుకోవడం అన్నది ఆధారపడి ఉంటుంది. రక్తనాళాల్లో బలహీన ప్రాంతాన్ని అన్యూరిజం అంటారు. బయటికి ఉబికిన ఈ ప్రాంతంలో పగుళ్లు ఏర్పడితే మెదడు పూర్తిగా దెబ్బతింటుంది. దీనికి అత్యవసర చికిత్స చేయాల్సి ఉంటుంది. 'బి గ్రేటర్ దేన్ స్ట్రోక్' అన్న నినాదాన్ని ఈ ఏడాది థీమ్‌గా వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్ నిర్ణయించింది. స్ట్రోక్‌కు మించిన మనోధైర్యాన్ని పెంపొందించుకుని, ముందుకు వెళ్లాలన్నది ఈ థీమ్ ఉద్దేశం.

తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం డిమాండ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన కింద చెల్లించాల్సిన రూ.3,200 కోట్లను తక్షణమే విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్, వృత్తి విద్య కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులు సొంతంగా ఫీజులు చెల్లించలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో నలిగిపోతున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఉన్నత విద్యా మండలి ఇన్‌చార్జి చైర్మన్ రామ్మోహనరావుకు వినతిపత్రం అందజేశారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తోందన్నారు. గత ప్రభుత్వం షెడ్యూల్ ప్రకారం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, విద్యాదీవెన పథకాల డబ్బులను చెల్లించే సమయానికి ఎన్నికల కోడ్ పేరుతో చంద్రబాబు అడ్డుకున్నారని గుర్తుచేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా 2017లో విద్యార్థులకు ఎగ్గొట్టిన రూ.1,778 కోట్లు బకాయిలను ఆ తర్వాత సీఎం అయిన వైఎస్ జగన్ విడుదల చేసి విద్యార్థులకు అండగా నిలిచారని గుర్తుచేశారు.

ఆన్‌లైన్‌లో ఉల్లి విక్రయాలు పునరుద్ధరణ

మంత్రి అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి: ఆన్‌లైన్‌లో ఉల్లి విక్రయాల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మార్కెటింగ్, ఉద్యాన శాఖలపై సోమవారం సచివాలయంలో జరిపిన సమీక్షలో మంత్రి మాట్లాడుతూ.. క్రయవిక్రయాలు పూర్తయిన ఉల్లిని కర్నూలు యార్డు నుంచి తరలించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఈ–నామ్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య పరిష్కారమవడంతో సోమవారం నుంచి పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ పద్ధతిలో క్రయవిక్రయాలు జరుగుతున్నాయని.. 43వేల బస్తాల ఉల్లిగడ్డల విక్రయాలు ఆన్‌లైన్‌లోనే చేశారన్నారు.

నాణ్యతా ప్రమాణాలుంటేనే కొనుగోలు..

కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా 2024–25 సీజన్‌కు సంబంధించి పత్తి కొనుగోళ్ల కోసం ఏర్పాటుచేసిన కేంద్రాలనూ సోమవారం పూర్తిస్థాయిలో ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కేంద్రాల్లో తమ వివరాలను నమోదు చేసుకుని పత్తి నిల్వలను విక్రయించుకోవచ్చునన్నారు.

ఏపీకి బదిలీ చేయండి

హోమ్‌గార్డుల విజ్ఞప్తి

సాక్షి, అమరావతి : ఆంధ్రప్రదేశ్ స్థానికత కలిగి తెలంగాణలో విధులు నిర్వహిస్తున్న తమను సొంత రాష్ట్రానికి బదిలీ చేయాలని పలువురు హోమ్‌గార్డులు ప్రభుత్వాన్ని కోరారు. ఉమ్మడి ఏపీలో హోమ్‌గార్డులుగా నియమితమైన తాము 15 ఏళ్లుగా తెలంగాణ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం కూడా తెలంగాణలోనే కొనసాగుతున్న తమను ఏపీకి బదిలీ చేయాలని పదేళ్లుగా కోరుతున్న విషయాన్ని వారు గుర్తు చేశారు. తెలంగాణలో తమను స్థానికేతరులుగా పరిగణిస్తున్నారని, తమ పిల్లల భవిష్యత్‌పై ఇది ప్రతికూల ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.



శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 69,333 మంది స్వామిని దర్శించుకున్నారు. 22,606 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.53 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 6 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళితే లోనికి అనుమతించబోమని స్పష్టం చేసింది.


నేడు రావులమ్మ వారి పంట జాతర

అంబాజీపేట: కె.పెదపూడి గ్రామంలో వేంచేసి ఉన్న రావులమ్మ వారి పంట జాతరను మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రెండేళ్లకోసారి పంట జాతర నిర్వహిస్తారు. గ్రామంలోని రైతులు, గ్రామస్తులు అమ్మవారి పూజా ఘటాలను సుమారు 15 రోజులుగా పురవీధుల్లో ఊరేగించారు. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ అమ్మవారి పూజా ఘటాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో జాతర చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా శ్రీపుష్ప యాగం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించిన పవిత్రోత్సవాలు సోమవారం సంపూర్ణమయ్యాయి. మూడో రోజు స్వామికి, ఉభయ దేవేరులకు అలంకరించిన పవిత్రాలను తీసుకువచ్చి చక్ర పెరుమాళ్లకు సమర్పించారు. శ్రీవారికి ఏకాదశ ఫలరసాలతో అర్చన వేడుకగా జరిగింది. చతుస్థానార్చనలతో ఉత్సవాలను ప్రారంభించి శ్రీపుష్పయాగంతో ముగించారు. 108 కలశాలతో స్వామి, అమ్మవార్లకు శత కలశ స్నపన తిరుమంజన సేవ ఘనంగా నిర్వహించారు.

మద్ది హుండీ ఆదాయం రూ.26.83 లక్షలు



జంగారెడ్డిగూడెం రూరల్: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి దేవస్థానంలో హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 54 రోజులకు రూ.26,83,741 ఆదాయం లభించినట్లు ఆలయ సహాయ కమిషనర్ ఆర్‌వీ చందన తెలిపారు. జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వర రావు స్వామి దేవస్థానం ఆలయ ఈఓ మానికల రాంబాబు పర్యవేక్షణలో సిబ్బంది, అర్చకులు హుండీ ఆదాయాన్ని లెక్కించారు.

30న జాబ్‌మేళాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 30న జిల్లాలోని ఏలూరు, బుట్టాయిగూడెంలో జాబ్‌మేళాలు నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఇన్‌చార్జి అధికారి వాడపల్లి కిషోర్ తెలిపారు. ఏలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాల (స్కిల్ హబ్), సత్రంపాడులో మేళా నిర్వహిస్తామని, వివరాలకు సెల్ 8978524022, 9493482414 (9988853335–టోల్ ఫ్రీ)లో సంప్రదించవచ్చన్నారు. అలాగే బుట్టాయిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో నిర్వహించే జాబ్‌మేళా సమాచారం కోసం సెల్:9182342688, 9666322032 (9988853335–టోల్ ఫ్రీ) నంబర్లలో గాని సంప్రదించవచ్చని పేర్కొన్నారు.



అట్టహాసంగా లాన్‌టెన్నిస్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని కాకినాడ డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి కేవీ సత్యనారాయణ అన్నారు. సోమవారం కాకినాడ జిల్లా క్రీడా మైదానం లాన్‌టెన్నిస్ కోర్టుల ఆవరణలో రాష్ట్ర స్థాయి 68వ ఏపీ అంతర్ జిల్లాల పాఠశాల క్రీడాసమాఖ్య లాన్‌టెన్నిస్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీల ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీవైఈఓ సత్యనారాయణ, గౌరవ అతిథిగా డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్, విశిష్ట అతిథిగా ఏపీ లాన్‌టెన్నిస్ సంఘ కార్యదర్శి పీవీ రామ్‌కుమార్‌లు హాజరయ్యారు.

వృక్ష సంరక్షణతోనే జీవ మనుగడ



విశాఖ సిటీ: వృక్షాలను సంరక్షిస్తేనే జీవుల మనుగడ సాధ్యపడుతుందని ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు పేర్కొన్నారు. వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏయూ బొటానికల్ గార్డెన్‌లో రిజిస్ట్రార్ మొక్కలు నాటి మాట్లాడారు. విశ్వవిద్యాలయంలో వృక్ష సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యమిస్తామని చెప్పారు. నగరంలో అతిపెద్ద హరిత ప్రాంగణంగా ఏయూ నిలుస్తోందన్నారు. మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం మనందరి బాధ్యతని సూచించారు. ఈ సందర్భంగా బొటానికల్ గార్డెన్‌లో అవకాడో, లక్ష్మణ ఫలం, మల్బరీ, లిచీ, మామిడి, ఇతర పండ్ల మొక్కలు నాటారు.

ఆధునిక ప్రయోగశాల ప్రారంభం

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగం విద్యార్థులకు ఉపయుక్తంగా అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధునికీకరించిన ప్రయోగశాలను సోమవారం ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ప్రారంభించారు. అరబిందో ఫార్మా వైస్ చైర్మన్, ఎండీ కె.నిత్యానందరెడ్డి, డైరెక్టర్ పి.శరత్‌చంద్రారెడ్డిల సహకారంతో ఈ ల్యాబొరేటరీని ఆధునికీకరించారు. అరబిందో ఫార్మా సీఎస్‌ఆర్ నిధుల నుంచి రూ.20 లక్షలు, ఏయూ రసాయన శాస్త్ర విభాగం(ఫుడ్స్, డ్రగ్స్ అండ్ వాటర్ అనాలసిస్) 1990–92 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రూ.8 లక్షలతో ప్రయోగశాలను తీర్చిదిద్దారు.

సాక్షి ప్లస్
మంగళవారం ॥ 29-10-2024

ఓ పరిమితి లేకుండా అనారోగ్యకరంగా, అసాధారణంగా పెరుగుతూ, తొలుత ఒక కణంతోనే క్యాన్సర్ తన ప్రస్థానాన్ని ప్రారంభిస్తుంది. ఎప్పటికప్పుడు రెట్టింపు అయ్యే ఈ ప్రక్రియలో 20వ సారి అది ఒక మిలియన్ కణాలుగా వృద్ధి చెందుతుంది. మిలియన్ కణాల సముదాయంగా పెరిగినప్పటికీ ఆ టైమ్‌లోనూ దాన్ని కనుక్కోవడం కష్టసాధ్యం. అదే 30వసారి రెట్టింపు అయ్యే సమయంలో అందులో బిలియన్ కణాలకు పైగా ఉంటాయి. అప్పుడు మాత్రమే అది ఓ గడ్డ (లంప్)లా రూపొంది గుర్తించడానికి వీలయ్యేలా ఉంటుంది. అంటే... చేత్తో గడ్డను తడిమి గుర్తించడానికి వీలయ్యే సమయానికి ఆ క్యాన్సర్ గడ్డలో బిలియన్ కణాలు... వందకోట్ల కణాలకు పైనే ఉంటాయి. ఇక 40వ సారి రెట్టింపయ్యాక అందులో ఒక ట్రిలియన్ కణాలుంటాయి. అప్పటికీ చికిత్స లభించక 42-43వ సారి రెట్టింపయినప్పుడు రోగి ప్రమాదకరమైన పరిస్థితుల్లోకి వెళ్తాడు. అన్ని రెట్టింపులు కాకముందే... అంటే కేవలం 20వ సారి రెట్టింపయ్యే లోపు కనుక్కోగలిగితే...? క్యాన్సర్‌ను నయం చేసే అవకాశాలు చాలా ఎక్కువే. మరి ఆ దశలోనే క్యాన్సర్‌ను కనుక్కోవడం ఎలాగో తెలిపేదే ఈ కథనం.

• క్యాన్సర్

నఖ శిఖం నజరెయ్యండి



క్యాన్సర్ లక్షణాలు అవయవానికీ అవయవానికీ మారిపోతున్నప్పటికీ క్యాన్సర్ బాధితులందరికీలోనూ కొన్ని సాధారణ లక్షణాలు కనిపిస్తాయి. ఆరోగ్యవంతుల్లోనూ అప్పుడప్పుడూ ఆ లక్షణాలు కనిపించేవే కావడంతో వాటిని గుర్తించడం కష్టం.

క్యాన్సర్‌ను గుర్తించేందుకు తోడ్పడే కొన్ని సాధారణ అంశాలు...

● ఆకలి తగ్గడం ● కారణం తెలియకుండా / ఏ కారణమూ లేకుండానే బరువు తగ్గడం ● ఎడతెరిపి లేకుండా దగ్గు ● లింఫ్ గ్లాండ్స్ (చంకల్లో, గజ్జల్లో, గొంతుదగ్గర) వాపు ● అవయవాల నుంచి రక్తస్రావం... (ఈ లక్షణం కొన్నిసార్లు కొన్ని అవయవాలలో మాత్రమే)

ఒక్క చివరిది మినహా ఇక్కడ పేర్కొన్నవన్నీ చాలా మందిలో ఏదో ఓ దశలో క్యాన్సర్ లేకపోయినప్పటికీ కనిపించే మామూలు లక్షణాలు. అందుకే ఈ లక్షణాలన్నీ తప్పనిసరిగా క్యాన్సర్‌వే కానక్కర్లేదు. కాబట్టి వీటిలో ఏదో ఒకటి కనిపించిన మాత్రాన ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కానీ లక్షణాలకు అవసరమైన తొలి చికిత్సలు తీసుకున్న తర్వాత కూడా, అవే పునరావృతమవుతుంటే ఒకసారి డాక్టర్ చేత పరీక్ష చేయించుకుని అది క్యాన్సర్ కాదని నిర్ధారణ చేసుకొన్న తర్వాతే నిశ్చింతగా ఉండాలి.

తల నుంచి కాలి వేలి వరకు ఆయా అవయవాల్లో క్యాన్సర్ ఉంటే కనిపించేందుకు / తొలి దశలోనే గుర్తించేందుకు ఉపయోగపడే ప్రాథమిక లక్షణాలివి...

బ్రెయిన్ క్యాన్సర్...

తలనొప్పి వస్తుంటుంది. అకస్మాత్తుగా మతిమరపు రావడం, కొన్ని సార్లు సామాజిక సభ్యత మరచి ప్రవర్తించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మనిషి మెదడులో మాట్లాడటానికీ, దృష్టికీ, వినికిడికీ, కాళ్లూ, చేతుల కదలికల నియంత్రణకు... ఇలా వేర్వేరు ప్రతిచర్యలకు వేర్వేరు కేంద్రాలు (సెంటర్స్) ఉంటాయి. క్యాన్సర్ అభివృద్ధి చెందిన సెంటర్ దేనికి సంబంధించినదైతే ఆ అవయవం చచ్చుబడటం వంటి లక్షణాలూ కనిపిస్తాయి. ఇవీ ఆయా అవయవాలకు సంబంధించి తొలిదశలో క్యాన్సర్‌కు లక్షణాలు.

తల భాగంలో...

ఈ క్యాన్సర్స్ నోటిలో, దడవ మీద, నాలుక మీద లేదా చిగుర్లు (జింజివా) మీదా ఇలా తలభాగంలో ఎక్కడైనా రావచ్చు. ఆయా భాగాల్లో ఎరుపు, తెలుపు రంగుల ప్యాచెస్ ఉన్నా, దీర్ఘకాలంగా మానని పుండు (సాధారణంగా నొప్పి లేని పుండు, కొన్ని సందర్భాల్లో నొప్పి ఉండవచ్చు కూడా) ఉంటే క్యాన్సర్ అయ్యేందుకు అవకాశం ఎక్కువ. అదే నాలుక మీద అయితే నాలుక కదలికలు తగ్గవచ్చు. నాలుక వెనక భాగంలో అయితే స్వరంలో మార్పు వస్తుంది. మరింత వెనకనయితే మింగడంలో ఇబ్బంది కలుగుతుంది. ఇక స్వరపేటిక ప్రాంతంలో అయితే స్వరంలో మార్పు వస్తుంది. మెడ దగ్గర లింఫ్ గ్రంధుల వాపు కనిపిస్తుంది.

గొంతు భాగంలో...

దీన్ని ఓరో ఫ్యారింజియల్ భాగంగా చెప్పుకోవచ్చు. ఇక్కడ గొంతులో ఏదో ఇరుక్కుని ఉన్న ఫీలింగ్ ఉంటుంది. అన్నవాహిక మొదటి భాగంలో అయితే మింగడం ఇబ్బందిగా అనిపిస్తుంది.

ఊపిరితిత్తులు...

పొగతాగేవాళ్లలో ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే అవకాశం ఎక్కువ. ఇది ఉన్నవాళ్లలో దగ్గు, కళ్లె (స్ఫుటమ్)లో రక్తం పడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఎక్స్-రే, సీటీ స్కాన్ పరీక్ష ద్వారా దీన్ని తెలుసుకోవచ్చు.

రొమ్ము క్యాన్సర్...

మహిళల్లో ఎక్కువగా కనిపించే ఈ రకం క్యాన్సర్‌లో... రొమ్ములో ఓ గడ్డ చేతికి తగలడం, రొమ్ము పరిమాణంలో మార్పు, రొమ్ము మీది చర్మం ముడతలు పడటం, రొమ్ము చివర (నిపుల్) నుంచి రక్తంతో కలిసిన స్రావం లాంటివి రొమ్ము క్యాన్సర్ లక్షణాలు.

కడుపు (స్టమక్)లో...

కడుపు (స్టమక్)లో మంట పుడుతున్నట్లుగా నొప్పి. పొట్టలో మంట. కొన్నిసార్లు పొట్టలో రక్తస్రావం అయినప్పుడు ఆ రక్తం వల్ల విసర్జన సమయంలో మలం నల్లగా కనిపిస్తుంది. రక్తస్రావం వల్ల రక్తహీనత (ఎనీమియా) కూడా కనిపించవచ్చు. దాంతో పాటు కొన్ని సార్లు కొద్దిగా తినగానే కడుపునిండిపోయిన ఫీలింగ్ ఉంటుంది.

పేగుల్లో...

మలమూత్ర విసర్జన అలవాట్లలో మార్పులు కనిపిస్తాయి.

రెక్టమ్ క్యాన్సర్‌లో...

మలద్వారం (రెక్టమ్) క్యాన్సర్ విషయంలోనూ మల విసర్జన తర్వాత కూడా ఇంకా లోపల మలం మిగిలే ఉందన్న ఫీలింగ్. దీనికో కారణం ఉంది. విసర్జించాల్సిన పదార్థం మామూలుగా మలద్వారం వద్దకు చేరగానే అక్కడి నాడులు స్పందించి అక్కడ మలం పేరుకుని ఉన్నట్లుగా మెదడుకు సమాచారమిస్తాయి. అప్పుడా పదార్థాల్ని విసర్జించాల్సిందిగా మెదడు ఆదేశాలిస్తుంది. కానీ విసర్జన తర్వాత కూడా అక్కడ క్యాన్సర్ ఓ గడ్డలా ఉండటంతో ఏదో మిగిలే ఉందన్న సమాచారాన్ని నాడులు మెదడుకు మళ్లీ మళ్లీ చేరవేస్తుంటాయి. దాంతో ఇంకా అక్కడేదో ఉందన్న ఫీలింగ్ కలుగుతుంటుంది. ఈ లక్షణంతో పాటు కొందరిలో బంక విరేచనాలు, రక్తంతో పాటు బంక పడటం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి.

సర్విక్స్ క్యాన్సర్...

దక్షిణ భారతదేశంలోని తీరప్రాంతాల్లోని మహిళల్లో అత్యధికంగా కనిపించే క్యాన్సర్ ఇది. రుతుస్రావం సమయంలో గాక మధ్యలోనూ రక్తం రావడం, రుతుస్రావం ఆగిపోయిన (మెనోపాజ్) మహిళల్లో అసాధారణంగా రక్తస్రావం కావడం, మహిళల్లో సెక్స్ తర్వాత రక్తస్రావం (పోస్ట్ కాయిటల్ బ్లీడింగ్), ఎరుపు, తెలుపు డిశ్చార్జ్ వంటివి దీని లక్షణాలు.

ఒవేరియన్ క్యాన్సర్...

దాదాపు 50, 60 ఏళ్ల మహిళల్లో పొట్ట కింది భాగంలో నొప్పి రావడం వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. సాధారణంగా ఈ భాగానికి క్యాన్సర్ వస్తే ఒక్కోసారి ఏ లక్షణాలూ కనిపించకుండానే ప్రమాదకరంగా పరిణమించవచ్చు.

టెస్టిస్ క్యాన్సర్...

పురుషుల్లో వచ్చే ఈ క్యాన్సర్‌లో వృషణాల సైజ్ పెరగడం, దాన్ని హైడ్రోసిల్‌గా పొరబాటు పడటం వల్ల పెద్దగా సీరియస్‌గా తీసుకోకపోవడంతో అది సైజ్‌లో పెరిగి ప్రమాదకరంగా పరిణమించే అవకాశాలెక్కువ.

ప్రోస్టేట్ క్యాన్సర్...

సాధారణంగా 50, 60 ఏళ్లు దాటిన పురుషుల్లో తరచూ కనిపించే క్యాన్సర్ ఇది. దాదాపు లక్షణాలేవీ పెద్దగా కనిపించకుండా వచ్చే ఈ క్యాన్సర్‌లో రాత్రివేళల్లో మూత్రవిసర్జనకు వెళ్లాల్సిన అవసరం ఎక్కువగా ఉండవచ్చు. పీఎస్ఏ అనే పరీక్ష ద్వారా దీన్ని తేలిగ్గా గుర్తించవచ్చు.

కిడ్నీ అండ్ బ్లాడర్ క్యాన్సర్...

మూత్ర విసర్జన సమయంలో రక్తం కనిపించడం, మాటిమాటికీ మూత్రం రావడం మూత్రపిండాలు, మూత్రాశయ క్యాన్సర్లలో కనిపించే సాధారణ లక్షణం.

బ్లడ్ క్యాన్సర్స్...

రక్తం కూడా ద్రవరూపంలో ఉండే కణజాలమే కాబట్టి... బ్లడ్ క్యాన్సర్ కూడా రావచ్చు. రక్తహీనత, చర్మం మీద పొడలా (పర్ప్యూరిక్ ప్యాచెస్) రావడం, చిగుళ్లలోంచి రక్తం రావడం, బరువు తగ్గడం, జ్వరం రావడం వంటివి బ్లడ్ క్యాన్సర్ లక్షణాలు.

లింఫ్ గ్లాండ్స్ అన్నవి బాహుమూలాల్లో, దవడల కింది భాగంలో మెడకు ఇరువైపులా, గజ్జల్లో ఉండే ఈ గ్రంథులకూ క్యాన్సర్ రావచ్చు. దాన్ని లింఫోమా అంటారు.

స్కిన్ క్యాన్సర్...

చర్మం క్యాన్సర్‌ను ఏ, బీ, సీ, డీ అనే నాలుగు లక్షణాలతో తేలిగ్గా గుర్తించవచ్చు. శరీరంపై ఏదైనా మచ్చ తాలూకు ఏ- అంటే... ఎసిమెట్రీ (అంటే మచ్చ సౌష్టవం మొదటికంటే మార్పు వచ్చినా, బీ- అంటే... బార్డర్ అంటే అంచులు మారడం, మందంగా మారడం జరిగినా, సీ- అంటే కలర్ రంగు మారినా, డీ అంటే డయామీటర్... అంటే వ్యాసం (సైజు) పెరిగినా దాన్ని చర్మం క్యాన్సర్ లక్షణాలుగా భావించవచ్చు.

కొంతమందిలో తమ తాతతండ్రుల్లో, పిన్ని వంటి దగ్గరి సంబంధీకుల్లో క్యాన్సర్ ఉన్నప్పుడూ, అలాగే స్మోకింగ్, ఆల్కహాల్ వంటి అనారోగ్యకరమైన జీవనశైలి ఉన్నవారూ... ఇక జన్యుపరంగా అంటే... జీరోడెర్మా, న్యూరోఫైబ్రమాటోసిస్ వంటి వ్యాధులున్నవారిలో క్యాన్సర్ ముప్పు ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి హైరిస్క్ వ్యక్తులంతా మిగతావారికంటే మరింత అప్రమత్తంగా ఉంటూ, మరింత ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలి.

గమనించాల్సిన అంశం ఏమిటంటే... ఇక్కడ ప్రస్తావించిన లక్షణాలన్నీ తప్పనిసరిగా క్యాన్సర్‌కు సంబంధించినవే కావచ్చేమోనని ఆందోళన వద్దు. తొలిదశలో తేలిగ్గా గుర్తిస్తే క్యాన్సర్ తగ్గుతుందన్న విషయం గుర్తుంచుకుని, ఏవైనా లక్షణాలు కనిపిస్తే ఆందోళన చెందకుండా ఒకసారి డాక్టర్ల సూచన మేరకు పరీక్షలు చేయించుకోవాలి. అది క్యాన్సర్ కాదని నిర్ధారణ చేసుకున్న తర్వాత నిశ్చింతగా ఉండాలి.



డా॥ ఏవీఎస్ సురేష్
సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్

చెవులు... ముక్కు కుట్టిస్తుంటే..!

ఇటీవల కొందరు కనుబొమల దగ్గర, పెదవుల దగ్గర, మరికొందరైతే నాభి దగ్గర కూడా బాడీ పియర్సింగ్ చేయించుకుంటున్నారు. గతంలో సాంప్రదాయికంగా బంగారపు ఆభరణాల తయారీ కళాకారులే ఈ చెవులు కుట్టడాన్ని చేసేవారు. ఇప్పుడైతే చాలాచోట్ల బ్యూటీ సెలూన్లలోనూ పియర్సింగ్ చేస్తున్నారు. అయితే ఇప్పుడూ చాలామంది నిపుణులైన డాక్టర్ల ఆధ్వర్యంలోనే పియర్సింగ్ చేయిస్తున్నారు.

డాక్టర్ల దగ్గరే మేలు...

ఇప్పుడు అధునాతన పియర్సింగ్ పరికరాలతో చెవులు, ముక్కు లేదా దేహంలో అవసరమైన చోట్ల పియర్సింగ్ చేస్తున్నారు. ఈ ప్రక్రియలో రింగులుగా వేయదలచిన లేదా స్టడ్స్‌గా ఉంచదలచిన బంగారు, వెండి తీగలను ముందుగానే డాక్టర్లు స్టెరిలైజ్ చేశాకే ముక్కుచెవులు కుట్టడం చేస్తున్నారు. ఈ కోణంలో చూసినప్పుడు ఆరోగ్యపరంగా డాక్టర్ల ఆధ్వర్యంలోనే పియర్సింగ్ ప్రక్రియ జరగడం ఎంతో మంచిది. డాక్టర్ల ఆధ్వర్యంలో ఇలా స్టెరిలైజ్ చేశాకే బంగారు రింగు తొడగడం లేదా స్టడ్స్ తొడగడం వల్ల ఇన్ఫెక్షన్ల వంటి ప్రమాదాలు తగ్గుతాయి.

ఇలా చెవి, ముక్కు కుట్టడం లేదా అలా కుట్టిన చోట తీగ / స్టడ్ వేయాల్సిన ప్రదేశాల్లో చిన్న రంధ్రం వేసే సమయంలో కొన్ని కాంప్లికేషన్స్ రావచ్చు.

పియర్సింగ్‌లో కలిగే అనర్థాలు...

- **ఇన్ఫెక్షన్స్ :** కుట్టాల్సిన చోట సెప్టిక్ కాకుండా ఉండేందుకు ప్రక్రియకు ముందూ, ఆ తర్వాతా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఒక్కోసారి ముక్కుకు లేదా చెవికి రంధ్రం వేసిన చోట ఇన్ఫెక్షన్ రావచ్చు. ఆ తర్వాత ఇది మరిన్ని కాంప్లికేషన్లకు దారితీయవచ్చు.
- **సిస్ట్ / గ్రాన్యులోమా ఏర్పడటం :** ముక్కు లేదా చర్మంపైన ఇతర ప్రాంతాల్లో కుట్టిన చోట చిన్న బుడిపె వంటి కాయ రావచ్చు. దీన్ని సిస్ట్ లేదా గ్రాన్యులోమా అంటారు. కుట్టగానే చర్మంలో జరిగే ప్రతిస్పందన వల్ల ఈ సిస్ట్ / గ్రాన్యులోమా వస్తుంది. ఇది సాధారణంగా హానికరం కాదు. చాలావరకు దానంతట అదే తగ్గిపోతుంది. ఏదైనా సమస్య వస్తే డాక్టర్‌కు చూపించి తప్పక చికిత్స తీసుకోవాలి. ఇలా సిస్ట్ / గ్రాన్యులోమా / కీలాయిడ్ వచ్చే అవకాశం ఉన్నవారు చిన్నప్పుడే వేసిన రంధ్రం తప్ప మళ్లీ పియర్సింగ్ చేయించుకోకపోవడమే మంచిది.
- **మచ్చ ఏర్పడటం :** కొన్ని సార్లు కుట్టే ప్రక్రియలో వేసే రంధ్రం వద్ద మచ్చలా రావచ్చు. ఇలా వచ్చినప్పుడు తప్పనిసరిగా డర్మటాలజిస్ట్‌ను సంప్రదించాలి.

అలర్జీలు : కొన్ని సందర్భాల్లో కొందరికి కుట్టడానికి ఉపయోగించే బంగారం లేదా వెండి వల్ల అలర్జీ కలగవచ్చు. దీన్ని కాంటాక్ట్ డర్మటైటిస్ అంటారు. కొందరిలో ఆర్టిఫిషియల్ జ్యువెలరీ వల్ల కూడా ఇలాంటి అనర్థం రావచ్చు. ఇలాంటి సందర్భాల్లో కుట్టిన చోట్ల ఇన్ఫెక్షన్ రావడం, దురద, స్రావాలు కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి సందర్భాల్లో తప్పనిసరిగా డర్మటాలజిస్ట్ సలహా మేరకు చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది.







డా. స్వప్నప్రియ
సీనియర్ డర్మటాలజిస్ట్

ఇవి గుర్తుంచుకోండి...

- శరీర భాగాలకు కుట్టే సమయంలో ఎలాంటి ఇన్ఫెక్షన్ లేకుండా పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్త పడండి. అంతకు ముందు వైరల్, బ్యాక్టీరియల్, ఫంగల్ ఇన్ఫెక్షన్స్ ఏవీ లేనప్పుడే ముక్కు, చెవులు కుట్టించే ప్రక్రియకు వెళ్లాలి.
- చెవులు, ముక్కు కుట్టే సమయంలో రంధ్రం పెట్టాల్సిన చోటిని ముందే నిర్ణయించుకోవాలి. తీరా కుట్టే ప్రక్రియ పూర్తయ్యాక రంధ్రం సరైన స్థానంలో లేదని బాధపడటం కంటే ముందే తగిన ప్రదేశాన్ని ఎంపిక చేసుకోవాలి. ఒకటికి రెండు సార్లు చూసుకోవాలి.
- చెవులు లేదా ముక్కు కుట్టేవారికి ఉన్న అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. అంటే అనుభవజ్ఞుల దగ్గరే ఈ ప్రక్రియ జరిగేలా చూసుకోవడం మంచిది.
- చెవులు లేదా ముక్కు కుట్టించే ముందుగా ప్రీ-స్టెరిలైజ్‌డ్ స్టడ్స్ ఉపయోగించి చెవులు, ముక్కు కుడతారు. కాబట్టి అందరిలో అంతగా ప్రమాదం ఉండకపోవచ్చు. ఒకవేళ ఏదైనా ఇన్ఫెక్షన్ వచ్చినట్లయితే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.
- చెవులు లేదా ముక్కు కుట్టడానికి 45 నిమిషాల ముందుగా లోకల్ అనస్థీషియా ఇస్తారు కాబట్టి పెద్దగా నొప్పి అనిపించకపోవచ్చు.
- తేలిగ్గా మచ్చ పడే చర్మతత్వం ఉన్నవారు ముక్కు కుట్టించుకోకపోవడమే మంచిది. ఇలాంటి వారు చెవులు, ముక్కు కుట్టించుకోడానికి ముందే డర్మటాలజిస్ట్ / డాక్టర్ సలహా తీసుకోవడం మేలు.
- కీలాయిడ్స్ వచ్చే శరీర స్వభావం (శరీరంపై ఏదైనా గాయం అయినప్పుడు ఆ ప్రదేశంలో ఉబ్బినట్లుగా మచ్చ వచ్చే శరీర తత్వం) ఉన్నవారు బాడీ పియర్సింగ్‌కు వెళ్లకపోవడమే మంచిది.

‘సిస్ట్’ర్స్... జాగ్రత్త!

మహిళల్లో సాధారణంగా గర్భసంచి పక్కనే ఉండే ఓవరీస్‌లో లేదా వారి ప్రత్యుత్పత్తి వ్యవస్థకు సంబంధించిన అవయవాల్లో... రకరకాల సిస్ట్‌లు కనిపిస్తుంటాయి. సిస్ట్ అంటే నీరు లేదా నీటి వంటి ద్రవపదార్థంతో నిండి ఉన్న సంచి అని అర్థం. మహిళల్లో ఇలా సిస్ట్‌లు కనిపించడం మామూలే. సాధారణంగా కనిపించే కొన్ని రకాల సిస్ట్‌ల గురించి ప్రాథమిక అవగాహన కోసం... ఈ కథనం.



1. ఫాలిక్యులర్ సిస్ట్: అండం విడుదల సమయంలో కనపించే సిస్ట్ ఇది. పీరియడ్స్ తరువాత ఐదు లేదా ఆరు రోజుల నుంచి క్రమంగా సైజ్ పెరుగుతూ పోతుంది. సాధారణంగా 2 నుంచి 2.2 సెం.మీ. సైజ్‌కు చేరాక... మహిళల్లో అండం విడుదల జరిగాక కనుమరుగవుతుంది.


2. కార్పస్ ల్యుటియల్ సిస్ట్: అండం విడుదలైన తర్వాత ప్రెగ్నెన్సీ వస్తే... ఆ పిండాన్ని సపోర్టు చేయడానికి ఏర్పడే సిస్ట్ ఇది. సాధారణంగా ఈ సిస్ట్‌లు వాటంతట అవే కనుమరుగవుతాయి.

3. ఎండోమెట్రియల్ సిస్ట్: రక్తంతో నిండి ఉండే ఈ సిస్ట్ ఎండోమెట్రియోసిస్ అనే కండిషన్‌లో కనపడుతుంది. ఈ సిస్ట్‌లు తీవ్రమైన నొప్పి కలిగిస్తాయి. ఇవి క్రమంగా పెద్దదై కొన్నిసార్లు పలిగిపోయే అవకాశం ఉన్నందున ఇటువంటి సిస్ట్‌లను ఇంజక్షన్ ద్వారా తాత్కాలికంగా పెరగకుండా చేయడంగానీ లేదా సర్జరీ ద్వారా తీసేవేయడం కానీ చేస్తుంటారు. ఇలా చేయాల్సిన అవసరమూ ఉంటుంది.

4. ఇన్ఫెక్టెడ్ సిస్ట్: ఓవరీస్‌లో ఇది చాలా అరుదుగా కనిపిస్తుంది. ట్యూబ్‌తో కలిసి ట్యూబో-ఓవేరియన్ సిస్ట్‌ల పెల్విస్ ఇన్ఫెక్షన్స్‌లో సాధారణంగా ఇది కనిపిస్తుంటుంది.

5. పాలిసిస్టిక్ ఓవరీస్ : సాధారణంగా ప్రతినెలా 20 నుంచి 30 ఫాలికల్స్ ఓవరీస్‌లో పెరగడం ప్రారంభిస్తాయి. వీటన్నింటిలో అత్యంత అనువుగా ఉన్న ఫాలికల్ మాత్రమే అండంగా మారుతుంది. అది... మిగిలిన వాటికన్నా మరింత వేగంగా పెరిగి... పీరియడ్స్ వచ్చిన 12-16 రోజుల మధ్యలో విడుదల అవుతుంది. ఇక మిగిలిన ఫాలికల్స్ అన్నీ వాటంతట అవే మాయమైపోతాయి. కాని ఊబకాయం, హార్మోన్ల అసమతౌల్యత ఉన్న మహిళల్లో ఆ ఫాలికల్స్ అన్నీ ఒకే సైజ్ వరకు పెరుగుతాయిగానీ, ఏ ఒక్కటీ అండంగా మారదు. అలా పెరిగిపోయిన ఈ సిస్ట్‌ల వల్ల పీరియడ్స్ సక్రమంగా రాకపోవడం, బరువు మరింతగా పెరగడం, అవాంఛిత రోమాలు రావడం జరగవచ్చు. స్కానింగ్ చేసి చూసినప్పుడు ఈ ఫాలికల్స్ అన్నీ చిన్న చిన్న నీటి బుడగల్లాగా కనపడతాయి. వీటినే డాక్టర్లు ‘పాలిసిస్టిక్ ఓవరీస్’గా చెబుతారు. ఈ సమస్యను మందులతో, జీవనశైలి మార్పులతో తగ్గించడం సాధ్యమవుతుంది.

6. సీరస్ లేదా మ్యూసినస్ సిస్ట్ : ఇవి కూడా ఓవరీస్‌లో సాధారణంగా కనిపించే సిస్ట్‌లే. నలభై ఏళ్లకు పైబడినవారిలో కనిపిస్తుంది. సైజును బట్టి చికిత్స నిర్ణయిస్తారు.



డా॥ స్వాతి హెచ్‌వి
కన్సల్టెంట్, అబ్‌స్టెట్రీషియన్ & గైనకాలజిస్ట్

చాలావరకు వాటంతట అవి తగ్గిపోయేవే...

ఇన్ని రకాల సిస్ట్‌లు ఉన్నా ఫాలిక్యులార్, కార్పస్ ల్యుటియల్, చిన్న సైజ్‌లో ఉన్న సీరస్ సిస్ట్‌లు వాటంతట అవే తగ్గిపోతాయి. కొన్ని సమయాలలో 6 సెం.మీ సైజ్ కన్నా ఎక్కువగా ఉంటే సిస్ట్‌లు లేదా నీరులాంటి పదార్థంతోపాటు గట్టిగా ఉన్న సిస్ట్‌లు, ఎండోమెట్రియాటిక్ సిస్ట్‌ల వంటికి మాత్రమే శస్త్రచికిత్స అవసరమవుతుంది.

శస్త్రచికిత్స అవసరమయ్యేవి...

కొన్ని సిస్ట్‌లు మెలిక తిరిగి అంటే టార్షన్‌కు గురై పేషెంట్‌కు విపరీతమైన కడుపు నొప్పి, వాంతులు, కళ్లు తిరగడం, స్పృహ తప్పిపోవడం వంటి సమస్యలను తెచ్చిపెట్టినప్పుడు ఆపరేషన్ తప్పని సరి.

చివరగా... మహిళలు తామ ఓవరాల్ ఆరోగ్యం కోసం సరైన ఆహారం, ఎక్సర్‌సైజ్ చేస్తే బరువు తగ్గడం చాలా మంచిది. దీనివల్ల ఇతరత్రా అనేక సమస్యలతో పాటు కొంతవరకు సిస్ట్‌లు కూడా నివారితమయ్యే అవకాశం ఉంది.

• క్లినికల్ వ్యాంపైరిజమ్

రక్తం తాగాలనిపించే రుగ్మత!

ఇంగ్లిష్ సినిమాల్లో, కథల్లో డ్రాక్యులాలు రక్తం తాగుతాయి. ఇలా రక్తాన్ని రుచి చూసే ఆ పిశాచాల్లాంటి క్యారెక్టర్స్‌ను ఇంగ్లిష్‌లో ‘వాంపైర్స్’ అని పిలుస్తారు. కానీ అలా రక్తం తాగే కోరికతో ఉండే ఒక జబ్బు ఉంటుందనీ, ఆ మెడికల్ కండిషన్ పేరే ‘వాంపైరిజమ్’ అన్న సంగతి చాలా మందికి తెలియదు. ఆ వాంపైరిజమ్ గురించిన కథనమే కాస్త సంక్షిప్తంగా...

ప్రతి మనిషీ తనకు తెలియకుండానే ఒక్కోసారి రక్తాన్ని ఎంతో కొంత రుచి చూస్తుంటాడు. దీనికి ఉదాహరణే... వేలు తెగినప్పుడు గబుక్కున అకస్మాత్తుగా చాలామంది ఆ వేలిని నోట్లో పెట్టుకుంటారు. ఇందులో రక్తాన్ని రుచి చూడడానికంటే... అలా కంటిన్యువస్‌గా రక్తస్రావం జరగకుండా నివారించేందుకే ఇలా తెగిన వేలిని నోట్లో పెట్టుకుంటారు. ఎవరికి వారు తమ సొంత రక్తాన్ని రుచి చూసే ఆ ప్రక్రియకు ‘ఆటో వాంపైరిజమ్’ అంటారు. వేలు తెగి రక్తస్రావం అవుతున్నప్పుడు చాలామందిలో కనిపించే ఈ ప్రక్రియ చాలా సాధారణమైన ప్రతిక్రియగా భావించవచ్చు. అయితే కొంతమంది మానసిక రోగుల్లో ఓ అసాధారణమైన కండిషన్ ఉంటుంది. చాలా చాలా అరుదైన ఈ కండిషన్ ఉన్నవారిలో రక్తం తాగాలనే కోరిక కలుగుతుంది. ఈ కోరిక పుట్టడాన్ని ‘క్లినికల్ వాంపైరిజమ్’ అంటారు. మరికొందరిలోనైతే ఇది కాస్త రుగ్మత స్థాయికి చేరుకుంటుంది. అలాంటి ఓ అత్యంత అరుదైన జబ్బే ‘రెన్‌ఫీల్డ్స్ సిండ్రోమ్’. ఈ జబ్బు ఉన్నవారికి రక్తం తాగాలనే కోరిక కలుగుతుంది. ఇది చాలా చాలా అరుదు కావడంతో దీనికి నిర్దిష్టమైన చికిత్స అంటూ లేకపోయినా... ప్రవర్తనకు సంబంధించిన రుగ్మతలకు చికిత్స అందించినట్లే న్యూరోసైకియాట్రిస్టులు దీనికీ ‘బిహేవియరల్ థెరపీ’ అనే చికిత్స చేస్తారు. అన్నట్టు... ఈ జబ్బు ‘రెన్‌ఫీల్డ్స్’ పేరిట 2023లో ఓ అమెరికన్ మూవీ కూడా విడుదలైంది. పేరుకు తగ్గట్టుగానే ఇది ఓ ‘అమెరికన్ యాక్షన్ కామెడీ హారర్’ థీమ్‌తో తయారైన సినిమా.

రోజూ అదే టైమ్‌కు ఠంచనుగా వాంతులు!



కొందరికి అదే పనిగా వాంతులవుతాయి. అంతేకాదు... రోజూ అదే టైమ్‌కు అవుతాయి. ఒకవేళ వాంతులు కాని పక్షంలో... కనీసం వికారంగానైనా ఉండే అవకాశముంది. వాంతులై కొన్ని గంటలు గడిచాకే హాయిగా అనిపిస్తుంటుంది. చిత్రంగా మళ్లీ ఆ మర్నాడు మళ్లీ అదే టైమ్‌కు వాంతులు కావడం మొదలవుతుంది! క్రితం రోజు ఎంత సేపు అయ్యాయో, ఆ మర్నాడు సైతం అంతే సేపు అవుతుంటాయి!. విచిత్రమైన ఈ జబ్బు పేరు... ‘సైక్లిక్ వామిటింగ్ సిండ్రోమ్’. సంక్షిప్తంగా సీవీఎస్ అంటారు. చిన్నపిల్లల్లో ఇది మరీ ఎక్కువ. పెద్ద వయసు వాళ్లలోనూ కొందరిలో ఈ సమస్య కనిపిస్తుంటుంది. సాధారణంగా ఈ ‘సీవీఎస్’తో పాటు కడుపునొప్పి, తలనొప్పి, మైగ్రేన్ కూడా కనిపించే అవకాశాలెక్కువ. దీనికి నిర్దిష్టమైన చికిత్స ఏదీ లేదుగానీ... వాంతుల వల్ల తగ్గిపోయిన / దేహంలోంచి వెళ్లిపోయిన లవణాలను భర్తీ చేసేందుకు సెలైన్ ఎక్కించాల్సి ఉంటుంది. ఇతరత్రా ప్రత్యేకమైన చికిత్స లేకపోయినప్పటికీ... సాధారణంగా వాంతులను, వికారాన్ని తగ్గించే మందులైన ‘యాంటీ-ఎమెటిక్’ డ్రగ్స్‌తో డాక్టర్లు ఈ ‘సీవీఎస్’ సమస్యకు చికిత్స అందిస్తారు.

బిజినెస్ రీల్

సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజీపై ఎన్ఎస్ఈ అవగాహన సదస్సు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సమాజ హిత ప్రాజెక్టుల కోసం నిధుల సమీకరణకు ఉపయోగపడేలా ప్రారంభించిన సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజీపై (ఎస్ఎస్ఈ) అవగాహన పెంచే దిశగా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సోమవారమిక్కడ సెమినార్ నిర్వహించింది. ఇందులో 70 పైచిలుకు నాన్-ప్రాఫిట్ సంస్థలు (ఎన్పీవో), ప్రముఖ ఇన్వెస్టర్లతో పాటు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఈడీ ఎస్వీఎండీ రావు, ఎన్ఎస్ఈ అధికారులు తదితరులు పాల్గొన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా ఎస్ఎస్ఈ ద్వారా పది ప్రాజెక్టులకు సంబంధించి ఎన్పీవోలు రూ. 22 కోట్ల పైగా నిధులు సమీకరించినట్లు ఎన్ఎస్ఈ అధికారులు తెలిపారు. 85 పైచిలుకు ఎన్పీవోలు ఇందులో నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఉడాన్‌కు రూ. 300 కోట్ల నిధులు



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ బిజినెస్-టు-బిజినెస్ ప్లాట్‌ఫాం ఉడాన్ సుమారు రూ. 300 కోట్ల రుణం సమీకరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో లైట్‌హౌస్ క్యాంటన్, స్ట్రైడ్ వెంచర్స్, ఇన్నోవెన్ క్యాపిటల్, ట్రిఫెక్టా క్యాపిటల్ నుంచి ఈ నిధులు సమీకరించినట్లు వెల్లడించింది. దేశ వ్యాప్తంగా కిరాణా దుకాణాలు, చిన్న వ్యాపార సంస్థలకు తోడ్పాటు అందించేందుకు ఈ నిధులను ఉపయోగించనున్నట్లు తెలిపింది. మరిన్ని ప్రాంతాలకు కార్యకలాపాలను విస్తరించేందుకు, సరఫరా వ్యవస్థను క్రమబద్ధీకరించుకునేందుకు, కొత్తగా మరిన్ని మైక్రో-ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్స్‌ను ఏర్పాటు చేసేందుకు వీటిని వినియోగించుకోనున్నట్లు సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కిరణ్ తాడిమర్రి తెలిపారు. 2023 డిసెంబర్‌లో ఉడాన్ 340 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

29-10-2024

విశాఖ	550-00
చిత్తూరు	578-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	545-00
విజయవాడ	550-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	525-00
వరంగల్	527-00
రిటైల్ ధర	5.85

నేటి బోర్డు సమావేశాలు

మారుతీ సుజుకీ, అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్, కెనరా బ్యాంక్, స్టార్ హెల్త్, ఎస్‌బీఐ కార్డ్స్, సిప్లా, వోల్టాస్, వీ-మార్ట్ రిటైల్, వీ-గార్డ్ ఇండస్ట్రీస్, , హడ్కో వక్రంగీ, మారికో, సీసీసీఎల్, దీపక్ ఫెర్టిలైజర్స్, ప్రెస్టేజ్ ఎస్టేట్, గోద్రేజ్ అగ్రోవెట్, గ్లాక్సో స్మిత్‌క్లైన్, నువెన్ లెఫ్ సైన్సెస్, అట్లాస్ సైకిల్స్, సింఫనీ, ఎంటార్ టెక్, ఎడల్వీజ్, పరాగ్ ఫైనాన్స్, వక్రంగీ, ఎల్‌కేపీ సెక్యూరిటీస్

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SHRIRAMFIN	3,258.00	5.35
ADANIENT	2,803.00	4.07
ICICIBANK	1,294.40	3.1
JSWSTEEL	972.15	3
WIPRO	559.2	2.9

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
COALINDIA	443.75	-3.76
BAJAJ-AUTO	9,995.00	-2.07
AXISBANK	1,174.00	-1.29
HEROMOTOCO	4,914.00	-1.19
BEL	269.85	-0.92

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,444
ఎన్ఎస్ఈ	1,04,980
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,94,156
ఎఫ్ఐఐ	- 3,228
డీఐఐ	+ 1,401

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	67.47	$ 71.78
బ్రెంట్	71.00	$ 75.63

ఆర్థిక పనితీరు ఫర్వాలేదు

- డిమాండ్ పరిస్థితులపై పరిశీలన అవసరం
- నియంత్రణలోనే ద్రవ్యోల్బణం
- 2023-24లో వృద్ధి 6.5-7 శాతం
- ఆర్థిక శాఖ సెప్టెంబర్ ఎడిషన్ వెల్లడి



న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థ పనితీరు సంతృప్తికరంగానే ఉందంటూ.. రానున్న రోజుల్లో డిమాండ్ పరిస్థితులపై పరిశీలన అవసరమని కేంద్ర ఆర్థిక శాఖ అభిప్రాయం వ్యక్తం చేసింది. ''భారత ఆర్థిక వ్యవస్థపై సానుకూల దృక్పథం ఉంది. సాగు రంగం పట్ల సానుకూల అంచనాలు, పండుగల్లో డిమాండ్ మెరుగుపడుతుందన్న అంచనాలు, ప్రభుత్వం నుంచి అధిక మూలధన వ్యయాలు పెట్టుబడులకు ఊతమిస్తాయి''అని సెప్టెంబర్ ఎడిషన్ నెలవారీ ఆర్థిక సమీక్షా నివేదికలో ఆర్థిక శాఖ పేర్కొంది. భారత ఆర్థిక వ్యవస్థ 2024-25 సంవత్సరానికి 6.5-7 శాతం మధ్య వృద్ధిని నమోదు చేస్తుందని అంచనా వేస్తున్నట్టు తెలిపింది. వినియోగ సెంటిమెంట్ మృదువుగా మారడంతో పట్టణ డిమాండ్ మోస్తరు స్థాయికి చేరుకుంటున్నట్టు కనిపిస్తోందని.. సాధారణం మించి వర్షాలతో ఫుట్‌ఫాల్ (షాపులను సందర్శించే కస్టమర్లు) పరిమితంగా ఉండడం, కాలానుగుణ కారణాలతో ప్రజలు కొత్త కొనుగోళ్లకు దూరంగా ఉన్నట్టు వివరించింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక స్తబ్దత మరింత అధికం కావడం, అభివృద్ధి చెందిన దేశాల వాణిజ్య విధానాల్లో అనిశ్చితి ఇవన్నీ ఆర్థిక వృద్ధికి రిస్కులుగా పేర్కొంది. వీటి ప్రభావాలు భారత ఆర్థిక వ్యవస్థపై ప్రసరించే రిస్క్ ఉందంటూ.. అదే జరిగితే డ్యూరబుల్ గూడ్స్‌పై వినియోగదారులు చేసే వ్యయాలపై ప్రభావం పడొచ్చని అంచనా వేసింది.

ద్రవ్యోల్బణం నియంత్రణలోనే..

వరుసగా రెండు నెలల పాటు తగ్గిన ద్రవ్యోల్బణం తిరిగి సెప్టెంబర్‌లో పెరిగిపోవడం తెలిసిందే. కానీ, కొన్ని కూరగాయలను మినహాయిస్తే ద్రవ్యోల్బణం దాదాపుగా నియంత్రణలోనే ఉన్నట్టు ఆర్థిక శాఖ నివేదిక తెలిపింది. రిజర్వాయర్లలో నీటిమట్టాలు మెరుగ్గా ఉండడం, ఖరీఫ్‌లో జోరుగా విత్తన సాగు వ్యవసాయ ఉత్పాదకత పట్ల ఆశాజనక అంచనాలకు వీలు కల్పిస్తోందని.. ఆహార ధాన్యాల నిల్వలు తగినంత ఉండడంతో మధ్యకాలంలో ధరల కట్టడికి వీలుంటుందని ఆర్థిక శాఖ నివేదిక తెలిపింది. అంతర్జాతీయ ఇన్వెస్టర్లలో భారత్ పట్ల సానుకూల సెంటిమెంట్ ఉన్నట్టు వెల్లడించింది. స్థిరమైన వృద్ధి సాధించడం ద్వారానే ఈ సెంటిమెంట్‌ను వాస్తవిక పెట్టుబడులుగా మలుచుకునేందుకు అవకాశాలుంటాయని పేర్కొంది. నెల రోజుల్లోనే విదేశీ ఇన్వెస్టర్లు భారత మార్కెట్లో రూ.85వేల కోట్లకు పైగా అమ్మకాలు చేయడం ఈ సందర్భంగా గమనార్హం. విదేశాలతో ఆర్థిక కార్యకలాపాలు (ఎక్స్‌టర్నల్ సెక్టార్) మెరుగ్గా ఉన్నాయని ఈ నివేదిక తెలిపింది. పెరుగుతున్న పెట్టుబడులు, స్థిరమైన రూపాయి, మెరుగైన స్థితిలో విదేశీ మారకం నిల్వలను ప్రస్తావించింది. సెప్టెంబర్ చివరికి 700 బిలియన్ డాలర్లను విదేశీ మారకం నిల్వలు దాటిపోవడాన్ని గుర్తు చేసింది. తయారీ రంగంలో ఉపాధి అవకాశాలు క్రమంగా విస్తరిస్తున్నట్టు తెలిపింది.

వృద్ధి మందగమనంలోకి భారత్

జపాన్ బ్రోకరేజీ సంస్థ నోమురా



ముంబై: భారత ఆర్థిక వ్యవస్థ సైక్లికల్ వృద్ధి మందగమనంలోకి అడుగు పెట్టినట్టు జపాన్ బ్రోకరేజీ దిగ్గజం నోమురా ప్రకటించింది. జీడీపీ 7.2 శాతం వృద్ధి సాధిస్తుందన్న ఆర్‌బీఐ అంచనాలు మరీ ఆశావహంగా ఉన్నట్టు పేర్కొంది. 2024-25లో 6.7 శాతం, 2025-26లో 6.8 శాతం మేర భారత జీడీపీ వృద్ధి సాధిస్తుందన్న తమ అంచనాలు మరింత క్షీణించడానికి రిస్కులు పెరుగుతున్నట్టు పేర్కొంది. వృద్ధి సూచికలు జీడీపీ మరింత మోస్తరు స్థాయికి చేరుకుంటుందని సూచిస్తున్నట్టు తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి దేశ జీడీపీ 7.2 శాతం వృద్ధిని సాధిస్తుందని ఇటీవలి ఆర్‌బీఐ ఎంపీసీ సమీక్ష తన గత అంచనాలను కొనసాగించడం తెలిసిందే. పట్టణాల్లో వినియోగం సాధారణంగా మారుతున్నట్టు సంకేతాలు కనిపిస్తున్నాయని.. ప్యాసింజర్ వాహన విక్రయాలు తగ్గడం, విమాన ప్రయాణికుల రద్దీ మోస్తరు స్థాయికి దిగిరావడం, ఎఫ్ఎంసీజీ సంస్థల అమ్మకాలు దీనికి నిదర్శనాలుగా పేర్కొంది. పట్టణ వినియోగంలో ఈ బలహీన ధోరణి కొనసాగుతుందని తాము భావిస్తున్నట్టు నోమురా తెలిపింది. కంపెనీలు వేతన వ్యయాలను తగ్గించుకుంటున్న విషయాన్ని ప్రస్తావించింది. ''కరోనా అనంతరం ఏర్పడిన పెంటప్ డిమాండ్ సమసిపోయింది. ద్రవ్య విధానం కఠినంగా మారింది. అన్ సెక్యూర్డ్ రుణాలపై ఆర్‌బీఐ ఆంక్షలు వ్యక్తిగత రుణాలు, ఎన్‌బీఎఫ్‌సీ రుణాల వృద్ధి క్షీణతకు దారితీశాయి'' అని నోమురా తన నివేదికలో వివరించింది.

హెచ్‌పీసీఎల్‌తో అమెజాన్ జట్టు



ముంబై: సుదూర రవాణా కోసం కర్బన ఉద్గారాలను తక్కువగా వెదజల్లే ఇంధనాల (లో కార్బన్ ఫ్యూయల్స్) అభివృద్ధి, వినియోగానికై ప్రభుత్వ రంగ హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్‌తో ఒప్పందం చేసుకున్నట్టు ఈ-కామర్స్ సంస్థ అమెజాన్ సోమవారం ప్రకటించింది. సుదూర రవాణాకు ఉపయోగించే వాహనాల్లో ఇంధనాలను పరీక్షించడానికి ఇరు సంస్థలు పైలట్‌ను నిర్వహిస్తాయి. కర్బన ఉద్గారాలను తక్కువగా వెదజల్లే ఇంధనాలను సులభంగా వినియోగించడానికి ఇంధన కేంద్రాలు, మొబైల్ రీఫ్యూయలింగ్ స్టేషన్ల ఏర్పాటు అవకాశాలను అన్వేషిస్తామని అమెజాన్ ఇండియా తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, హర్యానాలోని బహదూర్‌గఢ్‌లో ఇంధన ఉత్పత్తికి వ్యవసాయ, పారిశ్రామిక వ్యర్థాలను ఉపయోగిస్తామని వివరించింది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఇంధన కేంద్రాలు, మొబైల్ రీఫ్యూయలింగ్ స్టేషన్లను అభివృద్ధి చేయడంలో ఈ చొరవ సహాయపడుతుందని పేర్కొంది.

కమీషన్ 0.30% పెంచాలి

బిజినెస్ కరస్పాండెంట్ల డిమాండ్



న్యూఢిల్లీ: మరింత మందికి ఆర్థిక సేవలను చేరువ చేసేందుకు వీలుగా ఏజెంట్ల కమీషన్‌ను 30 బేసిస్ పాయింట్ల (0.30 శాతం) మేర పెంచాలని బిజినెస్ కరస్పాండెంట్ రీసోర్స్ కౌన్సిల్ (బీసీఆర్‌సీ) డిమాండ్ చేసింది. బీసీఆర్‌సీతోపాటు బ్యాంకింగ్ కరస్పాండెంట్లు సైతం తమ కమీషన్‌ను కనీసం 0.30 శాతం పెంచాలంటూ ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తుండడం గమనార్హం. ఆర్థిక సేవల విస్తృతి పెరిగినప్పటికీ గడిచిన 5-10 ఏళ్ల నుంచి ఏజెంట్ల కమీషన్‌లో ఎలాంటి మార్పులు చేయకపోవడాన్ని బీసీఆర్‌సీ గుర్తు చేసింది. సాధారణంగా బ్యాంక్‌లు, ఆర్థిక సంస్థలు ఈ కమీషన్‌ను చెల్లిస్తుంటాయి. సేవింగ్స్ ఖాతాలను తెరిపించినందుకు ఒక్కో ఖాతాపై రూ.5-20 వరకు బిజినెస్ కరస్పాండెంట్లకు కమీషన్ కింద ముడుతున్నట్టు బీసీఆర్‌సీ తెలిపింది. ప్రధానమంత్రి సురక్షా బీమా యోజనలో లబ్ధిదారు చేరికపై రూ.2, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజనలో చేరికపై రూ.15-30, అటల్ పెన్షన్ యోజనలో చేరికపై రూ.80-100 వరకు కమీషన్‌గా లభిస్తున్నట్టు వెల్లడించింది. దేశవ్యాప్తంగా 10 లక్షల వరకు కస్టమర్ సర్వీస్ పాయింట్లు/బ్యాంక్ మిత్రాలు ప్రస్తుతం పనిచేస్తున్నాయి. 53.81 కోట్ల ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన ఖాతాల్లో 45 కోట్ల ఖాతాలు బిజినెస్ కరస్పాండెంట్లు తెరిపించినవే ఉన్నాయి.


ఏఏఐ చైర్మన్‌గా విపిన్ కుమార్



న్యూఢిల్లీ: ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) చైర్మన్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి విపిన్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 1996 బ్యాచ్ బిహార్ క్యాడర్‌కు చెందిన ఆయన ఈ పదవిలోకి రాక ముందు కేంద్ర విద్యాశాఖకు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, లిటరసీ అదనపు కార్యదర్శిగా పనిచేశారు. బిహార్‌లో జిల్లా మెజిస్ట్రేట్‌గా, బిహార్ బ్రిడ్జ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ చైర్మన్‌గానూ విధులు నిర్వర్తించారు. ఏఏఐ పూర్తి స్థాయి చైర్మన్ సంజీవ్ కుమార్ డిఫెన్స్ ప్రొడక్షన్ సెక్రటరీగా బదిలీ అయ్యారు. ఏఏఐ సభ్యులు ఎం.సురేశ్ తాత్కాలిక చైర్మన్‌గా ఇప్పటి వరకు వ్యవహరించారు. మినీ రత్న అయిన ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రస్తుతం 137 విమానాశ్రయాలను నిర్వహిస్తోంది.

హైదరాబాద్‌లో ఇళ్ల ధరలు 7 శాతం అప్

- చదరపు అడుగు ధర రూ.7,050
- ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో 57% పెరుగుదల
- సెప్టెంబర్ త్రైమాసికంపై ప్రాప్‌టైగర్ నివేదిక



న్యూఢిల్లీ: హైదరాబాద్ మార్కెట్లో ఇళ్ల ధరలు సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలంలో సగటున 7 శాతం పెరిగినట్టు ప్రాపర్టీ కన్సల్టెన్సీ సంస్థ ప్రాప్‌టైగర్ తెలిపింది. దేశవ్యాప్తంగా టాప్-8 పట్టణాల్లో ఇళ్ల ధరలు 7- 57 శాతం మధ్య పెరిగాయని.. అతి తక్కువ వృద్ధి హైదరాబాద్‌లోనే నమోదైనట్టు ప్రకటించింది. హైదరాబాద్ మార్కెట్లో చదరపు అడుగు ధర రూ.7,050కు పెరిగింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో రూ.6,580గా ఉంది. అత్యధికంగా ఢిల్లీ ఎన్‌సీఆర్ మార్కెట్లో ధరల పెరుగుదల 57 శాతంగా ఉంది. అక్కడ చదరపు అడుగు ధర రూ.8,017కు చేరింది. డిమాండ్ పెరగడమే ధరల వృద్ధికి కారణమని వివరించింది. ''ఆర్‌బీఐ గడిచిన 10 పాలసీ సమీక్షల్లో రెపో రేటును 6.5 శాతం వద్దే కొనసాగించడం ధరలపై మరింత ఒత్తిడికి దారితీసింది. రేట్ల తగ్గింపు లేకపోవడంతో డెవలపర్లు రుణాలపై అధిక వడ్డీ చెల్లింపులు చేయాల్సి వచ్చింది. ఇది ఇళ్ల ధరల అందుబాటుపై ప్రభావం చూపించింది''అని ప్రాప్‌టైగర్ నివేదిక తెలిపింది.

ఇతర పట్టణాల్లో ధరల పెరుగుదల..

- బెంగళూరులో ఇళ్ల ధరలు సెప్టెంబర్ త్రైమాసికంలో క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 15 శాతం పెరిగి చదరపు అడుగు రూ.7,512కు చేరింది.
- చెన్నైలో 22 శాతం మేర ధరలు పెరిగాయి. చదరపు అడుగు రూ.7,179కు చేరుకుంది.
- కోల్‌కతాలో ఇళ్ల ధరలు చదరపు అడుగు రూ.5,844కు పెరిగింది. క్రితం ఏడాది ఇదే కాలంలోని ధరతో పోల్చి చూస్తే 22 శాతం అధికం.
- ముంబైలో ధరలు 21 శాతం పెరిగాయి. చదరపు అడుగు ధర రూ.12,590గా నమోదైంది.
- పుణెలో 18 శాతం వృద్ధితో చదరపు అడుగుకు రూ.6,953కు చేరింది.
- అహ్మదాబాద్ పట్టణంలో ధరలు 21 శాతం పెరిగాయి. చదరపు అడుగు ధర రూ.4,736గా నమోదైంది.

బలంగా రియల్ ఎస్టేట్ మార్కెట్

ఇళ్ల ధరలు స్థిరంగా పెరుగుతుండడం దేశ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో బలాన్ని, వృద్ధి అవకాశాలను తెలియజేస్తున్నట్టు బీపీటీపీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (సేల్స్) హరీందర్ దిల్లాన్ పేర్కొన్నారు. నాణ్యమైన ప్రాపర్టీలకు అధిక డిమాండ్ నెలకొనడం ఢిల్లీ ఎన్‌సీఆర్, గురుగ్రామ్, ఫరీదాబాద్‌లో ధరల పెరుగుదల అధికంగా ఉండడానికి కారణమని చెప్పారు. దక్షిణాది మార్కెట్లలో కొత్త ఇళ్ల ప్రారంభోత్సవాలు తగ్గడం మార్కెట్‌లో దిద్దుబాటును సూచిస్తున్నట్టు బీసీడీ గ్రూప్ సీఎండీ అంగద్ బేదీ తెలిపారు.

సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాలు — Q2 RESULTS

99 శాతం తగ్గిన ఐవోసీ లాభం

క్యూ2లో రూ. 180 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఇంధన దిగ్గజం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం ఏకంగా 99 శాతం పడిపోయి రూ. 180 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 12,967 కోట్లు ఆర్జించింది. ఈ ఏడాది క్యూ1(ఏప్రిల్-జూన్)లో ఆర్జించిన రూ. 2,643 కోట్లతో చూసినా లాభాలు భారీగా క్షీణించాయి. రిఫైనరీ, మార్కెటింగ్ మార్జిన్లు క్షీణించడం లాభాలపై ప్రతికూల ప్రభావం చూపింది. విదేశీ మార్కెట్లలో చమురు ధరలు క్షీణించడంతో మొత్తం ఆదాయం సైతం రూ. 2.02 లక్షల కోట్ల నుంచి రూ. 1.95 లక్షల కోట్లకు వెనకడుగు వేసింది.

జీఆర్ఎం వీక్

ప్రభుత్వ నియంత్రిత ధరలకే వంటగ్యాస్ విక్రయాల కారణంగా ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో రూ. 8,870 కోట్ల అండర్ రికవరీ(నష్టం) నమోదైనట్లు ఐవోసీ వెల్లడించింది. కాగా.. ప్రస్తుత సమీక్షా కాలంలో ఒక్కో బ్యారల్‌పై స్థూల చమురు శుద్ధి మార్జిన్లు(జీఆర్ఎం) 13.12 డాలర్ల నుంచి 4.08 డాలర్లకు పడిపోయాయి. పెట్రోలియం ప్రొడక్టుల అమ్మకాలు యథాతథంగా 21.931 మిలియన్ టన్నులు(ఎంటీ)గా నమోదయ్యాయి. 16.738 ఎంటీ చమురును ప్రాసెస్ చేసింది. గత క్యూ2లో ఇది 17.772 ఎంటీగా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో ఐవోసీ షేరు ఎన్ఎస్ఈలో 0.4 శాతం నీరసించి రూ. 146 వద్ద ముగిసింది.

ఇండియన్ బ్యాంక్ లాభం జూమ్

క్యూ2లో రూ. 2,707 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం ఇండియన్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 36 శాతం జంప్‌చేసి రూ. 2,707 కోట్లను తాకింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 1,988 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 15,736 కోట్ల నుంచి రూ. 17,770 కోట్లకు ఎగసింది. వడ్డీ ఆదాయం రూ. 13,743 కోట్ల నుంచి రూ. 15,345 కోట్లకు బలపడింది. నికర వడ్డీ ఆదాయం రూ. 5,741 కోట్ల నుంచి రూ. 6,194 కోట్లకు మెరుగుపడింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 4.97 శాతం నుంచి 3.48 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.6 శాతం నుంచి 0.27 శాతానికి దిగివచ్చాయి. కనీస మూలధన నిష్పత్తి 1 శాతం మెరుగుపడి 16.55 శాతాన్ని తాకింది.

ఫలితాల నేపథ్యంలో ఇండియన్ బ్యాంక్ షేరు ఎన్ఎస్ఈలో 11 శాతం దూసుకెళ్లి రూ. 552 వద్ద ముగిసింది.

అదానీ పవర్ లాభం క్షీణత

క్యూ2లో రూ. 3,298 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం అదానీ పవర్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 50 శాతం క్షీణించి రూ. 3,298 కోట్లకు పరిమితమైంది. ఆదాయం తగ్గడం, పన్నులు పెరగడం ప్రభావాన్ని చూపించింది. గతేడాది (2023-24) ఇదే కాలంలో కంపెనీ రూ. 6,594 కోట్లు ఆర్జించింది. ఈ కాలంలో వన్‌టైమ్ ఆదాయ నమోదు రూ. 2,781 కోట్ల నుంచి రూ. 598 కోట్లకు క్షీణించింది. గత క్యూ2లో రూ. 1,330 కోట్ల డిఫర్డ్ ట్యాక్స్ క్రెడిట్ లభించగా.. తాజా త్రైమాసికంలో రూ. 837 కోట్ల పన్ను వ్యయాలు నమోదయ్యాయి. ఇక మొత్తం ఆదాయం రూ. 14,936 కోట్ల నుంచి రూ. 14,063 కోట్లకు క్షీణించింది. నాన్ కన్వర్టబుల్ డిబెంచర్ల జారీ ద్వారా రూ. 5,000 కోట్లు సమీకరించేందుకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వీటిలో రూ. 2,500 కోట్లు పబ్లిక్ ఇష్యూకాగా.. ప్రయివేట్ ప్లేస్‌మెంట్‌కింద రూ. 2,500 కోట్లు సమీకరించనుంది.

ఫలితాల నేపథ్యంలో అదానీ పవర్ షేరు ఎన్ఎస్ఈలో 0.5 శాతం లాభంతో రూ. 595 వద్ద ముగిసింది.

సన్ ఫార్మా లాభం జూమ్

క్యూ2లో రూ. 3,040 కోట్లు



న్యూఢిల్లీ: హెల్త్‌కేర్ రంగ దిగ్గజం సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 28 శాతం జంప్‌చేసి రూ. 3,040 కోట్లను తాకింది. భారత్, యూఎస్‌సహా పలు మార్కెట్లలో అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 2,375 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 12,486 కోట్ల నుంచి రూ. 13,645 కోట్లకు ఎగసింది. ఫార్ములేషన్ అమ్మకాలు దేశీయంగా 11 శాతం బలపడి రూ. 4,265 కోట్లకు చేరగా.. యూఎస్‌లో 20 శాతం ఎగసి 51.7 కోట్ల డాలర్లను తాకాయి. వర్ధమాన మార్కెట్ల నుంచి 3 శాతం అధికంగా 29.3 కోట్ల డాలర్ల అమ్మకాలు సాధించింది. మిగిలిన దేశాల నుంచి 3.5 శాతం తక్కువగా 19.9 కోట్ల డాలర్ల అమ్మకాలు నమోదయ్యాయి. పరిశోధన, అభివృద్ధిపై రూ. 793 కోట్లు వెచ్చించింది.

ఫలితాల నేపథ్యంలో సన్ ఫార్మా షేరు బీఎస్ఈలో 2.3 శాతం లాభంతో రూ. 1,903 వద్ద ముగిసింది.

ఫెడరల్ బ్యాంక్ లాభం రూ.1,057 కోట్లు

మెరుగుపడిన ఆస్తుల నాణ్యత



న్యూఢిల్లీ: ఫెడరల్ బ్యాంక్ సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికానికి రూ.1,057 కోట్ల లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.954 కోట్లతో పోల్చి చూస్తే 11 శాతం వృద్ధి చెందింది. మొత్తం ఆదాయం రూ.6,186 కోట్ల నుంచి రూ.7,541 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 15 శాతం వృద్ధితో రూ.2,367 కోట్లకు చేరింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది రూ.2,056 కోట్లుగా ఉంది. స్థూల ఎన్‌పీఏలు 2.09 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.64 శాతానికి పరిమితమయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇవి 2.26 శాతం, 0.64 శాతం చొప్పున ఉన్నాయి.

ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో ఫెడరల్ బ్యాంక్ షేరు ధర ఒక శాతం నష్టంతో రూ.185 వద్ద ముగిసింది.


సుజ్లాన్ లాభం రూ. 201 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో పునరుత్పాదక విద్యుత్ సొల్యూషన్స్ అందించే సుజ్లాన్ నికర లాభం దాదాపు రెట్టింపై రూ. 201 కోట్లకు చేరింది. గత క్యూ2లో ఇది రూ. 102 కోట్లు. మరోవైపు మొత్తం ఆదాయం రూ. 1429 కోట్ల నుంచి రూ. 2,121 కోట్లకు పెరిగింది. సుదీర్ఘ సమయం భారీ వర్షాల వల్ల ప్రతికూల పరిస్థితులు నెలకొన్నప్పటికీ పటిష్టమైన మార్జిన్లతో మెరుగైన వృద్ధి సాధించగలిగామని సంస్థ వైస్ చైర్మన్ గిరీష్ తంతి తెలిపారు. సంస్థ సామర్థ్యాలను మెరుగుపర్చుకునే దిశగా దీర్ఘకాలిక పెట్టుబడులు పెడుతున్నట్లు వివరించారు. ప్రస్తుతం ఆర్డర్ బుక్ 5.1 గిగావాట్ల స్థాయిలో ఉన్నట్లు పేర్కొన్నారు.

లాభం తగ్గినా.. ఫలితాలు సూపర్

క్యూ2లో అంబుజా సిమెంట్ రూ. 473 కోట్లు



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ దిగ్గజం అంబుజా సిమెంట్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ. 473 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గతేడాది (2023-24) ఇదే కాలంలో కంపెనీ రూ. 987 కోట్లకుపైగా లాభాన్ని సాధించింది. గత ఐదేళ్లలోనే అత్యధికంగా మొత్తం ఆదాయం రూ.7,516 కోట్లను తాకింది. ఇందుకు అమ్మకాల పరిమాణం పుంజుకోవడం, ప్రీమియం ప్రొడక్టులు ప్రభావం చూపాయి. గత క్యూ2లో రూ. 7,424 కోట్ల టర్నోవర్ అందుకుంది. కాగా.. సంఘి ఇండస్ట్రీస్, పెన్నా ఇండస్ట్రీస్, మై హోమ్ ఇండస్ట్రీస్ తదితర కంపెనీలను కొనుగోలు చేశాం కనక ఈ ఫలితాలను గతేడాది ఫలితాలతో పోల్చి చూడటం సరికాదని కంపెనీ పేర్కొంది. ఈ బాటలో అనుబంధ సంస్థ ఏసీసీ సైతం ఏషియన్ కాంక్రీట్స్ అండ్ సిమెంట్స్‌ను సొంతం చేసుకున్న విషయాన్ని ప్రస్తావించింది. ఈ కాలంలో మొత్తం వ్యయాలు రూ. 7,023 కోట్లను దాటాయి. సిమెంట్ బిజినెస్ ఆదాయం రూ. 7,249 కోట్లకు చేరగా.. రెడీ మిక్స్ నుంచి రూ. 295 కోట్లు లభించింది. కంపెనీ చేతిలో నగదు, తత్సమాన నిల్వల విలువ రూ. 10,135 కోట్లుగా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో అంబుజా సిమెంట్స్ షేరు ఎన్ఎస్ఈలో 3 శాతం ఎగసి రూ. 570 వద్ద ముగిసింది.

కెప్టెన్‌గా సలీమా

ఆసియా చాంపియన్స్‌ ట్రోఫీకి భారత మహిళల హాకీ జట్టు ప్రకటన

న్యూఢిల్లీ: ఆసియా చాంపియన్స్‌ ట్రోఫీలో పాల్గొనే భారత మహిళల హాకీ జట్టును సెలక్టర్లు ప్రకటించారు. 18 మంది సభ్యుల ఈ టీమ్‌కు మిడ్‌ఫీల్డర్‌ సలీమా టెటె కెప్టెన్‌గా వ్యవహరిస్తుంది. బిహార్‌లోని రాజ్‌గిర్‌ స్టేడియంలో నవంబర్‌ 11 నుంచి 20 వరకు ఈ టోర్నమెంట్‌ జరుగుతుంది. టీమ్‌కు వైస్‌ కెప్టెన్‌గా నవ్‌నీత్‌ కౌర్‌ను ఎంపిక చేశారు. గాయాల నుంచి కోలుకున్న సుశీల, బ్యూటీ డుంగ్‌డుంగ్‌ టీమ్‌లోకి పునరాగమనం చేశారు. గత ఏడాది రాంచీలో జరిగిన ఈ టోర్నీలో విజేతగా నిలిచిన భారత జట్టు డిఫెండింగ్‌ చాంపియన్‌గా బరిలోకి దిగనుంది. భారత్‌తో పాటు పారిస్‌ ఒలింపిక్స్‌ రజత పతక విజేత చైనా, జపాన్‌, కొరియా, మలేసియా, థాయిలాండ్‌ ఆసియా చాంపియన్స్‌ ట్రోఫీలో పాల్గొంటాయి. నవంబర్‌ 11న జరిగే తమ తొలి మ్యాచ్‌లో మలేసియాతో భారత్‌ తలపడుతుంది. టోర్నమెంట్‌ కోసం తాము పూర్తి స్థాయిలో సిద్ధమయ్యామని...అనుభవజ్ఞులు, కొత్త ప్లేయర్లతో కూడిన జట్టుతో టైటిల్‌ను నిలబెట్టుకుంటామని సలీమా విశ్వాసం వ్యక్తం చేసింది.



భారత జట్టు వివరాలు: గోల్‌కీపర్లు: సవితా పూనియా, బిచ్చుదేవి ఖరిబమ్‌. **డిఫెండర్లు:** ఉదిత, జ్యోతి, వైష్ణవి విఠల్‌ ఫాల్కే, సుశీల చాను, ఇషిక చౌదరి. **మిడ్‌ఫీల్డర్లు:** సలీమా టెటె, నేహా, షర్మిలా దేవి, మనీషా చౌహాన్‌, సునేలిత టోపో, లాల్‌రెమిసియామి. **ఫార్వర్డ్‌లు:** నవ్‌నీత్‌ కౌర్‌, ప్రీతి దూబే, సంగీతా కుమారి, దీపిక, బ్యూటీ డుంగ్‌డుంగ్‌.

టెస్టు ఆటగాళ్లకు విశ్రాంతి

పాక్‌తో టి20 సిరీస్‌కు ఆస్ట్రేలియా జట్టు ప్రకటన

సిడ్నీ: సొంతగడ్డపై పాకిస్తాన్‌తో జరిగే మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో పాల్గొనే ఆస్ట్రేలియా జట్టును జార్జ్‌ బెయిలీ నేతృత్వంలోని సెలక్షన్‌ కమిటీ సోమవారం ప్రకటించింది. భారత్‌తో టెస్టు సిరీస్‌కు సన్నద్ధమవుతున్న కీలక ఆటగాళ్లు కమిన్స్‌, హెడ్‌, మార్ష్‌లకు ఈ సిరీస్‌ నుంచి విశ్రాంతినిచ్చారు. 13 మంది సభ్యుల ఈ టీమ్‌కు ఇంకా కెప్టెన్‌ను కూడా ఎంపిక చేయాల్సి ఉంది. ఆస్ట్రేలియా, పాకిస్తాన్‌ మధ్య నవంబర్‌ 14, 16, 18 తేదీల్లో మూడు టి20 మ్యాచ్‌లు జరుగుతాయి. దీనికి ముందు జరిగే వన్డే సిరీస్‌లో ఆస్ట్రేలియా జట్టు కమిన్స్‌ నాయకత్వంలోనే బరిలోకి దిగుతుంది.

ఆస్ట్రేలియా టి20 జట్టు: మాథ్యూ షార్ట్‌, జేక్‌ ఫ్రేజర్‌, ఇన్‌గ్లిస్‌, కనోలీ, మ్యాక్స్‌వెల్‌, టిమ్‌ డేవిడ్‌, స్టొయినిస్‌, ఆరోన్‌ హార్డీ, అబాట్‌, నాథన్‌ ఎలిస్‌, స్పెన్సర్‌ జాన్సన్‌, బార్ట్‌లెట్‌, ఆడమ్‌ జంపా.

అలా వచ్చాడు... ఇలా గెలిచాడు!



స్వర్ణం గెలిచాక జాతీయ పతాకంతో చిరాగ్‌

సోనీపత్‌... అంటేనే గుర్తొచ్చేది రెజ్లర్లు. చిరాగ్‌ చికారా ఊరు కూడా సోనీపత్‌కు దగ్గర్లోనే ఉంది. ఆ పల్లెలో రెజ్లర్ల కార్ఖానా (అఖాడా)లు ఉన్నాయి. అక్కడి నుంచి కొందరు అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు. కానీ చిరాగ్‌కు రెజ్లర్‌ కావాలనే కలగానీ, స్పృహ గానీ ఏదీ లేదు. అనుకోకుండా వచ్చాడు. వచ్చాక కోచ్‌ మెచ్చేలా నడుచుకున్నాడు. దీంతో కోచ్‌కీ అంచనా వచ్చింది. ఇతను ఈ క్రీడలో పట్టుదలతో రాకపోయినా 'ఓ పట్టు' బడితే మాత్రం బరిలో విజేత అవుతాడని కోచ్‌ బలంగా నమ్మాడు. అలా కోచ్‌ దిద్దిన చాంపియన్‌గా చిరాగ్‌ చికారా విశ్వవిజేతగా అవతరించాడు. **–సాక్షి క్రీడా విభాగం**



కిర్గిస్తాన్‌ రెజ్లర్‌ కరాచోవ్‌తో చిరాగ్‌ ఫైనల్‌ బౌట్‌

పసిడి పతకంతో చిరాగ్‌

- యువ రెజ్లర్‌ చిరాగ్‌ విజయ ప్రస్థానం
- తొలి ప్రయత్నంలోనే అండర్‌–23 ప్రపంచ చాంపియన్‌గా ఘనత
- 57 కేజీల విభాగంలో స్వర్ణం నెగ్గిన రెండో భారతీయ రెజ్లర్‌గా గుర్తింపు

కెరీర్‌లోకి ఇష్టంగా రాకపోయినా... కష్టపడితే వచ్చే ఫలితమెంతో 18 ఏళ్ల టీనేజ్‌ రెజ్లర్‌ చిరాగ్‌ చికారా తన 'పట్టు'లో చూపించాడు. అండర్‌–23 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలిచిన రెండో భారత పురుష రెజ్లర్‌గా ఘనత వహించాడు. రెండేళ్ల ముందు అమన్‌ సెహ్రావత్‌ (2022) తొలి పసిడి పతకం అందించాడు. అయితే ఓవరాల్‌గా మాత్రం అతను మూడో భారత రెజ్లర్‌. మహిళల కేటగిరీలో గతేడాది రీతిక హుడా (76 కేజీలు) బంగారు పతకం అందించింది. ఊరిలోని అఖాడా ఓనమాలు నేర్పితే... సోనీపత్‌ అకాడమీలో కోచ్‌ కుల్దీప్‌ ప్రత్యేక చొరవ అతన్ని అండర్‌–23 వరల్డ్‌ చాంపియన్‌గా తయారు చేసింది. ఇదంతా కూడా ఆరేళ్లలోనే జరగడం విశేషం. జాతీయ స్థాయిలో పతకాలు గెలిచే క్రమంలో గాయాలు బాగా ఇబ్బంది పెట్టాయి. గత మూడేళ్లలో ఓసారి పక్కటెముకలకు, రెండుసార్లు మోకాళ్లకు గాయాలయ్యాయి. అయినా సరే బెదిరిపోలేదు. ఇష్టంలేని దానిపై ఎందుకీ కష్టాలు అనుకోలేదు. అంకితభావంతో కుస్తీ పట్టి 'బంగారం'లాంటి విజయాన్ని సాధించాడు.

ఇల్లు వీడని బాలుడే కుస్తీలో మొనగాడు

ఇంటికే పరిమితమయ్యే బాలుడు చిరాగ్‌. ఎప్పుడు చూసిన ఇంట్లో తిని కూర్చొనే పిల్లాడు సహజంగానే లావుగా ఉంటాడు. దీంతో అతని తండ్రి దినేశ్‌ తనకి శారీరక శ్రమ అలవాటు చేయాలనే ఉద్దేశంతో 12 ఏళ్ల వయసులో ఊరిలో ఉన్న అఖాడాలో చేర్పించాడు. అక్కడికి అలవాటు పడ్డాక క్రమంగా ఆసక్తి పెరిగింది. అస్తమానం ఇంట్లోనే ఉండే ఆ కుర్రాడు అప్పుడు అఖాడా బాలుడయ్యాడు. పెరిగే వయసుతో పాటే మనసు లగ్నం చేయడంతో రెండేళ్లలో సబ్‌–జూనియర్‌ కేటగిరీలో భారత మేటి రెజ్లరయ్యాడు. ఇరాన్‌లో జరిగిన ఆసియా అండర్‌–15 చాంపియన్‌షిప్‌లో తలపడ్డాడు. ఆ తర్వాత 2021లో బుడాపెస్ట్‌లో జరిగిన క్యాడెట్‌ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో సాధించిన కాంస్యం అతన్ని రేసులో పడేసింది. ఇదంతా బాగానే ఉన్నా ఇంట్లోనే ఆర్థిక పరిస్థితి ఇబ్బంది పెట్టేది. దినేశ్‌ చికారా చక్కెర మిల్లులో ఓ ఎలక్ట్రిషియన్‌. వచ్చే అరకొర జీతంతో అంతర్జాతీయ రెజ్లర్‌ను తయారు చేయడమంటే అఖాడాలో చేర్పించినంత సులువు కాదు. పెట్టాల్సిన భోజనం, పోషకాల ఆహారం తండ్రి దినేశ్‌కు కష్టమయ్యేది. కానీ తాత (దినేశ్‌ నాన్న రిటైర్డ్‌ టీచర్‌) రెజ్లర్‌ మనవడికి బలవర్ధకమైన పోషకాహారం ఒంటబట్టాలని తన పెన్షన్‌ డబ్బుల్ని కూడా ఇచ్చేవారు.

కోచ్‌ కుల్దీప్‌ కీలకపాత్ర

అలా ఇంటి నుంచి అందే సాయం, స్థానిక అఖాడా నుంచి సోనీపత్‌లోని రాయ్‌పూర్‌ రెజ్లింగ్‌ అకాడమీకి చేరేలా చేసింది. అక్కడ కోచ్‌ కుల్దీప్‌... చిరాగ్‌ నైపుణ్యాన్ని ఆరంభంలోనే గుర్తించాడు. చక్కగా సానబెట్టాలని, ప్రత్యర్థుల్ని పట్టుపట్టేందుకు అవసరమైన కిటుకులు నేర్పించాడు. ముందుగా గట్టిపోటీ భాగస్వాముల్ని ఎంపిక చేసి వారితోనే కుస్తీపడేలా ప్రణాళికను అమలుచేశాడు. జూనియర్‌ అయినప్పటికీ బలవంతులతో ఓడినా సరే వారితోనే పోరాటం అన్నట్లుగా కోచ్‌ ఇచ్చిన శిక్షణ చిరాగ్‌ను మార్చేసింది. తద్వారా చాలా మంది టాప్‌ స్టార్లను తయారు చేసిన ఈ రెజ్లింగ్‌ కార్ఖానా తాజాగా చిరాగ్‌ చికారాను చాంపియన్‌గా ఆవిర్భవించేలా చేసింది. అంతకు ముందు ఏడాది జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌ విజేత రితిక (మహిళల 76 కేజీలు) కూడా రాయ్‌పూర్‌ అకాడమీ రెజ్లరే!

గుర్తుంచుకో... ఇది 57 కేజీల కేటగిరీ!

కోచ్‌ మార్గనిర్దేశనం పదేపదే లక్ష్యం ఎంత కఠినమైందో గుర్తుచేసేది. భారత్‌లో 57 కేజీల కేటగిరీకి ఉన్న పోటీ ఎలాంటిదో పదేపదే చెప్పేవాడు. ఒలింపిక్‌ పతక విజేతలు అమన్‌ సెహ్రావత్‌, రవి దహియాలు పోటీపడిన ఈవెంట్‌ కావడంతో చిరాగ్‌ ఓ మెట్టుపైనే ప్రాక్టీస్‌ చేయాల్సి ఉంటుందని ఘంటాపథంగా చెప్పాడు. దీన్ని బాగా చెవికెక్కించుకున్న చిరాగ్‌ కష్టపడ్డాడు. చెమటోడ్చాడు. చివరకు అండర్‌–23 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో అనుకున్నది సాధించాడు. ఇప్పుడు 57 కేజీల విశిష్టతను మరింత పెంచాడు. తన విజయంపై కోచ్‌ కుల్దీప్‌ మాట్లాడుతూ 'ఈ పసిడి పతకం చిరాగ్‌ గొప్ప ముందడుగుకు శ్రీకారం చుడుతుంది. ప్రభుత్వ ఉద్యోగంతో ఉపాధి, స్పాన్సర్ల చేయూత ఇకపై లభిస్తాయి. టార్గెట్‌ ఒలింపిక్‌ పోడియం (టాప్స్‌) పథకానికి ఎంపికైతే విదేశీ శిక్షణ, ప్రఖ్యాత కోచ్‌ల మార్గదర్శనం అతన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళుతుంది' అని సంతోషం వెలిబుచ్చాడు. నిజానికి అతని నైపుణ్యానికి జూనియర్‌, జాతీయస్థాయిలో పతకాలెన్నో రావాలని... కానీ ఆశించినస్థాయిలో రాలేదన్నాడు. హరియాణా రాష్ట్ర చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచినా జైపూర్‌లో జరిగిన సీనియర్‌ జాతీయ పోటీల్లో ఒక్క పతకం గెలవలేదన్నాడు. అయినాసరే నిరాశపడకుండా కష్టపడే తత్వమే చిరాగ్‌ను ఈ స్థాయికి తీసుకొచ్చిందని కోచ్‌ ఉబ్బితబ్బిబ్బవుతున్నాడు.



సూపర్‌ సెయింజ్‌...

- మెక్సికో గ్రాండ్‌ప్రి టైటిల్‌ సొంతం
- వెర్‌స్టాపెన్‌పై 20 సెకన్ల పెనాల్టీ
- ఆరో స్థానంతో సరిపెట్టుకున్న రెడ్‌బుల్‌ డ్రైవర్‌

ట్రాక్‌పై దూసుకెళుతున్న డ్రైవర్‌ సెయింజ్‌ కారు



విన్నర్స్‌ ట్రోఫీతో సెయింజ్‌

మెక్సికో సిటీ: క్వాలిఫయింగ్‌లో కనబరిచిన జోరును ప్రధాన రేసులోనూ కొనసాగించిన ఫెరారీ జట్టు డ్రైవర్‌ కార్లోస్‌ సెయింజ్‌ జూనియర్‌ ఈ ఏడాది ఫార్ములావన్‌ సీజన్‌లో రెండో విజయం నమోదు చేసుకున్నాడు. భారత కాలమానం ప్రకారం ఆదివారంఅర్ధరాత్రి దాటాక జరిగిన మెక్సికో గ్రాండ్‌ప్రి రేసులో సెయింజ్‌ విజేతగా నిలిచాడు. నిర్ణీత 71 ల్యాప్‌లను సెయింజ్‌ అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా ఒక గంట 40 నిమిషాల 55.800 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. తొమ్మిదో ల్యాప్‌లో తొలి మలుపు వద్ద వెర్‌స్టాపెన్‌ను వెనక్కి నెట్టి ఆధిక్యంలోకి వచ్చిన సెయింజ్‌ చివరి ల్యాప్‌ వరకు ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని గెలిచాడు. సీజన్‌లోని మూడో రేసు ఆస్ట్రేలియా గ్రాండ్‌ప్రిలో విజేతగా నిలిచిన సెయింజ్‌ మళ్లీ 20వ రేసులో తన ఖాతాలో విజయాన్ని జమ చేసుకోవడం విశేషం. ఓవరాల్‌గా సెయింజ్‌ కెరీర్‌లో ఇది నాలుగో గెలుపుకాగా... ఒకే ఏడాది అతను రెండు రేసుల్లో నెగ్గడం ఇదే ప్రథమం. ఈ సీజన్‌ తర్వాత సెయింజ్‌ ఫెరారీ జట్టును వీడనున్నాడు. సెయింజ్‌ స్థానాన్ని బ్రిటన్‌ దిగ్గజ డ్రైవర్‌ లూయిస్‌ హామిల్టన్‌ భర్తీ చేయనున్నాడు. మరోవైపు సీజన్‌ ఆరంభంలో వరుస విజయాలతో దుమ్మురేపిన డిఫెండింగ్‌ ప్రపంచ చాంపియన్‌, రెడ్‌బుల్‌ జట్టు డ్రైవర్‌ మాక్స్‌ వెర్‌స్టాపెన్‌కు ఈ రేసు కూడా కలిసి రాలేదు. వెర్‌స్టాపెన్‌ ఆరో స్థానంతో సరిపెట్టుకున్నాడు. రేసు సందర్భంగా రెండుసార్లు ప్రమాదకరంగా డ్రైవ్‌ చేసినందుకు వెర్‌స్టాపెన్‌కు 10 సెకన్ల చొప్పున మొత్తం 20 సెకన్ల పెనాల్టీని విధించారు. ఈ పెనాల్టీ వెర్‌స్టాపెన్‌ తుది ఫలితంపై ప్రభావం చూపింది. 27వ ల్యాప్‌లో మూడో స్థానంలో ఉన్న వెర్‌స్టాపెన్‌ పిట్‌ లేన్‌లోకి వచ్చి ఆగాడు. రెడ్‌బుల్‌ జట్టు మెకానిక్‌లు 20 సెకన్ల పెనాల్టీ ముగిసేవరకు వెర్‌స్టాపెన్‌ కారుకు సర్వీస్‌ చేయలేదు. 20 సెకన్లు ముగిశాక వెర్‌స్టాపెన్‌ ట్రాక్‌పైకి రాగా అప్పటికి అతను 15వ స్థానానికి పడిపోయాడు. 15వ స్థానానికి పడిపోయినా వెర్‌స్టాపెన్‌ ఆందోళన చెందకుండా జోరు పెంచాడు. చివరకు ఆరో స్థానాన్ని దక్కించుకున్నాడు. సీజన్‌లోని తొలి 10 రేసుల్లో వెర్‌స్టాపెన్‌ 7 రేసుల్లో అగ్రస్థానంలో నిలిచాడు. ఆ తర్వాత జరిగిన 10 రేసుల్లో వెర్‌స్టాపెన్‌కు ఒక్క విజయం కూడా దక్కలేదు. మొత్తం 24 రేసుల ఈ సీజన్‌లో ఇప్పటికి 20 రేసులు ముగిశాయి. వెర్‌స్టాపెన్‌ 362 పాయింట్లతో టాప్‌ ర్యాంక్‌లో ఉండగా... లాండో నోరిస్‌ 315 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇద్దరి మధ్య 47 పాయింట్ల వ్యత్యాసమే ఉంది. తదుపరి నాలుగు రేసుల్లో ఈ ఇద్దరు ఎలా రాణిస్తారన్న విషయంపైనే ఈ సీజన్‌ విజేత ఎవరో తేలుతుంది. సీజన్‌లోని 21వ రేసు బ్రెజిల్‌ గ్రాండ్‌ప్రి నవంబర్‌ 3న సావోపాలో నగరంలో జరుగుతుంది.

రిషి ధావన్‌ 195

- హిమాచల్‌కు భారీ ఆధిక్యం అందించిన కెప్టెన్‌
- మూడో మ్యాచ్‌లోనూ ఆంధ్ర ఎదురీత
- రంజీ ట్రోఫీ గ్రూప్‌ 'బి' మ్యాచ్‌



రిషి ధావన్‌

సాక్షి, విశాఖపట్నం: రంజీ ట్రోఫీలో తొలి రెండు మ్యాచ్‌లు ఓడిన తర్వాత సొంతగడ్డపై తమ మూడో మ్యాచ్‌ ఆడిన ఆంధ్ర జట్టుకు ఇక్కడా గెలుపు అవకాశం దాదాపు లేనట్లే! ఆంధ్రతో జరుగుతున్న గ్రూప్‌ 'బి' పోరులో హిమాచల్‌ప్రదేశ్‌కు ఇప్పటికే 134 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. స్థానిక వైఎస్‌ఆర్‌ ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌ మూడో రోజు ఆట ముగిసే సమయానికి హిమాచల్‌ తమ తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 478 పరుగులు చేసింది. కెప్టెన్‌ రిషి ధావన్‌ (318 బంతుల్లో 195; 19 ఫోర్లు, 2 సిక్స్‌లు) భారీ సెంచరీతో చెలరేగాడు. అతని ఫస్ట్‌క్లాస్‌ కెరీర్‌లో ఇది ఆరో శతకం. వ్యక్తిగతంగా ఇదే ధావన్‌కు అత్యుత్తమ వ్యక్తిగత స్కోరు కాగా ఐదు పరుగుల తేడాతో డబుల్‌ సెంచరీ అవకాశాన్ని కోల్పోయాడు. అతనికి ముకుల్‌ నేగి (42) అండగా నిలిచాడు. ఓవర్‌నైట్‌ స్కోరు 198/4తో ఆట కొనసాగించిన హిమాచల్‌ సోమవారం 85 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి మరో 280 పరుగులు జోడించింది. ఆంధ్ర బౌలర్లలో కేవీ శశికాంత్‌ నాలుగు వికెట్లు పడగొట్టగా... సత్యనారాయణ రాజు 3 వికెట్లు తీశాడు. మ్యాచ్‌కు నేడు చివరి రోజు కాగా మొత్తం ఆటలో రెండు జట్లు చెరో ఇన్నింగ్స్‌ ఆడలేకపోవచ్చు. కాబట్టి మ్యాచ్‌ 'డ్రా' అయ్యే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి.

స్కోరు వివరాలు

ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌: 344; **హిమాచల్‌ ప్రదేశ్‌ తొలి ఇన్నింగ్స్‌:** శుభమ్‌ (సి) భరత్‌ (బి) శశికాంత్‌ 16; ప్రశాంత్‌ (సి) భరత్‌ (బి) శశికాంత్‌ 10; అంకిత్‌ (బి) విజయ్‌ 53; ఏకాంత్‌ (బి) శశికాంత్‌ 20; ఆకాశ్‌ (బి) రాజు 85; రిషి ధావన్‌ (బి) మనీశ్‌ 195; ముకుల్‌ (సి) రషీద్‌ (బి) రాజు 42; మయాంక్‌ (సి) రషీద్‌ (బి) రాజు 0; వినయ్‌ (సి) భరత్‌ (బి) శశికాంత్‌ 15; గులేరియా (బ్యాటింగ్‌) 15; దివేశ్‌ (బ్యాటింగ్‌) 12; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం** (150 ఓవర్లలో 9 వికెట్లకు) 478. **వికెట్ల పతనం:** 1–12, 2–31, 3–59, 4–124, 5–265, 6–386, 7–394, 8–427, 9–454. **వికెట్ల పతనం:** శశికాంత్‌ 30–8–101–4, సత్యనారాయణ రాజు 27–2–125–3, లలిత్‌ మోహన్‌ 31–4–74–0, విజయ్‌ 26–2–81–1, మహీప్‌ 6–1–16–0, మనీశ్‌ 28–3–71–1, రషీద్‌ 2–0–8–0.

తొలి విజయంపై హైదరాబాద్‌ గురి

ఫాలోఆన్‌లో పుదుచ్చేరి 171/2 • మరో 212 పరుగులు వెనుకంజ • అనికేత్‌ రెడ్డికి 5 వికెట్లు



అనికేత్‌

సాక్షి, హైదరాబాద్‌: రంజీ ట్రోఫీలో వరుసగా రెండు ఓటముల తర్వాత హైదరాబాద్‌ జట్టు తొలి విజయంపై గురి పెట్టింది. ఉప్పల్‌ స్టేడియంలో పుదుచ్చేరితో జరుగుతున్న గ్రూప్‌ 'బి' మ్యాచ్‌ తొలి ఇన్నింగ్స్‌లో 383 పరుగుల భారీ ఆధిక్యం సాధించిన హైదరాబాద్‌ రెండో ఇన్నింగ్స్‌లోనూ ప్రత్యర్థిని దెబ్బ తీసింది. మ్యాచ్‌ మూడో రోజు సోమవారం ఆట ముగిసే సమయానికి పుదుచ్చేరి తమ రెండో ఇన్నింగ్స్‌లో 47 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. చేతిలో 8 వికెట్లు ఉన్న టీమ్‌ మరో 212 పరుగులు వెనుకబడి ఉంది. దీనిని పుదుచ్చేరి దాటగలిగితే స్వల్ప లక్ష్యాన్ని సాధించే అవకాశం హైదరాబాద్‌కు ఉంటుంది. పుదుచ్చేరి బ్యాటర్లలో అజయ్‌ రోహెరా (97 బంతుల్లో 69; 9 ఫోర్లు), గంగా శ్రీధర్‌ రాజు (139 బంతుల్లో 61 బ్యాటింగ్‌; 6 ఫోర్లు) తొలి వికెట్‌కు 112 పరుగులు జోడించారు. అంతకుముందు ఓవర్‌నైట్‌ స్కోరు 24/2తో ఆట కొనసాగించిన పుదుచ్చేరి తమ తొలి ఇన్నింగ్స్‌లో 42 ఓవర్లలో 153 పరుగులకే ఆలౌటైంది. అజయ్‌ రోహెరా (27)దే టాప్‌ స్కోర్‌. హైదరాబాద్‌ బౌలర్లలో లెఫ్టార్మ్‌ స్పిన్నర్‌ అనికేత్‌ రెడ్డి 40 పరుగులిచ్చి 5 వికెట్లు తీసి ప్రత్యర్థిని కుప్పకూల్చాడు.

స్కోరు వివరాలు

హైదరాబాద్‌ తొలి ఇన్నింగ్స్‌: 536/8 డిక్లేర్డ్‌; **పుదుచ్చేరి తొలి ఇన్నింగ్స్‌:** శ్రీధర్‌ రాజు (ఎల్బీ) (బి) రోహిత్‌ రాయుడు 19; రోహెరా (సి) తన్మయ్‌ (బి) తనయ్‌ త్యాగరాజన్‌ 27; సాగర్‌ (సి) అభిరత్‌ రెడ్డి (బి) అనికేత్‌ రెడ్డి 0; గౌరవ్‌ (ఎల్బీ) (బి) అనికేత్‌ రెడ్డి 4; ఆకాశ్‌ (ఎల్బీ) (బి) మిలింద్‌ 17; అరుణ్‌ కార్తీక్‌ (ఎల్బీ) (బి) అనికేత్‌ రెడ్డి 20; ఆనంద్‌ (సి) రాదేశ్‌ (బి) అనికేత్‌ రెడ్డి 4; అమాన్‌ (బి) అనికేత్‌ రెడ్డి 19; అంకిత్‌ (సి) కార్తికేయ (బి) అనికేత్‌ రెడ్డి 16; విఘ్నేశ్వరన్‌ (నాటౌట్‌) 19; సతీశ్‌ (సి) మిలింద్‌ (బి) తనయ్‌ త్యాగరాజన్‌ 6; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం** (42 ఓవర్లలో ఆలౌట్‌) 153. **వికెట్ల పతనం:** 1–23, 2–23, 3–38, 4–55, 5–72, 6–78, 7–106, 8–118, 9–136, 10–153. **బౌలింగ్‌:** మిలింద్‌ 8–0–24–1, కార్తికేయ 8–3–18–0, రోహిత్‌ రాయుడు 3–1–5–1, రక్షణ్‌ రెడ్డి 7–1–24–0, తనయ్‌ త్యాగరాజన్‌ 5–1–10–1, అనికేత్‌ రెడ్డి 11–2–40–5.

పుదుచ్చేరి రెండో ఇన్నింగ్స్‌: శ్రీధర్‌ రాజు (బ్యాటింగ్‌) 61; రోహెరా (స్టంప్డ్‌) రాదేశ్‌ (బి) తనయ్‌ త్యాగరాజన్‌ 69; అమాన్‌ (సి) మిలింద్‌ (బి) తనయ్‌ త్యాగరాజన్‌ 11; అరుణ్‌ కార్తీక్‌ (బ్యాటింగ్‌) 14; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం (47 ఓవర్లలో 2 వికెట్లకు) 171. వికెట్ల పతనం:** 1–122, 2–140. **బౌలింగ్‌:** మిలింద్‌ 5–0–16–0, రక్షణ్‌ రెడ్డి 8–3–18–0, రోహిత్‌ రాయుడు 5–1–21–0, కార్తికేయ 2–1–11–0, అనికేత్‌ రెడ్డి 11–1–36–0, తనయ్‌ త్యాగరాజన్‌ 14–2–49–2, అభిరత్‌ రెడ్డి 1–0–2–0, తన్మయ్‌ 1–0–4–0.

సాక్షి ప్లస్
మంగళవారం । 29-10-2024

సీ295 ప్రాజెక్ట్ ఎందుకంత ప్రత్యేకం?



యూరప్ అవతల తొలిసారిగా విదేశంలో తయారవుతున్న సీ295 రకం విమానం ఇప్పుడు భారత రక్షణ విమానయాన రంగంలో కొత్త చర్చకు తెరలేపింది. విదేశీ విమానాల తయారీ యూనిట్ ఆరంభంతో దేశీయంగా విమాన యాన రంగం రూపురేఖలు మారే వీలుందని విశ్లేషణలు వెలువడుతున్నాయి. త్రివిధ దళాల సన్నద్ధతనూ ఈ విమానాలు మెరుగు పరుస్తాయని చెబుతున్నారు.

మెరుపు స్థాయిలో మోహరింపు

కొత్త విమానాల రాకతో భారత సైన్యం సన్నద్ధత స్థాయి పెరగనుంది. యుద్ధ సామగ్రి ఉపకరణాలతోపాటు సైన్యాన్ని సైతం వేగంగా అనుకున్న చోటికి తరలించవచ్చు. దీంతోపాటు సరకులను తీసుకెళ్లవచ్చు. విపత్తుల వేళ వైద్యసాయం కోసం మెడికల్ పరికరాలు, ఔషధాలనూ తరలించవచ్చు. తీరగస్తీ విధుల్లోనూ వీటిని చక్కగా ఉపయోగించుకోవచ్చు. కాలం చెల్లిన సోవియట్ ఆంటోనోవ్ ఏఎన్–32, హిందుస్తాన్ ఏరోనాటిక్స్ ఏవిరో748 విమానాల స్థానంలో వీటిని వినియోగంలోకి తెస్తారు. అధునాతన సాంకేతికతలనూ దీనికి జోడించే వెసులుబాటు ఉందని రక్షణరంగ నిపుణులు కునాల్ బిశ్వాస్ చెప్పారు. పర్వతమయ చైనా, భారత్ సరిహద్దు వెంట అత్యవసరంగా సైనికులను దింపేందుకు వీలుగా చిన్నపాటి స్థలంలోనూ దీనిని ల్యాండ్ చేయొచ్చు. టేకాఫ్‌కు తక్కువ పొడవైన రన్‌వే ఉన్నా సరిపోతుంది. గంటలకు 482 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోగలదు. తొమ్మిది టన్నుల బరువులను మోయగలదు. 71 మంది సాధారణ సైనికులను లేదంటే బరువైన ఆయుధాలున్న సాయుధ పారాట్రూప్ సైనికులు 48 మందిని ఒకేసారి తీసుకెళ్లగలదు. దీంతో వాయుసేన సన్నద్ధత మెరుగుపడనుంది. జంట టర్బో ఇంజన్లుండే ఈ విమానం ద్వారా గాల్లోంచే సరకులను కిందకు దింపొచ్చు. ఎలక్ట్రానిక్ సిగ్నల్ నిఘా, వేగంగా ఇంధనం నింపుకునే సామర్థ్యం ఇలా పలు ప్రత్యేకతలు దీని సొంతం. భారత రక్షణరంగంలో బహుళార్థ ప్రయోజనకారిగా ఈ విమానం పేరొందనుంది.

పెరగనున్న ఉపాధి అవకాశాలు

ఇన్నాళ్లు హైదరాబాద్, బెల్గామ్, బెంగళూరులకే అధికంగా పరిమితమైన ఏరోస్పేస్ పరిశ్రమ కొత్త ప్రాజెక్ట్ కారణంగా వడోదరలో విస్తరించనుంది. స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి. ఇది ఆర్థికాభివృద్ధికి దోహదపడనుంది. ప్రత్యక్షంగా 3,000 మందికి, పరోక్షంగా 15,000 మందికి ఉపాధి లభించనుంది. ఒక్కో విమానం తయారీకి 10 లక్షల పని గంటల సమయం పట్టనుంది. అంటే ఆమేరకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు సంబంధించి వేలాది మందికి పని దొరుకుతుంది.

మేక్ ఇన్ ఇండియాకు ఊతం

రక్షణ రంగ ఉపకరణాల విడిభాగాలను దేశీయంగా తయారుచేసి ఈ రంగంలో స్వావలంబన సాధించాలనుకున్న మోదీ ప్రభుత్వానికి ఈ ప్రాజెక్ట్ ఎంతగానో దోహదపడనుంది. దిగుమతులు భారం తగ్గడంతో 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భరత భారత్'ఆశయాలు ఈ ప్రాజెక్ట్‌తో మరింతగా సాకారం కానున్నాయి. అన్ని విడిభాగాలు ఇక్కడే తయారుచేసి అసెంబ్లింగ్ చేసి 2026 సెప్టెంబర్‌కల్లా తొలి విమానాన్ని తయారుచేయనున్నారు. ఒప్పందంలో భాగంగా 56 విమానాలు భారత్‌కు అందాల్సి ఉండగా 16 విమానాలను స్పెయిన్‌లోనే తయారుచేసి పంపిస్తారు. మిగతా 40 విమానాలను వడోదరలోని నూతన కర్మాగారంలో అసెంబ్లింగ్ చేస్తారు. సీ295 విమానానికి సంబంధించిన ముఖ్యమైన విడిభాగాల తయారీ హైదరాబాద్‌లో జరగనుంది. అక్కడి టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ మెయిన్ కాంపోనెంట్స్ అసెంబ్లీ యూనిట్‌లో వీటిని చిన్న భాగాలను జతచేస్తారు. తర్వాత పెద్ద భాగాలను వడోదరలో అసెంబ్లింగ్ చేసి పూర్తి విమానాన్ని తయారుచేస్తారు.

ఏరోస్పేస్ మౌలిక సదుపాయాల వృద్ధి

ఏరోస్పేస్ మౌలికవసతుల విభాగంలో శిక్షణ, నిర్వాహణ వ్యవస్థలూ విస్తరించనున్నాయి. ఈ విమానాలను నడిపేందుకు, రిపేర్, మెయింటెనెన్స్ వంటి పనులకు వాయుసేనలో అదనపు సిబ్బంది అవసరమవుతారు. దీంతో అదనపు ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి. వాడుతున్న విమానాలకు నిర్వహణ, విడిభాగాల తయారీ, సరఫరా గొలుసు వంటి ఇతరత్రా విభాగాలూ విస్తరించనున్నాయి. ఈ మొత్తం వ్యవస్థల కోసం ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో స్టిక్ హోల్డింగ్ విభాగం, ఆగ్రాలోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో శిక్షణాకేంద్రాన్ని కొత్తగా నెలకొల్పనున్నారు. దీంతో ఇన్నాళ్లు ఎయిర్‌బస్, బోయింగ్, ఏటీఆర్‌సహా ప్రభుత్వరంగ హిందుస్తాన్ ఏరోనాటిక్స్‌కు తోడుగా టాటా వారి సంస్థలూ ఈ రంగంలో మరింతగా విస్తరించనున్నాయి.

ఎగుమతులకూ ప్రోత్సాహం

దేశీయ అవసరాలకు తీరాక అదనపు ఉత్పత్తుల ఎగుమతికీ ఈ ప్రాజెక్ట్ బాటలు వేయనుంది. సైనిక, సరకు రవాణా విమానాల తయారీకి ఉద్దేశించిన ఈ ప్రాజెక్ట్ అనుకున్నదానికంటే బాగా విజయవంతమైతే భవిష్యత్తులో పౌరవిమానాల తయారీ చేపట్టే వీలుంది. అప్పుడిక వేల కోట్లు ఖర్చు పెట్టి విదేశీ విమానాలను కొనుగోలుచేసే బదులు దేశీయంగానే పౌర విమానాలను తయారుచేయొచ్చు. తయారీ ఖర్చు సైతం గణనీయంగా తగ్గనుంది. భారతీయ ఏవియేషన్ రంగంలో ఆత్మనిర్భరతకు హామీ ఇస్తున్న ఈ ప్రాజెక్ట్ మరిన్ని కొత్త ప్రాజెక్టుల రాకపై ఆశలు పెంచుతోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

చెప్పేదొకటి చేసేదొకటి

జయాకిశోరీపై నెటిజన్ల విమర్శలు

న్యూఢిల్లీ: భౌతిక ప్రపంచంలో వస్తువులపై వ్యామోహం వదిలి సాధారణ జీవనం గడపాలని తరచూ ఉపదేశించే యువ ఆధ్యాత్మిక వేత్త, గాయకురాలు జయా కిశోరీపై తాజాగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆమె చేతిలో చాలా ఖరీదైన హ్యాండ్ బ్యాగ్ ప్రత్యక్షమవడమే ఈ విమర్శలకు అసలు కారణం. ఇటీవల విమానం ఎక్కేందుకు ఓ ఎయిర్‌పోర్ట్ లోపలికి నడిచి వెళ్తున్నప్పుడు ఆమె వద్ద ప్రత్యేకంగా జయ పేరు ముద్రించిన ' డియోర్ బుక్ టోట్' లెదర్ హ్యాండ్‌బ్యాగ్ మీడియా కంట పడింది. సాధవులా దవళ వర్ణ దుస్తులు ధరించిన యువ ఆధ్యాత్మికవేత్త ఇంతటి ఖరీదైన చేతి సంచి వాడతారా? అంటూ అక్కడి వారు అవాక్కయ్యారు. సంబంధిత వీడియో నెట్టింట వైరల్ కావడంతో ఆమెపై విమర్శల జడివాన కురుస్తోంది. అయినా ఏమాత్రం వెరవక తన చర్యలను ఆమె సమర్థించుకోవడం విశేషం. '' ఎదుటివారిని నిలదీసేముందు మిమ్మల్ని మీరు '' విభిన్న దృక్కోణాలను అర్థంచేసుకునేంత మానసిక పరిపక్వత నాకు ఉందా?'' అని ప్రశ్నించుకోండి. ఆ పరిపక్వత లేని వారితో వాదించడం కూడా వృథా'' అని ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. దీంతో నెటిజన్లు మరింత రెచ్చిపోయారు. 'భౌతిక ప్రపంచంపై అంత ప్రేమ ఒలకబోసే మీరు మాకెందుకు ఉచిత సలహాలు ఇస్తున్నారు?' అని ఒక నెటిజన్ సూటిగా ప్రశ్నించారు. '' అత్యంత ఖరీదైన రోలెక్స్ వాచీతో ఎప్పుడూ దర్శనమిచ్చే ఈమె తన వైఖరిని ఏనాడో వ్యక్తపరిచింది. మనకే ఇన్నాళ్లు సరిగా అర్థంకాలేదు' అని మరొకరు వ్యంగ్య ట్వీట్‌చేశారు. '' ఇలాంటి ఖరీదైనవి వాడొద్దు అనే ఉపదేశించేందుకే ఆమె దానిని వాడుతున్నారేమో' అని ఇంకొకరు సరదా ట్వీట్‌చేశారు. అయితే జయాకిశోరీని సమర్థించేవాళ్ల జాబితా కూడా ఇంటర్నెట్‌లో చాంతాడంత పెరిగిపోయింది. ''ఆమె ఆమె సొంత బ్యాగు కాకపోవచ్చు. ఎవరైనా బహుమతిగా ఇచ్చారేమో. చూడ్డానికి అచ్చం నిజమైనదానిలా ఉండే డూప్లికేట్ బ్యాగు అయిఉండొచ్చు. వేరే చోట ఉన్న వాళ్లకు ఇచ్చేందుకు విమానంలో వెంట తీసుకెళ్తున్నారేమో'' అంటూ పలువురు ఆమెను సమర్థించారు. 1995 జూలై 13న కోల్‌కతాలో జన్మించిన జయాకిశోరీ చిన్ననాటి నుంచే ఆధ్యాత్మిక విషయాలపై సోషల్ మీడియాలో అనర్గళంగా మాట్లాడుతూ, పాటలు పాడుతూ పాపులారిటీ సంపాదించారు.



ఎయిర్‌పోర్ట్‌లో జయాకిశోరీ(ఇన్‌సెట్‌లో) హ్యాండ్‌బ్యాగ్

విమానాలకు ఆగని బెదిరింపులు

న్యూఢిల్లీ: దేశీయ విమానయాన సంస్థలకు బాంబు బెదిరింపు హెచ్చరికలకు ఫుల్‌స్టాప్ పడేలా కనిపించడం లేదు. సోమవారం మరో 60కి పైగా విమానాలకు హెచ్చరికలు అందినట్లు అధికారవర్గాలు తెలిపాయి. దీంతో, గత 15 రోజుల్లో దాదాపు 410 దేశీయ, అంతర్జాతీయ సర్వీసులకు బాంబు బెదిరింపులు అందినట్లయింది. సామాజిక మాధ్యమ వేదికలపై అందిన ఈ బెదిరింపులన్నీ తీవ్ర సోదాల అనంతరం ఇవన్నీ ఉత్తుత్తివేనని తేలింది. అయితే, పండగ సీజన్‌లో అందుతున్న ఇలాంటి బెదిరింపులతో దేశీయ విమానయాన సంస్థలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సోమవారం ఎయిరిండియా, ఇండిగోలకు చెందిన 21 చొప్పున విమానాలు, విస్తారకు చెందిన 20 విమానాలకు బెదిరింపులు వచ్చినట్లు సమాచారం.

ముడా కేసులో ఈడీ మరిన్ని సోదాలు

బెంగళూరు: ముడా (మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)అధికారులు సోమవారం మళ్లీ సోదాలు నిర్వహించారు. బెంగళూరు, మైసూరులలోని కనీసం ఏడు చోట్ల తనిఖీలు జరిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి. సీఎం సిద్ధరామయ్య భార్య పార్వతికి 14 ప్లాట్లను కేటాయించడంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై లోకాయుక్త నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా మనీ లాండరింగ్ ఆరోపణలపై ఈడీ కేసు దర్యాప్తు చేస్తోంది. ఇప్పటికే రెండు పర్యాయాలు ముడా కార్యాలయం సహా పలు చోట్ల దాడులు జరిపింది. అయితే, ముడాలో ప్లాట్ల కేటాయింపులో తను గానీ తన కుటుంబం గానీ ఎటువంటి అవకతవకలకు పాల్పడలేదని సీఎం సిద్ధరామయ్య అంటున్నారు.

హేమంత్ ప్రధాన ప్రత్యర్థి హెంబ్రొమ్



హెంబ్రొమ్

రాంచీ: జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌ను బీజేపీకి చెందిన గమ్లియెల్ హెంబ్రొమ్ ఢీకొట్టనున్నారు. నవంబర్ 13, 20వ తేదీల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ సోమవారం ఇద్దరు అభ్యర్థులతో రెండో జాబితా విడుదల చేసింది. ఇందులో గమ్లియెల్ హెంబ్రొమ్‌కు బర్హయిత్ టికెట్‌ను, టుండి సీటును వికాశ్ మహతోకు కేటాయించింది. బర్హయిత్ సీఎం హేమంత్ సోరెన్ సొంత నియోజక వర్గం. 2019 ఎన్నికల్లో ఏజేఎస్‌యూ టికెట్‌పై బర్హయిత్ నుంచి పోటీకి దిగిన హెంబ్రొమ్ 2,573 ఓట్లతో నాలుగో స్థానంలో నిలిచారు. కాగా, 2019 ఎన్నికల్లో హేమంత్ బర్హయిత్‌తోపాటు దుమ్కా నుంచి పోటీ చేసి రెండు చోట్లా విజయం సాధించారు. దుమ్కాను వదిలేశారు. బర్హయిత్‌లో ఆయన 25 వేలకు పైగా ఓట్లతో గెలిచారు.

25 మంది బీజేపీ మూడో జాబితా విడుదల

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీకి నవంబర్ 20న జరిగే ఎన్నికలకు గాను బీజేపీ 25 మంది అభ్యర్థులతో సోమవారం మూడో జాబితా విడుదల చేసింది. ఇందులో ఇటీవలే కాంగ్రెస్ నుంచి వచ్చిన ఇద్దరితోపాటు డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ వ్యక్తిగత సహాయకుడి పేర్లున్నాయి. తాజా లిస్టుతో కలిపితే బీజేపీ ఇప్పటివరకు 146 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లయింది. మాజీ సీఎం అశోక్ చవాన్ సన్నిహితుడు 2021 ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి గెలుపొందిన జితేశ్ అంతపుర్కర్‌కు దెగ్లూర్ సీటు కేటాయించారు. కాంగ్రెస్‌ను వీడి ఇటీవలే బీజేపీ తీర్థం పుచ్చుకున్న చవాన్ రాజ్యసభ ఎంపీ అయిన విషయం తెలిసిందే. అదేవిధంగా, లోక్‌సభ మాజీ స్పీకర్ శివరాజ్ పాటిల్ కోడలు అర్చనా పాటిల్‌కు బీజేపీ లాతూర్ సిటీ టికెట్టిచ్చింది. ఫడ్నవీస్‌కు చాలాకాలంగా వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేస్తున్న సుమిత్ వాంఖడే అర్వి నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. మొత్తమ్మీద మూడో జాబితాలో నలుగురు మహిళా అభ్యర్థులున్నారు.

మళ్లీ తీహార్ జైలుకు ఎంపీ ఇంజనీర్ రషీద్



న్యూఢిల్లీ: అవామీ ఇత్తెహాద్ పార్టీ నేత, జమ్మూకశ్మీర్‌లోని బారాముల్లా లోక్‌సభ సభ్యుడు షేక్ అబ్దుల్ రషీద్ అలియాస్ ఇంజనీర్ రషీద్ తిరిగి తీహార్ జైలుకు వచ్చారు. మధ్యంతర బెయిల్ గడువు ముగియడంతోపాటు, రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై కోర్టు తీర్పును రిజర్వు చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం శ్రీనగర్ నుంచి ఢిల్లీకి వచ్చిన ఆయన జైలు అధికారుల ఎదుట లొంగిపోయారు. ఉగ్ర నిధుల కేసులో అరెస్టయిన రషీద్ జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు వీలుగా అదనపు సెషన్స్ కోర్టు జడ్జి చందర్ జిత్ సింగ్ సెప్టెంబర్ 10న మధ్యంతర బెయిలివ్వడం తెలిసిందే.

ఓటేసిన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్

న్యూ క్యాజిల్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఓటేశారు. సోమవారం డెలావెర్‌లో విల్మింగ్టన్‌లోని తన నివాసానికి సమీపంలో ఉన్న బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. తద్వారా ఈ అధ్యక్ష ఎన్నికల్లో ముందస్తుగా ఓటేసిన దాదాపు 4.3 కోట్ల పై చిలుకు అమెరికన్ల జాబితాలో ఆయన కూడా చేరారు. ఉదయాన్నే ఓటేసేందుకు వచ్చిన బైడెన్ దాదాపు 40 నిమిషాలకు పైగా లైన్లో నిలబడ్డారు. ఈ సందర్భంగా తోటి ఓటర్లతో మాటలు కలిపారు. వీల్‌చైర్లో వచ్చిన వృద్ధురాలిని తనకంటే ముందు పంపించారు.

యుద్ధాన్ని ఆపే సత్తా మోదీకి ఉంది

- విశ్వాసం వ్యక్తం చేసిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ
- బ్రిక్స్ శిఖరాగ్రం విఫలమైందని వ్యాఖ్యలు



కీవ్: ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే సత్తా భారత ప్రధాని మోదీకి ఉందని ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ పేర్కొన్నారు. దీని ద్వారా ఆయనకే కాదు, అంతర్జాతీయంగాను భారత్ ప్రతిష్ట పెరుగుతుందన్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియాకు జెలెన్‌స్కీ ఇటీవల ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ఉక్రెయిన్ సంక్షోభానికి సంబంధించిన పలు విషయాలను ఆయన ప్రస్తావించారు. ప్రధాని మోదీ జోక్యంతో ఉక్రెయిన్, రష్యాల మధ్య ఒప్పందం కుదిరే అవకాశాలున్నాయా అన్న ప్రశ్నకు జెలెన్‌స్కీ..'ప్రధాని మోదీ దీనిని నిజం చేయగలవనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇందుకు భారత్‌లోనే చర్చలు జరగొచ్చు. అయితే, యుద్ధం మా గడ్డపై జరుగుతున్నందున మేమిచ్చే షరతులకు లోబడే సంప్రదింపులు జరగాలి'అని పేర్కొన్నారు. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు ప్రయత్నిస్తానన్న మోదీ ప్రకటనపై జెలెన్‌స్కీ..మాటలు కాదు, చేతలు అవసరమన్నారు. 'జనాభాపరంగా, ఆర్థికంగా, పలుకుబడిపరంగా భారత్ పెద్ద దేశం. అలాంటి దేశానికి ప్రధాని అయిన మోదీ..యుద్ధాన్ని ఆపేందుకు ప్రయత్నిస్తామని కేవలం మాటగా చెప్పడం సరికాదు. యుద్ధాన్ని ఆపేందుకు పలుకుబడిని ఉపయోగించాలి. రష్యాను ఆర్థికంగా దెబ్బకొట్టాలి. ఆదేశం నుంచి చౌకగా దొరుకుతున్న చమురును, రక్షణ రంగ ఉత్పత్తులను కొనరాదు. ఫలితంగా ఆ దేశ యుద్ధ సామర్థ్యం దెబ్బతింటుంది' అని తెలిపారు. యుద్ధం సమయంలో ఎత్తుకుపోయిన మా చిన్నారుల్లో కనీసం వెయ్యి మందినైనా తిరిగి మాకు ఇచ్చేలా మోదీ రష్యాపై తన పలుకుబడిని ఉపయోగించాలన్నారు.

తటస్థత అంటే రష్యా వైపు ఉన్నట్టే

'యుద్ధం జరుగుతున్న సమయంలో తటస్థంగా ఉండటమంటే రష్యా పక్షాన ఉన్నట్లే అర్థం. దురాక్రమణదారు, బాధిత దేశం మధ్య తటస్థత అనేదే ఉండదు. అలా ఉండటమంటే పరోక్షంగా రష్యాకు మద్దతివ్వడమే'అని జెలెన్‌స్కీ అభిప్రాయపడ్డారు. 'బ్రిక్స్ శిఖరాగ్రంలో పాల్గొన్న నేతలు కూడా సంక్షోభం సమసేందుకు సహకరిస్తామని చెప్పారు. నా దృష్టిలో అది కూడా మాకంటే రష్యాకే ఎక్కువగా అనుకూలంగా ఉన్నట్లు భావిస్తున్నా'అన్నారు. 'అంతేకాదు, సౌదీ అరేబియా, బ్రెజిల్ వంటి దేశాల నేతలు రానందున బ్రిక్స్ శిఖరాగ్రం విఫలమైనట్లే లెక్క. ప్రపంచాన్ని పుతిన్ పశ్చిమ అనుకూల, బ్రిక్స్ అనుకూల దేశాలుగా విభజించాలనుకుంటున్నారు. అందుకే, బ్రెజిల్, చైనాలు తీసుకువచ్చిన శాంతి ప్రతిపాదనలను సైతం తిరస్కరించారు. ఈ పరిణామం చైనా, బ్రెజిల్‌లకు చెంపపెట్టు వంటిది'అని చెప్పారు.

బారామతి నుంచి అజిత్.. కోఫ్రి పాచ్‌పాఖ్‌డీ నుంచి ఏక్‌నాథ్

- నామినేషన్ దాఖలు చేసిన నేతలు
- నేటితో ముగియనున్న మహారాష్ట్ర అసెంబ్లీ నామినేషన్ల గడువు

సాక్షి, న్యూఢిల్లీ/పుణె/థానె: మహారాష్ట్రలో నామినేషన్లకు గడువు దగ్గర పడుతుండటంతో అగ్రనేతలు తమ నామినేషన్ల పత్రాలను సోమవారమే దాఖలుచేశారు. బారామతి అసెంబ్లీ స్థానం నుంచి పోటీచేసేందుకు డిప్యూటీ సీఎం, ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ సోమవారం ఉదయమే పుణె జిల్లాలోని తహసీల్ ఆఫీస్‌కు వచ్చి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఆయన వెంట కుమారులు పార్థ్ పవార్, జై పవార్ వచ్చారు. ఈ స్థానం నుంచి ఎన్సీపీ(ఎస్పీ) వర్గం నుంచి అజిత్ మేనల్లుడు యుగేంద్ర పవార్ బరిలో ఉండటం గమనార్హం. యుగేంద్ర సైతం సోమవారం ఉదయం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సమయంలో ఆయనతోపాటు ఎన్సీపీ(ఎస్పీ) చీఫ్ శరద్‌పవార్, శరద్ కుమార్తె సుప్రియా సూలే ఉన్నారు. నామినేషన్ దాఖలు చేశాక అజిత్ మీడియాతో మాట్లాడారు. 'ఎన్నికల్లో పోటీ చేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. నాపై అభ్యర్థిని నిలబెట్టినప్పుడల్లా బలమైన అభ్యర్థిగా తీసుకుని ప్రచారం చేస్తున్నాను. ఈసారి కూడా బారామతి ప్రజలు నన్ను ఎన్నుకుంటారు. వారిపై నాకు నమ్మకం ఉంది'అని అన్నారు. నామినేషన్ వేశాక యుగేంద్ర మాట్లాడారు. ''అజిత్ పవార్‌పై పోరాటం కష్టం కాదు. అలా అని అంత సులభం కూడా కాదు. బారామతి ప్రజలు శరద్ పవార్ సాహెబ్ వెంట ఉన్నారు. కుటుంబంలో ఇదంతా జరగడం చాలా బాధాకరం. దురదృష్టకరం. ఇది లోక్‌సభ ఎన్నికలతో మొదలైంది''అని యుగేంద్ర తెలిపారు. థానేలోని కోఫ్రి పాచ్ పాఖ్‌డీ స్థానం నుంచి పోటీ చేస్తున్న ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ దాఖలుకు ముందు షిండే తన నివాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా మాహిమ్ స్థానం నుంచి మహారాష్ట్ర నవనిర్మాణ సేన చీఫ్ రాజ్ ఠాక్రే కుమారుడు అమిత్ నామినేషన్ దాఖలు చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ల దాఖలు ప్రక్రియ మంగళవారంతో ముగియనుంది.

అలాంటి భేటీలు సాధారణమే

గణపతి పూజ వేళ ప్రధాని మోదీ తన ఇంటికి రావడంపై సీజేఐ చంద్రచూడ్ వ్యాఖ్య



ముంబై: వినాయక చవితి పండగ రోజుల్లో గత నెలలో ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో జరిగిన గణపతిపూజా కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరవడాన్ని సాధారణ విషయంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ అభివర్ణించారు. నవంబర్ పదిన సీజేఐగా పదవీవిరమణ చేయనున్న న్యాయమూర్తి చంద్రచూడ్ తొలిసారిగా ఈ విషయంపై స్పందించారు. ఆదివారం ముంబైలో లోక్‌సత్తా ప్రసంగాల కార్యక్రమంలో సీజేఐ మాట్లాడారు. ఏదైనా కార్యక్రమంలో ప్రధాని, ముఖ్యమంత్రి తదితర శాసనవ్యవస్థకు చెందిన ప్రతినిధులతో జడ్జీలు భేటీ అయిన సందర్భాలను సీజేఐ పరోక్షంగా ప్రస్తావించారు. ''ఏదైనా భేటీ, చర్చల సందర్భంలో శాసనకర్తలతో మాట్లాడేటప్పుడు కేసుల విషయాలను ప్రస్తావించకూడదనే పరిణతి జడ్జీలకు ఉంది. శాసనవ్యవస్థలోని వ్యక్తులతో మాట్లాడితే జడ్జీలు ఏవైనా లోపాయికారి ఒప్పందాలు కుదర్చుకున్నారని ప్రజల్లో పుకార్లు రావడం సహజం. నిజానికి అలాంటివేవీ ఉండవు. ప్రభుత్వ విభాగాలతో సంప్రతింపులు సాధారణ వ్యవహారం. శాసన, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థలన్నీ కలిసి పనిచేసేది సమాజ శ్రేయస్సు కోసమే. ప్రజాస్వామ్య వ్యవస్థలో మా పరిమితులు, బాధ్యతలు మాకు తెలుసు. ఆయా రాష్ట్రాల హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో భేటీ అవుతారు. వాళ్ల మధ్య కేసుల సంబంధ విషయాలు ప్రస్తావనకు రావు. ఇలాంటి భేటీలు ఆవశ్యకం. నూతన కోర్టు భవనాల నిర్మాణం, జడ్జీలకు వసతుల కల్పనా ఇతరత్రా అంశాలపై చర్చించడం ముఖ్యం. మెరుగైన సమాజ స్థాపనకు కలిసి పని చేయాల్సి ఉంటుంది. హైకోర్టుల్లో చీఫ్ జస్టిస్‌గా ఉన్నప్పుడూ నేను కూడా ఆయా శాసనవ్యవస్థ ప్రతినిధులతో మాట్లాడా. ఇలాంటి పారదర్శకమైన విధానంపై విశ్వాసం ఉన్నన్ని రోజులు ఈ సంప్రతింపుల కార్యక్రమాన్ని కొనసాగించాల్సిందే. కొన్నిసార్లు బయటి కార్యక్రమాల్లో అధికారంలోలేని ఇతర రాజకీయ నేతలనూ కలుస్తాం. కానీ కేసులపై ఏనాడూ మాట్లాడబోం''అని సీజేఐ అన్నారు.

రాజ్యాంగ విలువలకు బీజేపీ తిలోదకాలు

వయనాడ్ ఉప ఎన్నిక ప్రచారసభలో ప్రియాంక విమర్శలు



మీనాంగడిలో ప్రియాంకతో కరచాలనానికి జనం పోటీలు

వయనాడ్(కేరళ): బీజేపీ తమ పాలనలో రాజ్యాంగ విలువలకు తిలోదకాలు ఇస్తోందని కాంగ్రెస్ నాయకురాలు, వయనాడ్ ఉప ఎన్నికల కాంగ్రెస్ అభ్యర్థి అభ్యర్థి ప్రియాంకా గాంధీ ఆరోపించారు. సోమవారం కేరళలోని వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని మీనాంగడి, పనమరమ్, పొఝుథన పట్టణాల్లో ప్రచార సభల్లో కార్యకర్తలు, పార్టీ మద్దతుదారులనుద్దేశించి ప్రియాంక మాట్లాడారు. ''కేంద్రంలోని బీజేపీ ఏ స్థాయిలో జనాల మధ్య విద్వేషం, భయం పెంచుతోందో తెల్సిందే. మణిపూర్‌లో మైనారిటీలపై దాడులు చేయించారు. నా సోదరుడు రాహుల్ గాంధీపై ఉన్న ప్రేమతోనే మీరంతా ఇక్కడికొచ్చారు. మీతో ఆయనకు ఎంతో అనుబంధం ఉంది. మీరంతా ఆయన కుటుంబ సభ్యులే. దేశ రాజ్యాంగ విలువ పరిరక్షణ కోసం ఇప్పుడాయన పోరాడుతున్నారు. ఈ పోరాటంలో పాల్గొన్న మీలో ప్రతి ఒక్కరూ సైనికులే''అని అన్నారు.

క్రైస్తవ ఓటర్లతో మమేకం

మీనాంగడి పట్టణంలో జరిగిన సభలో ప్రధానంగా క్రైస్తవ ఓటర్లను ప్రియాంక ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. మానవతామూర్తి మదర్ థెరిసాను గతంలో భేటీ అయిన అంశాన్ని ఈ సందర్భంగా ప్రియాంక ప్రస్తావించారు. ''నా టీనేజీ రోజుల్లో తండ్రి రాజీవ్ గాంధీ హత్యోన్మరణం వార్త తెలిసి మమ్మల్ని పరామర్శించేందుకు మదర్ థెరిసా మా ఇంటికొచ్చారు. నన్ను చూడాలని ఆమె అనుకున్నారు. జ్వరంతో బాధపడుతున్నాసరే ఆమె దగ్గరకు వెళ్లా. ప్రేమతో ఆశీర్వదించారు. బాధ నుంచి ఉపశమనం కోసం సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. పెళ్లయిన ఐదారేళ్ల తర్వాత ఢిల్లీలో మదర్ థెరిసా సిస్టర్స్‌తో పనిచేసేందుకు అక్కడికి వెళ్లా. అప్పుడు బాధలు, కన్నీళ్లు, కష్టాలు, సేవ అంటే ఏంటో తెలిసొచ్చింది.''అని అన్నారు.

బిష్ణోయ్ గ్యాంగ్ బెదిరించింది.. కేంద్రానికి పప్పూ యాదవ్ లేఖ



పట్నా: లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి తనను బెదిరింపులు వస్తున్నందున వ్యక్తిగత భద్రతను మరింత పెంచాలని బిహార్‌లోని పూర్ణియాకు చెందిన ఎంపీ రాజేశ్ యాదవ్ అలియాస్ పప్పూ యాదవ్ కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు హోం మంత్రి అమిత్ షాకు అక్టోబర్ 21న రాసినట్లుగా ఉన్న రెండు పేజీల లేఖను సోమవారం ఆయన సామాజిక మాధ్యమాల్లో ఉంచారు. ఈ లేఖ ప్రతులను బిహార్ సీఎం నితీశ్ కుమార్, ఇతర ఉన్నతాధికారులకు కూడా పంపారు. బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యుడుగా చెప్పుకుంటున్న వ్యక్తి దుబాయ్ నుంచి చేసిన కాల్ ఆడియో క్లిప్‌ను ఆయన జతచేశారు. ప్రస్తుతమున్న వై కేటగిరీ భద్రతను జెడ్‌కు పెంచి, పోలీస్ ఎస్కార్ట్‌ను కూడా ఏర్పాటు చేయాలని కోరారు. తనకేదైనా జరిగితే కేంద్రం, బిహార్ ప్రభుత్వానిదే బాధ్యతని హెచ్చరించారు. ఒకప్పటి గ్యాంగ్‌స్టర్ అయిన పప్పూ యాదవ్ ఇటీవల ముంబైలో ఎన్సీపీ నేత బాబా సిద్దిఖీ హత్యపై స్పందిస్తూ..అవకాశమిస్తే బిష్ణోయ్ గ్యాంగ్ నెట్‌వర్క్‌ను 24 గంటల్లో అంతం చేస్తానంటూ ప్రకటించుకోవడం తెలిసిందే.

ఎస్సీల్లో అంతర్గత రిజర్వేషన్లకు ఓకే చెప్పిన కర్ణాటక కేబినెట్

బెంగళూరు: ఎస్సీల్లో అంతర్గత రిజర్వేషన్లు కల్పించేందుకు కర్ణాటక మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇందుకోసం హైకోర్టు రిటైర్డు జడ్జి సారథ్యంలో కమిటీ వేసి విధి విధానాలను ఖరారు చేయాలని నిర్ణయించింది. రాష్ట్ర మంత్రి హెచ్‌కే పాటిల్ సోమవారం కేబినెట్ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్రంలో ఇందుకు సంబంధించిన డిమాండ్లు, చర్చలు నడుస్తున్నాయని చెప్పారు. మూడు నెలల్లో కమిటీ నుంచి నివేదిక అందిన తర్వాత కార్యాచరణను నిర్ణయిస్తామన్నారు. ఈలోగా జరగాల్సిన ఉద్యోగ ఎంపిక పరీక్షలను మూడు నెలలపాటు వాయిదా వేయాలని కేబినెట్ నిర్ణయించిందని కూడా వెల్లడించారు.

పంటల వ్యర్థాల దహనం పంజాబ్‌లో 50% తగ్గింది

చండీగఢ్: ఢిల్లీలో వాయు కాలుష్యానికి ప్రధాన కారణమని భావిస్తున్న పంజాబ్, హరియాణాల్లో పంట వ్యర్థాల దహనం ఈ ఏడాది గణనీయంగా తగ్గిపోయింది. పంజాబ్‌లో సగానికి సగం, హరియాణాలో 29 శాతం మేర తగ్గింది. అయినప్పటికీ ఢిల్లీలో వాయు కాలుష్యం మెరుగుపడిన జాడలు లేవని చెబుతున్నారు. గతేడాది సెప్టెంబర్ 15–అక్టోబర్ 27 మధ్య పంట వ్యర్థాల దహనం కేసులు పంజాబ్‌లో 4,059 నమోదు కాగా, ఈ ఏడాది ఇదే సమయంలో ఇవి 1,995కి తగ్గిపోయాయి. ఈ సీజన్‌లో హరియాణాలో పంట వ్యర్థాల దహనం ఘటనలు 713 మాత్రమే నమోదయ్యాయి. గతేడాది జరిగిన పంట వ్యర్థాల దహనం ఘటనలతో పోలిస్తే ఇవి 29 శాతం తక్కువని హరియాణా అధికారులు వివరించారు.

సాక్షి ప్లస్
మంగళవారం: 29-10-2024

ఆంధ్రుల గురించి పేర్కొన్న అశోకుని శాసనం?

శాతవాహనులు

మౌర్య సామ్రాజ్యం పతనంతో పాటు, భారత దేశంలో వాయవ్య దిశలో కుషాణులు, పశ్చిమ దిశలో 'క్షాత్రపులు', దక్షిణా పథంలో ప్రాచీనచోళులు, ఆంధ్ర శాతవాహనులు స్వతంత్ర రాజ్యాలు స్థాపించారు. శాతవాహనుల పరిపాలనకు పూర్వమే దక్షిణాపథం రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందినట్లు గ్రీకు రచనల ద్వారా తెలుస్తోంది. పెరిప్లస్ ఆఫ్ ఎరిత్రియన్ సీ, టాలమీ రచించిన 'జాగ్రఫీ' మెగస్తనీసు 'ఇండికా' వంటి గ్రంథాలు వింధ్య పర్వతాలకు దక్షిణాన వివిధ జాతుల వారు పరిపాలించి నట్లు విశద పరుస్తున్నాయి.

శాతవాహనుల యుగచరిత్ర క్రీ.పూ. 2వ శతాబ్దం నుంచి, క్రీ.శ. 2వ శతాబ్దం వరకూ దక్షిణా పథ రాజకీయ చరిత్రకు శ్రీకారం చుట్టింది. వీరు ఉత్తర–దక్షిణ దేశాల మధ్య సాంస్కృతిక వారధిని నిర్మించారు. సుమారు నాలుగున్నర శతాబ్దాల పాటు 33మంది రాజులు ప్రతిష్ఠానపురం, అమరావతులను రాజధానులుగా చేసుకొని పాలించారు. భారతదేశ చరిత్రలోనే అతి సుదీర్ఘంగా పాలించిన రాజవంశంగా శాతవాహనులు ప్రసిద్ధి చెందారు. వివిధ ఆధారాల ప్రకారం వీరి పాలన క్రీ.పూ. 271లో ఆరంభమై క్రీ.శ. 174లో పతనమైంది.

శాతవాహనుల చరిత్రకు ప్రధాన ఆధారాలు:

- ఐతరేయ బ్రాహ్మణం.
- మత్స్య, వాయు, బ్రహ్మాండపురాణాలు.
- కుంతల శాతకర్ణి కాలానికి చెందిన 'శర్వవర్మన్' సంస్కృత భాషలో రాసిన కాతంత్ర వ్యాకరణ గ్రంథం.
- గుణాఢ్యుడు ప్రాకృతభాషలో రచించిన బృహత్కథ.
- మహారాష్ట్ర ప్రాకృతభాషలో శాతవాహన రాజైన హాలుడు రచించిన గాథసప్తశతి.
- బౌద్ధమత మహాయాన సిద్ధాంతకర్త ఆచార్య నాగార్జునుడు సంస్కృతభాషలో రచించిన సుహృల్లేఖ, ప్రజ్ఞాపారమిత వంటి గ్రంథాలు.
- గ్రీకు రచయితలు మెగస్తనీసు–'ఇండికా', టాలమీ–'ఎ గైడ్ టు జాగ్రఫీ'.
- చైనా యాత్రికుడు హ్యూయాన్‌త్సాంగ్ రచించిన సీ–యూ–కీ గ్రంథం
- అజ్ఞాత రచయిత రచించిన 'పెరిప్లస్ ఆఫ్ ఎరిత్రియన్–సీ' గ్రంథం
- అశోకుడు వేయించిన శిలా శాసనాలు (ప్రాకృతం) ఎర్రగుడి, రాజుల మందగిరి (కర్నూలు జిల్లా), మస్కీ (రాయచూర్).
- శాతవాహన రాజు మొదటి శాతకర్ణి భార్య 'నాగనిక' వేయించిన 'నానాఘాట్ శిలాశాసనం' (ప్రాకృతభాష)
- గౌతమీ పుత్రశాతకర్ణి తల్లి గౌతమీ బాలశ్రీ వేయించిన 'నాసిక్' శిలా శాసనం.
- రెండో శాతకర్ణి సమకాలికుడైన కళింగాధిపతి ఖారవేలుడు వేయించిన 'హాతీగుంఫా శిలా శాసనం (ఒడిశా).
- శకరాజైన రుద్రదమనుడు మొదటిసారిగా సంస్కృతభాషలో వేయించిన క్రీ.శ. 150 నాటి గిర్నార్ శాసనం.
- క్షాత్రపు రుద్రదత్తుడు వేయించిన నాసిక్, కన్హేరి శిలాశాసనాలు.
- 'వాసిష్ఠీ పుత్రపులోమావి'కి సంబంధించిన నాసిక్ గుహ శాసనం.

ఇవి కాకుండా, పురావస్తు అవశేషాలు, స్థూపాలు, చైత్యగృహాలు, విహారాలు, నాణేలు ముఖ్య ఆధారాలు. అశోకుడు, శాతవాహన రాజులు వేయించిన శాసనాలన్నీ ప్రాకృతభాష, బ్రాహ్మీ లిపిలో ఉన్నాయి.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

హిస్టరీ



ఆంధ్రులు–ప్రశస్తి:
తెలుగుకంటె ఆంధ్రశబ్దం ప్రాచీనమైంది. రుగ్వేదానికి వ్యాఖ్యానంగా రాసిన 'ఐతరేయబ్రాహ్మణం'లో అంధ్రులు విశ్వా మిత్రుని సంతతిగా పేర్కొంటూ 'ఆంధ్రశబ్దం' ప్రశస్తి ఉంది. ఐతరేయ బ్రాహ్మణం క్రీ.పూ. 1200 నాటిది.

అశోకుని 13వ శిలాశాసనం ఆంధ్రులు మౌర్య సామ్రాజ్యంలో నివసించేవారని పేర్కొంది. ఆంధ్రుల నివాసం గురించి బౌద్ధ జాతక కథల్లో వివరణ ఉంది. భీమసేనజాతకం 'ఆంధ్రపదాన్ని' ప్రస్తావించింది. సెరివణిజ జాతకం తేలి వాహన నదిపై (కృష్ణానది)ఉన్న నగరం 'ఆంధ్రనగరి' అని ప్రస్తావించింది.

క్రీ.శ. 4వ శతాబ్దం మైదవోలు శాసనం 'ఆంధ్రపదం' అని పేర్కొంది. తూర్పు చాళుక్యుల శాసనాల్లో ఆంధ్ర పేరుంది. క్రీ.శ. 13వ శతాబ్దం నాటి హన్మకొండ శాసనం (వరంగల్) 'ఆంధ్రవాణీమండన' అని పేర్కొంది. క్రీ.శ. 14వ శతాబ్దంలో 'ఆంధ్రఖండమండలం' అని పేర్కొన్నారు. శక్తి సంగ్రమతంత్రం ప్రకారం ఆంధ్ర – తెలింగ దేశంగా పేర్కొంది. తర్వాత త్రిలింగశబ్దం వచ్చింది. కాళేశ్వరం, ద్రాక్షారామం, శ్రీశైలం త్రిలింగాలుగా పేరుగాంచాయి.

జన్మస్థలంపై – భిన్నాభిప్రాయాలు:
అంధ్ర శాతవాహనుల జన్మస్థానం, జాతి, కులం, పరిపాలనా కాలం, ముఖ్య పట్టణాల గురించి చరిత్రకారుల్లో భిన్నాభిప్రాయా లున్నాయి. శాతవాహనులు గోదావరి, కృష్ణా మండల వాసులని, అశోకుని మరణానంతరం స్వతంత్రులై పశ్చిమాన నాసిక్ (మహారాష్ట్ర) వరకు రాజ్యాన్ని విస్తరించిన వీరు ఆంధ్రులేనని ఆచార్య గుర్తి వెంకటరావు, ఆచార్య మారేమండరామారావు, వి.ఎ.స్మిత్, రాయ్ చౌదరి, ఆర్.జి. భండార్కర్ వంటి చరిత్రకారులు అభిప్రాయపడ్డారు. శాతవాహనుల జన్మభూమి విదర్భ ప్రాంతమని వాసుదేవ విష్ణుమిరాశీ పేర్కొన్నారు. శాతవాహనుల ఆదిమ నివాసం మహారాష్ట్ర (నాసిక్) అని పి.టి. శ్రీనివాస అయ్యం గారు, కె. గోపాలా చారి, ప్రసాల్కర్‌లు పేర్కొన్నారు. వీరి ప్రథమ నివాసం 'బళ్లారి' అని వి.ఎస్. సుక్తాంకర్ అభిప్రాయపడ్డారు. శాతవాహనులు, ఆంధ్రులు కారని, ఆంధ్రులకు 'భృత్యులు' అని ఆర్.జి. భండార్కర్ అభిప్రాయం.

శాతవాహనుల ప్రాచీన రాజధాని శ్రీకాకుళం (కృష్ణా జిల్లా), ఆ తర్వాత ధాన్యకటకం (అమరావతి, గుంటూరు జిల్లా), ఆ తర్వాత ప్రతిష్ఠానపురం (పైథాన్, మహారాష్ట్ర) అని డాక్టర్ ఎల్.డి. బార్నెట్ అభిప్రాయపడ్డారు. వీరి మొదటి రాజధాని ధాన్యకటకం అని భండార్కర్ అభిప్రాయం.

రాజ్యస్థాపన:
స్వతంత్ర శాతవాహన రాజ్యస్థాపకుడు శ్రీముఖుడు (సీముకుడు). క్రీ.పూ.271 నుంచి 248 వరకు 23 ఏళ్లు పాలించాడు. ఇతను మొదట జైనమతం స్వీకరించాడు. శ్రీముఖుని నాణేలు (తగరం) కరీంనగర్ జిల్లా కోటిలింగాల, ధూళికట్ట ప్రాంతాల్లో లభ్యమయ్యాయి. మెదక్ జిల్లా లో సంగారెడ్డి, కొండాపూర్‌ల్లో కూడా లభించాయి. కర్ణాటకలోని 'సన్నతి', మహారాష్ట్రలోని నెవాస,జున్నార్,అకోల ప్రాంతాల్లో తగరపు నాణేలు అధిక సంఖ్యలో లభ్యమయ్యాయి.

మొదటి శాతకర్ణి:
శ్రీముఖుని తర్వాత అతడి సోదరుడు కన్హ(కృష్ణుడు) కొద్దికాలం పాలించాడు. ఇతడు నాసిక్, కన్హేరి గుహలను తొలిపించాడు. ఇతడి అన్న శ్రీముఖుని కుమారుడు మొదటి శాతకర్ణి తర్వాత రాజ్యానికొచ్చాడు. ఇతడు క్రీ.పూ. 180 నుంచి క్రీ.పూ. 170 వరకు పాలించాడు. ఇతడి భార్య నాగనిక వేయించిన నానాఘాట్ శిలాశాసనం ఇతడి విజయాలను వర్ణిస్తుంది. ఈ శాసనం ప్రకారం మొదటి శాతకర్ణికి 'ఏకవీరుడు, శూరుడు, దక్షిణాపథపతి'గా బిరుదులున్నాయి. రెండు అశ్వమేధయాగాలు, ఒక రాజసూయ యాగం చేసిన మొట్టమొదటి శాతవాహన రాజు ఇతడే! ఇతడి రాజ్యం ఉత్తరాన మాళ్వా నుంచి దక్షిణాన మైసూరు వరకు విస్తరించి ఉంది. 'అప్రతిహతచక్ర' అనే బిరుదు పొందాడు. ఇతడు బలమైన పుష్యమిత్ర శుంగుని ఓడించి, అందుకు గుర్తుగా ఉజ్జయినీ పట్టణ గుర్తుతో నాణేలను ముద్రించాడు. మొదటి శాతకర్ణి బ్రాహ్మణులకు కార్షాపణలు (వెండినాణేలు) విరివిగా దానం చేశాడు. ఇతడు మాళ్వా నుంచి విదిశ (మధ్యప్రదేశ్) వరకు రాజ్యాన్ని విస్తరించాడు.

రెండో శాతకర్ణి:
శాతవాహన వంశంలో 6వ రాజైన రెండో శాతకర్ణి క్రీ.పూ. 184 నుంచి క్రీ.పూ. 128 వరకు 56 ఏళ్లు పాలించాడు. కణ్వ వంశంలో చివరివాడైన 'సుశర్మను' ఓడించి పాటలీ పుత్రాన్ని జయించాడు. దీనికి గుర్తుగా రెండో శాతకర్ణి నాణేలు పాటలీపుత్రంలోని 'కుమ్రాయ' వద్ద లభ్యమ య్యాయి. ఇతడు కళింగాధిపతి (ఒడిశా) ఖారవేలుని చేతిలో ఓడాడని, ఖారవేలుని మరణానంతరం కళింగను జయించాడని తెలుస్తోంది. ఇతడు మధ్యప్రదేశ్‌లోని సాంచీస్థూపానికి దక్షిణ తోరణాన్ని నిర్మించాడు.

కుంతల శాతకర్ణి:
శాతవాహన రాజుల్లో 13వ వాడు 'కుంతల శాతకర్ణి' రాజ్యానికొచ్చాడు. శాతవాహనుల సమకాలీకులైన శకులను ఓడించి, మాళ్వా, మహారాష్ట్ర లను తిరిగి సంపాదించాడు. ఇతడి కాలంలోనే ప్రాకృత భాష స్థానంలో సంస్కృతం రాజభాషగా మారింది. ఇతడు తన నాణేలపై పాటలీపుత్ర చిహ్నాన్ని ముద్రించాడు.

వాత్స్యాయనుడు రచించిన 'కామసూత్రం' గ్రంథంలో కుంతల శాతకర్ణిని ప్రస్తావించాడు. ఇతని ఆస్థానంలో శర్వవర్మన్ సంస్కృతభాషలో 'కాతంత్ర వ్యాకరణ' గ్రంథాన్ని రచించాడు. ఇతడి కాలంలోనే గుణాఢ్యుడు పైశాచిక ప్రాకృతభాషలో బృహత్కథను రచించాడు. ఈ గ్రంథ మే పంచతంత్రాన్ని సంస్కృతభాషలో 'విష్ణుశర్మ' రచించడానికి ఆధారమైంది. బృహత్కథ ఆధారంగా, క్షేమేంద్రుడు బృహత్కథా మంజరి, హరిసేనుని బృహత్కథాకోశం, వరాహమిహిరుని – బృహత్ సంహిత వంటి గ్రంథాలకు కూడా గుణాఢ్యుని బృహత్కథ ఆధారమైంది.

హాలుడు:
శాతవాహన రాజుల్లో 17వ వాడు. ఏడాది మాత్రమే రాజ్యపాలన చేశాడు. హాలుడు ప్రాకృతభాషలో 700 శృంగార గాథలను 'గాథసప్తశతి' పేరుతో సంకలనం చేశాడు. ఈయనకు 'కవివత్సలుడు' అనే బిరుదు ఉంది. కుతూహలుడు రచించిన 'లీలావతి పరిణయం' కావ్యం ప్రకారం హాలుడు సింహళ రాకుమారి లీలావతిని గోదావరి తీరం ద్రాక్షారామంలో వివాహం చేసుకున్నట్లు తెలుస్తోంది. వాత్స్యాయన కామసూత్రం, రాజశేఖరుని 'కావ్యమీమాంస' గ్రంథాలు హాలుడిని ప్రస్తావించాయి.

గౌతమీ పుత్రశాతకర్ణి:
క్రీ.శ. 62–86 మధ్య కాలంలో పాలించిన 23వ శాతవాహన రాజు గౌతమీపుత్ర శాతకర్ణి. ఇతడు శాతవాహన రాజుల్లో అగ్రగణ్యుడు. గొప్పవిజేత. తన తల్లి గౌతమీబాలశ్రీ వేయించిన నాసిక్ శిలా శాసనం ఇతడి విజయాలను వర్ణిస్తుంది. శాతవాహన రాజుల్లో పేరుకు ముందు తల్లిపేరును పెట్టుకునే సంప్రదాయం గౌతమీపుత్ర శాతకర్ణితోనే ప్రారంభమైంది. శక–శాతవాహనుల మధ్య సముద్ర వ్యాపారం కోసం జరుగుతున్న పోరాటాన్ని అంతం చేసి శకరాజైన నహపాణుడ్ని హతమార్చి, 'క్షహరాట వంశనిరవశేషకార' అనే బిరుదును పొందాడు. తాను అధికారంలోకి రావడానికి గుర్తుగా క్రీ.శ. 78లో 'శాలివాహన శకాన్ని' ప్రారంభించాడు. శక రాజుల్లో నహపాణుడు గొప్ప విజేతగా పేరు పొందాడు. నహపాణుడి రాజ్యం కతియవాడ్ (గుజరాత్), ఉత్తర–దక్షిణ–మహారాష్ట్ర ప్రాంతం, కొంకణ ప్రాంతాల వరకు విస్తరించింది. ఈయన రాజధాని మిన్నగార (మందసా). ఇది ఉజ్జయినీ–బ్రోచ్‌ల మధ్య ప్రాంతం. శాతవాహనుల నుంచి నహపాణుడు మహారాష్ట్ర ప్రాంతాన్ని జయించాడు. కానీ గౌతమీపుత్ర శాతకర్ణి తిరిగి జయిం చి స్వాధీనం చేసుకున్నాడు. నహపాణునితో క్షహరాట వంశం అంతమైంది. నహపాణుడు వేయించిన సుమారు 13,270 వెండినాణేలు మహారాష్ట్రలోని 'జోగల్‌తంబి' ప్రాంతంలో లభ్యమయ్యాయి. ఈ నాణేలను గౌతమీపుత్ర శాతకర్ణి తన బొమ్మతో తిరిగి ముద్రించాడు. ఆంధ్రదేశంలో గౌతమీపుత్ర శాతకర్ణి నాణేలు అమరావతి, చేబ్రోలు, మాచర్ల, గోలి, మాడుగుల ప్రాంతాల్లో లభించాయి. ఇతనికాలం నాటి టంకశాల మూసకట్లతో సహా విజయపురి (నాగార్జునకొండ) వద్ద లభించాయి. ఇతడు అపరాంత, కుకుర, వైజయంతి, అసక, ములకలను జయించాడు. ఇతనికి 'ఆగమనిలయ, ఏకబ్రాహ్మణ, క్షత్రియదర్పమానమర్ధన త్రిసముద్రతోయపీతవాహన' బిరుదులున్నాయి.

> **గుర్తుంచుకోండి ఇలా..!**
>
> చరిత్రలో తారీఖులు, దస్తావేజులు, రచనలు, రాజుల సమకాలీకులు, వాదాలు, రాజధానులు గుర్తుంచుకోవాలి. ఒక రాజ్యం చరిత్ర చదివినపుడు ఆనాటి సమకాలీన రాజుల గురించి కొంత తెలుసుకోవాలి. **ఉదా:** హాలుడు గాథసప్తశతిని ఏ భాషలో రచించాడు. **జ:** ప్రాకృతభాషలో అదే విధంగా గ్రంథాలు ఏ అంశాన్ని ప్రస్తావిస్తున్నాయి అనేది కూడా గుర్తుంచుకోవాలి. **ఉదా:** 'గాథసప్తశతి' ఏ అంశాన్ని ప్రధానంగా పేర్కొంటుంది. **జ:** శృంగార పదాల గురించి.. ఈ కోణంలోనూ చరిత్రాంశాలను అధ్యయనం చేయాలి.

గౌతమీపుత్ర శాతకర్ణి తర్వాత అతని కుమారుడు 'వాసిష్ఠీపుత్ర పులోమావి' రాజ్యానికొచ్చాడు. ఇతడిని 'దక్షిణాపథేశ్వర' అని గౌతమీ బాలశ్రీ వేయించిన నాసిక్‌శాసనం ప్రస్తావించింది. ఇతని సమకాలికుడు కుషాణురాజు హువిష్కుడు. వాసిష్ఠీ పుత్ర పులోమావి కాలంలోనే తన రాజధానిని ప్రతిష్ఠానపురం నుంచి ధాన్యకటకానికి మార్చాడు. ఇతడి కాలంలోనే ప్రఖ్యాతిగాంచిన అమరావతి స్థూపానికి మెరుగులు దిద్దారు. ఇతడు కార్లేలోని బౌద్ధ భిక్షువులకు దానాలు చేశాడు. ఇతడి రాజ్య కాలం క్రీ.శ. 86–114 వరకు. ఇతడినే రెండో పులోమావిగా కూడా పిలుస్తారు.

యజ్ఞశ్రీ శాతకర్ణి:
ఇతడు కడపటి శాతవాహన రాజుల్లో గొప్పవాడు. 27వ శాతవాహనరాజు. యజ్ఞశ్రీ శాతకర్ణి మహాక్షాత్రప శకరుద్రదామునికి సమకాలికుడు. తొలి సంస్కృత శాసనం వేయించింది రుద్రదాముడే. దీనినే 'గిర్నార్ శాసనం' అంటారు. యజ్ఞశ్రీ శాతకర్ణి కాలంలో నౌకావ్యాపారం జరిగినట్లు అతడి నాణేల ద్వారా తెలుస్తోంది. ఇతడి కాలంలోనే తెరచాప (లేదా) లంగరు వేసిన ఓడముద్రలున్న నాణేలు లభించాయి. ఇతడి ఆస్థానంలో ఆచార్య నాగార్జునుడు ఉండేవాడు. ఇతని కోసం శ్రీ పర్వతం (నాగార్జున కొండ)పై పారావత విహారం నిర్మించాడు యజ్ఞశ్రీ. యజ్ఞశ్రీ శాతకర్ణికి 'త్రి సముద్రాధిపతి' అనే బిరుదు ఉంది. ఇతడి తర్వాత శాతవాహన రాజ్యం క్షీణించింది. చివరిరాజు మూడో పులోమావి కాలంలో ఈ రాజ్యం అంతరించింది. క్రీ.శ. 225 సంవత్సరంలో సామంతరాజులైన అభిరులు, చుటునాగులు, ఇక్ష్వాకులు, పల్లవులు తిరుగుబాటు చేసి స్వతంత్ర రాజ్యాలు స్థాపించారు.

మాదిరి ప్రశ్నలు

1) 'లీలావతి పరిణయం' గ్రంథకర్త?
   1) రాజశేఖరుడు 2) హాలుడు
   3) వాత్స్యాయనుడు 4) కుతూహలుడు
2) ఆచార్య నాగార్జునుడికి సమకాలీన శాతవాహన రాజు?
   1) హాలుడు 2) మొదటి శాతకర్ణి
   3) గౌతమీపుత్ర శాతకర్ణి 4) యజ్ఞశ్రీ శాతకర్ణి
3) 'కాతంత్ర సంస్కృత వ్యాకరణం' రచయిత?
   1) నాగార్జునుడు 2) గుణాఢ్యుడు
   3) శర్వవర్మన్ 4)వరాహమిహిరుడు
4) ఆంధ్రుల గురించి పేర్కొన్న అశోకుని శిలా శాసనం ఏది?
   1) 9వ 2) 12వ 3) 13వ 4) ఏవీకావు
5) నహపాణుడిని ఓడించిన శాతవాహన రాజు?
   1) సీముఖుడు 2) యజ్ఞశ్రీ శాతకర్ణి
   3) రెండోశాతకర్ణి 4) గౌతమీపుత్ర శాతకర్ణి
6) గాథాసప్తశతి ప్రాకృత పదాల్లో ప్రధానాంశం?
   1) జానపద పదాల వివరణ
   2) శృంగార పదాల వివరణ
   3) చిలుక చెప్పిన కథలు 4) పురాణాల కథనం
7) శాతవాహనులు ఆంధ్రులు కారని, ఆంధ్రులకు భృత్యులని వాదించిన పండితుడు?
   1) ఆర్.జి. భండార్కర్ 2) వి.యస్.సుక్తాంకర్
   3) రాప్సన్ 4) డా.గోపాలాచారి
8) ఆంధ్రశబ్దాన్ని తొలిసారిగా ప్రస్తావించింది?
   1) రుగ్వేదం 2) సామవేదం
   3) ఐతరేయ బ్రాహ్మణం
   4) మాండ్యూకోపనిషత్
9) ఓడముద్రలున్న సీసం నాణేలను ముద్రించిన శాతవాహన రాజు?
   1) హాలుడు 2) గౌతమీపుత్ర శాతకర్ణి
   3) రెండోపులోమావి 4) యజ్ఞశ్రీ శాతకర్ణి
10) శాతవాహన రాజులు తమ వ్యక్తిగత నామాలకు మాతృగోత్ర నామాలను ముందు చేర్చి, చెప్పుకునే పద్ధతి ఎవరి కాలంలో ప్రారంభమైంది?
   1) గౌతమీపుత్ర శాతకర్ణి 4) హాలుడు
   2) శ్రీముఖుడు 3) వాసిష్ఠీపుత్ర పులోమావి
11) తొలిసారి సంస్కృతభాషలో క్రీ.శ.150లో గిర్నార్ శాసనాన్ని వేయించిన విదేశీ రాజు?
   1) నహపాణుడు 2) మీనాండర్
   3) రుద్రదమనుడు 4) డెమిత్రియస్

సమాధానాలు

1) 4; 2) 4; 3) 3; 4) 3; 5) 4; 6) 2; 7) 1; 8) 3; 9) 4; 10) 1; 11) 3.

నిగమన ఉపగమానికి గల ప్రయోజనం?

విజ్ఞాన శాస్త్ర బోధనాభ్యసన వ్యూహాలు

- విద్యార్థుల్లో ఆమోదయోగ్యమైన ప్రవర్తనా మార్పు తీసుకొని రావడమే బోధన ముఖ్య ఉద్దేశం.
- బోధన ఒక కళ. అది సహజ సిద్ధంగా వస్తుంది. అలాకాకపోతే శిక్షణ ద్వారా సాధించవచ్చు. విద్యా లక్ష్యాలను సాధించడానికి బోధన పద్ధతులు ఉపయోగపడతాయి.
- పూర్వం సంప్రదాయ పద్ధతిలో బోధించేవారు. జ్ఞానం విస్ఫోటనం చెందిన తర్వాత మనోవైజ్ఞానిక సిద్ధాంతాలు విద్యలో బోధించడం వల్ల అనేక బోధన పద్ధతులు ఏర్పడ్డాయి.

బోధన ఉపగమాలు:

- బోధన పద్ధతుల్లో వాడే విధానాలను ఉపగమాలు అనొచ్చు. అంటే ఒక బోధన పద్ధతిలో తెలిసిన విషయాలను తెలియని విషయాలవైపుగా లేదా తెలియని విషయం నుంచి తెలిసిన విషయం వైపుగా చెబుతూ ఉండటం ఈ ఉపగమాలను సూచిస్తాయి.
- ఒక విషయంలో ఉపగమాన్ని బోధన పద్ధతిలో వాడితే మరొక విషయంలో ఆ ఉపగమాన్నే ప్రత్యేక బోధన పద్ధతిగా వాడుతున్నారు. **ఉదా:** గణితశాస్త్రం.

ఆగమన ఉపగమం:

- తెలిసిన విషయాల నుంచి తెలియని విషయాల వైపునకు వెళ్లడం.
- మూర్త విషయాల నుంచి అమూర్త విషయాల వైపునకు వెళ్లడం.
- నిర్దిష్ట ఉదాహరణల నుంచి సామాన్య సూత్రాలను రాబట్టడం ఆగమన ఉపగమాన్ని సూచిస్తాయి.

ఫౌలర్

- నిర్దిష్ట అంశాల నుంచి సాధారణీకరణలను రూపొందించడాన్ని ఆగమనం అంటారు.

జీవన్

- ప్రత్యేక సత్యాల నుంచి సాధారణ సత్యాలను రూపొందించడాన్ని ఆగమనం అంటారు.

ఉదా: మల్లెపూవుకు సువాసన ఉంటుంది. అది రాత్రి వికసిస్తుంది. సన్నజాజికి సువాసన ఉంటుంది. అది రాత్రి వికసిస్తుంది. విరజాజికి సువాసన ఉంటుంది. అది రాత్రి వికసిస్తుంది. కాబట్టి రాత్రివేళ వికసించే పూలలో సువాసన ఉంటుంది అని సాధారణీకరణాన్ని ప్రతిపాదిస్తే అది ఆగమన ఉపగమం అవుతుంది.

నిగమన ఉపగమం:

- ఇది ఆగమన ఉపగమానికి వ్యతిరేకంగా ఉంటుంది.
- తెలియని విషయాల నుంచి తెలిసిన విషయాల వైపునకు, అమూర్త విషయాల నుం చి మూర్త విషయాల వైపునకు, సాధారణ విషయం నుంచి ప్రత్యేకాంశాల వైపునకు, వెళ్లడం ఈ ఉపగమాన్ని తెలుపుతుంది. దీన్ని అరిస్టాటిల్ తర్కశాస్త్ర పునాదులపై ఆధారపడి తయారుచేశారు.
- మానవులంతా మర్త్యులే (మరణించేవారే)
- సోక్రటీస్ మానవుడు మరణించాడు.
- ప్లేటో మానవుడు మరణించాడు.
- అలెగ్జాండర్ మానవుడు మరణించాడు. ఈ విభాగంలో బోధించడం నిగమన ఉపగమం.

విజ్ఞానశాస్త్ర బోధన వ్యూహాలు:

- విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు చేసే ప్రయత్నాలు లేదా బోధిం చే పద్ధతులు ప్రధానంగా రెండు రకాలు.
  1) ఉపాధ్యాయ కేంద్రిత బోధన పద్ధతులు
  2) విద్యార్థి కేంద్రిత బోధన పద్ధతులు.

ఉపాధ్యాయ కేంద్రిత బోధన పద్ధతులు:

- ఉపాధ్యాయుడు మాత్రమే చురుకుగా ఉండి బోధించే బోధన పద్ధతి. దీనిలో విద్యార్థి పాత్ర తక్కువ. ఇందులో నాలుగు పద్ధతులు చూడొచ్చు.
  1) ఉపన్యాస పద్ధతి
  2) ఉపన్యాస ప్రదర్శన పద్ధతి
  3) చారిత్రాత్మక పద్ధతి 4) నిర్మాణ పద్ధతి

ఉపన్యాస పద్ధతి:

- ఉపాధ్యాయుడు ఉపన్యసిస్తాడు. విద్యార్థులు వింటారు లేదా వింటున్నట్లు నటిస్తారు.
- దీన్ని రాసి మాట్లాడే పద్ధతి అని కూడా అంటారు.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ - ఎస్‌జీటీ మెథడ్స్

- ఇందులో విద్యార్థి కంటే విషయానికే ప్రాధాన్యత ఉంటుంది.

ప్రయోజనాలు:

- ఆర్థికంగా సులువైనవి. ప్రయోగాలు, నమూనాలు లేవు కాబట్టి ఖర్చు తక్కువవుతుంది.
- తక్కువ కాలంలో ఎక్కువ అంశాలు బోధించవచ్చు.
- పాఠ్య ప్రణాళికను సకాలంలో బోధించవచ్చు.
- ఎంతమంది విద్యార్థులకైనా ఒకేసారి బోధించవచ్చు. ➲ పనిభారం తక్కువ.

లోపాలు

- కృత్యాధార బోధనకు వ్యతిరేకం.
- చేయడం ద్వారా నేర్చుకోవడం జరగదు. (విద్యార్థులు ప్రయోగాలు చేయరు).
- శాస్త్రీయ వైఖరి పెంపొందించలేం.
- వైయక్తిక భేదాలను గుర్తించి బోధించలేం.
- శారీరక ఉపస్థితి, మానసిక అనుపస్థితి ఉంటుంది. (తరగతి గదిలో ఉన్న విద్యార్థులు మానసికంగా సిద్ధంగా ఉండరు)

ఉపన్యాస ప్రదర్శనా పద్ధతి:

- ఉపన్యాస పద్ధతిలోని లోపాలను ప్రదర్శనా పద్ధతిలో కొన్ని సవరించారు. ఈ పద్ధతిలో వినడంతోపాటు చూడటం కూడా ఉంటుంది. కాబట్టి అభ్యసించిన విషయం ఎక్కువ రోజులు గుర్తుంటుంది.
- విద్యార్థులు ఉపన్యాస పద్ధతిలో కంటే కొంత చురుకుగా ఉంటారు.
- **ముఖ్యాంశాలు:** పాఠ్య పథక రచన – పరికరాలను సిద్ధం చేసుకోవడం – ప్రయోగాలు సరి చేసి చూడడం.

ప్రదర్శన విజయవంతం కావాలంటే?

- ప్రదర్శనా లక్ష్యాన్ని ముందుగా తెలపాలి.
- ప్రదర్శన అందరికీ కనిపించేలా ఉండాలి.
- సామగ్రి తగిన పరిమాణంలో ఉండాలి.
- ప్రత్యామ్నాయ పరికరాలుండాలి.
- మధ్యలో ప్రశ్నలు వేసి ఆసక్తి పెంచాలి.
- విద్యార్థుల స్థాయికి తగిన ప్రయోగాలుండాలి.
- విద్యార్థుల సహకారం తీసుకోవాలి.
- ప్రదర్శన చూడడానికి తగిన సమయం ఇవ్వాలి.
- చివరి వరకూ ఆసక్తి కొనసాగాలి.

ప్రయోజనాలు: మనోవైజ్ఞానికం, సిద్ధాంతం ఆచరణకు మధ్య సంబంధం కలిగి ఉంది. వ్యయాన్ని, కాలాన్ని ఆదా చేస్తుంది. (ఉపాధ్యాయుడు మాత్రమే ప్రయోగం చేస్తాడు)

లోపాలు: విద్యార్థులు ప్రయోగం చూస్తారు కానీ చేయరు. ప్రదర్శన విఫలమైతే విద్యార్థుల్లో నిరుత్సాహం కలుగుతుంది.

3. **చారిత్రక పద్ధతి:** ఇది పూర్తిస్థాయి బోధన పద్ధతి కాదు. కొన్ని పాఠ్యాంశాలను మాత్రమే ఈ పద్ధతిలో బోధించవచ్చు. **ఉదా:** శాస్త్రవేత్తల జీవిత విశేషాలు, ఆవిష్కరణలు తెలియజేసేటప్పుడు పూర్వ చరిత్ర తెలపొచ్చు. శాస్త్రవేత్తల చిత్రాలను ప్రదర్శిస్తూ చెప్పడం బాగుంటుంది. ప్రతి పాఠానికి ముందు దాని పూర్వ చరిత్ర చెప్పడం ఈ పద్ధతి.
4. **నిర్మాణ పద్ధతి:** విజ్ఞాన శాస్త్ర నిర్మాణం ప్రకారం బోధన జరిపే పద్ధతి. ష్వాబ్ అండ్ ఫినిక్స్ ప్రకారం సంశ్లేషాత్మక నిర్మాణంలో ఉండే పరిశీలనలు, వర్గీకరణలు, ప్రాకల్పనలు, ప్రయోగాలు, వ్యాఖ్యానం, కొలవడం, అన్వేషణ వంటి ప్రక్రియలు నేర్పడం, ద్రవ్యాత్మక నిర్మాణంలోని యథార్థాలు,భావనలు, సాధారణీకరణలు, సూత్రాలు, సిద్ధాంతాలు, నియమాలు తెలపడం ఈ పద్ధతిలో జరుగుతుంది. ఇది ఆలోచననను రేకెత్తించి వైఖరులను ఏర్పరుస్తుంది.

> **గతంలో అడిగిన ప్రశ్నలు**
>
> 1. శాస్త్రీయ సూత్రాలు, సిద్ధాంతాలు, ధర్మాలు కనుక్కోవడానికి దోహదపడిన పద్ధతి? (డీఎస్సీ- 2008)
>   1) ఆగమన 2)నిగమన
>   3) సర్పిల 4) ఏక కేంద్రీయ
> 2. అభ్యసనంలో ఉపాధ్యాయుడు కల్పించే కృత్యాల పరంగా ప్రాధాన్యత లేని కృత్య లక్షణం? (డీఎస్సీ- 2008)
>   1) బహుళ తరగతి బోధనకు అనువైనదిగా
>   2) విద్యార్థులు శారీరక, మానసిక ఒత్తిళ్లను పెంచేదిగా
>   3) ఆలోచనలు రేకెత్తించేదిగా
>   4) ఆసక్తి కలిగించేదిగా
>
> **సమాధానాలు:** 1) 1; 2) 2.

మాదిరి ప్రశ్నలు

1. బోధన ముఖ్య ఉద్దేశం కానిది?
   1) లక్ష్యాలను సాధించడం విద్యార్థుల్లో నేర్పడం.
   2) చేయడం ద్వారా నేర్చుకునేట్లు చేయడం.
   3) విద్యార్థుల తల్లిదండ్రుల మన్ననలను బోధన ద్వారా పొందడం.
   4) విద్యార్థుల్లో శాశ్వత ప్రవర్తనా మార్పులు తీసుకొని రావడం.
2. ప్రాచీన సంప్రదాయ పద్ధతిలో బోధన, బోధనలో ఆధునికీకరణకు వేటిని జోడిం చారు?
   1) ప్రయోగాలు చేస్తూ బోధించడం
   2) బోధనోపకరణాలు విరివిగా వాడడం
   3) మనోవైజ్ఞానిక సిద్ధాంతాలు
   4) సొంత పాఠశాల భవనాలు
3. ఉపగమాలు, బోధన పద్ధతుల మధ్య సంబంధానికి సంబంధించి సరైంది?
   1) ఉపగమాలు, బోధన పద్ధతులు రెండూ ఒకటే.
   2) బోధన పద్ధతుల్లో తిరిగి అనుసరించే విధానం ఉపగమం.
   3) ఉపగమానికి బోధన పద్ధతికి అసలు సంబంధమే లేదు.
   4) విద్యలో ఉపగమం లేదు, బోధన పద్ధతి మాత్రమే ఉంది.
4. ఏ శాస్త్రంలో ఉపగమాలను ప్రత్యేక బోధన పద్ధతిగా వాడుతున్నారు?
   1) విజ్ఞాన శాస్త్రం
   2) సాంఘిక శాస్త్రం
   3) జీవ శాస్త్రం 4) గణిత శాస్త్రం
5. జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు తన బోధనలో సూత్రాన్ని ముందుగా చెప్పి తర్వాత ఉదాహరణలు ఇచ్చారు. ఆమె అనుసరించిన ఉపగమం?
   1) ఆగమన ఉపగమం
   2) నిగమన ఉపగమం
   3) ఆగమన, నిగమన రెండూ
   4) ఇది ఉపగమం కాదు
6. ఇనుము, రాగి, అల్యూమినియం వేడి చేస్తే వ్యాకోచిస్తాయి. ఎందుకంటే అవి లోహాలు. కాబట్టి లోహాలన్నీ వేడి చేస్తే వ్యాకోచిస్తాయి. ఈ క్రమంలో బోధించిన విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయుడు ఏ ఉపగమాన్ని ఎంచుకున్నట్లు?
   1) ఆగమన ఉపగమం
   2) నిగమన ఉపగమం
   3) ఆగమన నిగమన రెండూ
   4) నిగమన తర్వాత ఆగమన ఉపగమం
7. వీటిలో ఏది ఆగమన ఉపగమాన్ని తెలపదు?
   1) మూర్త విషయాల నుంచి అమూర్త విషయాలు రాబట్టడం
   2) నిర్దిష్ట విషయాల నుంచి సాధారణీకరణలు రూపొందించడం
   3) సాధారణీకరణాలు ప్రతిపాదించడం
   4) అమూర్త సామాన్యీకరణల నుంచి మూర్త సత్యాలను గుర్తించే విధానం
8. నిగమన ఉపగమానికి గల ప్రయోజనం?
   1) శాస్త్రీయ పద్ధతి
   2) శాస్త్రీయ వైఖరి పెంపొందిస్తుంది
   3) నేర్చుకున్న విషయాలు ఎక్కువ కాలం జ్ఞాపకం ఉంటాయి.
   4) సిలబస్‌ను తక్కువ సమయంలో పూర్తి చేయొచ్చు.
9. 'రాసి మాట్లాడే పద్ధతి' అని ఏ బోధన పద్ధతికి మారుపేరు?
   1) ఉపన్యాస - ప్రదర్శనా పద్ధతి
   2) ఉపన్యాస పద్ధతి
   3) చారిత్రక పద్ధతి
   4) నిర్మాణ పద్ధతి
10. కింది బోధన పద్ధతుల్లో ఏది ఉపాధ్యాయ కేంద్రిత బోధన పద్ధతి కాదు?
   1) ఉపన్యాస పద్ధతి
   2) ఉపన్యాస ప్రదర్శనా పద్ధతి
   3) అన్వేషణ పద్ధతి
   4) చారిత్రక పద్ధతి

సమాధానాలు

1) 3; 2) 3; 3) 2; 4) 4; 5) 2; 6) 1; 7) 4; 8) 4; 9) 2; 10) 3.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

సహజ వాయువులో ప్రధానంగా ఉండే వాయువు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

రసాయన శాస్త్రం



హైడ్రోకార్బన్లు

1. ప్రయోగశాలలో ఇనార్గానిక్ సమ్మేళనం నుంచి మొదటిసారిగా తయారుచేసిన కర్బన సమ్మేళనం ఏది?
   1) చక్కెర 2) గ్లూకోజ్
   3) యూరియా 4) ఆల్కహాల్
2. కింది వాటిలో హైడ్రోకార్బన్ ఏది?
   1) మీథేన్ 2) ఇథిలీన్
   3) బ్యూటేన్ 4) పైవన్నీ
3. ఆల్కేన్లుగా పేర్కొనే మొదటి నాలుగు హైడ్రో కార్బన్లు ఏవి?
   1) మీథేన్, బ్యూటేన్, ప్రొపేన్, ఈథేన్
   2) మీథేన్, ఇథిలీన్, ఎసిటలీన్, బ్యూటేన్
   3) మీథేన్, ఈథేన్, ప్రొపేన్, బ్యూటేన్
   4) బ్యూటేన్, ప్రొపేన్, ఈథేన్, మీథేన్
4. కింది వాటిలో ద్రవరూపంలో ఉండే హైడ్రో కార్బన్ ఏది?
   1) ప్రొపేన్ 2) బ్యూటేన్
   3) పెంటేన్ 4) హెక్సేన్
5. కింది వాటిలో సంతృప్త హైడ్రోకార్బన్ ఏది?
   1) మీథేన్ 2) ఇథిలీన్
   3) బెంజీన్ 4) ఎసిటలీన్
6. ఫలాలను కృత్రిమంగా త్వరగా పండించడానికి వినియోగించే కాల్షియం కార్బైడ్ విడుదల చేసే వాయువు ఏది?
   1) ఇథిలీన్ 2) ఎసిటలీన్
   3) మీథేన్ 4) బ్యూటేన్
7. ఫలాలను కృత్రిమంగా త్వరగా పండించడానికి సురక్షితమైన పద్ధతి ఏది?
   1) ఫలాలను ఎసిటలీన్ చాంబర్‌లో ఉంచడం
   2) ఫలాలను ఇథిలీన్ చాంబర్‌లో ఉంచడం
   3) ఫలాలను బ్యూటేన్ చాంబర్‌లో ఉంచడం
   4) ఫలాలను ఈథర్ చాంబర్‌లో ఉంచడం
8. కింది వాటిలో కార్బన్ రూపాంతరం కానిది ఏది?
   1) వజ్రం 2) గ్రాఫైట్
   3) ఫుల్లరీన్ 4) కార్బోరండం
9. కింది వాటిలో కేవలం కార్బన్ పరమాణువులు మాత్రమే ఉండే పదార్థం ఏది?
   1) గ్రాఫైట్ 2) ఫుల్లరీన్
   3) వజ్రం 4) పైవన్నీ
10. కింది వాటిలో ఇంధనాలుగా ఎక్కువగా విని యోగంలో ఉన్నవేవి?
    1) ఆల్కేన్లు 2) ఆల్కీన్లు
    3) ఆల్కైన్లు 4) పైవన్నీ
11. కింది వాటిలో హరిత గృహ (గ్రీన్‌హౌజ్) వాయువు కానిది ఏది?
    1) కార్బన్ డై ఆక్సైడ్ 2) మీథేన్
    3) నైట్రస్ ఆక్సైడ్ 4) హైడ్రోజన్
12. వెల్డింగ్ చేయడానికి అవసరమైన అధిక ఉష్ణోగ్రత పొందడానికి ఆక్సిజన్‌తో కలిపి ఉపయోగించే హైడ్రోకార్బన్ ఏది?
    1) ఇథిలీన్ 2) ఎసిటలీన్
    3) ఈథేన్ 4) బ్యూటేన్
13. సహజ వాయువులో ప్రధానంగా ఉండే వాయువు ఏది?
    1) మీథేన్ 2) కార్బన్ డై ఆక్సైడ్
    3) బ్యూటేన్ 4) ఎసిటలీన్
14. గృహ ఇంధనంగా ఉపయోగించే గోబర్ గ్యాస్, బయోగ్యాస్‌లలో ప్రధానంగా ఉండే వాయువు ఏది?
    1) బ్యూటేన్ 2) ఈథేన్
    3) మీథేన్ 4) పెంటేన్
15. LPGలో ఉండే ప్రధాన హైడ్రోకార్బన్ ఏది?
    1) బ్యూటేన్ 2) మీథేన్
    3) ప్రొపేన్ 4) బెంజీన్
16. జతపరచండి.
    జాబితా – 1
    A) కోల్ గ్యాస్ B) LPG
    C) వాటర్ గ్యాస్ D) ఆక్సీ ఎసిటలీన్
    జాబితా – 2
    1) వెల్డింగ్‌లో వాడతారు
    2) అమ్మోనియా తయారీలో వాడతారు
    3) వంటగ్యాస్‌గా ఉపయోగపడుతుంది
    4) లోహ సంగ్రహణలో క్షయకరణిగా విని యోగిస్తారు

	A	B	C	D
1)	1	2	3	4
2)	4	3	2	1
3)	4	3	1	2
4)	2	4	1	3

17. 'వాటర్ గ్యాస్' ఏ వాయువుల మిశ్రమం?
    1) మీథేన్ + బ్యూటేన్
    2) మీథేన్ + కార్బన్ మోనాక్సైడ్
    3) హైడ్రోజన్ + కార్బన్ మోనాక్సైడ్
    4) హైడ్రోజన్ + ఆక్సిజన్
18. కింది వాటిలో సరైన వాక్యం ఏది?
    1) ఆక్సిజన్‌కు మండే స్వభావం ఉంటుంది (దహన శీలి).
    2) ఆక్సిజన్‌కు మండే స్వభావం ఉంటుంది. అదేవిధంగా మండటానికి సహాయ పడుతుంది (దహన దోహదకారి).
    3) ఆక్సిజన్ దహనశీలి కాదు. కానీ దహన దోహదకారి.
    4) ఆక్సిజన్ గ్రీన్‌హౌస్ వాయువు.
19. కింది వాటిలో మండే స్వభావం లేని వాయువు ఏది?
    i) హైడ్రోజన్ ii) బ్యూటేన్
    iii) కార్బన్ డై ఆక్సైడ్ iv) కార్బన్ మోనాక్సైడ్
    1) i, ii, iii 2) i, ii, iv
    3) ii, iii, iv 4) ii, iv
20. కింది వాటిలో పారిశ్రామిక ఇంధన వాయువు ఏది?
    1) వాటర్ గ్యాస్ 2) ప్రొడ్యూసర్ గ్యాస్
    3) కోల్ గ్యాస్ 4) పైవన్నీ
21. ప్రొడ్యూసర్ గ్యాస్‌లో నైట్రోజన్‌తోపాటు ఉండే ప్రధాన వాయువేది?
    1) హైడ్రోజన్ 2) ఆక్సిజన్
    3) కార్బన్ మోనాక్సైడ్
    4) బ్యూటేన్
22. కింది వాటిలో అధిక పీడనం, అధిక ఉష్ణోగ్రత వద్ద ఉత్ప్రేరక సమక్షంలో వేడిచేస్తే.. మైనం లాంటి ఘన పదార్థాన్ని ఏర్పరిచేది ఏది?
    1) హైడ్రోజన్ 2) ఇథిలీన్
    3) ఈథేన్ 4) మీథేన్
23. క్యారీ బ్యాగుల తయారీకి ఉపయోగపడే ముడి పదార్థం ఏది?
    1) ఇథిలీన్ 2) ఈథేన్
    3) బ్యూటేన్ 4) బెంజీన్
24. ఒక మైక్రాన్ కింది వాటిలో దేనికి సమానం?
    1) మిల్లీమీటర్‌లో పదో వంతు(0.1 mm)
    2) మిల్లీమీటర్‌లో వందో వంతు (0.01 mm)
    3) మిల్లీమీటర్‌లో 1000వ వంతు (0.001 mm)
    4) మిల్లీమీటర్‌కు సమానం
25. 2011లో భారత ప్రభుత్వం ఎంత మందం కలిగిన క్యారీ బ్యాగులపై నిషేధం విధించింది?
    1) 40 మైక్రాన్ల కంటే తక్కువ
    2) 40 మైక్రాన్ల కంటే ఎక్కువ
    3) 100 మైక్రాన్లు 4) ఏదీకాదు
26. జతపరచండి.
    ఇంధన వాయువు ప్రధాన అనుఘటకాలు
    A) CNG 1) మీథేన్, ఈథేన్
    B) కోల్‌గ్యాస్ 2) హైడ్రోజన్, మీథేన్, కార్బన్ మోనాక్సైడ్
    C) LPG 3) బ్యూటేన్, ప్రొపేన్
    D) వాటర్ గ్యాస్ 4) కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోజన్

	A	B	C	D
1)	1	2	3	4
2)	2	3	4	1
3)	4	3	1	2
4)	3	4	1	2

27. కింది వాటిలో పొడవైన శృంఖలాలతో కూడిన హైడ్రోకార్బన్ల సల్ఫోనికామ్ల లవణాలేవి?
    1) సబ్బులు 2) డిటర్జెంట్లు
    3) కొవ్వులు 4) మైనాలు
28. ప్రింటింగ్ ఇంక్ తయారీలో వినియోగించే హైడ్రోకార్బన్ ఏది?
    1) మీథేన్ 2) ఈథేన్
    3) ప్రొపేన్ 4) బ్యూటేన్
29. దుస్తులను కొరికే క్రిముల నుంచి రక్షణ కోసం వాటి మధ్య ఉంచే కలరా ఉండల (డాంబర్ గోళీలు) తయారీలో వినియోగించే ప్రధాన పదార్థం ఏది?
    1) కాంఫర్ 2) నాఫ్తలీన్
    3) సుక్రోజ్ 4) ఫ్రక్టోజ్
30. కేన్సర్ కలిగించే గుణం ఉన్న హైడ్రోకార్బన్లు ఏవి?
    1) ఆల్కేన్లు 2) ఆల్కీన్లు
    3) ఆల్కైన్లు
    4) ఎరోమాటిక్ సమ్మేళనాలు
31. కింది వాటిలో ఎరోమాటిక్ ధర్మం ఉన్న హైడ్రోకార్బన్లు ఏవి?
    1) బెంజీన్ 2) నాఫ్తలీన్
    3) టోలిన్ 4) పైవన్నీ
32. హైడ్రోకార్బన్లను మండిస్తే విడుదలయ్యే ప్రధాన వాయువేది?
    1) కార్బన్ డై ఆక్సైడ్
    2) కార్బన్ మోనాక్సైడ్
    3) సల్ఫర్ డై ఆక్సైడ్ 4) నైట్రస్ ఆక్సైడ్
33. హైడ్రోకార్బన్లకు ప్రధాన ఆధారం?
    1) ముడి చమురు 2) చక్కెర పరిశ్రమ
    3) తోలు పరిశ్రమ 4) ఏదీకాదు
34. 'డ్రై క్లీనింగ్'లో ఉపయోగించే ద్రావణి ఏది?
    1) పర్‌క్లోరో ఇథిలీన్ (PCE)
    2) ఆల్కహాల్
    3) పెట్రోల్ 4) హెక్సేన్
35. 'మార్ష్‌గ్యాస్' అని దేనికి పేరు?
    1) ఎసిటలీన్ 2) ఇథిలీన్
    3) మీథేన్ 4) ప్రొపేన్
36. బొగ్గు గనుల్లో అగ్ని ప్రమాదాలకు కారణమయ్యే వాయువు ఏది?
    1) బ్యూటేన్ 2) హైడ్రోజన్
    3) మీథేన్ 4) ఆక్సిజన్
37. మంటలను ఆర్పడానికి కింది వాటిలో ఏ వాయువు పనికిరాదు?
    i) హైడ్రోజన్ ii) కార్బన్ మోనాక్సైడ్
    iii) ఆక్సిజన్ iv) కార్బన్ డై ఆక్సైడ్
    1) iv మాత్రమే 2) i, iii మాత్రమే
    3) ii, iii మాత్రమే 4) i, ii, iii
38. వంట గ్యాస్ సిలిండర్లలో నింపే గ్యాస్ ఏ రూపంలో ఉంటుంది?
    1) ఘన 2) ద్రవ
    3) వాయు 4) జెల్
39. వరి పొలాల్లో చెత్తాచెదారం కుళ్లిపోవడం వల్ల విడుదలయ్యే వాయువేది?
    1) ఎసిటలీన్ 2) ఈథేన్
    3) ఇథిలీన్ 4) మీథేన్
40. గాలి తగిలేలా ఉంచినప్పుడు 'వైన్' రుచి మారడానికి కారణం?
    1) ఆల్కహాల్ ఈథర్‌గా మారడం
    2) ఇథైల్ ఆల్కహాల్ ఎసిటికామ్లంగా ఆక్సీకరణం చెందడం
    3) ఇథైల్ ఆల్కహాల్ మిథైల్ ఆల్కహాల్‌గా మారడం
    4) ఇథైల్ ఆల్కహాల్ లాక్టికామ్లంగా మారడం
41. వాహనాల్లో ఇంధనం దహనం చెందినప్పుడు కార్బన్, హైడ్రోజన్‌లు ఏవిధంగా మారతాయి?
    1) కార్బన్ డై ఆక్సైడ్, నీటిఆవిరిగా మారతాయి
    2) ఆల్కీన్‌గా మారతాయి
    3) బెంజీన్‌గా మారతాయి
    4) వాతావరణంలోకి అలాగే విడుదలవుతాయి
42. భారీ మోటారు వాహనాలకు డీజిల్‌ను ఇంధనంగా వాడటానికి కారణం?
    1) కాలుష్యం తక్కువగా ఉండటం
    2) అధిక సామర్థ్యం, ఇంధన పొదుపు
    3) ఇంజన్‌కు తక్కువ నష్టం కలగడం
    4) అధికంగా లభ్యమవడం
43. గోబర్ గ్యాస్, బయోగ్యాస్, కోల్‌గ్యాస్‌లలో ప్రధాన వాయువు ఏది?
    1) బ్యూటేన్ 2) మీథేన్
    3) ప్రొపేన్ 4) పెంటేన్
44. కింది వాటిలో ఉత్పతనం చెందే గుణం ఉన్న కర్బన సమ్మేళనం ఏది?
    1) నాఫ్తలీన్ 2) కాంఫర్
    3) 1, 2 4) సుక్రోజ్
45. కింది వాటిలో ఇంధనంగా ఉపయోగించని హైడ్రోకార్బన్ ఏది?
    1) మీథేన్ 2) ప్రొపేన్
    3) పెంటేన్ 4) బ్యూటేన్
46. సిగరెట్ లైటర్‌లో ఉండే వాయువు ఏది?
    1) మీథేన్ 2) ఈథేన్
    3) కార్బన్ మోనాక్సైడ్ 4) బ్యూటేన్
47. కింది వాటిలో భూగోళం వేడెక్కడానికి కారణమైన ప్రధాన వాయువు ఏది?
    1) CO_2 2) CH_4
    3) CFC 4) పైవన్నీ
48. కొండ ప్రాంతాల్లోని ఆవాసాలను విద్యుదీకరించడానికి, వంటకు కింది వాటిలో చక్కైంది ఏది?
    1) విద్యుచ్ఛక్తి 2) బయోగ్యాస్
    3) పవన విద్యుత్ 4) జల విద్యుత్

సమాధానాలు

1) 3;	2) 4;	3) 3;	4) 4;
5) 1;	6) 2;	7) 2;	8) 4;
9) 4;	10) 4;	11) 4;	12) 2;
13) 1;	14) 3;	15) 1;	16) 2;
17) 3;	18) 3;	19) 2;	20) 4;
21) 3;	22) 2;	23) 1;	24) 3;
25) 1;	26) 1;	27) 2;	28) 1;
29) 2;	30) 4;	31) 4;	32) 1;
33) 1;	34) 1;	35) 3;	36) 3;
37) 4;	38) 2;	39) 4;	40) 2;
41) 1;	42) 2;	43) 2;	44) 3;
45) 3;	46) 4;	47) 4;	48) 2.

The antonym of depict is...

BANK EXAMS

GENERAL ENGLISH



Model Questions

Directions (Q.No. 1-05): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. In addition to escalating violence, (1)/ a distinct feature of the situation in Kashmir today (2)/ is the divide among the administration and the populace, (3)/ which is possibly at its widest today. (4)/ No error (5)
2. The government has come under a lot of criticism (1)/ above its estimates for economic growth (2)/ during the United Progressive Alliance years (3)/ and for the slowdown in GDP growth in the second quarter of this financial year. (4)/ No error (5)
3. Over centuries, humans observed (1)/ and invented means to extract repetitions (2)/ and commonalities from a world (3)/ that was full of differences and variations. (4)/ No error (5)
4. The Andhra Pradesh Weather Forecasting and Early Warning Research Centre, an division of the RTGS, (1)/ on Sunday said cyclone Phethai might make landfall (2)/ by the evening of Monday (3)/ between Kakinada and Tuni. (4)/ No error (5)
5. The Madras High Court on Monday directed the Centre (1)/ to notify the statutory rules related to online sale (2)/ of drugs and medicines by January 31, 2019 (3)/ and banned online sales till than. (4)/ No error (5)

Directions: (Q.No. 6 - 10) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. At school, Mira is antisocial and sullen, but <u>it is in her home in which</u> she is a bubbly, even tempered child.
   1) in her home
   2) in her home, in which
   3) in her home where
   4) it is in her home and
   5) No correction required
7. Angel food cake, a cholesterol-free cake, solves the problem of <u>how to bake a cake for a health-conscious family.</u>
   1) having a health-conscious family for which to bake a cake
   2) how can one bake a cake for a health-conscious family
   3) how one could feed a health-conscious family a cake
   4) having a health-conscious cake to bake for a family
   5) No correction required
8. Experts believe that senior citizens with higher than average cholesterol <u>and their families develop a predisposition to cardiovascular disease</u> are more likely to die at an age below that of their life expectancy.
   1) and a predisposition to cardiovascular disease runs in the family
   2) whose families have a predisposition to cardiovascular disease
   3) whose families have a predisposition to cardiovascular disease running in them
   4) with a predisposition to cardiovascular disease running in their family
   5) No correction required
9. Sometimes, it seems like she does things only <u>making it more inconvenient for her husband so he can have</u> a good time when he's out with his friends.
   1) to make it more inconvenient for her husband to have
   2) to make more inconvenient for her husband the having of
   3) that her husband more inconveniently can have
   4) for her husband to more inconveniently
   5) No correction required
10. She had to <u>back down as she had forgotten</u> her mobile and car keys in the cabin.
    1) go back as she has forgotten
    2) went back as she has forgotten
    3) backed down as she had forgotten
    4) return as she had forgotten
    5) No correction required

Directions (Q.No. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. A series of misunderstandings between the management and the staff have led to the present ____.
    1) concord 2) contract
    3) impasse 4) access
    5) agreement
12. Tensions had ____ towards the end of day three with Kohli and Paine exchanging verbal ____ as the game headed for a nail-biting finish.
    1) flared, trickle
    2) flared-in, pitch
    3) escalated, dribble
    4) flared-up, volleys
    5) increased, duals
13. The children were ____ by the seemingly nonsensical clues until their teacher pointed out that the messages were in code.
    1) censured 2) striated
    3) feigned 4) prevaricated
    5) flummoxed
14. The chess master promised to ____ havoc upon his opponent's pawns for taking his bishop.
    1) wreak 2) warrant 3) ensue
    4) placate 5) endow
15. The soldiers received a military ____ to inspect all their vehicles before travelling.
    1) allotment 2) dominion
    3) affectation 4) calculation
    5) mandate

Directions (Q.No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) The ruling establishment in India maintains that the NRC is an administrative task overseen by the Supreme Court, and not a political gambit.
B) Many Indian citizens are securing coveted employment opportunities in Bangladesh through multinational companies, non-governmental organizations, and trading activities.
C) According to the latest available Bangladesh government estimates of 2009, more than 500,000 Indians were working in Bangladesh.
D) However, some members of the ruling party have been making hateful anti-migration and anti-Bangladeshi comments that reflect poorly on the prevalent positive relationship between Bangladesh and India.
E) More recently, Bangladesh was reported to be among the highest source of remittances to India, behind the United Arab Emirates, the U.S., Saudi Arabia, Qatar and the U.K.
F) To put things into perspective, most of them are employed in advantageous jobs in Bangladesh while Bangladeshis in India are largely employed in low-paying jobs.

16. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
18. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
20. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q.No. 21-25) Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

Bollywood films influence negative societal attitudes towards women in India. If we are to make progress, we must reverse these narratives through better storytelling, for storytelling influences behaviour. A study by Elizabeth Levy of Harvard University showed how a **reconciliation**-themed radio soap opera changed social norms and behaviour in Rwanda after the 1994 **genocide**. We also know storytelling works because multilateral agencies around the world spend billions of dollars on advertisements and informational campaigns to reach the public. Yet, in India, we ignore or simply don't accept the impact of storytelling on social behaviour. Last year, IBM India conducted a research study analyzing gender stereotypes in 4,000 Bollywood movies released between 1970 and 2017. Among these, the researchers identified only 30 movies where these stereotypes were broken. While filmmakers are attempting to break this mould, they are still few and far between. One way of initiating change could be for the Central Board of Film Certification (CBFC) to introduce a gender equity certification among the categories of film certification that we have today. This will empower the public to make a choice before heading to the theatres. It will signal to the industry that a gender lens is important and necessary. Granted, big brother attitudes are dangerous and we need to constantly push for less state regulation. But given the nature of sexual allegations against powerful members of the film industry, who can we trust to be responsible for shaping the narrative around gender stereotypes in India? Are future generations going to continue living in a world where they are encouraged to harass and rape women? Will sexist behaviour be tolerated and, if yes, for how long? Or can we start shaping the narrative around how we view various genders by being more responsible in how we **depict** them? The answer is, we can. It's time to think of unique ways of making films more gender sensitive, for this is a medium that has a huge impact on social behaviour as studies time and again have shown.

21. What does the writer say in this passage?
    1) We must reverse storytelling.
    2) Social norms and behaviour in India are reversed.
    3) We ignore or simply don't accept the impact of multilateral agencies.
    4) It is high time to think of future generations.
    5) social behaviour is definitely influenced by films
22. Which statement/s is/are true?
    a) CBFC may bring a change by initiating yet another certification among the categories of film certification we already have today.
    b) Film industry is abound with film makers who attempt to break the stereotypes.
    c) If a gender equity certification is introduced, public will have a choice before heading to the theatres.
    1) Only a 2) a& b 3) a & c
    4) a, b & c 5) none of them
23. Genocide means
    1) Related to genes
    2) Related to Rwanda
    3) Extraction of a species
    4) deliberate and systematic destruction of a group
    5) changed social norms and behaviour
24. Reconciliation means
    1) the restoration of friendly relations
    2) Estrangement 3) Feud
    4) Incompatibility in relations
    5) Making others believe in what you think is right
25. The antonym of depict is
    1) Limn 2) delineate
    3) distort 4) sculpt 5) sketch

KEY

1) 3	2) 2	3) 2	4) 1	5) 4
6) 1	7) 5	8) 2	9) 1	10) 4
11) 3	12) 4	13) 5	14) 1	15) 5
16) 5	17) 2	18) 4	19) 3	20) 4
21) 5	22) 3	23) 4	24) 1	25) 3